# ఎస్తేరు గ్రంథ ధ్యానము

శ్రీమతి. కెజియా వరప్రసాద రెడ్డి



# ఎస్తేరు గ్రంథ ధ్యానము


రచయిత్రి

**శ్రీమతి కెజియా వరప్రసాద రెడ్డి**

13/285, రెవిన్యూ కాలనీ

అనంతపూర్ - 515 001



Published by

**GOSPEL ASSEMBLY PUBLISHING**

7-270, Court Road

ANANTAPUR - 515 001.

Andhra Pradesh

మొదటి ముద్రణ : నవంబర్ ౨౦౦౭

ప్రతులు : ౨౦౦౦

**వెల రూ. ౨౫-౦౦**

## ప్రతులకు

**టి.పి. వరప్రసాద రెడ్డి**
13/285, రెవిన్యూ కాలనీ
అనంతపూర్ - 515 001
సెల్ : 9440285883

**జి. రాజారావు**
పెద్దకాకాని - 522 509
గుంటూరు జిల్లా

**లోగోస్ బుక్ సెంటర్**
10/1, అరండల్ పేట
గుంటూరు - 522 006
ఫోన్ : (0863) 2336927

***Designed & Type Setting :***
*Logos Graphics,*
Rajendra Nager 3rd Line,
GUNTUR - 522 006 Ph : 2230827

***Printed at :***
Sudarsan Printers,
GUNTUR. Ph : 2246245

# పరిచయ వాక్కులు

దైవజనులైన టి.పి. వరప్రసాదరెడ్డి గారు సిస్టర్ కెజియమ్మ గారు మనందరికి బాగా పరిచయమైన వారే. వారి యోగ్యత, మాన్యత, నిర్మలత, నమ్మకత్వము మనకందరికి తెలిసింది. వారు మంచి దైవభక్తులు. మంచి ప్రార్థన పరులు. ప్రభువు సేవ విషయములో త్యాగంగా పనిచేసేవారు. సువార్త ప్రకటించువారు. సమర్పణగలవారు. వారి ద్వారా ప్రభువు అనేక స్థలాలలో సంఘాలు స్థాపించారు. రచనల ద్వారా కూడా ప్రభువును గూర్చి విశేషమైన సాక్ష్యము ఇస్తున్నారు.

టి.పి. వరప్రసాదరెడ్డి గారి ద్వారా ఇప్పటి 10 పుస్తకాలు వ్రాయబడ్డాయి. అవి అనేక లకు ప్రయోజనకరమైనవిగా ఉన్న సంగతి మనకందరికి తెలిసినదే. ఇప్పుడు సిస్టర్ కెజియమ్మ గారు ఎస్తేరు గ్రంథము మీద మంచి వ్యాఖ్యానము ప్రభువును బట్టి వ్రాయగలిగారు. ఆ గ్రంథము నేను చదివాను. అదంతా అమూల్యమైనదిగా ఉన్నది. నేను ఆశ్చర్యపడినాను. ప్రతి చిన్నమాటలో ఎన్నో ఆత్మీయభావములు విభజించబడినవి. తలంపులు కేవలము ప్రభువు విచ్చినవే అని నేను నమ్ముచున్నాను. ఎస్తేరుకు వష్తికి మధ్య వ్యత్యాసములు, ఎస్తేరు యొక్క త్యాగము, సమర్పణ. ఉపవాస ప్రార్థన, విశ్వాసము, ప్రభువుమిద ఆధారపడుట, నమ్మకముగా ఉండుట ఎంతో వివరముగా అనేక విధాలుగా వ్రాయబడినవి. దేవుని యందు మొర్దెకై యొక్క పట్టుదల ఎట్టిశోధన వచ్చినా స్థిరంగా నిలుచుట, ప్రాణపాయం అయినా ప్రభువు కొరకు నిలుచుట, దేవుని యెడల విశ్వాసము కలిగి జీవించుట, దీన స్థితినుండి ఉన్నతస్థాయికి వచ్చుట చక్కగా వివరించబడి. హామాను గర్వము, అతని పతనము, అతని మరణము, అతని కుమారుల మరణం, సాతానుకు వాని క్రియలకు అపజయం, దేవుని పిల్లలకు అత్యధిక విజయము, అంగలార్పును ఆనందముగా మార్చుట, అదృశ్యరీతిగా దేవునిహస్తము పనిచేయుట, అనేకులు యూదుల మతమును అవలంబించుట, మొర్దెకై అంతకంతకు అభివృద్ధిపొంది ఉన్నతస్థాయికి వచ్చుట, అనేకులకు ఇష్టుడుగా ఉండుట మొదలగు విషయములు ఎంతో వివరముగా వ్రాసిరి. వారికి ఎంతో కృతజ్ఞతలు. ఈ పుస్తకము చదువువారికందరికి ఎంతో ప్రయోజనకరముగను మేలుకరముగా ఉండునని నమ్ముచున్నాను.

ఇట్లు
మీ తోటి సహోదరుడు
**జి. రాజారావు**

పెద్దకాకాని
13-03-07

# విషయసూచిక


| అధ్యా | విషయము | పేజీ |
|---|---|---|
| 1) | రాణియైన వష్తి ఔన్నత్యము - పతనము | 6 |
| 2) | రాణిగా ఎస్తేరు ఎన్నిక - ఔన్నత్యము | 16 |
| 3) | హామాను ప్రధానమంత్రిగా హెచ్చింపు- యూదులు చంపబడవలెనన్న ఆజ్ఞ | 26 |
| 4) | మొర్దెకై హెచ్చరిక - ఎస్తేరు తీర్మానము | 38 |
| 5) | ఎస్తేరు రాజుకు మనవి చేయుట - హామాను మొర్దెకై పతనమునకు పథకమువేయుట | 55 |
| 6) | హామానుకు కలిగిన అవమానము | 71 |
| 7) | హామాను ఉరితీయబడుట | 82 |
| 8) | మొదటి శాసనము రద్దు - రెండవశాసనము అమలుచేయుట | 87 |
| 9) | యూదులు తమ పగవారిని చంపుట - పూరీము పండుగ | 101 |
| 10) | యూదుడైన మొర్దెకై గొప్పతనము | 112 |

# ఎస్తేరు గ్రంథము

**ఉపోద్ఘాతము :**

ఈ గ్రంథములో దేవుడైన యెహోవా తన ప్రజలైన యూదులు పాపము చేసి బబులోనుకు డెబ్బది సంవత్సరముల చెరకు వచ్చినపుడు, వారు హామాను చేతిలో వధింపబడుటకు సిద్ధమైన గొఱ్ఱెలవలె వుండగా దేవుడు వారిని ఆశ్చర్యరీతిగా ఎలాభద్రపరిచారో వివరించబడియున్నది. ఈ గ్రంథము యూదుల నాశనమునకు వేయబడిన పథకము ఎలాపడగొట్టబడిందో వివరిస్తుంది. బబులోను చెరనుండి కొద్దిమంది యూదులు యెరూషలేముకు వెళ్ళగా చాలా మంది పారశీక రాజుక్రింద ప్రయోజనకరమైన పదవులలో వుంటూవచ్చారు. కాని దేవుడు వారిని మరచిపోలేదు. యెరూషలేమునకు తిరిగి వెళ్ళిన వారికి దేవుడు ఎలామేలుచేశారో పారశీకపు దేశములో నిలబడిపోయిన వారికి కూడా అలాగే దేవుడు మేలుచేశారు.

ఈ గ్రంథమందలి అధ్యాయములు 10. ఇవన్నీ ఒకేసారి చదివేసెయ్యాలి అనే ఆసక్తిని పుట్టిస్తాయి. ఈగ్రంథమంతటిలో దేవుడు అన్నమూడక్షరముల పదముఎక్కడనూ కనిపించక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కాని దేవుని హస్త కార్యాలు అడుగడుగునా కనిపిస్తాయి. ఒక్క ఉపవాసమును గురించి మాత్రమేగానీ మిగతా మతసంబంధ విషయాలను గురించి ఈగ్రంథములో వ్రాయబడలేదు.

**గ్రంథరచయిత :**

ఈ గ్రంథాన్ని కొందరు ఎజ్రా లేక నెహెమ్యా వ్రాసివుండవచ్చునని, మరికొందరు ఎస్తేరు 9:20వ॥ నుబట్టి మొర్దెకై వ్రాసి ఉండవచ్చునని నమ్ముచున్నారు.

**గ్రంథకాలము :**

క్రీ.పూ 485-465. (ఎజ్రా గ్రంథములో 6,7 అధ్యాయాల మధ్యకాలము)

**మూలవాక్యము :** ఎస్తేరు 4:16 "నేను నశించిన నశించెదను."

**గ్రంథమందలి పేర్లకు అర్థాలు :**

| | | | |
|---|---|---|---|
| 1. ఎస్తేరు | : నక్షత్రము | 2. హదస్సా | : గొంజిచెట్టు |
| 3. హేగే | : ధ్యానము | 4. అహష్వేరోషు | : మహారాజు |
| 5. మొర్దెకై | : చిన్నవాడు. | 6. హామాను | : ప్రసిద్ధినొందినవాడు. |

**గ్రంథవిభజన :** (2+3+2+3=10అ) -

I. 1-2అ. రాణియైన వష్తి ఔన్నత్య పతనములు - ఎస్తేరు ఔన్నత్యము

1అ. వష్తిఔన్నత్యము-పతనము;

2అ. రాణిగాఎస్తేరు ఎన్నిక - ఔన్నత్యము ;

II. 3-5 అ. హామాను ఔన్నత్యము.

3అ. హామాను ప్రధానమంత్రిగా హెచ్చింపు - హామాను ద్వారా యూదులు చంపబడవలెనన్న ఆజ్ఞ.

4అ. మొర్దెకై హెచ్చరిక - ఎస్తేరు తీర్మానము.

5అ. ఎస్తేరు రాజుకు మనవి చేయుట - హామాను మొర్దెకై పతనము కొరకు పథకము వేయుట.

III. 6-7 అ. హామాను పతనము ;

6అ. హామానుకు కలిగిన అవమానము.

7అ. హామాను ఉరితీయబడుట.

IV. 8-10 అ. మొర్దెకై ఔన్నత్యము-యూదుల ఆనందము.

8అ. మొదటి శాసనము రద్దు - రెండవ శాసనము అమలు చేయబడుట.

9అ. యూదులు తమ పగవారిని చంపుట - పూరీము పండుగ

10అ. యూదుడైన మొర్దెకై గొప్పతనము.

❖ ❖ ❖

## 1వ అధ్యాయము 4+4+1+10+3=22వ

**అంశము :** వష్తి ఔన్నత్యము - పతనము.

**విభజన :** 1వ-4వ. - రాజు ఔన్నత్యస్థితి- సేవకుల విందు.

5వ-8వ. - జనులందరికి విందు.

9వ. - వష్తి రాణి స్త్రీలకు చేసిన విందు

9-19వ. - వష్తి ఔన్నత్యస్థితి-దీనస్థితి.

20-22వ. - రాజు ఆజ్ఞ

### 1-4వ. రాజు ఔన్నత్యస్థితి - సేవకులవిందు :

అహష్వేరోషు అను పేరుకు మహారాజు అని అర్థము. ఈ మహారాజు 127 సంస్థానములు మాత్రమే కలిగి ఉన్నాడు. మనపరమరాజు సర్వభూమికి రాజైయున్నాడు. యిర్మి

10:10లో ఆయన సదాకాలమున్న రాజని, మలాకీ 1:14లో ఘనమైన మహారాజని వ్రాయబడింది. కీర్త 95:3లో దేవతలందరిపై మహాత్మ్యము గల మహారాజని వ్రాయబడింది. కీర్త.95:2లో మహారాజని మాత్రమేకాక మహాదేవుడని కూడా వ్రాయబడింది. ఆయన సింహాసనము ఆకాశమందు స్థిరపరచబడి వున్నది. హెబ్రీ 1:8 లోదేవా! నీసింహాసనము నిరంతరముండునని వ్రాయబడింది. ఈ అహష్వేరోషు రాజు క్రీ.పూ: 485-465 వరకు 20సం॥ మాత్రమే పరిపాలించాడు. కానీ మన ప్రభువు రాజ్యము శాశ్విత రాజ్యము. II రాజు 19:15లో ఆయన సకల రాజ్యములకు దేవుడు అని వ్రాయబడింది.

అహష్వేరోషు ఘనుడని మాత్రమే వ్రాయబడింది. ఆయన ఘనత 20 యేండ్లు మాత్రమే-కానీ మన దేవుడు యెషయా 57:17 ప్రకారం మహాఘనుడు అని వ్రాయబడింది. అహష్వేరోషు తన ఘనతను ఎవరికీ యివ్వలేదు. ప్రభువైతే మనల్ని కీర్త.49:9 ప్రకారం రెండంచుల ఖడ్గమైన బైబులును పట్టుకునే ఘనత నిచ్చాడు కీర్త 91:14 లో తన నామమునెరిగిన వారిని ఘనపరుస్తానన్నాడు. సామె 31:29 ప్రకారం బలమును, ఘనతను మనకు వస్త్రములుగా ఇచ్చాడు. నెనరు అనే ఘనతనిచ్చాడు. 1 సమూ 2:30వ॥ ప్రకారము తనను ఘనపరచిన వారిని ఆయన ఘనపరుచు వాడు. 2 తిమో 2:21వ॥ ప్రకారము ఘనత కొరకైనపాత్రలుగా చేసాడు.

ఎస్తే:1 :1లో అహష్వేరోషు దినములలో జరిగిన చర్యలవివరము అని మొదలైంది. అనగా 7గురు నపుంసకుల వివరము, వష్తివివరము, 7గురు ప్రధానుల వివరము, మొర్దెకై, ఎస్తేరు వివరములు, బిగ్తాను, తెరెషుఅను ద్వారపాలకుల వివరములు, హామాను, జెరెషు వివరములు, ఎస్తేరు చెలికత్తెల వివరము, ఎస్తేరువిందుల వివరము, శత్రువులు లైన పారశీకుల హతమార్చబడిన వివరము, హామాను పుట్టించిన మొదటి శాసన వివరము, రెండవశాసన వివరము, యూదుల విజయమును గూర్చిన వివరము, పూరీము పండుగ వివరము, మొర్దెకై ప్రధానమంత్రి యైన వివరము మొదలగు అన్ని సంగతులు వివరముగా వ్రాయబడిన గ్రంథమే ఎస్తేరు గ్రంథము. నెహెమ్యా చర్యలు నెహెమ్యా గ్రంథములో వ్రాయబడ్డాయి (నెహె 1:1). యేసుక్రీస్తు కాలములో జరిగిన కార్యములు లూకా 1:1 నుండి లూకా 24:53 వరకు వివరముగా వ్రాయబడ్డాయి. అలాగైతే నీయొక్క నాయొక్క చర్యలు కూడ దేవుని సన్నిధిలో వ్రాయబడు తున్నాయి ప్రకటన 20:12లో వున్నట్లు మనక్రియలు వ్రాయబడి యున్నవని అర్థమవుతుంది. ఈ క్రియలనుబట్టియే మనకు తీర్పు తీర్చబడుతుంది మరియు II కొరి 5:10 చెప్పబడినట్లు "తాను జరిగించిన క్రియలచొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే దేహముతో జరిగించు వాటియొక్క ఫలము మనలో ప్రతివాడును. పొందునట్లు మనమందరమునూ క్రీస్తున్యాయపీఠము ఎదుట ప్రత్యక్షముకావలయును" అని వ్రాయబడియున్నది. కీర్త 50:21లో

"ఇట్టిపనులు నీవు అనేకము చేసినను నేను మౌనినైయుంటిని. అందుకు నేను కేవలము నీవంటి వాడనని నీవనుకొంటివి అయితే నీకన్నుల యెదుట ఈ సంగతులను నేను వరుసగా ఉంచి నిన్ను గద్దించెదను" అని ప్రభువు అంటున్నాడు ఇలా ప్రభువు వివరంగా వరుసగా మనక్రియలను గూర్చి వ్రాసి తీర్పుతీర్చువాడు గనుక ప్రభువు ప్రకటన 3:2లో వ్రాయించినట్లు మిగిలిన క్రియలను మనము బలపరచాలి.

అహష్వేరోషురాజు 127 సంస్థానములకు రాజై షూషను కోటను రాజధానిగా చేసికొని ఏలుచుండగా ప్రభువు మన హృదయమనే కోటను ఆధారముగా చేసుకొని మన ఆత్మశరీరాలను ఏలుతున్నాడు. రోమా 6:11–14లో వున్నట్లు చావునకు లోనైన ఈ శరీరాన్ని ఏలే దేవుడు మన ప్రభువు. యోబు తన కన్నులతో నిబంధన చేసికొనినట్లు ప్రతి ఉదయం మన అవయవములలో మనం నిబంధన చేసికొంటూ చావునకు లోనైన ఈశరీరములోని అవయవములను నీతి సాధనములుగా అప్పగించుకోవాలి. ఈరాజు తన ఏలుబడిలో 3వ సం॥ అనగా క్రీ.పూ 482లో 6నెలలు తన అధిపతులకును, సేవకులకును విందుచేశాడు. మన ప్రభువు సామె 15:15లో ఉన్నట్లు సంతోష హృదయునికి నిత్యము విందుకలుగునను మాట ప్రకారము వాక్యపు విందును నిత్యమూ ప్రభువు మనకు అనుగ్రహిస్తున్నాడు. ఈరాజు 6నెలల విందుకే పిలచాడు. కాని మనప్రభువుతన సన్నిధిని నిత్యమూ వుండులాగున పిలుస్తున్నాడు. దావీదు 23వ కీర్తలో 'చిరకాలము నేను యెహోవా మందిరములో నివాసము చేసెదనన్నాడు' ఆయన సన్నిధిని వెదకుడి, ఆయన సన్నిధిని నిత్యము వెదకుడి అని కీర్త॥ 105:4వ॥లోని వాక్యము చెబుతుంది. అహష్వేరోషు రాజు తనసన్నిధిలో తన సేవకులకు క్రింది విషయాలు కనబరిచారు (1) ప్రభువు మహిమ (2) ఐశ్వర్యము (3) ప్రభావము (4) మహాత్యాతిశయము (5) ఘనత (6) విందు (7) ద్రాక్షారసము. అంతకంటే ఎక్కువగా ప్రభువు సన్నిధిలో వున్నవారికి ఈ క్రింది విషయాలు లభ్యమవుతాయి.

**(1) మహిమ :** 1 పేతురు 1:17లో పేతురు, యోహాను, యాకోబు ప్రభువుసన్నిధిలో వుండగా మహాదివ్యమహిమను పొందిన యేసును చూచారు. ఆయన మహిమ సమీపింపరాని మహిమ. అది వాడబారనిది. అహష్వేరోషురాజు తన మహిమను చూపించుకున్నాడే కాని, రవ్వంతయైన తన సేవకులకియ్యలేదు. ప్రభువు తనవాడబారని మహిమను, నిత్యమహిమను మనకిస్తారు.

**(2) ప్రభువు ఐశ్వర్యము :** ప్రభువు ఐశ్వర్యము అడుగు జాడలు పట్టజాలని ఐశ్వర్యము. II కొరి. 8:9లో వున్నట్లు ఆయన ధనవంతుడై యుండియు తనదారిద్ర్యము వలన మనలను ధనవంతులుగా చేశాడు.

**(3) ప్రభువు ప్రభావము :** మార్కు 3:3లో ప్రభువు ప్రభావము తన సన్నిధి కొచ్చిన రక్తస్రావ రోగముగల స్త్రీలోకి వెళ్ళగా ఆస్త్రీ బాధ నివారణ అయ్యింది. అహష్వేరోషు ప్రభావము ఎవరికి కూడ మేలు కలుగచేయలేదు.

**(4) ప్రభువు మహత్యాతిశయము :** పేతురు, యాకోబు, యోహాను II పేతు 1:17లో వ్రాయబడినట్లు ఆయన సన్నిధిలో ఉండగా ఆయన మహాత్మ్యాన్ని కన్నులారా చూచారు. దేవుని వలన మహిమను, ఘనతను ఆయన పొందగా చూచారు. కానీ అహష్వేరోషు, కలిగియున్నది పరలోక మహాత్మ్యముకాదు.

**(5) ప్రభువుఘనత :** యెష 57:15లో అయన మహాఘనుడని వ్రాయబడి యున్నది. అహష్వేరోషు ఘనత మామూలు ఘనత. 20 యేండ్ల ఘనత మాత్రమే అరాజు కలిగియున్నాడు (మానవుల ద్వారా కలిగిన ఇహలోకఘనత).

**(6) ప్రభువు విందు :** పర 2:4 ఆయన తన విందుశాలకు నన్ను తోడు కొనిపోయెను అని వ్రాయబడియున్నది. సంఘమనే విందుశాలలో బ్రతుకుకాలమంతా ప్రభువు మనల్ని పోషిస్తాడు. అహష్వేరోషు 6నెలలు మాత్రమే విందు చేశాడు. కాని ప్రభువులాగా తన సేవకులను విందుకు తోడు కొని పోలేదు. ప్రకటన మాత్రమే చేశాడు. గొర్రెపిల్ల వివాహా విందుకు ఆయన వచ్చి తానే మనకు పరిచారము చేస్తాడు.

**(7) ప్రభువు ద్రాక్షారసము :** ద్రాక్షారసము సంతోషమునకు గుర్తు తన సన్నిధిలో సంపూర్ణ సంతోషము (కీ॥16:11) మిచ్చేది ఆయనే. మరియు ద్రాక్షారసము ప్రభువు కార్చిన రక్తానికి కూడా సూచనగావున్నది. ప్రభువు సన్నిధిలో వీటిని మనము యుగాయుగములు, సదాకాలము అనుభవించగలము. ప్రభువిచ్చేసంతోషము లోకమిచ్చునటువంటిదికాదు. అది తిండివలన వచ్చేదికాదు. త్రాగుడివలన వచ్చేదికాదు. హబ3:17లో రక్షణనుబట్టి కీర్త 119:92లో ధర్మశాస్త్రమును బట్టి కీర్త122:1లో మందిరాన్ని బట్టి వచ్చే సంతోషాన్ని దేవుడు ఇస్తాడు.

**5-8వ॥లు జనులందరికి విందు :**

ఆదినములు గడచిన పిమ్మట రాజుతోట అవరణములో 7వ రోజు రాజు కోటలో వున్న అల్పులకేమి ఘనులకేమి, జనులకందరికీ విందు చేయించాడు. యేసు ప్రభువు ఒక సంస్థానమునకు కాదు ఒక దేశమునకు కాదు ప్రపంచ ప్రజలకందరికీ,

గత 2,007 సంవత్సరాలనుండి అనగా 7,32,800 దినములుగా రక్షణ విందు అనుగ్రహిస్తున్నాడు. ఈ విందు యెషయా 25:6-9లో వ్రాయబడిన రక్షణ విందుకు సాదృశ్యముగావున్నది. 7,32,800 దినములనుండి రక్షణ విందు అనుగ్రహిస్తూనే వున్నారు.

ఈ విందు యెషయా 25:6-9లో వ్రాయబడిన రక్షణవిందుకు సాదృశ్యముగావున్నది.స్త్రీలు గొప్పసైన్యమని 7,32,800 దినములనుండి రక్షణ విందు అనుగ్రహిస్తూనే వున్నారు. ఈవిందు రాజుస్థితికి తగినట్టుగా, అధికముగా, ఆజ్ఞానుసారముగా ఎవడు కోరినట్లుగా వారికి పెట్టవలెనని దాసులకు రాజు ఆజ్ఞయిచ్చాడు అలాగే ప్రభువు తన రక్షణ విందుకు అందరిని ఆహ్వానిస్తూ అందరూ అందటను మారుమనస్సు పొందాలని ఆజ్ఞాపిస్తున్నాడు. కానీ ఈ ఆజ్ఞకు విధేయత చూపుచు యిరుకు మార్గమున ప్రవేశించువారు కొందరే. ఒకడు స్త్రీని వివాహము చేసుకొన్నానని, మరిఒకడు 5 జతల ఎడ్లుకొన్నాను వాటిని పరీక్షింప వెళ్ళుచున్నానని మరిఒకడు పొలమును కొన్నానని, దాని పరీక్షింప వెళ్ళుచున్నానని, సాకులు చెప్పుచుండగా ప్రభువు లూకా 14:15-23లో పట్టణపు వీధుల్లోకి సందులలోనికి వెళ్ళి బీదలను, అంగహీనులను కుంటివారిని, గ్రుడ్డివారిని ఇక్కడికి తోడుకొనిరమ్మని తనదాసులతో చెప్పుచున్నాడు. ఇంకాస్థలమున్నదని దాసుడు చెప్పగా నాఇల్లు నిండునట్లు నీవు రాజమార్గములోనికి, కంచెలలోనికిని, వెళ్ళి లోపలికి వచ్చునట్లు అక్కడివారిని బలవంతము చేయమని ప్రభువు అన్నారు. అహష్వేరోషు బలవంతము చేయలేదు కానీ, పరలోకపు రాజు బలవంతము చేయుచుండగా మన యెడల ఆయనకు ఎంత ప్రేమయోకదా! II కొరి 5:14 వ ప్రకారం క్రీస్తుప్రేమ మనల్ని బలవంతము చేసే ప్రేమ.

**9వ. వష్తిరాణి స్త్రీలకు చేసిన విందు :**

9వ రాజు చేసిన విందుకు పురుషులు హాజరుకాగా రాణిచేసిన విందుకు స్త్రీలు హాజరయ్యారు. మానవసంబంధ కార్యాలకు స్త్రీలు ప్రత్యేకంగా కూడుచుండగా ఆత్మీయకార్యాలకై స్త్రీలు ప్రత్యేకంగా ఒకచోట కూడితేతప్పేంటి? నేటి స్త్రీలకు ఉపదేశం చేయాలని తీతు పత్రిక 2:3-5లో చదవటం లేదా? ఆనాడు అ.కా. 21:9లో ఫిలిప్పు కుమార్తెలు ప్రవచించలేదా? కీర్త 144 :12లో మా కుమార్తెలు నగరుకై చెక్కబడిన మూలకంబాలవలె ఉన్నారన్నట్లు, ఈ మూలకంబాలన్నీ ఒకచోట కూడుకొని స్త్రీల మధ్య స్త్రీలు ప్రభువు యొక్క ఆత్మీయవిందును స్వీకరిస్తే స్త్రీలకెంతక్షేమమోకదా!

నిర్గమ 15:20లో మిర్యాము ఇశ్రాయేలు స్త్రీలమధ్య నాయకురాలుగా, ప్రవక్తిగా ఉండి, స్త్రీలు తన వెంబడిరాగా ఆమె స్త్రీల మధ్య పాడిప్రవచింపలేదా? ఇలా వాక్యపువిందుకు సంవత్సరానికొక్కసారి కాక కనీసము వారమునకు ఒక్కసారైనా స్త్రీలు చేరివచ్చి గొప్ప ఆత్మీయ మేలు పొందవచ్చును. స్త్రీలు స్త్రీలదగ్గరే తమ సమస్యలు మనస్సువిప్పి చెప్పుకోగలరు. తోటిస్త్రీల వాక్యపరిచర్య వలన ఎంతో ఆదరణ పొందగలరు. కీర్త 68:11లో ప్రభువు మాట సెలవిచ్చుచుండగా దానిని ప్రకటించు స్త్రీలసైన్యమని పిలవడంలో దేవుని ఉద్దేశమేమి? స్త్రీల మధ్య తన గొప్ప పరిచర్య చేయడానికే కదా! ఫిలి 4:3వ॥లో యువొదియ, సుంటుకే అను

స్త్రీలు క్లెమెంతుతోను, పౌలు యొక్క ఇతర సహకారులతోను సువార్త పనిలో పౌలుతో కూడ ప్రయాసపడ్డారని పౌలు భక్తుడే చెప్పుట లేదా? అటువంటి వారికి సహాయము చేయుమని పౌలుతన సహకారికి వ్రాయలేదా? కనుక ప్రియసోదరీ! వష్తిలాగా వాక్యపువిందును ఏర్పాటు చేసి నీకు అందుబాటులో వున్న స్త్రీలకందరికి వాక్యాన్ని వినిపించి, వారిని ఆదరించి, ప్రభువు రాకడకు చక్కని పెండ్లి కుమార్తెవలె సిద్ధపరుచు.

## 10-19వ॥ వష్తి ఔన్నత్యస్థితి-దీనస్థితి :

7వ దినమున రాజు ద్రాక్షారసముతో సంతోషిస్తున్నాడు. కానీ కీర్త 63:11లో దావీదు యూదా అరణ్యములో ఉండినప్పటికీ "రాజు దేవునిబట్టి సంతోషించును" అంటున్నాడు. లోకమివ్వని పరిపూర్ణ, పవిత్రమైన సంతోషాన్ని దేవుని సన్నిధిలో పొందగలము. 10వ వచనంలో ద్రాక్షారసమును బట్టి సంతోషించి రాజు 12వ॥ వచనంలో కోపిస్తున్నాడు ఈలోకసంతోషము కొద్దికాలమే, క్షణభంగురమే. సామె 9 :4:5లో జ్ఞానాధారమైన ప్రభువు వచ్చి "నేను సిద్ధపరచిన ఆహారము భుజించుడి. నేను కలిపిన ద్రాక్షారసము పానము చేయుడి" అంటున్నాడు. సామె 23:29లో ఎవరికి శ్రమ? ఎవరికి దుఃఖం? ఎవరికి జగడములు? ఎవరికి చింత? ఎవరికి హేతువు లేని గాయములు?ఎవరికి మంద దృష్టి? ద్రాక్షరసముతో ప్రొద్దుపుచ్చువారికే కదా! ద్రాక్షారసము కట్ల పామువలె కరచింది. ఆపామే సాతాను. మత్తును సేవించే వారందరూ సాతాను కాటు తిన్నవారే. హేతువులేని గాయములు, జగడాలు చింతలు, దుఃఖాలు, మంద దృష్టి ఇవన్ని త్రాగుబోతుల ఇళ్ళలో తప్పక ఉంటాయి. అందుకే ఎఫె 5:18లో మద్యముతో మత్తులై యుండకుడి. దానిలో దుర్వ్యాపారము కలదు అనివ్రాయబడింది. ప్రస11:9.10లో ఉన్నట్లు నిజమైన సంతోషం కావాలంటే మనం ప్రభువు వద్దకేరావాలి యెష 9:3 ప్రకారం కోతకాలమున మనుష్యులు సంతోషించునట్లు వారు నీసన్నిధిని సంతోషించుచున్నారు. ఇవన్నీ ఏమియు లేక పోయినా హబ 3:16-18లో నారక్షణకర్తయైన నాదేవుని బట్టి నేను ఆనందిస్తానన్నాడు హబక్కూకు భక్తుడు. ఈ 10-19 వచనాల్లో వష్తి. 11వ॥లో సౌందర్యవతి యైన వష్తిగాను 12వ॥లో రాజు సన్నిధికి రాకపోయిన వష్తిగాను 16వ॥లో నేరస్తురాలైన వష్తిగాను 17వ॥లో తిరస్కరించిన వష్తిగాను 19వ॥లో రాజుసన్నిధికిరాకూడని వష్తిగాను 19వ॥లో అయోగ్యురాలైన వష్తిగాను చూడవచ్చును.

**(1) సౌందర్యవతియైన వష్తి. 11వ॥ :** ఈరాజు సౌందర్యవతియైన తనభార్యను తనసన్నిధికి పిలిచాడు మన ప్రభువు మనము పాపపు కురుపులతో వుండగా, అటువంటి మనల్నే ప్రభువు పిలుస్తున్నాడు. యెహె 16:14 ప్రకారం పుట్టిననాడే నాభిసూత్రము కోయబడక పోయినా, శుభ్రమగుటకు నీళ్ళతో కడగబడక పోయినా, ఉప్పురాయకపోయినా బట్టచుట్టక

పోయినా, ఎవరునూ కటాక్షించి జాలిచూపకపోయినా, పుట్టిననాడే బయట నేలను పారవేయబడి. చూడ అసహ్యముగా వుండినా, యిర్మి 3:1:12,20,22;4:1లో ఉన్నట్లు వ్యభిచారులమైనా, ద్రోహులమైన, విశ్వాస ఘాతకులమైనా, భ్రష్టులమైనా పిలిచాడు. మనకు నా బాహ్య సౌందర్యము లేదు, హృదయ సౌందర్యమూ లేదు. హృదయము అన్నిటికంటే మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధికలది. అయినా ప్రభువు పిలుస్తూనే ఉన్నాడు. అహష్వేరోషురాజు వష్తిరాణిగా ఔన్నత్య స్థితిలో వున్నపుడు తన సన్నిధికి పిలిచాడు. అయితే పరమరాజైన ప్రభువు మనమింకను బలహీనులమై యుండగా, భక్తిహీనులమై యుండగా విరోధులమైయుండగా (రోమా 5:6-10) ప్రేమించిపిలిచాడు మరియు రాజు కూడివచ్చిన జనమునకు వష్తి సౌందర్యాన్ని కనుపరచవలెనని ఆమెను రమ్మన్నాడు. మన ప్రభువైతే తన సంఘము యొక్క ఆత్మీయ సౌందర్యమును అనగా ఫిలి 4:5 ప్రకారం సహనమును, మత్త 5:6 ప్రకారం మన సత్క్రియలను, మన వెలుగును చూపాలన్ని అందరి యెదుట దీపస్తంభము మీద ఉంచారు. ఈ ఆత్మీయమైన సౌందర్యాన్ని, ఆత్మ స్వభావాన్ని ఇతరులకు కనబరుస్తున్నామా?

**(2) 12వ॥ రాజాజ్ఞ ప్రకారం రాకపోయిన వష్తి :** అహష్వేరోషు రాజు 7గురు నపుంసకులను వష్తి యొద్దకు పంపిననూ ఆమె రాజు నొద్దకు రాలేదు. ప్రభువు పాపియొద్దకు తనదాసులను, దాసురాండ్రను అందరికి చివర తన కుమారుడైన యేసును పంపి పిలిచాడు. అయితే వారుయేసును యెరూషలేము వెలుపట సిలువవేసి చంపినట్లు మత్త 20 9-15లో చదువగలము. అయినా అంతటితో ఆగక ఆప్రియప్రభువు మృత్యుంజయుడై తిరిగి లేచి ప్రతిపాపి హృదయ ద్వారాన్ని తన సువార్త వాక్యముద్వారా తట్టుచు పిలుస్తుండగా ఆ ప్రభువు ప్రేమ ఎంత గొప్పదో ఆలోచించారా! "ఎంతసేపు నిలువబెట్టి ఏడ్పింతురతని "? అను పాట మనల్ని హెచ్చరించుట లేదా? ఆయన దొరకు కాలములోనే ఆయనను హృదయంలో స్వీకరించితే ఎంతో క్షేమకరం.

**(3) 13వ-16వ. నేరస్థురాలైన వష్తి :** విధిని, రాజధర్మమును ఎరిగిన వారందరి చేత ప్రతి సంగతిని పరిష్కరించుకునే అహష్వేరోషు రాజు ఇపుడు తన స్వంత భార్య సంగతిని పరిష్కరించాలని " ఆమెకు చేయవలసినదేమి"? అని అడిగినపుడు మెమూకాను "ఆమె అధిపతులందరి యెడలను జనులందరి యెదలను నేరస్థురాలయ్యిందని" తీర్పు చెప్పాడు. పిలిస్తే రాకపోవడం కూడా నేరమే. అలాగునే సంఘములో ఎవ్వరైనా తప్పుచేస్తే ప్రభువు పరిశుద్ధ గ్రంథమైన బైబిలు అనే న్యాయవిధి చొప్పున వారికి తీర్పు తీరుస్తాడు. ఆయన తీర్పులు న్యాయమైనవి. అవి సత్యములైనవి తప్పు చేసినవారు అందరి యెడలను ముఖ్యముగా రక్తముకార్చిన ప్రభువు యెడలను నేరస్థులే. ఉదా : తప్పిపోయిన కుమారుడు తండ్రి యింటికి

వచ్చినపుడు తండ్రితో, నేను నీకును పరలోకపు తండ్రికిని విరోధముగాను పాపము చేసితినన్నాడు. నేరస్తులమైన మనకొరకు ప్రభువు ఇద్దరు నేరస్తుల మధ్య సిలువ వేయబడ్డాడు. యోహా 18:20 ప్రకారం నేరము లేని ప్రభువు మీద నేరము మోపారు. అట్టి ప్రభువును నమ్మితే మనము చేసిన నేరములనుండి ఆయన రక్తముతో కడగబడతాం.

సంఘములోని సమస్యలు తీర్చుటకు కాలజ్ఞానుల్లాంటి సంఘపెద్దలున్నారు. వారే ప్రథమ పీఠముల నెక్కవలసిన ప్రధానులు I కొరి 6:5 ప్రకారం సహోదరుల మధ్యను వ్యాజ్యము తీర్చగల బుద్ధిమంతుడు మీలో ఒకడైననూలేడా.? అని పరిశుద్ధుడైన పౌలు అడుగుతున్నాడు. అలా సంఘములో తీర్పు తీర్చడానికి వాక్యవిధిని బాగుగా ఎరిగిన వారైయుండాలి. యిర్మీ 8:7 ప్రకారం "ఆకాశమునకెగురు సంకుబుడి కొంగ, తెల్లగువ్వ, మంగళకత్తిపిట్ట, ఓదెకొరకు తామురావలసిన కాలము నెరుగును. కానీ నా ప్రజలు తాము న్యాయవిధిని యెరుగరు" అని ప్రభువు వ్రాయించారు. అలా న్యాయవిధినివారు ఎరుగక పోవడానికి కారణం 9వ వచనంలో వున్నట్లు వారు యెహోవా వాక్యము నిరాకరించువారు. వారికేపాటి జ్ఞానం కలదు? అని ప్రశ్నిస్తున్నాడు. ప్రియసోదరీ నీకు లోక జ్ఞానముందేమోకానీ బైబిలు జ్ఞానముందా? వాక్యాన్ని ప్రార్థనా పూర్వకంగా చదువుతున్నావా? ఎఫె 5:13లో చెప్పినట్లు దినములు చెడ్డవి గనుక సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక జ్ఞానులవలె నడుచుకోవాలి. పై చొప్పున నడచుకొనే వారే కాలజ్ఞానులు. ఈ కాలజ్ఞానులు రాజు సన్నిధిలో వుండి ఆయన ముఖమునుచూచుచు, ప్రథమ పీఠముల నెక్కువారు. దావీదు యెహోవా మందిరములో చిరకాలము నివసిస్తానన్నాడు. అలా ఆయన సన్నిధిలో (ఆయననుచూస్తూ) గడిపిన దావీదు ప్రథమపీఠమైన సింహాసనమెక్కాడు. దేవుని ముఖాన్ని నలుబది రోజులు చూచిన మోషే ప్రథమ పీఠమెక్కాడు. దానికి మోషేపీఠమని పేరు. ప్రార్థనలో దేవుని సన్నిధిలో గడిపిన నెహెమ్యా గవర్నరై పీఠమునెక్కాడు. పై అనుభవములు గలవారే ప్రథమ పీఠములు నెక్కువారు. పై అనుభవాలు, అర్హతలు లేకున్నా ప్రథమపీఠములను కోరువారున్నారు. పనిచేయరు. కాని ప్రథమ పీఠములను కోరుతారు.

III యోహాను పత్రిక 9వ॥లో దియొత్రెఫే ప్రధానత్వమును కోరువాడు. యోహాను లాంటి వాడినే అంగీకరించలేదు. ప్రధానులలో ఒకడైన మెమూకాను వష్తిని నేరస్తురాలని సాక్ష్యమిస్తున్నాడు. నీ సంఘములోని పెద్దలునిన్ను గూర్చి కూడా అదే సాక్ష్యమిస్తున్నారా? మన కొఱకు సిలువలో నేరస్తునిగా వ్రేలాడదీయబడి, రక్తముకార్చిన ప్రభునొద్ద నేరములు ఒప్పుకుంటే ప్రభువు వాటిని తనరక్తమందు కడిగి పరిశుద్ధ పరుస్తారు. ఆ పని ఈరోజే చేస్తావా సోదరీ! అలా ఆయన వద్దకు రాక పోతే నీగతి నరకమే.

**(4) తిరస్కారము చూపిన వష్తి :** 1:17లో ఆమె తిరస్కరించిన వ్యక్తి అని వ్రాయబడింది. వష్తి రాజుసన్నిధికి రాకపోవుటచే స్త్రీలందరు తమ ముఖము ఎదుటనే తమ పురుషులను తిరస్కారము చేయుటకు మూలకారణముగా వున్నట్లు మెమూకాను చెబుతున్నాడు. యెష1:2,3వ॥లో ప్రభువును తిరస్కరించిన ఇశ్రాయేలీయులను చూస్తున్నాము. తిరుగు బాటు చేసినను మరలా దేవుడు వారిని 18వ॥లో పిలిచాడు. సమ్మతించి తిరిగివచ్చిన యెడల నిశ్చయముగా ఆయన యొక్క మంచిపదార్థములు అనుభవిస్తాము. సమ్మతించక తిరుగబడిన యెడల నిశ్చయముగా ఆయన యొక్క ఖడ్గం పాలవుతాము. ఈ తిరుగుబాటు అను పాపము పిల్లలలోను, పెద్దలలోనూ ఉంది. యెష 48:8లో నీవు గర్భమున పుట్టినది మొదలుకొని అపనమ్మకస్థుడవై తిరగుబాటు చేయువాడని అనిపించుకొంటివని నాకు తెలియును. "నేను నిన్ను నిర్మూలముచేయకుండునట్లు నా నామమును బట్టి నాకోపమును మానుకొనుచున్నాను" అని వ్రాయబడింది. ప్రియ చదువరీ! నీవు పుట్టింది మొదలుకొని తిరుగుబాటు అను పాపము చేయుచుండగా, అపాపం నిన్ను నిర్మూలముచేసే పాపమైయుండగా, దేవునికి కోపము తెప్పించే పాపమై యుండగా దేవుడు నీ మీద ఆకోపాన్ని వేయక తన ప్రియకుమారుడైన యేసుక్రీస్తు మీద వేశాడు. యెష 53:12 ప్రకారం యేసు ప్రభువు తిరుగు బాటు చేసిన వారికొఱకు విజ్ఞాపనము చేసి తండ్రిని క్షమాపణ వేడుకొన్నాడు. ఆ ప్రభువును నీవు నమ్మి నీ తిరుగుబాటు పాపమునుండి విడుదల పొందగోరితే ప్రభువు చెంతకురా. ఇదే మిక్కిలి అనుకూల సమయం. రేపునీదికాదు.

**(5) రాజసన్నిదికి రాకూడని వష్తి 1:19 :** ఈలాగున రాజసన్నిధికి రాక నేరస్తురాలై తిరస్కరించిన వష్తి రాజసన్నిధికి యిక రాకూడదని రాజాజ్ఞ పుట్టింది. అహష్వేరోషు రాజు వష్తిని ఒక్కసారి మాత్రమే పిలిచి ఆమెను గూర్చి ఆజ్ఞయిచ్చాడు. భూమిమీద ఎన్నో అవకాశాలు దేవుడు పాపమానవునికి ఇచ్చాడు. అతడురాకపోతే ఇక ధవళ సింహాసనపు తీర్పులో ప్రకటన 20:11-15 లో వ్రాయబడిన ప్రకారము నిత్యాగ్నిలోనికి పోవుడి అని తన సన్నిధికి రమ్మనిపిలువక 'పొండి' అంటున్నాడు.

**(6) అయోగ్యురాలైన వష్తి :** 1:19వ॥ మెమూకాను రాజు వష్తికంటే యోగ్యురాలిని రాణిగా చేయాలి అన్నాడు. అంటే వష్తి అయోగ్యురాలని చెప్పినట్లేకదా! విధేయత లేని కారణాన వష్తి అయోగ్యురాలనిపించుకుంది. ఆజ్ఞను ఉల్లంఘించిన వష్తికి ఎన్ని పేర్లు పెట్టబడ్డాయో గమనిస్తున్నాము. రక్షించబడుటకు ప్రభువునొద్దకు రానివారందరికి ఈపేర్లు సార్థక నామాలౌతాయి. సామె12:4 ప్రకారము యోగ్యురాలు తన పెనిమిటికి కిరీటము. సిగ్గు తెచ్చునది వాని ఎముకలకు కుళ్ళు అయోగ్యురాలైన వష్తి అంతమంది ముందర రాజుకు సిగ్గు తెచ్చింది.

# ఎస్తేరుకు గల తేడాలు

| వష్తికి | ఎస్తేరు |
| --- | --- |
| 1. వష్తిపేరుకు ఎందుకు క్షీణించి పోవుచున్నావని అర్ధము. మహారాజు భార్యయైనా క్షీణించి చివరకు రాజసన్నిధిని, రాణి పదవిని కోల్పోయింది. | 1. ఎస్తేరు అనగా నక్షత్రము. ఆమె ముందు పేరు హదస్సా. అనగా గొంజి చెట్టు అని అర్ధము - చివరకు అహష్వేరోషు భార్యగా నక్షత్రమువలె ఆకాశం వరకూ హెచ్చింపబడింది. భూమి నుండి ఆకాశము మట్టుకు హెచ్చింప బడింది. |
| 2. వష్తి స్త్రీలకు ఒక విందు ఏర్పాటు చేసింది. | 2. ఎస్తేరు 3రోజులపాటు తన చెలికత్తెలు తనతో ఉపవాసముండునట్లు ఏర్పాటు చేసింది. |
| 3. రాజు పిలిస్తే వష్తి రాలేదు. | 3. రాజు పిలువక ముందే ఎస్తేరు రాజు యొద్దకు వచ్చింది. |
| 4. ఈమె రాజు కొరకు విందు చేయలేదు | 4. ఈమె రాజుకొరకు 2రోజులు విందుచేసింది |
| 5. రాణిగా వుండకుండ తృణీకరించబడింది | 5. రాణిగా నియమించబడింది. |
| 6. ఈమె "అయోగ్యురాలు" అను చెడ్డపేరు తెచ్చుకొన్నది | 6. ఈమె "యోగ్యురాలు" అని మంచిపేరు తెచ్చుకుంది. |
| 7. రాజు ఈమె కొరకు విందు చేయలేదు | 7. రాజు ఈమెను బట్టి విందు చేయించాడు |
| 8. వష్తిఅవిశ్వాసికి సూచనగా వుంది | 8. ఎస్తేరు విశ్వాసికి సూచనగా వుంది |

ఆయన ఎముకలకు కుళ్ళు అనగా బోన్ టి.బి (Bone T.B.) లేక బోన్ క్యాన్సర్ (Bone cancer) తెచ్చినదానితో సమానమయ్యింది. ప్రియసోదరీ! నీద్వారా నీభర్తకు సిగ్గు, ఎముకలకు కుళ్ళు వస్తున్నాయా లేక నీ ద్వారా నీభర్తకు గౌరవము, ఘనత కలుగుతుందా? పరీక్షించుకో.

**20-22వ॥ రాజు ఆజ్ఞ :**

20వలో ఘనురాలుగానీ, అల్పురాలుగానీ, స్త్రీలందరూ తమ పురుషులను సన్మానించాలని రాజు ఆజ్ఞయిచ్చినట్లు ! పేతు 3:5-6లో పరిశుద్ధ స్త్రీలు తమ స్వపురుషులకు లోబడివుండాలని పరమరాజైన ప్రభువు సెలవిస్తున్నారు. అన్ని విషయాల్లో భర్తలకు లోబడి వుండాలి ఉదా:- శారానుగురించి చెప్పాడు. ఆది:18:5లో శారావయస్సు 89 యేండ్లు. 89 యేండ్ల శారా మూడు మానికల మెత్తనిపిండి పిసికి రొట్టెలు ఎందుకు చేయాలి? నాకు చేతకాదు, మూడు మానికల పిండితో చేయలేను అని చెప్పలేదు. సంపూర్ణవిధేయత చూపించింది. ఇదిస్త్రీలకు మాదిరికాదా ? 22లో ప్రతి ఇంటిలో పురుషుడు అధికారిగా వుండాలని అహష్వేరోషు ఆజ్ఞయిచ్చాడు. కుటుంబములో భార్యకు శిరస్సు భర్తని, సంఘమనుయింటిలో సంఘానికి శిరస్సు ప్రభువని ఎఫె 5:23, కొలొ 1:18లో ప్రభువు చెప్పుచున్నాడు. అహష్వేరోషు ప్రతిపురుషుడు తన యింటిలో స్వభాషననుసరించి మాట్లాడాలన్నాడు. ప్రభువు పిల్లలు కూడా బైబిలు భాషయే ఇంట్లోనైనా ఎక్కడైనా మాట్లాడాలి. మన సంభాషణ ఒక రకము, వాక్యము ఒకరకము కాదు. వాక్యాను సారంగానే మనం మాట్లాడాలి.

❖ ❖ ❖

## 2వ అధ్యాయము 4+3+8+3+2=20వ

**అంశము :** రాణిగా ఎస్తేరు ఎన్నిక - ఔన్నత్యము

**విభజన :** 1-4వ. అంతఃపురములో కన్యకలు.
5-7వ. బాల్యములో ఎస్తేరు.
8-15వ. అంతఃపురములో ఎస్తేరు
16-18వ. రాణియైన ఎస్తేరు.
19-23వ. అన్యరాజుకు మొర్దెకై చేసిన మేలు.

**2:1-4వ. అంతఃపురములో కన్యకలు :**

అందమైన కన్యకలు రాజుకొరకు కావాలట. సాధారణంగా భూరాజులు అందమైన వారినే తమ భార్యలుగా చేసుకుంటారు. అందమైన వారు రాజు కొరకట. వారు

అంతఃపురములో రాజుతో ఉండాలి. అంతఃపురము సంఘమునకు సూచన. సంఘమనే అంతః పురములోవున్న విశ్వాసులకు ఈకన్యకలు సాదృశ్యంగా ఉన్నారు. ఈసంఘ కన్యకలు శరీ సౌందర్యంకాదుకానీ ఆత్మీయహృదయ సౌందర్యం కలిగి ఉండాలి. రాజు కొరకై అంతఃపురములో ఆకన్యకలున్నట్లు విశ్వాసులమైన మనము మనజీవితాలు ప్రభువుకొరకే జీవించాలి. I కొరి 7:35 లో వున్నట్లు పెండ్లికాని యువతులు, కన్యకలు. తాము శరీరమందును, ఆత్మయందును పవిత్రురాండ్రైయుండుటకు ప్రభువు విషయమైన కార్యములను గూర్చి చింతించాలని వ్రాయబడివున్నది. సంఘాలలో మన జీవితాలు ప్రభువు కొరకే జీవిస్తున్నామా? ఆయన కార్యములను గూర్చి చింతఉన్నదా? పౌలుకు సంఘములన్నింటిని గూర్చిన చింత, తిమోతికి కూడా ఫిలిప్పీ సంఘము మీద చింత కలిగివున్నారు. ప్రియసోదరీ! నీ స్థానిక సంఘము మీద 'నీకు చింత ఉందా? 'ఇకను జీవించుదను నేనుకాను క్రీస్తే నాయందు జీవించు చున్నాడు. ఇక నేను జీవించు జీవితము నాకొరకు కాక నాకొరకు మృతి చెంది తిరిగి లేచిన యేసుకొరకే జీవిస్తాను" (గల 2:20) అని పౌలు అన్నాడు. కనుక మనము బ్రతుకుట క్రీస్తే చావైతే లాభమన్నట్లు గానే జీవించాలి. రాజుకన్యవైన నీవు సంఘములో వుండాలి. సంఘానికి వేరుగా కాదు. అంతఃపురములో ఆకన్యకలు హేగేవశములో వున్నారు. హేగే అను పేరుకుధ్యానము అని అర్థము. ఈ హేగే పరశుద్ధాత్మకు సాదృశ్యము. పరిశుద్ధాత్మ వశములో విశ్వాసి వుండాలి. వాక్యధ్యా నములో మనల్ని నడిపించి, వాక్యాన్ని మనకు బోధించు, సర్వసత్యములో మనల్ని నడిపించే పరిశుద్ధాత్మకు ఈహేగే సాదృశ్యంగా ఉన్నాడు. యోహా 16:13.వ॥. కనుకనే హేగే నడిపించినట్లు ఎస్తేరు రాజు నొద్దకు వెళ్ళినది.

ఈ అంతఃపురములో ఆకన్యకలు శుద్ధి పొందాలి. సంఘములో విశ్వాసులకు కూడ శుద్ధీకరణ అవసరము ఎఫె 5:27వ॥లో ఉన్నట్లు ప్రభువు మనలను ప్రేమించి సంఘము కళంకమైనను, ముడతయైనను, అట్టిది మరి ఏదైనను లేక, పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనది గాను, మహిమగల సంఘముగాను, ఆయన తనయెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని వాక్యముతో ఉదకస్నానముచేత పవిత్రము లేక శుద్ధి చేయాలనే, మనల్ని ప్రభువు సంఘములో చేర్చారు. కనుక సంఘ నియామక కూడికలన్నిటిలో మనకు శుద్ధీకరణ జరుగుతుంది. కనుక విశ్వాసులు తప్పని సరిగా అన్నికూడికలకు రావాలి. రాలేకపోతే శద్ధీకరణ వుండదని గ్రహించాలి. ఇలా శుద్ధీకరింపబడిన కన్యకలలో దేని యందు రాజు ఇష్టపడుతాడో ఆమె వష్తికి బదులుగా రాణి అవుతుంది. అహష్వేరోషు రాజు ఒక్కరియందు మాత్రమే ఇష్టపడి రాణిగా చేసుకుంటాడు కానీ, మన ప్రభువు మనలనందరినీ ఇష్టపడి మనలనందరనీ తన పెండ్లి భార్యగా చేసుకుంటారు. అహష్వేరోషు అంతఃపురములో శుద్ధీకరణ 12 నెలలు మాత్రమే జరుగుతుంది. కాని సంఘములో వాక్యముద్వారా శుద్ధీకరణ ప్రభువు భూలోకానికి 'రెండవసారి వచ్చేంతవరకూ

జరుగుతుంది. ఆశుద్ధీకరణ ఫలితంగా సంఘము ఎఫె5:27వ॥లో వున్నట్లుకళంకమైనను ముడత యైననులేక పరిశుద్ధమైనదిగాను మహిమ గల సంఘముగాను వాక్యముతో ఉదక స్నానము చేసిన సంఘముంగాను తయారవుతుంది.

## 5-7వ. బాల్యంలో ఎస్తేరు :

7వ॥లో ఎస్తేరు తల్లిదండ్రులు లేనిదని వ్రాయబడింది. అలాగే మనకు లేనివి ఎన్నోవున్నాయి. ఎఫె 2:12లో వున్నట్లు ఇశ్రాయేలీయులతో సహపౌరసత్వము లేని వారము. వాగ్దాన నిబంధనలు లేనివారము, పరజనులము, నిరీక్షణ లేని వారమును' దేవుడు లేనివారము, క్రీస్తుకు దూరముగా వున్నవాళ్ళము. అట్టి వారమైన మనలను దేవుడు క్రీస్తు రక్తము చేత కడిగి తన కుమారులుగా కుమార్తెలుగా చేశాడు.

మొర్దెకై తల్లిదండ్రులు లేని ఎస్తేరును తనకుమార్తెగా స్వీకరించాడు. ఎస్తేరును చెల్లెలుగా స్వీకరించలేదు కానీ కుమార్తెగా స్వీకరించాడు. ఈ కాలంలో యవనులు చెల్లెలిని కూడా చెల్లెలుగా భావించని వాళ్ళుగా వున్నారు. I తిమో 5:2వ॥లో సంఘములోని యవనస్త్రీలను, అక్క చెల్లెండ్రని పూర్ణ పవిత్రతతో సంబోధించాలని వ్రాయబడింది. చాలామంది అక్కా! చెల్లీ! అంటూ వుంటారు. కానీ హృదయంలో పవిత్రభావము లేకుండా వుంటారు. II సమూ 13:11లో అమ్నోను తామారును నా చెల్లీ ! అంటున్నాడు కానీ ఆమెపట్ల తన భావము భయంకరంగా వుంది. మొర్దెకై' తల్లిదండ్రులు లేని ఎస్తేరును ఏమిచేసినా అతనిని ఏమీ అనేవారు ఎవరునూలేరు. అయినా మొర్దెకై ఆమెను తన కుమార్తెగా స్వీకరించడమనేది మన మందరము ప్రశంశించతగినదే. మొర్దెకై కలిగిన సాక్షం నేటి యవ్వనులకందరికీ మాదిరికరము. ఎస్తేరు అందమైన రూపమును, సుందరముఖమును గలదట. ఒకటి లేక పోయినా (అనగా తల్లిదండ్రులు) మరొకటి (అనగా సుందర రూపము) దేవుడు ఎస్తేరుకిచ్చాడు. ఈ సుందర రూపమిచ్చుటలో కూడా దేవునికొక ప్రత్యేక ఉద్దేశము ఉన్నది. ఈ అందమే లేకపోతే అమె అహష్వేరోషు భార్య అవ్వడానికి వీలులేక పోయేది. ప్రభువు మన జీవితంలో ఏ తలాంతుయిచ్చినా, ఏ వరము యిచ్చినా, ఏ ఆశీర్వాదమిచ్చినా అన్నీ ఒక ఉద్దేశంతోనే యిస్తాడు. అందమైన ఎస్తేరు తన అందాన్ని బజారులో పారేసుకోలేదు. అందాన్ని బట్టి లూసీఫరు లాగా గర్వపడలేదు. అందము మోసకరమైందని గ్రహించి యెహోవా యందు భయభక్తులతో నడుచుకుంది.

## 8-15వ. అంత:పురములో ఎస్తేరు :

అంతఃపురములో ఎస్తేరు హేగేవశమునకు అప్పగింపబడింది. సంఘమనే అంతః పురంలో ఉన్న మన మందరము పరిశుద్ధాత్మ నడుపుదలకు అప్పగించుకోవాలి. ఆత్మచేత

నడిపించబడాలి. రోమా 8:14:వ॥ ఎస్తేరు హేగే దృష్టికి ఇంపైనదట. మరి మనమెలా వుంటే దేవునికిష్టులమో కొన్ని వాక్యాలు చూద్దాం.

1. విశ్వాసము కలిగిన వారు దేవుని కిష్టము హెబ్రీ 11:6వ ॥
2. భక్తి గలవారు దావీదుకు (దేవునికి) యిష్టులు కీర్త. 16:3 వ॥
3. దేవునికిష్టమైన కార్యము, యోహా 8 :29వ
4. యదార్థవంతులు ఆయనకిష్టులు సామె 11:20
5. సత్యవర్తనులు ఆయనకిష్టులు (సామె 12 :22)
6. రోగులు శుద్ధి అగుట ఆయనకిష్టమే. మార్కు 1:41 వ॥
7. యాగములు ఆయన కిష్టము లేదా ప్రీతికరము. ఫిలి 4:18వ॥
8. వినయ భయభక్తులతో చేయుసేవ ఆయన కిష్టం హెబ్రీ 2 :28 వ॥
9. యూదావనము ఆయన కిష్టమైనది ; యూదా అనగాస్తుతి అని అర్థము అనగా స్తుతించు వారు ఆయనకు యిష్టులు. యెష 5:7వ॥
10. శిక్షకులోబడిన విశ్వాసి ప్రభువు కిష్టం. యిర్మి 31:18 వ॥

మనముపై వాటిని చేస్తే పరిశుద్ధాత్మదయను సంపాదించుకోవచ్చు. 15 వ॥లో ఎస్తేరు తనను చూచిన వారందరి దయను పొందింది. 16వ రాజు యొక్క దయాదాక్షిణ్యములను పొందింది. ఎవరు దయను పొందుతారు? ఒకని సుబుద్ధి దయను సంపాదించును సామె 11:13. సమూయేలువలె, యేసుక్రీస్తువలె, (I సమూ 2:26, లూకా 2:52) మనుషుల దయయందు దేవునిదయయందును ఎదుగుతూవుండాలి. హేగే దయను పొందిన ఎస్తేరుకు హేగే 4 రకాల అవసరాలు త్వరగా ఏర్పరచాడు. అవియే

**1. పరిమళక్రియల కొరకైన వస్తువులు :** అంతఃపురములో వున్నంతకాలము ఎస్తేరు పరిమళ క్రియలు చేయాలి. సంఘములో వున్న విశ్వాసులమైన మనము కూడా వాటి యందు మనము నడుచు కొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియై వున్నాము. ఎఫె 2:10; తబిత సత్క్రియలు, ధర్మకార్యములు బహుగా చేసింది. ఆమె చనిపోయినా ఆమె సత్క్రియలు చావలేదు. అక్కడున్న పరిశుద్ధులు, విధవరాండ్రు తబితా తమతో వున్నపుడు కుట్టిన అంగీలను, వస్త్రములను పేతురుకుచూపారు. అలాగు మనమునూ ప్రభువు ద్వారా మనకు కేటాయింపబడిన సత్క్రియలు చేయాలి. తబిత సత్క్రియలే ఆమెను తిరిగీ బ్రతికించాయి అనిపిస్తుంది. అపో.కా 9:36-41.లో దావీదు కూడా తన తరము వారికి సేవచేసి నిద్రించాడని చదవగలము. కొర్నేలికూడా ప్రజలకు బహుధర్మము చేయుచుండెడివాడని అ.పో.కా 10:2వ. ద్వారా

గ్రహించగలము. ప్రియసోదరీ! ఈసత్క్రియలు చేయడానికి కావలసిన వస్తువులు, సరకులు అన్ని ప్రభువే ఇస్తాడు.

**2. భోజన పదార్థములు :** ఎస్తేరుకు కావలసిన భోజన పదార్థములను హేగే ఆమెకు ఏర్పాటు చేశాడు. సంఘములో వున్న విశ్వాసుల యొక్క శారీరక, ఆత్మీయ భోజన పదార్థములు కూడా ప్రభువు అనుగ్రహిస్తారు. భక్తుడైన ఏలీయా అవసరములను తీర్చుటకు కాకోలములను పంపాడు దేవుడు. కాకోలములు రొట్టెను మాంసాన్ని తెచ్చాయి. కెరీతు వాగు ద్వారా ఏలీయా దప్పికను తీర్చాడు. ప్రభువు II సమూ 17:6లో సంసోను ఫిలిష్తీయులను 1000 మందిని చంపిన తరువాత అతడు బహుదప్పిక గొనినవాడై ప్రభువును ప్రార్థింపగా, దేవుడు ఒక గోతిని చీల్చుట ద్వారా వచ్చిన నీళ్ళతో అతని దాహమును తీర్చినట్లు చూస్తున్నాము. ఆ గోతికి ' ఏన్హక్కోరే ' అను పేరు పెట్టబడింది. ఏన్హక్కోరే అనగా పిలిచినవాని ఊట అని అర్థము. అనగా సేవకు పిలుచుకున్నదేవుడే తనచే పిలువబడిన వారి అక్కరలు తీర్చుతాడని భావము. మన ఊటలు ఆయనయందే వున్నవి. అరణ్యములో 40 ఏండ్ల యాత్ర చేసిన ఇశ్రాయేలీయుల అక్కరలన్నీ ప్రభువే తీర్చారు కదా. అలాగే మన యాత్ర జీవితములో కూడా ప్రభువు మనలను తిండిలేక పస్తులు వుంచే దేవుడు కాదు.

**3. ఏడుగురు ఆడు పిల్లలు :** ఎస్తేరు సహవాసమునకై ఒకరు, ఇద్దరు కాదు. ఏడు గురు అనగా పరిపూర్ణ సహవాసమునకై ఆడపిల్లలను హేగే ఆమెకు ఏర్పాటు చేశాడు. అలాగే సంఘములోనున్న మనకు కూడా ప్రభువు సంపూర్ణ సహవాసాన్నిచ్చారు. మన సహవాసమైతే తండ్రితోను ఆయన కుమారుడైన యేసుతోను వున్నది. ఆయన పరిశుద్ధుల సహవాసం కూడా ప్రభువు మనకిచ్చారు. 1 యోహాను 1:3లో మనము సహవాసముగా కూడుట మానకూడదని, ఆయన రాకడ దినము సమీపించుచుండగా మరియెక్కువగా సహవాసము నిమిత్తమై కూడు కొనవలెనని ప్రభువు చెప్పుచున్నారు (హెబ్రీ 10:24-25). దుష్ట సాంగత్యము మంచినడవడిని చెరుపును గనుక నేటి యువతరం మంచివారితోనే సహవాసం చెయ్యాలి. దావీదు కుమారుడైన అమ్నోను, యెహోనాదాబు అను బహు కపటితో స్నేహం చేశాడు. యెహోనాదాబు చెడునడతను బోధించుట ద్వారా అమ్నోను అలాగే ప్రవర్తించి అఖరికి అబ్షాలోముతో చంపబడ్డాడు (II సమూ 13:3-28). కావున మన స్నేహితులెవరైయుండాలి ? II తిమో 2:22 ప్రకారము యవనేచ్ఛల నుండి పారిపోయి పవిత్రహృదయులై, ప్రభువునకు ప్రార్థన చేయువారితోకూడ నీతిని, విశ్వాసమును, ప్రేమను, సమాధానమును వెంటాడాలి. కీర్తన 119:63 ప్రకారం యెహోవాయందు భయభక్తులు గలవారు ఆయన ఉపదేశములను అనుసరించు వారు మనకు స్నేహితులైవుండాలి.

ఇక్కడ హేగే ఎస్తేరు ఆడపిల్ల గనుక ఆడపిల్లలనే చెలికత్తెలుగా యిచ్చాడు. ఈ దినాల్లో ఆడపిల్లలు boy friends ను, మగ పిల్లలు girl friends ను కలిగియున్నట్లు చూస్తున్నాం. ఇది వాక్యాను సారం కాదు. ఈ దినాల్లో పట్టణాలలలో అనేక మంది ఆడపిల్లలు boy friends తో సరదాగా తిరుగుతూ late గా యింటికి వస్తున్నారు. నానా మోసకరమైన పరిస్థితులలోకి వెళ్ళిపోతున్నారు. తనతో వున్న ఏడుగురు చెలికత్తెలను ఎలా ప్రభువు తట్టు త్రిప్పి ఈలాగు ఉపవాస ప్రార్థన చేయువారిగా మార్చిందో ఆ సంగతి 4వ అధ్యాయములో చూడవచ్చును. బోయజు రూతుతో రూతు 2:8లో ఇచ్చట నా పని కత్తెలయొద్ద నిలకడగా వుండమన్నాడు. కానీ పనిచేసే యువనస్తుల యొద్ద కాదు. అంతేకాక 'యువనస్తులు నిన్ను ముట్టకూడదని ఆజ్ఞాపించాను' అంటున్నాడు. ఈనాడు యువనస్తులు, యువనస్థురాండ్రు కలసి చెట్టా పట్టా లేసుకుని తిరుగుచుండుట వాక్యవిరుద్ధముగా, దేవుని కయిష్టమైనదిగా యున్నది కాదా !

**4. అంతఃపురంలో అతి శ్రేష్ఠమైన స్థలము :** హేగే అంతఃపురములో ఎస్తేరుకు అతి శ్రేష్ఠమైన స్థానాన్నిచ్చాడు. హేగే దయను పొందిన ఎస్తేరు, హేగేకు యింపయిన ఎస్తేరు అంతఃపురములో అతి శ్రేష్ఠమైన స్థానాన్ని పొందింది. ప్రభువు మనకు కూడా మనోహరమైన స్థలములో పాలు ప్రాప్తింప చేస్తారు. శ్రేష్ఠమైన స్వాస్థ్యము ప్రభువు మనకిస్తారు (కీర్తన 16:6). ప్రభువు యాకోబు స్వాస్థ్యాన్ని మన అనుభవంలో ఉంచుతానన్నారు. ఇదే ఎస్తేరు గ్రంథములో, హామాను ఇంటిని ఎస్తేరుకును, హామాను ఉంగరమును (అనగా అధికారాన్ని) మొర్దెకైకి దేవుడిచ్చాడు. ప్రభువు తన పరలోకరాజ్యములో మనకు శ్రేష్ఠమైన స్వాస్థ్యమును అనుగ్రహిస్తారు. అదివాడబారని మహిమాస్వాస్థ్యము. అసలు ఆయన యిచ్చిన రక్షణయే ఒక స్వాస్థ్యము. శ్రేష్ఠమైనదియు స్థిరమైనదియునైన స్వాస్థ్యాన్ని పొందుదుమని యెరిగి హెబ్రీ క్రైస్తవులు ఆస్తి కోల్పోవుటకు ఇష్టపడ్డారు. హెబ్రీ 10:35లో శ్రేష్ఠమైన వాటిని ఇచ్చాడు. ఈలాగు అన్నింటిలో శ్రేష్ఠమైన వాటినే తన పిల్లలమైన మనకు ప్రభువిస్తున్నాడు. శ్రేష్ఠమైన ఈ ఊట ప్రభువే. అలా మనకు శ్రేష్ఠమైన వాటినన్నింటినీ అనుగ్రహిస్తున్న ఆప్రభువు అందరిలో అతిశ్రేష్ఠుడు. ఆయన నామము కూడా శ్రేష్ఠమైనదే. ఎస్తేరుకు కావలసిన వస్తువులు అనగా భోజన పదార్థములు, ఏడుగురు చెలికత్తెలు, అంతఃపురములో అతి శ్రేష్ఠమైన స్థానము, యివన్నియూ హేగే త్వరగా ఆమెకు ఏర్పాటు చేశాడు. ఆలస్యంగా కాదు. సరియైన సమయానికి త్వరగా ఏర్పాటు చేశాడు. తన్ను ప్రేమించువారికి మేలుకలుగుటకై ప్రభువు సమస్తమును సమకూడి జరుగునట్లు చేస్తారు (రోమా 8 : 28). ఎస్తేరు కిచ్చిన దేవుడు నీకివ్వడా? సోదరీ ! మీకేమికావలో మీ పరలోకపు తండ్రికి తెలియును కనుక ఆయన నీతిని ఆయన రాజ్యాన్ని మొదట వెదుకుడి అని ప్రభువు చెప్పారు. ఇలా లోక సంబంధమైనవే కాక పరలోకపు అంతఃపురమైన నూతన యెరూషలేములో

కూడ అతి శ్రేష్ఠమైన స్థానం పొందాలంటే ఎస్తేరు వలె మనముకూడా ప్రభువు కు ఇంపైన జీవితం జీవించాలి.

2:10వచనంలో మొర్దెకై ఎస్తేరుతో తన జాతిని వంశమును కనుపరచకూడదని ఆజ్ఞాపించాడు. కారణం అలా చెబితే ఆమెను అహష్వేరోషు రాజు పెండ్లి చేసుకోవడానికి, రాణిగా చేయటానికి ఆటంకముగా వుండగలదు. 11వచనములో ఎస్తేరు ఏలాగుండెనో ఆమెకు ఏమి సంభవించునో అది తెలుసుకోవటానికి అంతఃపురము ఆవరణము ఎదుట ప్రతిదినము మొర్దెకై తిరుగులాడుచుండెను. తన చెల్లికి ఏమి సంభవిస్తుందో, ఆమె ఏలాగున్నదోనని ప్రతిదినము మొర్దెకై ఆమెకు కావలి కాయుచున్న వాడివలె వున్నాడు. పర 1:6లో షూలమ్మితి సహోదరులు ఆమె మీద కోపించి ఆమెను తమ ద్రాక్షతోటకు కావలికత్తెగా వుంచుకున్నారు. కానీ, ఇక్కడ మొర్దెకై తన చెల్లికి ఏమిసంభవించునో అని ఆమెను కావలి కాయుచున్న వాడుగా చూస్తున్నాం. ఎంతమంచి సహోదరుడుగా వున్నాడో కదా! మొర్దెకై తల్లిదండ్రులు లేని ఈ చెల్లిని అన్నివిధాలుగా భద్రంగా చూచుకొనుచున్నాడు. తల్లిదండ్రులమైన మనము చదువు నిమిత్తం గానీ ఉద్యోగముల నిమిత్తంగానీ, సేవ నిమిత్తంగానీ, దూరప్రాంతాలలో నివసిస్తున్న మన కుమారుల, కుమార్తెల నిమిత్తమై, సహోదర సహోదరీల నిమిత్తమై, ప్రతిదినము వారి ఆత్మీయ, శారీరక పరిస్థితులు ఎలా వున్నాయో అని వారికొరకు నిత్యము ప్రార్థనలో కనిపెట్టవలసిన వారముగా, కాపు కాయవలసినవారముగా వున్నాము. మన ప్రార్థనలు వారి చుట్టూ ఒక ప్రహరీగోడగా ఉండాలి. యోబు తన పదిమంది సంతానము కొరకు అనుదినము అరుణోదయమున దహనబలి చేసేవాడు. ఇంత చేసినా, ఆ పిల్లలు యింటి మిద్దెకూలి చనిపోయారే. అలాగున మనము ప్రార్థన ద్వారా మనపిల్లలను కావలి కాయకపోతే ఎంత శీఘ్రముగా వారు నశించిపోతారో! మనము ఆసంగతిని చాలా తీవ్రముగా ఆలోచించాలి. అలా మనపిల్లలకు సరైన కాపుదలగా మన ముండకపోతే సాతాను తనదుష్ట పన్నాగాలతో, అగ్నిబాణములను మనపిల్లల మీద ప్రయోగించడానికి ముందుకు వస్తాడు. అప్పుడు ఎంత ఏడ్చినా లాభం లేదు. ప్రభువు చెప్పినట్లు నాకొరకు ఏడ్వకుడి గానీ మీకొరకు మీపిల్లల కొరకు ఏడ్వుడి అన్నట్లు మరియు విలా 2:18-19లో చెప్పినట్లు మన పసిపిల్లల ప్రాణముల కొరకు మనచేతులు ఆయన తట్టు ఎత్తి ప్రార్థించి వారిని కాపాడాలి.

అంతఃపురములో కన్యకలు ఆరునెలలు గోపరస తైలముతో శుద్ధీకరణ పొందాలి. పరమగీతము1:13వ ప్రకారం ప్రియుడైన యేసు ప్రభువే మన హృదయమందుండు గోపరసతైలము వంటి సువాసన గలవాడు. ఆప్రభువే తనరక్తముతో మనల్ని శుద్ధీకరించినవాడు. ఆయనవుండవలసిన స్థానము మన హృదయమే. సామె 23:26లో ప్రభువు కుమారుడా నీహృదయము నాకిమ్మన్నాడు. ప్రభువే మన సువాసన, అనగా చక్కని సాక్ష్యజీవితమునిచ్చినవాడు.

అలాగే స్త్రీల పరిమళక్రియల కొరకైన వేరువేరు పదార్థములలో మరో 6నెలలు పరిమళక్రియలను చేసి ముగించి రాజునొద్దకు వెళ్ళాలి. ప్రభువు రక్తముతో శుద్ధీకరింపబడిన మనము మనకు కేటాయింపబడిన పరిమళక్రియలు అనగా సత్క్రియలు చేసిముగించి ప్రభువునొద్దకు చేరాలి (ఎఫె 2:10). దావీదు తన తరము వారికి సేవచేసి నిద్రించినట్లు తబిత తాను బ్రతికియున్నప్పుడు విధవరాండ్రకు అంగీలు కుట్టించి పరిశుద్ధులకు వస్త్రములనిచ్చినట్లు మనమును మనకప్పగించబడిన సత్క్రియలు చేసి ముగించి మనమనవంతు వచ్చినపుడు మనపరమరాజు నొద్దకు వెళ్ళాలి. మనవంతు అనగా మనమును మరణించినపుడు లేదా సంఘము ఎత్తబడినపుడు మనవంతు వస్తుంది. అలాగునా రాజుయింటిలోనికి వెళ్ళినపుడు ఆమె ఏమేమి కోరునో అవి అట్టి స్త్రీకి ఇవ్వబడుట జరిగేది. బాహ్యరూప సౌందర్యం కొరకు ఏమేమి కావాలో ఆకన్యకలు వాటిని కోరుకునేవారు. నూతన నిబంధన సంఘ కన్యక యొక్క అలంకరణ కీర్త 149:4వ॥లో వున్నట్లు రక్షణయే అని అర్థమౌతుంది. I తిమో 2:10-12 ప్రకారము సత్క్రియలు చేయుట, మౌనముగా వుండుట, భర్తయెడల సంపూర్ణ విధేయత కనబరచుట. Iపేతురు3:1-6లో వున్నట్లు పవిత్ర ప్రవర్తన, సాధువైనట్టి గుణం, మృదువైనట్టి గుణం అను అక్షయాలంకారము సంఘ కన్యకయైన మనకు అలంకారముగా వుండవలెను. అది దేవుని దృష్టికి మిగుల విలువ గలది. ఎస్తేరు యిట్టి అక్షయమైన అలంకారాన్ని ధరించి రాజు నొద్దకు వెళ్ళింది. మరి ఏ యితర అలంకారాలను కోరలేదు. యెష 3:16-26వ॥లో వున్న లౌకికి అలంకారాలన్నీపాడైపోయ్యేవే. వాక్యములో పరిశుద్ధ దేవుడు నిర్ణయించిన అలంకారము మాత్రమే చివరివరకు నిలిచి వుంటుంది అది ప్రభువు దృష్టికి మిగుల విలువగలది. హేగే నిర్ణయించిన అలంకారాన్నే రాజు యిష్టపడతాడు. ఈ మర్మాన్ని ఎరిగిను ఎస్తేరు హేగే నిర్ణయించినిన అలంకారాన్ని గాక మరిదేనిని కోరక రాజునొద్దకు వెళ్ళగా స్త్రీలందరికంటే రాజు ఎస్తేరును ఎక్కువగా ప్రేమించాడు. అలాగైతే పరలోకరాజు ఎవరిని ఎక్కువగా (యితరులకంటే) ప్రేమిస్తాడు? వాక్యములో పైన చెప్పబడిన ఆత్మీయ ఆభరణాలన్నిటిని ధరించేవారిని ప్రభువు ఎక్కువగా ప్రేమిస్తాడు. కీర్త 45:11లో ఈ రాజు నీ సౌందర్యమును కోరుచున్నాడని వ్రాయబడింది. ఎందుకనగా కీర్త 45:2లో ఆయన అందరిలో అతిసుందరుడు. అతి సుందరుడైన ప్రభువు తన సంఘమనే కన్యకను సౌందర్యవంతురాలిగానే చూడగోరుచున్నాడు. ఈ సౌందర్యంతోనే రెండవరాకడలో మనము ప్రభువుని సంధించినపుడు యెష 62:5లో వున్నట్లు పెండ్లి కుమారుడైన ప్రభువు, పెండ్లికుమార్తెయైన సంఘాన్ని చూచి సంతోషిస్తాడు. ఎస్తేరును ప్రేమించినట్లు ప్రేమిస్తాడు. ఆహష్వేరోషు రాజు కన్యకలందరికంటే ఎస్తేరును ఎక్కువగా ప్రేమించి, ఆమె తలమీద కిరీటము ఉంచి వష్తికి బదులు ఆమెను రాణిగా చేశాడు. కారణం ఆమె కన్యకలందరికంటే రాజుకు యిష్టురాలుగా వుండింది.

## 16-18వ. రాణియైన ఎస్తేరు :

రాజు ఎస్తేరు విషయమై గొప్ప విందు చేయించాడు రాజు చేసిన విందులలో కెల్ల ఎస్తేరు విషయమై చేసిన విందు గొప్పది అని వ్రాయబడింది. ప్రభువు సంఘము విషయమై కూడ గొర్రెపిల్ల వివాహ ఉత్సవ సమయములో విందు చేయిస్తాడు. చేయును ఆదినమున రాజు జనులకు తన స్థితికి తగినట్టుగా బహుమతులను ఇప్పించినట్లు ప్రభువు ఆ సంఘములోని విశ్వాసులకు బహుమానములు ఇస్తారు.

## 19-23వ. అన్యరాజుకు మొర్దెకై చేసినమేలు :

రాజు యొక్క షండులైన బిగ్తాను, తెరెషు అను ద్వారపాలకులు రాజును చంపుటకు ఆలోచించగా ఈ సంగతి మొర్దెకైకి తెలిసినందున, అతడు ఆసంగతిని రాణియైన ఎస్తేరుకు తెలిపి రాజును మరణమునుండి రక్షించాడు. బిగ్తాను, తెరెషు విషయమై కొంత ఆలోచిద్దాం. బిగ్తాను పేరుకు అదృష్టదానము అని, తెరెషు పేరుకు భక్తి లేక స్వాస్థ్యము అని అర్థము. వీరిద్దరూ రాజు దగ్గర ద్వారపాలకులుగా వుంటూ రాజు సేవచేయువారుగా వున్నారు. రాజుకు హాని కలిగించు వారెవ్వరూ రాజుసన్నిధికి రాకుండా కాపాడ వలసినవారు. బిగ్తాను పేరు యొక్క అర్థమును బట్టి (అదృష్టదానము లేక కృపాదానము) రక్షించబడిన వ్యక్తికి సాదృశ్యముగా వున్నాడు. అలాగే తెరెషు పేరు యొక్క అర్థములనుబట్టి అతడు భక్తిపరునికి, రక్షణ అను స్వాస్థ్యమును పొందిన విశ్వాసికి సాదృశ్యంగా వున్నాడు. ఇటువంటి వారు రాజుదగ్గర ఉద్యోగం చేస్తూ, రాజు ఉప్పుతింటు, రాజు ప్రాణానికి ఎసరు పెడుతున్నారు. అలాగే ఈనాడు ప్రభువును నమ్మామని చెప్పుకుంటూ, భక్తిపరులమని చెప్పుకుంటూ, సేవకులమని చెప్పుకుంటూ రాజు ప్రాణాలను తీసే వాళ్ళుగా ఉంటున్నామా?. బిగ్తాను, తెరెషు రాజు మీద కోపగ్రస్తులై రాజును చంపటానికి ఆలోచించారు. కోపము ఎంత పనైనా చేస్తుంది. నేను ప్రభువుమీద కోపపడుట లేదు కాదా! చంపాలని అనుకొనడం లేదు కదా! అని మనము అనుకోవచ్చు. ఆయన ప్రాణం తీయక పోయినా ఆయన ప్రాణమైయున్న సంఘము? సభికుల ప్రాణాలు తీస్తున్నారు, ఆయన ప్రాణరక్తాన్ని పంచుకొని నూతన జన్మ పొందిన సంఘ సభికుల మీద కోపపడుచు ఒకరి హృదయాన్ని గాయపరిచి, నొప్పించే మాటలతో పోటు పొడిచి, ప్రాణం పోయేంత రీతిగా మాట్లాడుతున్నామా? మన మాటలే బాకులైవారి ప్రాణానికి బాధ కలిగిస్తున్నాయా? ఒకింత సేపు ఆలోచించాలి. ఈ సంగతి మొర్దెకై ద్వారా ఎస్తేరుకు, ఎస్తేరు ద్వారా రాజుకు తెలిసింది. ఆసంగతి రాజువిచారణ చేశాడు. మన పరమ ప్రభువుకూడా అన్ని సంగతులు తీర్పులో విచారణకు తెస్తారు. విశ్వాసుల తీర్పు ఏడుయేండ్ల చివరిలో జరుగుతుంది. II కొరి 5 :10 ప్రకారం క్రీస్తు న్యాయ పీఠం దగ్గర విచారణ జరుగుతుంది. మనము చేసిన క్రియల ఫలితము

అనుభవిస్తాము. అది ఎంతో విచారకరము. ఎస్తేరు 1:13 ప్రకారం అహష్వేరోషు రాజు ప్రతిసంగతిని పరిష్కరించువాడు. తన భార్యను తాను పిలువగా ఆమె రానందుకై నాభార్యకదా ఎందుకులేవిచారించడం అనుకోలేదు. తన భార్యనే వదల్లేకపోతే బిగ్తాను, తెరెషులను వదలుతాడా? విచారించి శిక్షవేశాడు. ప్రియసోదరీ! నీవు నామాకార్థ క్రైస్తవురాలిగా వుంటూ, రక్షించ బడినట్లు, భక్తి పరురాలుగా వున్నట్లు, ప్రభువుసేవలో వున్నట్లే వుండి, నీపేరుకు తగిన జీవితం నీలో వుందా? లేక వేరుగా వుందా? పట్టిపేరు మాత్రమేనా? తీరు, లేదా? నిన్నునీవు నేను కూడ దేవునిబిడ్డనే అనుకుంటూ ఇంకాకోపము, నరహత్యలు, దురాలోచనలు, దుర్భాషలు, బాకుల్లాంటి ప్రాణాన్ని బాధపెట్టే మాటలు, నీ పె జీవితంలో కలిగి వున్నావా?. ప్రభువు రెండవ రాకడలో వస్తున్నాడు. తీర్పు తీర్చి క్రియల ఫలితనిస్తాడు.

ఈ రాజైతే తన్నుచంపుటకు బిగ్తాను తెరెషు ఆలోచిస్తున్నారని తెలిసిన వెంటనే విచారణ జరిపి వెంటనే వారిని ఉరికొయ్యకు అప్పగించాడు. మన ప్రభువైతే ప్రధాన యాజకులు రోమా సైనికులును తన్ను చంపుతూ బాధిస్తున్నప్పటికీ తండ్రీ వీరేమి చేస్తున్నారో వీరెరుగరు కనుక వీరిని క్షమించుమని ప్రార్థించారేకానీ వారిని నాశనము చేయలేదు కాదా?. రాబోయేకాలంలో పాప మానవుల కొరకు రక్తంచిందించి బలికావాలని తండ్రి చిత్తమెరిగిన వాడై తన్నుతాను మనకొరకు దేవునికి బలిగాను అర్పణముగాను అర్పించుకొని దిక్కులేని శాపగ్రస్తుమైన సిలువస్త మరణాన్ని అనుభవించాడు. మన ప్రభువు ఎంత ప్రేమామయుడో కదా!

ఈలాగున బిగ్తాను, తెరెషుల మీద రాజు విచారణ జరిపి ఉరిశిక్ష వేసినపుడు వారిరువురు కనీసం రాజును క్షమాభిక్షకోరినట్లు లేదు. ఒకవేళ కోరినా రాజు క్షమించ లేదేమో తెలియదు. కానీ రక్షించబడిన నీకు నీపాపములకొరకు రావలసిన నరక శిక్షను గురించి బాగుగా తెలుసు. బైబిలులో పరలోకం కంటే నరకలోకం గురించే ఎక్కువ సార్లు వ్రాయబడింది. నీక్రియాఫలము నరక బాధే అని నీకు తెలుసు. మరి ఎప్పుడైనా నీ పాపాలను క్షమించి తన రక్తములో కడగమని ప్రభువును వేడుకొన్నావా? సూక్ష్మంలో వుంది మోక్షం. వేడుకొనక పోతే నీజీవితం వ్యర్థం. ఘోరం, బహుఘోరం, నీవు చావవు ఆ అగ్ని ఆరదు. ఏడ్పే, పండ్లు కొరుకుటే నీ పని.

అన్యరాజుకు మొర్దెకై మేలు చేశాడు. మనమును ఈలోకస్థులను పాపము వలన వచ్చు జీతమైన రెండవ మరణము అనగా నరకము నుండి తప్పించి మేలు చేయవలసిన వారమై యున్నాము. మిమ్మును చెరగొనిపోయిన దేశము కొఱకు ప్రార్థిస్తే వారిక్షేమము మీక్షేమానికి కారణమౌతుందని ప్రభువు యిర్మీ 29:7లో చెప్పారు. మనుషులందరికొరకు అనగా రాజుల కొరకు, అధికారుల కొఱకు విజ్ఞాపనములను, ప్రార్థనలను, యాచనలను, కృతజ్ఞతాస్తుతులను చేయవలెనని ప్రభువు 1 తిమో 2:2లో హెచ్చరించుచున్నారు.

రాజుక్షేమం కోరిన మొర్దెకైకి రాజుద్వారా ప్రధానమంత్రి పదవి 8వ అధ్యాయంలో కలిగింది. గల 6:9-10 ప్రకారం మనము అలయకమేలు చేసితిమేని తగినకాలమందు పంట కోస్తాము. మొర్దెకై రాజు కొరకై చేసిన మేలు రాజ్య సమాచార గ్రంథమందు వ్రాయబడింది. మనమేమేమి చేస్తున్నామో అవి ప్రక 20:12,13లోని మంచి చెడ్డల గ్రంథములో వ్రాయబడుతున్నాయి. వాటిని బట్టి తీర్పు ఉంటుంది. కావున చావవలసిన రాజును మొర్దెకై రక్షించినట్లు సామె 24:11 ప్రకారము మనము కూడా చావునకై పట్టబడిన వారిని తప్పించి నాశనమునకు జోగుచున్న వారిని రక్షించాలి. మనం పరదేశులం. ఈపరదేశంలో ఎంతమందిని రక్షించాం? మొర్దెకై పరాయి దేశంలో ఆదేశరాజునే రక్షించాడు. ఇది ఎంతో గొప్ప సంగతి.

❖ ❖ ❖

## 3వ అధ్యాయము 2+2+2+9=15వ.

**అంశము :** హామాను ప్రధానమంత్రిగా హెచ్చింపు-హామాను ద్వారా యూదులు చంపబడవలెనన్న ఆజ్ఞ.

**విభజన :** 1-2వ. హామాను హెచ్చింపు

3-4వ. మొర్దెకై హామానుకు నమస్కరించక పోవుట.

5-6వ. యూదులందరిమీద ప్రతీకారము

7-15వ. యూదులను చంపించుటకు తాకీదులపై రాజముద్ర వేయుట.

### 1-2వ. హామాను హెచ్చింపు :

1వ వచనంలో రాజు హమ్మెదాత కుమారుడును, అగాగీయుడైన హామానును ఘనపరచి హెచ్చించాడు. వాని పీఠమును తన దగ్గరనున్న వారందరి పీఠములకంటే ఎత్తుగా చేశాడు. హామాను అమాలేకీయుడైన అగగురాజు సంతాన సంబంధిగా II సమూ 15:20 లో కనబడుతున్నాడు. నిర్గ 17:14-16 ప్రకారం ఆకాశం క్రింద నుండి తుడుపు పెట్టబడవలసిన అమాలేకీయుడగు అగగు సంబంధి. అమాలేకు శరీరమును ప్రేమించిన ఏశావు సంతానమైనందున శరీరమనెడి శత్రువుకు సాదృశ్యము. శరీరమనే శత్రువు, యెహోవా విరోధియు అయిన హామానును రాజు నిష్కారణముగా హెచ్చించాడు. కానీ ఆ హెచ్చింపును హామాను దుర్వినియోగము చేసుకున్నాడు. చివరకు తన స్వంత నాశనానికి తానే కారణమయ్యాడు. అలాగే ఏ యోగ్యత, మెప్పులేని మనల్ని క్రీస్తు ప్రభువు ద్వారా దేవుడు రాజులుగా, యాజకులుగా, తన గుణాతిశయములను ప్రచురించు వారిగా చేసి ఆత్మీయంగాను, శారీరకంగాను ఎన్నో

దీవెనలు హెచ్చింపులు యిచ్చాడు. కానీ వాటిని మనము దుర్వినియోగము చేసికొనక ప్రభుప మహిమ కొరకై వాటిని వాడాలి. అలాగున హామాను తనకివ్వబడిన ఉద్యోగాన్ని, అధికృతను దుర్వినియోగపరచుకున్నాడు. ప్రభుపు ద్వారా మనకివ్వబడిన కిరీటాన్ని ఎవ్వరూ అపహరింపకుండా చూచుకోవాలి. వష్తి కిరీటం, సింహాసనం, రాణిపదవి ఎస్తేరు కొచ్చాయి. హామాను పదవి ఉంగరం మొర్దెకైకి వచ్చాయి. హామాను ఇల్లు ఎస్తేరుకు వచ్చింది. హామాను ఇంటిమీద అధికారాన్ని ఎస్తేరు మొర్దెకైకి యిచ్చింది.

ఈ హామాను అమాలేకు జాతివాడు. అమాలేకీయులు ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రము దాటగానే నిర్గమ 17:8-16లో ఎదురైన మొదటి శత్రువులు హామాను కూడా యూదులకు శత్రువే. ఇట్టి అమాలేకీయుల పేరు ఆకాశం క్రిందనుండి తుడిపి వేయాలని జ్ఞాపకార్థ గ్రంథములో దీనిని వ్రాసి యెహోషువకు వినిపించమని మోషేతో దేవుడు చెప్పాడు. హామాను భూమి మీద ఆకాశము క్రింద వుండవలసిన వాడు కాదు, కారణం అమాలేకీయులు తమచేతిని యెహోవాకు విరోధముగా ఎత్తినవారు. " యెహోవాకు అమాలేకీయులతో తరతరముల వరకు యుద్ధము " అని వ్రాయబడింది. అట్టి యెహోవాకే శత్రువైన హామానుపీఠాన్ని రాజు హెచ్చించడం దేవునికిష్టమైనది కాదు. ఇలా I సమూ 15:18,19వచనం ప్రకారం దేవుడు నిర్మూలము చేయుమని చెప్పిన అమాలేకు సంతానమైన అగగును సౌలురాజు బ్రతికించాడు. కానీ ప్రవక్తయైన సమూయేలు I సమూ 15:23 వచనంలో అగగును రాజు తుత్తునియలు చేశాడు. ఇతడు పాపాత్ముడని 18 వచనములోను, స్త్రీలకు సంతు లేకుండా చేసిన హంతకుడని 33వ వచనంలోను చదువుతాము. తాను చేసినట్టే దేవుడు తనకు సమూయేలు ద్వారా చేశాడు. అతని తల్లికి సంతు లేకుండా దేవుడు చేశాడు. మరియు అమాలేకీయులు బైబిల్‌లో శరీరానికి సాదృశ్యంగా వున్నారు. హామానును హెచ్చిస్తే యూదులకు శ్రమ, శోకం, విచారం కలిగాయి. అలాగే మన శరీరాన్ని మనం హెచ్చిస్తే లేక శరీరానికి ప్రాముఖ్యతనిస్తే, ఆత్మమీద శరీరం ప్రభుత్వము చేస్తే, ఆత్మకు ఎంతైనా అపారనష్టం కలుగుతుంది. హామాను యూదులకు శత్రువు. శరీరము ఆత్మకు శత్రువు. ఈ శరీరంలో మంచిది ఏదియూ నివసించదు. శరీర క్రియలు నశించి పోవాలంటే ఆత్మవైపే మొగ్గు చూపాలి. ఆత్మచేత శారీరక క్రియలను చంపాలి. ఎల్లప్పుడు ఆత్మచేత నింపబడి, నడిపింపబడి ఆత్మ పూర్ణులై వుండాలి. శరీర కార్యాలు తుత్తునియలు చేయాలి. I పేతు 2 :11లో వ్రాయబడినట్లు మనము పరదేశులమును, యాత్రికులము గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశలను విసర్జించాలని ప్రభువు చెబుతున్నాడు.

అహష్వేరోషు రాజు, తన ప్రాణాలను బిగ్తాను, తెరెషు అను ద్వార పాలకుల నుండి రక్షించి ఆత్మకు గుర్తుగా వున్న ' మొర్దెకై' ని హెచ్చింపలేదు. కానీ తనకు ఏమేలునూ చేయని 'శరీరానికి' గుర్తుగా వున్న హామాను యొక్క పీఠాన్ని, అందరి పీఠములకంటే ఎత్తుగా

చేశాడు. 3వ అధ్యాయంలో హెచ్చింపబడిన హామాను 7వ అధ్యాయంలో పతనం చెందాడు. హెచ్చింపు పొందిన శరీరం చివరకు పతనం చెందడం ఖాయం. మత్త 11:23వలో " కపెర్నహోమా! ఆకాశము మట్టుకు నీవు హెచ్చింపబడెదవా ? నీవు పాతాళము వరకు దిగిపోయెదవు " అని ప్రభువన్నారు. తన్నుతాను హెచ్చించు కొనువాడు తగ్గింపబడును. సాతాను కూడా యెష 14:13వలో ఆకాశానికి హెచ్చించుకున్నాడు. నక్షత్రాలకు పైగా సింహాసనాన్ని హెచ్చించుకున్నాడు. ఉత్తర దిక్కునవున్న సభా పర్వతము మీదికి ఎక్కిపోయెదననుకున్నాడు. మేఘమండలము మీదికి ఎక్కుదుననుకున్నాడు. సర్వోన్నతమైన స్థలములో నివసించే సర్వోన్నతునితో తనను సమానునిగా చేసుకుంటానను కున్నాడు. కానీ 15వ వచనంలో వున్నట్లు పాతాళమందుచు నరకములో ఒక మూలకు త్రోయబడ్డాడు. 11వ వచనంలో వున్నట్లు అతని క్రింద పురుగులు వ్యాపించాయి. కీటకములు అతనిని కప్పాయి. తేజో నక్షత్రమైన తాను, వేకువచుక్క అయిన తాను ఆకాశము నుండి నరకంలో ఒకమూలకు త్రోసి వేయబడ్డాడు. కనుక పెరుగుట విరుగుట కొరకే, రోమా 6:13 ప్రకారము శరీరము ననుసరించి మనము నడిచిన యెడల చావవలసిన వారమైయుందుము. కానీ ఆత్మచేత శారీరిక క్రియలను చంపాలి. యూదులు ఆత్మ ద్వారా మూడు రోజుల ఉపవాసమూ ప్రార్థన చేయుట ద్వారా హామాను (శత్రువు) చావు చూడగలిగారు. కావున విశ్వాసులమైన మనము శరీరానికి ప్రాధాన్యత ఇవ్వకూడదు. అలాఇస్తే ఆత్మకు ఎంతైనా నష్టము కలుగుతుంది. ఆత్మద్వారా ప్రార్థనచేసి శరీరక్రియల్ని చంపేయాలి.

రాజుకు మేలుచేసిన మొర్దెకైకి కాకుండా హామాను యొక్క పీఠాన్ని రాజు హెచ్చించినట్లు ఈ లోకంలో అనేకమంది అన్యాయస్థులు, మోసగాండ్రు, భక్తి హీనులు చాలా ఉన్నత స్థానాల్లో, పదవుల్లో ఎందుకు వుంటున్నారు? అని విశ్వాసులు అనుకోవచ్చు. అలాగే దావీదు 37 కీర్తనలో భక్తిహీనుల క్షేమము తన కంట పడినపుడు ఆయన మత్సరపడ్డాడు. వ్యసన పడ్డాడు. కానీ కొంత కాలమునకు భక్తిహీనులు లేకపోవుదురు. జాగ్రత్తగా పరిశీలించిననూ వారు కనబడక పోవుదురు అన్నాడు. "నిశ్చయముగా నీవు వారిని కాలుజారు చోటనే వుంచి యున్నావు" అని అన్నాడు. అలాగున తన మార్గమున వర్ధిల్లుచున్న హామానులాంటి భక్తిహీనులను చూచి వ్యసన పడక వాళ్ళు అన్నింటిలోనూ ఎదిగిపోతున్నారే అని మనము మత్సరపడకూడదు వారికి లేని ఆత్మీయ రక్షణాశీర్వాదాన్ని ప్రభువు మనకిచ్చారు. కావున ఆ ఆత్మీయ ఆశీర్వాదాలను బట్టి ప్రభువును స్తుతించుటే మంచిది. మనదేశానికి, మన రాష్ట్రానికి మనము కనీసము ప్రార్థనా మేలు చేస్తే తగిన కాలంలో మొర్దెకైవలె పంట కోస్తాము. తనకు మేలు చేసి రక్షించిన మొర్దెకైకి రాజు ఏ స్థిరమైన మేలు చేయలేదు. కేవలం ఊరేగింపు మాత్రమే చేశాడు. ఆ తరువాత మొర్దెకై తన మామూలు రాజ గుమ్మము దగ్గర పనికి వెళ్ళిపోయాడు. కానీ ఎస్తే 8:15వలో

దేవుడే భవిష్యత్తులో తనను ప్రధానమంత్రి పదవికి హెచ్చించాడు. కనుక మనము గల 6:10వలో వ్రాయబడిన ప్రకారము సమయము దొరికినకొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారియెడలను మేలు చేయాలి.

## 3-4వ. మొర్దెకై హామానుకు నమస్కరించకపోవుట :

రాజ సేవకులందరూ మోకాళ్ళూని హామానుకు నమస్కరించారు. కానీ దేవుడు ఎవరితో తరతరములకు యుద్ధం చేస్తున్నాడో, ఆ అమాలేకీయుల సంబంధియైన హామానుకు మొర్దెకై ఏలాగు వంగగలడు ? ఏలాగు నమస్కారం చేయగలడు ? మొర్దెకై ధర్మశాస్త్ర ఆజ్ఞను హత్తుకొని వున్నాడు. కానీ ధర్మశాస్త్ర విధికి వ్యతిరేకంగా వున్న హామానుకు 'మ్రొక్కి నమస్కారం చెయ్యాలి'. అని చెప్పిన రాజు యొక్క ఆజ్ఞను మొర్దెకై వ్యతిరేకిస్తున్నాడు. హామానుకు ఎందుకు మ్రొక్కడం లేదని రాజసేవకులు ప్రతిదినము మొర్దెకైని అడుగుతూ ఉన్నారు. ప్రతిదినము మొర్దెకైకి శోధనగానే ఉంటోంది. యోసేపునుగూడ పోతీఫరు భార్య ప్రతిదినము శోధిస్తూనే ఉంది. విశ్వాసులకు ప్రతిదినమూ శోధనలు ఎదురౌతూనే వుంటాయి. "నేను యూదుడను గనుక ఆపని చేయజాలను". అని మొర్దెకై రాజసేవకులతో అన్నాడు. అవును విశ్వాసి చేయజాలని పనులు ఎన్నోవున్నాయి. అన్నీ చేయదగినవి కావు. చేయతగిన, చేయ తగని వాటి విషయమై బైబిల్‌లో వ్రాయబడ్డాయి. మొర్దెకై రాజు విధినైనా అతిక్రమిస్తాడు. కానీ ధర్మశాస్త్ర విధిని మాత్రము అతిక్రమించడు. హామానుకు మ్రొక్కడం ధర్మశాస్త్ర విధికి వ్యతిరేకమే. కారణం ద్వితీ 5:7-9 మరియు, ద్వితీ 17:19 వచనంలోని వాక్యాలే. ఆకాశము క్రింద నుండి తుడిచి వేయవలసిన హామానుకు నమస్కరించడమా ? అట్టిపని మొర్దెక్కి చేయలేదు.

హామాను సాతానుకు సాదృశ్యం. ఆది నుండి సాతాను అందరిని చివరకు యేసుప్రభువును కూడా మత్త 4:8-10లో తనకు నమస్కరించమన్నాడు. కానీ ప్రభువు అలాచేయలేదు. " నీ దేవుడైన ప్రభువునకు మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను" అని సాతానుతో ప్రత్యుత్తరం చెప్పాడు. అలాగే 7 ఏండ్ల శ్రమలకాలంలో క్రీస్తు విరోధి అందరితో మ్రొక్కబడతాడు. నెబుకద్నెజరు, దర్యావేషురాజుల మాదిరిని హామాను కూడా అనుసరించాడు. కానీ దానియేలు షద్రక్, మెషెక్, అబెద్నెగోలు, మొర్దెకైలు రాజాజ్ఞలను వ్యతిరేకించారు. తద్వారా ప్రభువును మహిమ పర్చారు.

ఇక్కడ మొర్దెకై రాణి యొక్క అన్నను కాబట్టి లేక రాజు యొక్క బావమరిదిని కాబట్టి నేను హామానుకు మ్రొక్కలేదు అని చెప్పివుండాల్సింది. అలా చెప్పివుంటే ఇక మొర్దెకైకి గానీ, యూదులందరికీ గానీ శోధన వుండేదికాదు ఎస్తేరు గ్రంథాన్ని 10 అధ్యాయాల వరకు పొడిగించాల్సిన పని కూడా వుండేది కాదు. అలాగున రాజుతో బంధుత్వాన్ని గురించి చెప్పుకొని

వుంటే శోధన వచ్చేదికాదు. కానీ దేవుని వాక్యములోని ఆజ్ఞ నెరవేర్చుట కొరకై మొర్దెకై రాజాజ్ఞను వ్యతిరేకించాడు. రాజుతోటి బంధుత్వాన్ని ఆయన గొప్ప చేయలేదు. కానీ, దేవుడు నిర్గ 20:3వలో యిచ్చిన వాక్యాన్ని గొప్పచేశాడు. కీర్త 138:2వ లో 'నీ నామమంతటి కంటే నీవిచ్చిన వాక్యమును నేను గొప్పచేయుచున్నాను అన్నాడు దావీదు అలాగే మొర్దెకై దేవుని ఆజ్ఞనే తన జీవితంలో గొప్పచేశాడు. ప్రియసోదరీ ! మరి నీవు నీ జీవితంలో ప్రభువు వాక్యాన్ని గొప్ప చేస్తున్నావా ? లేక ఆయన వాక్యముకంటే వేరే వాటిని, వేరే వారిని గొప్ప చేస్తున్నావా ? ఆయన గొప్పవాడు, గొప్ప కార్యము లెన్నిటినో చేసినవాడు. పైన ఆకాశమందును, క్రింద భూమి యందును, భూమి క్రింద నీళ్ళయందును గొప్ప కార్యములు చేసిన దేవున్ని ఆయన వాక్యాన్ని మాత్రమే గొప్ప చేస్తున్నావా? హోషే 7:8వలో ఇశ్రాయేలీయులు ప్రత్యేకంగా జీవించక అన్యులతో కలిసిపోయి ఎవరునూ త్రిప్పివేయలేని మాడిపోయిన అప్పమై పోయారు. మొర్దెకై "నేను యూదుడను గనుక ఆపని చేయజాలనని" చెప్పినట్లు' నేను క్రీస్తును విశ్వసించిన విశ్వాసిని గనుక అలాగు చేయనని మనము కూడా చెప్పి ప్రభువు ఆజ్ఞను, వాక్యాన్ని గొప్ప చేయుదము గాక ! సాక్ష్యజీవితము జీవించుదము గాక ! అపో.కా 2:40వలో పేతురు" మీరు మూర్ఖులగు ఈతరము వారికి వేరై రక్షణ పొందుడని వారిని హెచ్చరించాడు. ప్రియసోదరీ ! ఈ వేరు జీవితము నీకున్నదా ? నలుగురితో పాటు మనమూ వెళ్దాము, అని అనుకుంటున్నావా ? ఊరంతా ఉత్తరమంటే నేను దక్షిణమంటే ఎలా ? అని అన్యులతో కలసి పోవటం కాదు. ప్రభువు ఆజ్ఞలను నెరవేర్చే విషయంలో అన్యులతో, నామాకార్థులతో కలసిపోక ప్రత్యేక జీవితం జీవించడం దేవుడు కోరుతున్నాడు.

## 5-6వ. యూదులందరి మీద ప్రతీకారము :

మొర్దెకై తనకు మ్రొక్కలేదని హామాను మొర్దెకై ప్రాణం మాత్రము తీయుట చాలా స్వల్పమనుకున్నాడు. కానీ ఒక ప్రాణానికి ప్రభువు యిచ్చిన విలువ ఎంతగొప్పదో వాక్య వెలుగులో చూద్దాం.

ఒకడు లోకమంతా సంపాదించుకొని తన ప్రాణము పోగొట్టుకుంటే వానికి ఏమి ప్రయోజనం ? అని మార్కు 8:36వలో వ్రాయబడింది. దీని ప్రకారం మానవ ప్రాణానికి ఈ లోకమంతా యిచ్చినా అది సరిపోదని అర్థమౌతుంది. మానవ రక్షణ ఎంతో గొప్పది. ఈ రక్షణను గురించి హెబ్రీ 2:3లో " ఇంత గొప్ప రక్షణ " అని వ్రాయబడింది. రెండవ మరణము నుండి అనగా నరకాగ్ని నుండి మనలని తప్పించి ఇంత గొప్ప రక్షణను మనకిప్పడానికి ఆయన కట్టిన విమోచన క్రయధనము ఎన్నటికీ తీరక అట్లుండవలసినదే. (కీర్త 49:9) నిర్గ 30:13లో మానవుని ప్రాణపరిక్రయ ధనము అరతులము వెండి అనగా ఈనాటి మన లెక్కలో

అక్షరాలా 40 రూపాయలు. అది చాలా స్వల్పం. కాని క్రొత్త నిబంధనలో మన ప్రాణ పరిక్రయ ధనముగా ప్రభువు [illegible] న క్రయధనము తన ప్రాణ రక్తమే. ఆ ప్రభువు కార్చిన రక్తపు విలువమనకు అం [illegible] ది. అది తీర్చుకోవడం మన చేతకాదు. అది ఎన్నటికీ తీరక అట్లుండ వలసినదే.

అలాగైతే ఒక [illegible] ప్రాణం = యేసు ప్రభువు ప్రాణం అన్నమాట. ఆయన ప్రాణము అనగా ఆయన రక్తమే. [illegible] కి ప్రభువు యింత విలువనిస్తే హామాను మొర్దెకైని చంపడం మాత్రమే కాక యూదుల [illegible] ప్రాణాలను ముట్టు పెట్టాలనుకోవడం ఎంత ఘోరమో, ఎంత నేరమో, ఎంత పాతకమో [illegible] ! హామాను లోని సాతాను దేవుని చేత విమోచింపబడిన దేవుని ప్రజలను ఆనిసుంచి చంపాలను కుంటున్నాడు. కీర్త 83:4వ ఇశ్రాయేలు పేరు జ్ఞాపకము రాక పోవునట్లు జనముగా నుండకుండ వారిని సంహరించుదమురండని శత్రువులు చెప్పుకొనుచున్నట్టు వ్రాయబడింది. గత చరిత్రలో అనేకులు అలాగుననే ఆలోచించి వారికి విరోధంగా నిబంధనలు చేశారు. కానీ, నేటికి ఇశ్రాయేలీయులు సజీవంగానే వున్నారు. దేవునికి స్తోత్రం.

కీర్త : 119 86-87వ ధర్మశాస్త్రమును అనుసరింపని గర్విష్టులు దావీదును చిక్కించుకొనుటకై గుంటలు త్రవ్వినట్లు వ్రాయబడింది. భూమి మీద ఉండకుండ వారు దావీదును నాశనము చేయుటకు కొంచెమే తప్పెను అని వ్రాయబడింది. దేవుని పిల్లలు అనగా ధర్మశాస్త్రము ననుసరించే దేవుని పిల్లలను, సేవచేసే దేవుని పిల్లలను, భూమి మీద వుండకుండ నాశనము చేయాలని సాతాను తలస్తున్నాడు. కానీ ప్రభువు అనేకసార్లు మనల్ని కొంచెములో తప్పిస్తున్నాడు. దావీదు మామయైన సౌలురాజు తాను దురాత్మతో నింపబడినపుడు తన యీటె విసరి దావీదును చంపాలనుకున్నాడు. ఇంచు మించు 21 సార్లు సౌలు దావీదును చంప ప్రయత్నము చేశాడు. కానీ, I సమూ 23:14వ లో "సౌలు అనుదినము అతనిని వెదికినను దేవుడు సౌలు చేతికి దావీదును అప్పగించలేదు." అని వ్రాయబడింది. ఇలా సైతానుడు మనలను మన సంతతిని చంపవెదుకుతూ వుండగా సాతాను యిచ్ఛకు ప్రభువు మనలను అప్పగించకుండా కాపాడుతున్నాడు. ఆయనకు లెక్కలేనన్ని స్తుతులు మనము చెల్లించవలసి వున్నాము. దుష్టమృగమైన సాతానుకు గువ్వవంటి మన ప్రాణాలను ప్రభువు అప్పగింపలేదు. కీర్త 31:13-20వ లో వున్నట్లు అనేకులు దావీదు మీద దురాలోచనలు చేస్తూ ప్రాణహాని చేయుటకు యోచించుచుండగా, నలుదిశల దావీదుకు భీతి కలుగగా దావీదు దేవునికి ప్రార్థించగా, మనుష్యుల కపటోపాయములు దావీదుకు అంటకుండా తన సన్నిధి చాటున దేవుడు దావీదును దాచినట్లు మనం గమనించగలము. ఈనాడు మన జీవితాలను కూడ ప్రభువు శత్రువైన సాతాను చేతిలో నుండి తప్పిస్తూ వున్నందుకై ఆయనకే మన వందనములు సమర్పించు

కొంటున్నాం. "యెహోవా విశ్వాసులను కాపాడును" అన్నమాట నిశ్చయము. కీర్త 31:23వలో క్రొత్త నిబంధనలో కూడా పేతురు హేరోదు ద్వారా చెఱలో వేయబడినపుడు సంఘము అత్యాసక్తిగా ప్రార్థించినపుడు ప్రభువు తన దూత ద్వారా పేతురును బయటికి తీసుకొని వచ్చారు. హేరోదు యిచ్ఛకు ప్రభువు తన దాసుడైన పేతురును అప్పగించలేదు. సాతాను ఈలాగున దేవుని పిల్లలను చంపాలనుకుంటే ప్రభువు కీర్త 103:4వ వచనంలో వ్రాయబడినట్లు సమాధిలో నుండి మన ప్రాణములను విమోచిస్తున్నారు. ఆయన మన ప్రాణములను కాపాడువాడని కీర్త 121:7లో వ్రాయబడింది ఈలాగున హామాను ఒక్క నమస్కారం కొరకు యూదా జాతినంతటిని చంపాలను కున్నాడు. ప్రక 22:9లో యోహాను దూత యెదుట నమస్కారం చేయుటకు సాగిలపడగా అతడు వద్దుసుమీ! దేవునికే నమస్కారము చేయుమని చెప్పుట వలన నమస్కారాలు దేవునికే గానీ మనుషులకు కాదని అర్థమౌతుంది. మనుష్యులకు వందనాలు చెప్పుకోవాలి.

పైన వ్రాయబడిన రీతిగా 40 రుపాయుల విలువగల మానవునికి ప్రభువిచ్చిన విలువ తన ప్రాణరక్తముకాగా, "మీరు విలువ పెట్టికొనబడిన" వారని ప్రభువు చెప్పుచుండగా అట్టి ప్రభువుల ప్రభువుకు, రాజుల రాజుకు, సృష్టి కర్తకు, సర్వాధికారియైన దేవునికి. ఇస్కరియోతు యూదా యిచ్చిన విలువ ముప్పది వెండి నాణెములు మాత్రమే మానవుడు ప్రభువును ఎంత తక్కువగా అంచనా వేశాడో కదా! అదే మానవున్ని ప్రభువు తన స్వరక్తముతో విమోచించి ఎవరూ ఎన్నిటికీ తీర్చుకోలేని విలువ పెట్టికొన్నాడు. ప్రియ సోదరీ ! ఈనాడు నీ విలువ ఎంత గొప్పదో ఎప్పుడైనా ఆలోచించావా ? ద్వితీ 33:29వ వచనంలో ఇశ్రాయేలు నీ భాగ్యమెంత గొప్పది ? యెహోవా రక్షించిన నిన్ను పోలినవాడెవడు ? అని వ్రాయబడింది.

## 7-15వ. యూదులను చంపించుటకు రాజముద్ర వేయబడుట :

రాజు యేలుబడిలో 12వ సంవత్సరమున హామాను రాజు నొద్దకు వెళ్ళి తన రాజ్యములో ఒక జాతి ప్రజలు చెదరి వున్నారని, వారి విధులు సకల జనుల విధులకు వేరుగా వున్నవని, వారు రాజు ఆజ్ఞలు గైకొనువారు కారని, వారిని రాజ్యములో వుండనిచ్చుట రాజునకు ప్రయోజనకరము కాదని యూదులను గురించి అసాక్షమిచ్చాడు. హామాను తనకు తెలియని రీతిగానే యూదుల ప్రత్యేకతను గురించి మంచి సాక్ష్యము యిచ్చాడు. అలాగున విశ్వాసులమైన మనముసూ అన్యులతో కలసిపోయిన ఎఫ్రాయీము వలెకాక (హోషే 7:8) ప్రత్యేక జీవితం జీవించాలి మీరు వారిలో నుండి బయలు వెడలి ప్రత్యేకంగా వుండుడని II కొరి 6:18వలో వ్రాయబడిన వాక్యాన్ని మనం గమనించాలి. ఈ పుస్తకాన్ని చదువుచున్న సోదరీ ! నీకు అలాంటి సాక్ష్యజీవితమున్నదా ? మాటలు అన్యుల్లాగనే మాట్లాడుతున్నావా ? నీ పద్ధతులు, ఆచారాలు అన్యుల్లాగే వున్నాయా? అన్యుల మూఢనమ్మకాలను నీవు కూడా కలిగి వున్నావా ? అన్యుల్లాగే

తిథి, కాల, నక్షత్రాలను పాటిస్తున్నావా? అన్యుల్లాగా రాశి ఫలాలను గమనిస్తున్నావా? యెష 47: 12,13 వచనాలలో వున్నట్లు కర్ణ పిశాచతంత్రములను, శకునాలను పాటిస్తున్నావా ? జ్యోతిష్యము చిలక శాస్త్రము చెప్పించు కుంటున్నావా? నక్షత్రసూచకులతోను, మాసచర్య చెప్పువారితోను జోక్యము కలిగచేసికొని వున్నావా? హారఫలాలు, విచారించుకుంటున్నావా? అదృష్ట జాతకాలు చెప్పించుకుంటున్నావా? ఇవన్నీ అన్యుల పద్ధతులు. వారు ఇంటి ముందర ముగ్గులు వేస్తే, నీవునూ ముగ్గులు వేస్తున్నావా? బల్లిపడినా వారికి శాస్త్రమే, ఆచారమే. గంటకొడితే సత్యం అంటారు. ఇంటిలోపలికి వచ్చేప్పుడు కుడికాలు ముందు పెట్టాలి అంటారు. అజాగ్రత్తతో పొయ్యిమీద పాలు పొంగిపోయేట్లు చేసికొని ప్రొద్దున లేచి ఎవరి ముఖము చూచానో పాలుఅన్నీ పొంగిపోయాయి అని వారన్నట్లే విశ్వాసియై నీవూ అంటున్నావా? పాలుత్రాగే శిశువులు మాటి మాటికి పాలు కక్కితే దిష్టి తగిలిందని అన్యులవలె దిష్టి తీయించడం చేస్తున్నావా? పిల్లలకు దిష్టి తగులుతుందని పిల్లల పాల బుగ్గల మీద నల్లని చుక్క, పిల్లల అరికాళ్ళకు నల్లచుక్కలు పెట్టడం నీవు కూడా ఒక ఆచారంగా అలవాటుగా కలిగి వున్నావా ? ప్రయాణాలప్పుడు ఈ రోజు మంగళవారం ప్రయాణం చేయకూడదు అని అంటున్నావా ? వివాహది శుభకార్యాలు జరిగించేప్పుడు రాహుకాలాలను గురించి అన్యులవలె వాకబు చేస్తున్నావా ? చాలా పర్యాయాలు క్రైస్తవ వివాహాలు కూడా అన్యుల వివాహాలు జరిగేరోజే ఉంటాయి. అన్యులు సంతోషించునట్లు మీరు సంతోషించవద్దని ప్రభువు చెప్పారు. ఏమితిందుమో, ఏమి త్రాగుదుమో, యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి అన్యజనులు విటన్నింటిని విషయమై విచారింతురు అని మత్త 6:3లో ప్రభువు తేటగా వ్రాయించారు. వివాహములలో అన్యులతో వియ్యమొందవద్దని ప్రభువు ఖచ్చితంగా చెప్పారు. కానీ విచారమేంటంటే ఈ దినాల్లో విశ్వాసుల పిల్లలు సదా అన్యులను స్నేహించి, స్నేహం ప్రేమగా మారి దేవుని భయం లేకుండా, దేవుని వాక్యాన్ని ఉల్లంఘించి పెళ్ళిళ్ళు కూడా చేసుకుంటున్నారు. పైగా ఆ అమ్మాయిని లేక ఆ అబ్బాయిని లేదా ఆ ఇంటివారిని నేను రక్షణలోకి నడిపించుకుంటాను అంటున్నారు. ఓస్త్రీగా భర్తను నేను రక్షించుకుంటాను అనుకొని వివాహం చేసుకున్నావు. నీవు పెళ్ళి చేసుకొని ఎన్ని యేళ్ళయింది? ఇప్పటికి నీ ద్వారా నీ భర్త రక్షించబడ్డాడా? ఆయనను రక్షణలోనికి నడిపించాడం నీవు అనుకున్నంత సులభం కాదు. రక్షణ యెహోవాది (కీర్త 3:8). నీ ఇష్టమొచ్చిన వారిని నీ స్వంతకోరికతో పెళ్ళిచేసుకొని రక్షించడానికి రక్షణ నీ చేతిలో లేదు. అందుకే ఓస్త్రీ ! నీ భర్తనుచరక్షించెదవో లేదో నీకేమి తెలియును అని I కొరి 7:16 లోని లేఖనము చెబుతోంది.

వివాహాల్లో పూజారులనడిగి ముహూర్తాలు ఏర్పాటు చేసేవారున్నారు. II దిన 33:6లో హిజ్కియా కుమారుడైన మనష్షే ముహూర్తములను విచారించుచు మంత్రములను, చిల్లంగితనమును వాడుకచేయు, కర్ణపిశాచములతోను, సోదెగాండ్రతోను సాంగత్యముచేస్తూ,

యెహోవాదృష్టికి చెడునడత నడుస్తూ ఆయనకు కోపము పుట్టించాడు. విగ్రహాలు నిలిపాడు. అన్యజనుల కంటె ఇశ్రాయేలీయులు మరింత అక్రమముగా ప్రవర్తించునట్లు చేయుటకు మనష్షే కారణమయ్యాడు. కాబట్టి యెహోవా అతనిని అష్షూరు సైన్యాధిపతుల కప్పగించగా వారు అతనిని బంధించి బబులోనుకు తీసికొనిపోయారు. కనుక ప్రభువుకు కోపము తెప్పించే పనులుచేసి అన్యులతో కలిసిపోక, సకల జనుల విధులకు వేరుగా జీవించి ప్రభువును సంతోషపరుచుదుముగాక!

యూదులు రాజాజ్ఞలను గైకొనువారు కారని హామాను రాజుతో చెబుతున్నాడు. కానీ వారలాగు రాజాజ్ఞను గైకొనకపోవడాన్ని ఈ గ్రంథములో ఎక్కడకూడా మనము చదవము. ఆనాడు యూదులు యింతమంచి సాక్ష్యము పొందినరీతిగా ఈనాడు విశ్వాసులమైన మనమునూ మనపై అధికారులకు (వాక్య వ్యతిరేకతకు తప్ప మిగిలిన) అన్ని విషయములలో లోబడి వుండాలని ప్రభువు కొలొ 3:2వ లో వ్రాయించారు.

యూదులను తన రాజ్యములో వుండనిచ్చుట ప్రయోజనకరము కాదని హామాను రాజుతో చెబుతున్నాడు. కానీ బిగ్తాను, తెరెషులు రాజును చంపాలని ఆలోచించినపుడు ఆ రాజును కాపాడిన వాడు యూదుడైన మొర్దెకై మాత్రమే కదా! కానీ పారసీకులలో ఎవ్వరూ రాజును రక్షించి మేలుచేయలేదు. ఈనాడు రాజు బ్రతికి యున్నాడంటే దానికి కారణం యూదుడైన మొర్దెకై మాత్రమే. ప్రియసోదరీ! మనమున్న దేశములో మనము మొర్దెకైవలె మేలుకరముగా వున్నామా? ఈదేశములోని మనుషులందరి కొఱకు ప్రార్థించి మేలు కరముగా వున్నామా? మనముంటున్న సంఘానికి మనము మేలురకముగా వుంటున్నామా? ఫలానా సోదరిని మా మేలుకొరకే దేవుడు మా సంఘానికిచ్చాడు అని, నీ సంఘస్థులు చెబుతున్నారా? మా వీధిలో ఈ సోదరి మాకెంతో మేలుకరంగా వుందని నీ వీధివారు చెప్పగలరా? లేక ఈమె నిష్ప్రయోజకురాలు అని చెబుతున్నారా? ఒనేసీము మొదట నిష్ప్రయోజకుడేకానీ ఇపుడు ఫిలేమోనుకును పౌలుకును ప్రయోజనకరముగా వున్నాడు. ప్రియసోదరీ! నీవు ప్రయోజనకారిణిగా వున్నావా? కొద్దిమంది, తల్లిదండ్రులకుగానీ ఇంటి వారికిగానీ, సంఘానికిగానీ, సమాజానికిగానీ, ఎవ్వరికీ ప్రయోజనకరంగా వుండక గాలికి తిరుగు తుంటారు. ప్రభువు పిల్లలు అందరితే ప్రయోజకులుగా వుండాలి.

తబితా యొప్పేలో వున్న సంఘములోని విధవరాండ్రకు, పేదవారికి వస్త్రాలు కుట్టి యిస్తూ ఎంతో ప్రయోజనకారిగా వుండింది. అపొల్లో కొరింథు సంఘానికి వెళ్ళి విశ్వసించిన వారికి చాలా వాక్యసహాయం చేసి ప్రయోజకుడయ్యాడు. కొద్ది మంది తమ తల్లిదండ్రులతో నావలన నీకేది ప్రయోజనమో అది దైవార్పితం అనే పిల్లలు కూడా వున్నారు (మత్త 15:5వ). మనలో ఎవ్వరము మన కొరకే బ్రతుక కూడదు. మన మందరము "బ్రతుకుట క్రీస్తు కొరకే"

అని బ్రతకాలి. మనద్వారా సంఘానికి, సమాజానికి మేలు కలిగేటట్లు బ్రతకాలి. మొర్దెకై రాజుకు ప్రయోజనకరంగా వున్నాడు. యిర్మి 29:7వ లో నేను మిమ్మును చెఱగొనిపోయిన దేశము క్షేమము కొఱకు మీరు ప్రార్థన చేయండి. దాని క్షేమము మీ క్షేమమునకు కారణమౌతుందని ప్రభువు చెప్పారు. కనుక మనమును I తిమో 2:2 వచనంలో వ్రాయబడిన రీతిగా మనుష్యులందరి కొఱకు అనగా రాజుల కొరకును, అధికారుల కొఱకును ప్రార్థనలు విజ్ఞాపనలు, కృతజ్ఞతాస్తుతులు, యాచనలు చేసి వారికి ప్రయోజనకరంగా వుండాలి. ప్రియ సోదరీ! మన దేశానికి నీ వలన ప్రార్థనా ప్రయోజనం కలుగుతోందా ? లేని యెడల ఇప్పటి నుండి అయినా అలా చేయడానికి ప్రభువు నిన్ను నడిపించు గాక!

యూదులు ప్రయోజకులు కారని హామానురాజుతో అబద్ధమాడుతున్నాడు. అలాగే మత్త 5:11 వచనంలో వ్రాయబడినట్లు ఆయన నిమిత్తము జనులు మనల్ని నిందించి హింసించి మన మీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునపుడు మనం ధన్యులం. సంతోషించి ఆనందించాలి. పరలోకమందు మన ఫలము అధికమౌతుంది. యూదులను హతము చేయునట్లు ఆ పని చేయువారికి ఇరువది వేల మణుగుల వెండి కావలెనని హామాను రాజును అడిగాడు. యూదులను హతము చేసే వారికి యివ్వవలసిన ఖడ్గముల కోసం, వారికివ్వాల్సిన కూలి కోసం 20 వేల మణుగుల వెండిని యివ్వడానికి, ఖజానాలోని ప్రజాద్రవ్యాన్ని ఇలా వ్యర్థ ఖర్చుపెట్టడానికి హామాను సిద్ధపడుతున్నాడు. దేవుడు మనకిచ్చిన ధనాన్ని మంచి పనుల కొఱకు, దేవుని సేవ కొఱకు, ప్రజాశ్రేయస్సు కొఱకు, ప్రజల రక్షణ కొఱకు వాడాలి కానీ, ప్రజాక్షయము కొఱకు కాదు. పైగా హామాను వాడే డబ్బు తన స్వంత డబ్బుకాదు. అది తన డబ్బు కాదు కదా..! తన యిష్టము వచ్చినట్లు రాజును ప్రేరేపించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడు హామాను. మనము కూడా మన డబ్బేకాని, సంఘము డబ్బేకాని, యితరులడబ్బే కానీ ఎవరి డబ్బు వాడవలసివచ్చినా అది దుర్వినియోగం కాకుండా దుబారా కాక, మన స్వంత డబ్బు ఎట్లు జాగ్రత్తగా వాడుతామో అలానే ఈ డబ్బును కూడా జాగ్రత్తగా వాడాలి. ఎందుకనగా మనం ఈ దేహంతో జరిగించిన వాటన్నిటి ప్రకారం ఒకరోజు ఆయన న్యాయపీఠము ఎదుట చక్కని లెక్క ఒప్పచెప్పవలసి వుంటుంది. (II కొరి 5:10). హామాను రాజును అలా వెండి కొరకై అడుగగానే రాజు " ఆ వెండి నీకియ్యబడినది నీ దృష్టికి అనుకూలమైన దానిని చేయుము" అని హామానుతో చెప్పాడుకానీ, ఒక జాతివారు అన్నావు. ఎవరాజాతి ? అని రాజు హామానుతో వాకబు చేయలేదు. ఈ విషయాన్ని గూర్చి రాజు హామానుతో పెద్దగా ఆలోచించనూలేదు. మొదటి అధ్యాయంలో తన భార్య వష్తి తన ఆజ్ఞ ప్రకారముగా రాజునొద్దకు రానపుడు తన స్వంత విషయములో కాలజ్ఞానులతో చక్కగా ఆలోచించాడు. కానీ యూదుల విషయములో మాత్రం చాలా తేలికగా తీసికొని నీ దృష్టికి అనుకూలమైన దానిని చేయమని

చెప్పాడు. రాజు విధిని, రాజ ధర్మమును ఎరిగిన వారిచేత ప్రతి సంగతిని పరిష్కరించు కొనువాడు అని ఎస్తే 1:13వలో వ్రాయబడింది. కానీ యూదుల విషయమై సంగంతిని జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించలేదు. ఆ సంగతిని పూర్తిగా హామాను యిష్టానికే వదలిపెట్టాడు. అయితే మన పరమ అహష్వేరోషుయైన మన ప్రభువు మన శత్రువైన సాతాను యిచ్ఛకు యూదులను అప్పగించలేదు. కీర్త 124 : 6 వచనంలో వున్నట్లు వారి (సాతాను వాని దూతల) పండ్లకు మనలను ప్రభువు అప్పగించడు. అలాగే II తిమోతి 4:17వ వచనంలో పౌలు " నాద్వారా సువార్త పూర్ణముగా ప్రకటింపబడునట్లు, అన్యజనులందరు దానిని విను నిమిత్తమును ప్రభువు నా ప్రక్క నిలిచి లేదా నాపక్షమున వుండి నన్ను బలపరచెను గనుక నేను సింహము నోట నుండి తప్పింబడితిని " అని చెబుతున్నాడు. అవును మన శ్రమ,శోధన, సంకటములన్నింటిలో ఆయన కొరకు, ఆయన సువార్త సేవ కొరకు మనము జీవిస్తున్నప్పుడు మనందరి ప్రక్కన ప్రభువు నిలుస్తాడు లేక మన పక్షమున ఆయన వుండి సాతాను అనే గర్జించు సింహము మనలను మ్రింగ కుండా (II పేతురు 5:8) మనలను రక్షిస్తాడు. ప్రభువు ప్రతి దుష్కార్యము నుండి మనలను పౌలువలె తప్పించి తన పరలోక రాజ్యమునకు చేరునట్లు మనలను రక్షిస్తాడు (II తిమో 4:18). హామాను ద్వారా రాజు యూదులను చంపించడానికి 20 వేల మణుగుల వెండిన జారీ చేస్తున్నాడు. కానీ మన పరలోక అహష్వేరోషు అయిన తండ్రియైన దేవుడు, ఆయన పంపిన తన ప్రియ కుమారునికి విరోధముగాను పాపములు, అపరాధములను చచ్చిపోయిన మనలను కడిగి క్రీస్తుతో కూడా బ్రతికించాడు. కానీ చంపలేదు. నిత్యనరకమనే రెండవ మరణము నుండి రక్షించాడు. మన పాపములను బట్టి మనల్ని వధించక తన ప్రియకుమారుని మీదనే మన పాపములను వేసి ఆయననే సిలువ మరణమునకు అప్పగించిన ఆ తండ్రి ప్రేమ ఎంత గొప్పదో కదా ! వర్ణించలేని ప్రేమ. అది కొలవలేని ప్రేమ. అది శాశ్వతమైన ప్రేమ (యిర్మియా 3:13వలో యోహాను 13:1). అందుకై దేవునికి స్తోత్రములు చెల్లించ బద్ధులమై యున్నాము. రక్షించబడిన తరువాత కూడా మన అనుదిన విశ్వాస జీవితములో సాతాను మనల్ని, మన పిల్లలని, మనకు దేవిడిచ్చిన ఆశీర్వాదాల్నిపు పాడు చేయుటకు, నశింప చేయవలెనని చాలా చాలా పథకాలు వేస్తున్నాడు. ప్రభువే ఆ పథకాల్ని వీగి పోవునట్లు చేస్తూ మనల్ని మన పిల్లల్ని, మన ప్రాణాలను కాపాడుతున్నాడు. (కీర్త 121:7) హామాను యూదులకు శత్రువైతే, విశ్వాసుల శత్రువు సాతాను. ఈ హామాను ఆజ్ఞాపించిన ప్రకారము మొదటి నెల పదమూడవ దినమున మొదటి శాసనమును వ్రాతగాండ్రు వ్రాయగా అవి రాజముద్ర చేత ముద్రించబడ్డాయి. ఇప్పుడు 20వేల మణుగుల వెండి సిద్ధంగా వుంది. కానీ యూదులను ఏరోజు హతము చేయాలో తెలుసుకొనుటకు చీటి వేయించాడు హామాను. ఆచీటి ప్రకారం పండ్రెండవమాసము పదమూడవ రోజున యూదులను హతము చేయాలనుకున్నాడు. ఏమని

ఎప్పుడు చేయాలి అని తెలుసుకోడానికి అన్యులు, అవలంభించే పద్ధతులలో ఒకటి చీటీవేయటం. నామా కార్థ క్రైస్తవులు కొందరు కత్తెర మీద బైబిల్ పెట్టి త్రిప్పడం ద్వారా దేవుని చిత్తం తెలుస్తుందని నమ్ముతారు. ఇవి వాక్య పద్ధతులు కావు. సంఘము ఇంకా ఏర్పడనపుడు ఆది అపొస్తలులు కూడా, తమ స్థానమున్న నకు వెళ్ళిపోవడానికి, " యూదా తప్పిపోయి, పోగొట్టుకొనిన ఈ పరిచర్యలోను, అపోస్తలత్వములోను పాలు పొందుటకు "నీవు ఏర్పరచుకొనిన వానిని కనబరచు" మని ప్రభుపును ప్రార్థించి చీట్లు వేయగా మత్తీయ పేరట చీటి వచ్చిందని అపో.కా 1:25,26వ వచనంలో వ్రాయబడింది. కానీ సంఘముని ఏర్పరచబడ్డాక ఆత్మ కుమ్మరించబడ్డాక ఇక అపోస్తలులు అలా చీట్లు వేయలేదు. అపో.కా13:1,2వ వచనంలో అంతియొకయ సంఘములో బర్నబా, నీగెరనబడిన సుమెయోను, కురేనీయుడైన లూకియా చతుర్థాధిపతియైన హేరోదుతో కూడ పెంచబడిన మనయేను, సౌలు అను ప్రవక్తలును, బోధకులును ఉండిరి. వారు ప్రభుపును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ - నేను బర్నబాను, సౌలును పిలిచిన పని కొరకు వారిని నా కొఱకు ప్రత్యేక పరచుడని వారితో చెప్పాడు. కనుక దేవుడు పిలిచిన పని కొఱకు ఎవరిని ప్రభువు ప్రత్యేకించాలో అన్న విషయంపై దేవుని చిత్తాన్ని అపోస్తలులు పరిశుద్ధాత్మ ప్రేరేపణ ద్వారానే తెలుసుకున్నారు. కనుక ఈనాడు ప్రభువు పిల్లలమైన మనము ప్రార్థించుట ద్వారా పరిశుద్ధాత్మ మనకు తన చిత్తాన్ని బయలు పరచేవాడుగా వున్నాడు. అంతేకాక వాక్యము ద్వారాను, అదే సమయంలో ఆత్మలో తన మెల్లని స్వరము వినిపించుట ద్వారాను దేవుని చిత్తం మనకు తెలుస్తుంది. ఆత్మలో వినిపించే స్వరము, దైవ వాక్యము ఒకటేలా వుంటాయి. కానీ, ఒకదానికొకటి వేరుగా వుండవు. కనుక రోమా 12:2లో వ్రాయబడినట్లు " ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలుసుకొనునట్లు" మన మనసులు మారి నూతన మగుట వలన రూపాంతరము పొందాలి.

అలాగున 13వ వచనములో ఆదారు అను 12వ మాసము 13వ దినమున యవ్వనులేమి వృద్ధులేమి, శిశువులేమి, స్త్రీలేమి, యూదులనందరిని ఒక్కదిన మందే బొత్తిగా నిర్మూలము చేసివారి కొల్లసొమ్ము పుచ్చుకొనవలెనని హామాను రాజు ద్వారా వ్రాతగాండ్రతో వ్రాయించాడు. దేవుని పిల్లల పట్ల ఆనాడు హామాను, ఈనాడు సాతాను దేవుని నమ్మిన పిల్లలను, విశ్వాసులను అందరినీ వారి సొమ్ముతో, ఆస్తితో సహా బొత్తిగా నిర్మూలము చేయాలని పథకం వేశాడు. చరిత్రలోనూ ప్రస్తుతములోను, భవిష్యత్తులోనూ, మన ఉనికి లేకుండా చేయాలని సాతాను ప్రయత్నంలో వున్నాడు. కానీ, యూదా పత్రిక 1:24 లో వ్రాయబడినట్లు " తొట్రిల్ల కుండా మనల్ని కాపాడుటకును తన మహిమ యెదుట ఆనందముతో మనల్ని నిర్దోషులనుగా నిలుపబెట్టుటకును శక్తి గల దేవుడు తప్పకుండా తన మహిమ ఎదుట పరలోకంలో

నిలువబెడతాడు. మన ఉనికి పరలోకంలో కూడా ఉంటుంది. సాతాను మనల్ని నిర్మూలం చేయడానికి, అలా నిర్మూలమవ్వటానికి ప్రభువు మనల్ని సాతానుకు అప్పగించడు. అలాగే హామాను కాలంలో నిర్మూలమవ్వాల్సిన యూదులను ప్రభువు నేటివరకూ నిర్మూలము కాకుండా నిలిపారు. పరలోకము చేరువరకూ యుగాయుగములు కాపాడుతారు. ఆయన వాత్సల్యత యెడతెగక నిలుచున్నది. కాబట్టి మనము నిర్మూలముకాకున్నవారము.

సంఘానికి కూడా అపో.కా 8:3లో సౌలు ద్వారా పాడుకావాల్సిన సందర్భము వచ్చింది. సౌలు యింటింటజొచ్చి పురుషులను, స్త్రీలను ఈడ్చుకొని పోయి, చెరసాలలో వేయించి సంఘమును పాడుచేయుచుండెను. కాని ఆ సౌలునే దేవుడు మార్చారు. సంఘాలు నేటికీ నిలిచే వున్నాయి. సంఘానికి శిరస్సైన ప్రభువు తన సంఘ భార్యను కనుపాప వలె కాపాడుకొనే దేవుడు. అందుకు ప్రభువుకు స్తోత్రం.

ఎస్తేరు 3:15లో తాకీదులోని రాజాజ్ఞ షూషను కోటలో యివ్వబడింది. దానిని వినిషూషను కోట కలత పడిందని వ్రాయబడింది. కాని అంతట రాజును హామానును విందులో కూర్చున్నారు. మీరు ఏడ్చి ప్రలాపింతురు. గానీ లోకము నవ్వుతుందని ప్రభువు యోహా 16:20లో వ్రాయించారు. సంఘానికి ఇది కష్ట కాలము, శ్రమ కాలము. ఆత్మీయులు శ్రమలు బాధలు అనుభవించు చుండగా, అగ్నిలాంటి శోధనలు అనుభవించుచుండగా, సాతాను ప్రజలు ఎంతో సంతోషంగా ఉంటున్నారు. వారి సంతోషమంతా కొంత కాలమే. అయిన ప్రభువు " ఇప్పుడు దుఃఖపడుచున్న మీరు ధన్యులు అన్నారు. మత్త 5:3లో దుఃఖపడు వారు ధన్యులు వారు ఓదార్చబడుదురు అన్నారు.

❖ ❖ ❖

## 4వ అధ్యాయము 3+5+3+4+2=17వ.

**అంశము :** మొర్దెకై హెచ్చరిక-ఎస్తేరు తీర్మాణము

**విభజన :** 1 - 3వ. రోదనముతో పడియున్న యూదులు

4 - 8వ. మొర్దెకై దుఃఖమునకు ఎస్తేరు కారణము తెలిసికొనుట

9 - 11వ. రాజు పిలువకుండ తనంతటతానే వెళ్ళితే వచ్చే అపాయమును గూర్చి ఎస్తేరు చెప్పుట.

12 - 15వ. ఎస్తేరుకు మొర్దెకై హెచ్చరిక

16 - 17వ. ఎస్తేరు ప్రార్థన - తీర్మాణము

## 1-3వ. రోదనముతో పడియున్న యూదులు :

3వ అధ్యాయము విందుతో ముగుస్తుంది. 4వ అధ్యాయము జరిగినదంతయూ తెలియగానే మొర్దెకై బట్టలు చింపుకొని గోనెపట్ట వేసికొని, బూడిద పోసికొని, పట్టణము మధ్యకు బయలు వెళ్ళి మహాశోకముతో రోదనము చేశాడు. అని ఆరంభమౌతోంది. 127 సంస్థానములలోని యూదులందరికీ ఈ శాశనము దుఃఖకరంముగా వుండుట వలన ఆయన ఇలా రోదనము చేశాడు. ఇలా పట్టణము మధ్యకు వెళ్ళటానికి ఆయన సిగ్గుపడ లేదు. అలాగే ప్రభువు నాశనపాత్రులమైన మనలను విమోచించుటకై దిగంబరిగా సిలువలో వ్రేలాడుటకు యెరూషలేము వీధులలో సిలువ మోయుటకు, ముఖముపై ఉమ్మి వేయించుకొనటకు సిగ్గుపడలేదు. యూదుల సమాజం నశించుటకు ఇంకా 11 మాసములు సమయము వుండగా, జాప్యము చేయక తాకీదు వచ్చిన తోడనే ప్రార్థన చేయడం గమనించదగ్గ విషయం. సమస్య ముదిరిన తరువాత ప్రార్థించుట కంటే సమస్య ఆరంభములోనే ప్రార్థించడం ఎంతైనా క్షేమకరం. అందరికీ వచ్చే మరణమే నాకూ వస్తుందిలే అని మొర్దెకై నిర్లక్ష్యంగా వుండలేదు. అందరికీ లేని చింత, దిగులు నాకెందుకు? అనుకోలేదు. రాజగుమ్మానికి గోనెపట్టతో వచ్చాడు. గోనెతో ఇలా రావడం కూడా రాజాజ్ఞకు వ్యతిరేకమే. ఈలాగున మొర్దెకై తాను ఒక మాదిరియైన ప్రార్థనా నాయకుడుగా ముందుకు రాగా ప్రతి సంస్థానములోని యూదులందరు కూడా ఉపవాసంతో మహా శోకంతో, ఏడ్పుతో, రోదనముతో మునిగిపోయి, గోనెను ధరించి బూడిదలో పడియున్నారు.ఆలాగున మనమును ఆత్మీయ కార్యముల కొఱకు ముందుగా పూనుకుంటే మన వెనుక అనేకులు ఆ మంచి కార్యములు చేయుటకై ప్రేరేపింపబడి ముందుకు వస్తారు. ఇక 11 నెలలకు నాశనము వస్తుందని తెలియగానే వారు ప్రభువునొద్ద ఎంతగానో తగ్గించు కున్నారు. ద్వితీ 7:14,15వ వచనముల వ్రాయబడినట్లుగా తన జనులు తమ్మును తాము తగ్గించుకొని ప్రార్థన చేసి తమ చెడుమార్గములను విడిచిన యెడల నేను వారి ప్రార్థనను వింటానని ప్రభువు చెప్పారు. వీరు చేసిన ప్రార్థన నిజంగా ప్రభువు విన్నారు. అడిగిన దాని కంటే ఊహించిన దానికంటే ఎక్కువగా జావాబులు పొందారని రానున్న అధ్యాయాల్లో గమనించగలము. నీనివె పట్టణస్థులు కూడా యూదులవలె 40 దినములకు దుర్గతి కలుగుతుందని తెలిసిన వెంటనే 39 దినములు బాగా తిని, త్రాగి, ఆడి, పాడి, 40వ రోజు ఉపవాసముండి ప్రార్థిస్తాము అని అనుకోలేదు. దుర్గతిని గూర్చి వినగానే రాజు మొదలుకొని కూలివాని వరకు ఉపవాసముండి గోనెపట్ట ధరించుకొని పశువులకు కూడా గోనెపట్ట ధరింప చేసి మేత, నీళ్ళు కూడా వాటికి పెట్టక ప్రార్థించారు. దేవుడు వారికి చేయుదునన్న కీడు చేయక మానుకున్నాడు. అలాగే పాపములో జీవిస్తున్న నీవునూ, నరకమనే నాశనము కాచుకొనివుండగా ఈ సంగతి యెరిగివుండి కూడా నీ పాప జీవితాన్ని విడిచి పశ్చాత్తాప పడి,

దుఃఖపడి దేవుని సన్నిధిలో తగ్గించుకొని పాపములు ఒప్పుకొనక పోతే నరకాగ్నిలో యుగాయుగములు బాధపడవలసి వస్తుంది.

ఈలాగున యూదులు 70 యేండ్లు బబులోను చెరకు వెళ్ళే ముందు కూడా రోదించమని యిర్మియా ఆనాటి యూదాస్త్రీలతో చెప్పాడు. విలాప ప్రవక్తయైన యిర్మియా విలపించే, రోదించే, అంగలార్చే స్త్రీలను పిలుస్తున్నాడు.(యిర్మీ 9:17-21) దేవని ప్రజలు ఎన్ని మారులు ప్రవక్తలచేత హెచ్చరించబడినమూవారి పాపములను వారు విడువని కారణముచేత దేవుడు వారిని చెఱకు పంపించబోతున్న విషయాన్ని గురించి స్త్రీలు త్వరపడి మన కొరకు రోదన ధ్వని చేయాలి అంటున్నాడు. మనము వలసపోతిమే, సిగ్గు నొందితిమే, మనము మనదేశము విడువవలసి వచ్చెనే అని ఆ స్త్రీలు రోదన చేయవలసి వచ్చింది. యిర్మియా ఆ స్త్రీలతో 20వ లో మీ కుమార్తెలకు రోదనము చేయ నేర్పుడి. ఒకరికొకరు అంగలార్పు విద్య నేర్పుడి యెహోవా మాట వినుడి అనిచెబుతున్నాడు. ఈనాడు స్త్రీలమైన మనతో కూడ ప్రభువు ఈ రోదన ధ్వని చేయమని చెబుతున్నాడు. మన పిల్లలకు కూడా అంగలార్చుట మనం నేర్పాలి. ప్రభువు యెరూషలేము కుమార్తెలారా! "మీ కొఱకును, మీ కుమార్తెల కొఱకును ఏడ్వుడి" అన్నారు. "వీధుల్లో పసిపిల్లలు లేకుండను, రాజమార్గములు యవనులు లేకుండను వారిని నాశనము చేయుటకు మరణము మన కిటికీలను ఎక్కుచున్నది. మన నగరులలో ప్రవేశించుచున్నది." అని యిర్మియా 9:20వలో చెప్పాడు కాబట్టి ఈ దినాలలో కూడా మన పాపాన్ని బట్టి మరణము మన అందరి ఇళ్ళలో కిటకీలను ఎక్కుచున్నది. గనుక కిటికీలలో వున్న మరణం లోపలికి రావడానికి ఎంత సమయం కావాలి? ఏ క్షణంలోనైనా రావచ్చును. ఇలాంటి మరణాలు ఆకస్మికంగా రోగాల రూపంలోనూ, అర్థం కాని జబ్బుల రూపంలోను, వ్యాధి కారకాలైన అనేక బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా మన యిళ్ళల్లోకి ప్రవేశించే రోజుల్లో మనమున్నాము. ప్రభువును విశ్వసించక చనిపోయే పిల్లలు యవనులు మన ఇళ్ళలో, మన నగరాలలో అత్యధికులుగా వున్నారు. శిశు మరణాలు ఈ దినాల్లో ఎక్కువైపోయాయి. మరి ఈ సంగతులన్నిటి కొఱకై మనము త్వరగా అంగలార్చి విలపించి రోధించి ప్రభువు దగ్గర మొఱ్ఱపెట్టవలసిన దినాలివి. అలాగున చేసి మనలను, మన శిశువులను, మన యువస్థులను రక్షించుకొందుము గాక ! యిర్మీ 9:2వలో "నాజనులలో హతులైన వారిని గురించి నేను దివారాత్రము కన్నీరు విడుచునట్లు నాతలను జలము యముగానూ, నాకళ్ళు కన్నీటి ఊటలుగాను వుండును గాక" అన్నాడు. అలాంటి రోధన వేదన అంగలార్పు మనకున్నదా ? మొర్దెకై రాజుగుమ్మములో గోనెను ధరించిన సంగతి అంతఃపురములో వున్న ఎస్తేరుకు తెలిసి మనోవిచారముతో నింపబడింది. గోనెపట్ట అంగలార్పును, పాపస్థితిని చూపిస్తుంది. పాపియైన మనుషుని చూస్తే నేడు మనకు అలాంటి విచారముందా ?

## 4-8వ. మొర్దెకై దుఃఖమునకు ఎస్తేరు కారణము తెలిసికొనుట :

ఎస్తేరు గోనెను ధరించిన మొర్దెకై విషయమై విచారముకలదై కట్టుకొనుటకై వస్త్రములు పంపింది కానీ, అతడు వాటిని తీసికొనలేదు. మొర్దెకైకి కావలసినది వస్త్రములు కాదు గానీ, యూదుల రక్షణ ఆయనకు కావాలి. ఎలీషా వలె మొర్దెకై వస్త్రాలు కోరలేదు. దానియేలు వలే దానములు, బహుమానాలు కోరలేదు. యూదులు నాశనమైతే యూదుల రాజు, జగద్రక్షకుడైన యేసు ప్రభువు, ఈ లోకానికి వచ్చే అవకాశమే వుండేది కాదు. ఎస్తేరు ఒక వ్యక్తి విషయమై విచారపడితే మొర్దెకై అన్ని సంస్థానాలలో వున్న యూదులందరి రక్షణ విషయమై విచారపడుతున్నాడు. రక్షణ వస్త్రములేని అనేక మానవుల కొఱకై మనము విచారము కలిగివుండాలి. సంఘములను గూర్చిన చింత పౌలుకును, తిమోతి కొనివున్నట్లు మనము కూడా కలిగివుండాలి. నెహెమ్యా రాజుకు గిన్నెనందించు చుండగా నెహె2:2వ వచనంలో రాజు – " నీకు వ్యాధిలేదు గదా! నీ ముఖము విచారముగా నున్నదేమి ?నీ హృదయ దుఃఖము చేతనే అదికలిగినద " ని నెహెమ్యాతో అన్నాడు. అందుకు నెహెమ్యా నాపితరులు సమాధులుండు పట్టణము పాడైపోయి దాని గుమ్మములు అగ్నిచేత కాల్చబడి వుండగా నాకు దుఃఖ ముఖము లేకపోవునా ? అని అన్నాడు. పాడైపోయిన యెరూషలేము పట్టణమును గూర్చి ఆయన విచారిస్తున్నాడు. మనదేశంలో ఈ ప్రపంచములో, అలా రక్షణ లేక పాడైపోయిన పట్టణాలు ఎన్నో వున్నాయి. సాతాను ఈ లోకాన్ని అడవిగా చేసి, పట్టణాలను పాడుచేసి పెట్టాడు (యెష 14:17). ఈ అడవి లోకాన్ని పునరుద్ధరించాలనే విచారము విశ్వాసులమైన మనందరికీ వుండాలి. ఈ విచారంతోనే మనుషులులందరి కొఱకు రాజుల కొఱకు, అధికారుల కొఱకు ప్రార్థన' విజ్ఞాపన, యాచన' కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. (తిమో 2:2). ఎస్తేరుకు, నెహెమ్యాకు, పౌలుకు, తిమోతికి వున్న ఆత్మలను గూర్చిన విచారము మనందరమూ కలిగివుండాలి. తాను పంపిన వస్త్రములు మొర్దెకై ఎందుకు తీసికొనలేదు?అనే సంగతి తెలుసుకొనుటకు ఎస్తేరు మొర్దెకై యొద్దకు హోతాకు అనే షండుని పంపింది. అలా పంపగా మొర్దెకై తనకు సంభవించిన దంతయూ, యూదులను నాశనము చేయుటకుగాను, హామాను రాజు సుంఖ్కి పొందిన ఖజానాలోని సొమ్ము మొత్తము ఇంత అని హోతాకుకు తెలిపి, యూదుల సంహారమునకై ఘూషను కోటలో యివ్వబడిన ఆజ్ఞ ప్రతిని ఎస్తేరుకు చూపి, తెలుపుమని, ఆమె తన జనుల విషయమై విన్నపము చేయుటకై రాజునొద్దకు పోవలెనని చెప్పుమని అప్రతిని అతనికిచ్చాడు.

**9-11వ. రాజు పిలవకుండా తనంతకటితానే వెళ్ళితే వచ్చే అపాయమును గూర్చి ఎస్తేరు చెప్పుట :**

పిలువబడక పురుషుడేగాని, స్త్రీయేగాని, రాజుయొక్క అంతర్గృహమున ప్రవేశించిన యెడల బ్రతుకునట్లుగా రాజు తన బంగారు దండమును ఎవరితట్టు చాపునో వారుతప్ప ప్రతివాడును సంహరింపబడునన్న కఠినమైన ఆజ్ఞ కలదని నేటికి 30 దినముల నుండి రాజునొద్దకు ప్రవేశించుటకు తాను పిలువబడలేదని హతాకుతో ఎస్తేరు తన అన్న యైన మొర్దెకైకు చెప్పిపంపింది. ఈ పారశీకరాజుల ఆజ్ఞలు కడకు వారి భార్యలకు కూడా మినహాయింపు యివ్వలేదని తెలుస్తుంది. మన పరమ రాజైన ప్రభువునొద్ద మనవి చేయటానికి ఆయన పెండ్లి భార్యయైన సంఘములో వున్న మనము ఏవేళైనా వెళ్ళవచ్చు. నా యొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రము త్రోసివేయనని ప్రభువు చెప్పారు. ఆయన కృపాసనమునొద్దకు వెళ్ళటానికి నిర్భయమైన ప్రవేశం మనకుంది (హెబ్రీ 4:16). ఆయన సన్నిధిలో మొఱ్ఱపెట్టడానికి ఫలానా సమయంలోనే వెళ్ళాలనే నియమంలేదు. ఏవేళైనా ఆయన పిలువకపోయినా, మనం పిలిస్తే పలికే దేవుడు, మనదేవుడు. అన్యుల దేవుళ్ళను గురించి, " పిలచినా పలుకవు, ఎన్నిమెట్లెక్కినా కానరావు" అని అన్యులు నిరాశతో పాడినట్లు కాదు మన దేవుని సంగతి. మనము మొఱ్ఱపెట్టుచుండగా చెవియొగ్గి ఆలకించే దేవుడు. అది కాండములో దేవుడు ప్రతిరోజూ చల్లని పూటఆదాము, హవ్వలతో మాట్లాడేవారు. ఈ దినాల్లో ఎంతమంది ఎన్నిసార్లు ఆయన యొద్దకు వెళ్ళినా ప్రేమ గల తన హస్తాన్ని రాజు తన దండము చాచినట్లు చాపేదేవుడు. తన అంతర్గృహమైన పరలోకానికి పిలుస్తున్న దేవుడుగా వున్నారు. ప్రభువిప్పుడు, మనలను పిలిచే పనిలోనే వున్నారు. రక్షణకు, సేవకు, పరిచర్యకు పిలిచేవారుగా వున్నారు.

అహష్వేరోషురాజు యొక్క ఆజ్ఞ తమ భార్యల విషయంలో కఠినంగా వున్నట్లున్నాయి. కానీ మన ప్రభువు మనకిచ్చిన ఆజ్ఞలు భారమైనవి కావు. మత్తై 11:30వ వచనంలో నాకాడి సుళువు, నాభారం తేలిక అని ప్రభువే అన్నారు. అది మానవునికి ప్రభువిచ్చిన మొదటి ఆజ్ఞ - "మంచి చెడుల తెలివినిచ్చు వృక్ష ఫలమును నీవు తినకూడదు" న్నారు. ఇది చాలా సుళువైన ఆజ్ఞ. ఈ సుళువైన ఆజ్ఞకు విధేయత చూపకపోతే దేవుడు యిర్మి 7:22వ వచనంలో వ్రాయబడినట్లు వారు ఆయన మాటలు అంగీకరిస్తే క్షేమం కలుగుతుంది చెప్పారు. కానీ, వారాలాగు చేయక పోయినందు వలన దహన బలులు, బలులను గూర్చి విధిరూపకమైన ఆజ్ఞలు, ఆచారములు కలిగిన ధర్మశాస్త్రాన్ని దేవుడు వారికిచ్చారు. ఆయన మాట అంగీకరించమని చెప్పిన సుళువైన ఆజ్ఞను ఎప్పుడు మానవులు వుల్లంఘించారో అప్పుడు దేవుడు వారికి ముందు చెప్పని బలులు' దహన బలులను గురించిన కఠినమైన ఆజ్ఞలు

యివ్వాల్సి వచ్చింది. ఆయన ఆజ్ఞలు అంటే, ఏమిటా ఆజ్ఞలు? ఉదాహరణకు యెహె 20:19వ వచనంలో మీ దేవుడైన యెహోవాను నేనే. గనుక నా కట్టడలను అనుసరించి నా విధులను గైకొని నేను నియమించిన విశ్రాంతి దినములను ఆచరించుడి" అని ప్రభువాజ్ఞాపించారు. అయితే ఇశ్రాయేలీయులు దేవుని మీద తిరుగబడి తామనుసరించి బ్రతుకువలెనని దేవుడిచ్చిన ఆజ్ఞలను, విధులను, కట్టడలను గైకొనక, ఆయన నియమించిన విశ్రాంతి దినములను ఆచరించక పోయినా వారు అరణ్యములో వుండగానే, దేవుడు తన రౌద్రాగ్ని వారి మీద కుమ్మరించాలనుకున్నాడు. కానీ చుట్టూ వున్న అన్యజనులు చూస్తూఉండగా, ఆయన తన హస్తాన్ని వెనుకకు తీసి వాగ్దాన భూమిక వారిని రప్పించి తన వాగ్దానాన్ని నేరవేర్చారు. అక్కడికి వెళ్ళిన ఇశ్రాయేలీయులు ఆ వాగ్దాన భూమిలో కూడా అయన విధులను కట్టడాలను తృణీకరించి, విశ్రాంతి దినములను అపవిత్ర పరచి తమ పితరులు పెట్టుకొనిన విగ్రహములను పూజింప కోరుకున్నప్పుడు దేవుడు అన్యజనులలోకి వారని చెదరగొట్టి సకల దేశములలోనక వారిని వెళ్ళగొట్టాడు. ఈ సందర్భములో ప్రభువు యెహె 20:25వ వచనంలో "నేను యెహోవా అనివారు తెలుసుకొనునట్లు వారు విస్మయమొందవలెనని అనుకూలము కాని కట్టడలను తాము బ్రతుకుటకు ప్రయోజనము కాని విధులను నేను నారికిచ్చితిని." అని అన్నారు. అట్లయితే ఈ బలులు, దహనబలులు రాబోవుచున్న యేసు ప్రభువుకు ఛాయలుగా ఉన్నాయే తప్ప యివన్నీ ఆచరించాలంటే ఎంతో సమయం నష్టం? ఎంతో డబ్బు నష్టం? ఎంతో ఆస్థి నష్టం? పైగా యివన్నీ మన బ్రతుకుకు ప్రయోజనం కావని ప్రభువే వ్రాయించారు. ధర్మశాస్త్ర విధులకు కట్టడలకు దాసత్వం చేయాల్సి వచ్చింది. ఇదంతా ఎందుకు జరిగిందంటే, ఆపండు తినవద్దని చెప్పిన చిన్నదైన సులువైన ఆజ్ఞకు మనుష్యుడు అనగా ఆదాము విధేయత చూపివుంటే ఈ ఖఠినమైన ఆజ్ఞలు (బ్రతుకుకు ప్రయోజనము కాని, అనుకూలము కానీ ఆజ్ఞలు) ప్రభువు వారికిచ్చే వారే కాదు. కనుక ఏరాజ్యములోనైనా ఆజ్ఞలు ఎందుకు కఠినంగా వుంటాయి? అంటే, చిన్న ఆజ్ఞకు లోబడకపోతే కఠినమైన ఆజ్ఞలు జారీ అవుతాయి. ఎవరైనా ఆజ్ఞను అతిక్రమిస్తే చిన్న శిక్ష పడుతుంది. అంతమాత్రమే కాక రూల్స్, రెగ్యులేషన్స్ ఇంక ఎక్కువగా విధిస్తారు. ఆ రూల్సు, రెగ్యులేషన్సు అధిగమిస్తే యిక జైలు పాలవుతారు. ఆ రూల్సు, రెగ్యులేషన్సు తమ బ్రతుకులకు అనానుకూలంగాను, నిష్ప్రయోజకంగాను వుంటాయి అలాగే పారశీక రాజ్యంలో కూడా మును పెప్పుడో ఎవరో రాజు పిలుప కుండానే వచ్చి రాజుకు ఏదోహానీ చేయ తలపెట్టివుంటారు. కాబట్టి రాజు పిలువకుండా ఎవ్వరూ (కనీసం తన భార్యలు కానీ) రాకుండా ఖఠినమైన ఆజ్ఞ పెట్టబడి ఉండవచ్చు. ప్రియ సోదరీలారా! ప్రభువు మనకిచ్చిన ఆజ్ఞలను మనము చేయకపోతే ప్రభువు మనపట్ల కూడా ఖఠినముగా వ్యవహరించ వలసివస్తుంది. కీర్త 118:18వ వచనంలో వున్నట్లు ఆయననన్ను ఖఠినముగా శిక్షించెను గానీ, మరణమునకు

అప్పగించలేదు. కీర్తన 71:20వ వచనంలో వున్నట్లు అనేక విధములైన కఠిన బాధలు మాకు కలుగచేసినవాడా ! నీవు తిరిగి మమ్మలను బ్రతికించెదవు. ఈలాంటి వచనాలు మనపట్ల నెరవేరితే ఎంతకష్టమో సోదరీలు ఆలోచించాలి.

అప్పటికి 30 దినముల నుండి ఎస్తేరు రాజునొద్దకు పిలువబడలేదు. ప్రియసోదరీ ! రాజు పిలవులేదు గనుక ఎస్తేరు రాజునొద్దకు వెళ్ళలేక పోయింది. కానీ మన పరమరాజు మనలను అనేక విషయముల కొఱకు పిలుచువాడు గానే వున్నాడు. **మొట్టమొదటిదిగా** ప్రభువు " ప్రయాసపడి భారము మోయుచున్న వారలారా! నా యొద్దకు రండి, మీకు విశ్రాంతి కలుచేయుదును " అని మత్త 11:28వ వచనంలో రక్షణకై పిలుస్తున్నాడు. ఆయన స్వరము విని ఆయన యొద్దకు వస్తే పాపక్షమాపణ, రక్షణ కలుగుతుంది. ఆయనయిచ్చిన ఏ పిలుపుకైనా సమ్మతి చూపిస్తే భూమి యొక్క మంచి పదార్థములతో మనకు తృప్తినిస్తాడు. లేకపోతే ఖడ్గము పాలు చేస్తాడు (యెష 1:18) ఆయన యిచ్చిన ఏ పిలుపునైనా నిర్లక్ష్యము చేస్తే గొప్ప అపాయం కలుగుతంది. సామె 1:3వ వచనంలో నేను పిలువగా మీరు వినకపోతిరి. నా చేయి చాచగా (దండము) ఎవరునూ లక్ష్యపెట్టకపోతిరి. నేను చెప్పు బోధ ఏమియు వినక త్రోసి వేసితిరి. నేను పిలువగా లోబడక పోతిరి. కాబట్టి మీకు అపాయము కలిగినపుడు నేను నవ్వెదను. మీకు భయము కలుగునపుడు నేను అపహాస్యము చేసెదను. భయము మీ మీదికి తుఫాను వలె వచ్చినపుడు' సుడిగాలి వచ్చునట్లు మీకు అపాయము కలుగనపుడు మీకు కష్టమును,దుః ఖమును ప్రాప్తించినపుడు నేను అపహాస్యము చేసెదను. అప్పుడువారు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టెదరు (లేక పిలచెదరు). కానీ నేను ప్రత్యుత్తర మియ్యకుందును. నన్ను శ్రద్ధగా వెదకెదరుగానీ నేను వారికి కనబడకుందును. అని ప్రభువు చెబుతూంటే ఎంత భయకరం ? ప్రియ సోదరీ! మన ప్రభువు తన రెండుచేతులు లోబడనొల్లని వారివైపు చాచుచున్నాడు. చాచిన బాహువుకు అప్పగించుకోకపోతే, ఇంతకాలము 'రండి' అని పిలిచిన దేవుడు "అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచిన నరకాగ్నికి పొండి" అని అంటారు.

**రెండవదిగా** ప్రభువు తన ఉపదేశాన్ని వినడానికి పిలుస్తున్నాడు. కీర్తన 32:8వ నేను నీకుపదేశము చేసెదను. నీవు నా ఆజ్ఞలను ఆలకించవలెనని నేనెంతో కోరుచున్నాను. ఆలకించిన యెడల నీ క్షేమము నదివలెను, నీ నీతి సముద్ర తరంగముల వలెను వుండును. నీ సంతానము ఇసుకరేణువుల వలె విస్తారమగును. నీగర్భఫలమును, దాని రేణువుల వలె విస్తరించును. వారి నామము నా సన్నిధి నుండి కొట్టి వేయబడదు అన్నాడు ప్రభువు. ఉపదేశమాలకిస్తే ఎంతో క్షేమం. ఆలకించకపోతే ఎంతో అపాయం పొందవలసిన వారుగా వుంటాము.

**మూడవదిగా** I కొరి 1:1లో పౌలును అన్యజనులకు అపోస్తలుడుగా ఉండుటకు పిలిచినట్లు ప్రభువు కొంతమందికి ప్రత్యేక పని కొఱకు పిలుచుచున్నాడు. అ.పో.కా. 13:1,2.

**నాలుగవదిగా** I కొరి 1:2వ వచనంలో వున్నట్లు మనలను పరిశుద్ధ పరచుటకును, పరిశుద్ధులుగా వుండుటకును ప్రభువు పిలిచాడు. కీర్త 7:1లో వున్నట్లు దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు శరీరమునకును, ఆత్మకును కలిగిన సమస్త కల్మషముల నుండి మనలను పవిత్రులనుగా చేసికొనుటకు ఆయన మనలను పిలుస్తున్నాడు. అలాగున పవిత్ర పరచుకొనువారికి II కొరి 6:16-18వ వచనంలలో వున్న వాగ్దానాలన్నీ లభ్యమవుతాయి. ఆవాగ్దానాలు (1) వారిలోనేను నివసింతును (2) సంచరింతును (3) నేను వారి దేవుడనై యుందును (4) వారు నా ప్రజలైయుందురు (5) నేను మిమ్మును చేర్చుకొందును (6) మీకు తండ్రినై యుందును (7) మీరు నాకుమారులును, కుమార్తెలునై యుందురు. ఈ 7 వాగ్దానాలు మనము పొందుకోవాలంటే పరిశుద్ధతను కలిగి నివసించాలి. ఈ పవిత్రతలో మనముండాలంటే ఆయన పిలుపుకు మనము విధేయులుగా వుంటున్నామా ?

**ఐదవదిగా** ప్రార్థనకు పిలుస్తున్నాడు " అడుగుడి మీకివ్వబడును. వెదకుడి మీకు దొరుకును. తట్టుడి మీకు తీయబడును" అని పిలుస్తున్నాడు. మీరు అడిగినసూ మీ భోగేచ్ఛల నిమిత్తమా? దురుద్దేశముతో అడుగుతున్నారు అనిచెప్పి, ప్రార్థన కొరకు
ఆయన యొద్దకు పిలుస్తున్నాడు. యోవేలు 2:12-15వ వచనంలో యిప్పుడైనను మీరు ఉపవాసముండి, కన్నీరు విడచుచు దుఃఖించుచు మనఃపూర్వకముగా తిరిగి నాయొద్దకు రండి. ప్రతిదినము నియమించి ప్రకటన చేయుడి. జనులను సమకూర్చుడి. సమాజకూటము ప్రతిష్ఠించుడి. పెద్దలను పిలువనంపించుడి. చిన్నవారిని, స్తన్యపానము చేయు బిడ్డలను తోడుకొని రండి. పెండ్లి కుమారుడు అంతఃపురములో నుండియు, పెండ్లి కుమార్తె గదిలో నుండియూ రావలెను అని అందరినీ స్తన్యమిచ్చు శిశువులను కూడారండని, ఆటంకము లేకుండా, అందరినీ పిలుస్తున్నాడు. ఇంత నిరాటంకమైన పిలుపు వుండినప్పటికీ, ప్రియ సోదరీ !నీవు ఎన్ని రోజుల నుండి లేక ఎన్ని నెలలనుండి, లేక ఎన్ని సంవత్సరములనుండి పరమ రాజునొద్దకు వెళ్ళకుండా వుంటున్నావు ? ప్రార్థనకైనా, వాక్యానికైనా తన యొద్దకు రమ్మని పిలుచుచున్న ప్రభువు దగ్గరకు రాకుండా వుండుట, నీకు ఏమాత్రమూ క్షేమాన్ని కలిగించదు కదా! కనుక ఆయన పిలుపుకు నేడే విధేయత చూపు. అప్పుడు నీ క్షేమము నదివలెను, సముద్ర తరంగములవలెనూ వుంటుంది.

## 12-15వ. ఎస్తేరుకు మొర్దెకై హెచ్చరిక :

ఎస్తేరు రాజనగరులో వున్నంత మాత్రము చేత యూదులందరికీ ఆదారుమాసం 13వ రోజున వచ్చే నాశనము నుండి ఆమె తప్పించుకొనే అవకాశం లేదనీ, ఆమె ఈసమయమందు

ఏమీ మాటలాడక మౌనంగా వుంటే యూదులకు సహాయము విడుదల మరియొక దిక్కు నుండి వస్తుందని ఆమె, ఆమె తండ్రి ఇంటి వారును నశిస్తారని ఆమె ఈ సమయాన్ని బట్టియే రాజ్యమునకు వచ్చినదేమోనని మొర్దెకై ఆమెను హెచ్చరించుట మనము ఈ వచనాల్లో గమనిస్తాము.

మొర్దెకై పేరుకు 'చిన్నవాడు' అని అర్థము. మన ప్రభువు మహాఘనుడు, మహోన్నతుడు. నిత్యనివాసి, అమరత్వములో ఉన్నవాడు. అయినా, ఈ లోకానికి మానవ రూపములో వచ్చినపుడు చిన్న కుటుంబములో పుట్టాడు. యేసు అనే చిన్న పేరు కలిగివున్నాడు. నివాస యోగ్యం కాని చిన్న యింటిలో పెరిగాడు. ఎండిన నేలలో లేతమొక్కగా పెరిగాడు. ఆయన జీవితం పచ్చిక బయళ్ళలో సాగలేదు. ఆయన జీవిత కాలం కూడా చిన్నదే. అనగా 33 $^1/_2$ సంవత్సరాలే ఆలాగున ప్రభువు యొక్క పోలిక మొర్దెకైలో కనబడుతోంది. మొర్దెకై చేసే ఉద్యోగం కూడా చిన్న వుద్యోగమే. ఆయన పరిస్థితి కూడ చిన్న పరిస్థితే, ఇట్లు మొర్దెకై యేసు ప్రభువుకు ముంగుర్తుగా వున్నాడు.

ఎస్తేరైతే ఒకప్పుడు తల్లిదండ్రులు లేని చిన్నది, అనాథ, కానీ యిప్పుడు ఆమె అనాథకాదు. అందలమెక్కి అంతఃపురంలో వున్నది. దానికి కారణం మొర్దెకై రాణి పదవిలో ఉన్నటువంటి ఎస్తేరును యూదుల విడుదల కొరకై రాజుతో మాట్లాడాలని మొర్దెకై హెచ్చరిస్తున్నాడు. ఈ సమయాన్ని బట్టియే కాబోలు దేవుడామెను రాజ్యానికి తెచ్చాడని హెచ్చరిస్తున్నాడు. అలాగే ప్రభువు తన్ను తాను తగ్గించు కొనినవాడై ఎన్నిక లేని మనల్ని రక్షించి పెంచి గొప్ప వారినిగా చేశాడు. మనల్ని ఆయా స్థానాలలో, ఆయా పదవుల్లో, ఆయా సంస్థల్లో, ఆయా ఘనతల్లో ఉంచాడు. దేవుడిచ్చిన ఆస్తులు, అంతస్థులు, పదవులు చూచుకొని మురిసిపోక ప్రభువు కొరకు అనేక నశించే ఆత్మలను రక్షణలోకి నడిపించాలని ప్రభువు కోరుతున్నాడు. సోదరీ !నీ దేహ సంబంధులైన నీ బంధువుల రక్షణ కొరకై, నీ పాఠశాల మిత్రులకై నీ కాలేజి మిత్రుల రక్షణ కొరకై, నీ యిరుగు పొరుగు వారి రక్షణకై ప్రభువును ప్రార్థిస్తున్నావా ? మనమా పని చేయకపోతే దేవుడు మరియొకరి ద్వారా ఆకార్యాన్ని చేయిస్తాడు. కానీ నీ బహుమానం, నీ కిరీటం, వేరొకరికి యివ్వబడుతుంది. కానీ ప్రభువు నిన్ను లెక్క అడుగుతాడు. ఎవడునూ నీ కిరీటాన్ని అపహరించకుండా కాపాడుకోవాలి.

## 16-17వ. ఎస్తేరు ప్రార్థన – తీర్మాణములు :

యూదుల విడుదల కొరకు రాజుతో మాట్లాడుటకు మొర్దెకై ద్వారా హెచ్చరించబడిన ఎస్తేరు ఆలోచించి "నేను నశించిన నశించెదను" అని ఒక ప్రార్థనా తీర్మానము చేసుకుంది. షూషనుకోటలోని యూదులందరినీ 3 రోజుల ఉపవాస ప్రార్థనకై సమాజ మందిరములో

సహాకూర్చమని మొర్దెకైని కోరింది. ఏ పనైనా చేయడానికి ముందు ప్రార్థించటం ఎంతో ప్రాముఖ్యమైనదని మొర్దెకై పెంపకంలో ఎస్తేరు ఎదిగింది. ప్రియ సోదరీ! నీవు అలా చేస్తున్నావా ? ఈ పని నాచేత అవుతుంది. ఇది నేను చేయగలను అని కాదు గానీ, అన్ని కార్యకలాపములకు ముందు ప్రార్థన వుండాలి. మొదట ప్రార్థించకుండా దుడుకుగా పని మొదలు పెట్టి పనిలో కష్టం వచ్చినపుడు అప్పుడు ప్రార్థన చేయుటం కాదు. ఎస్తేరు పని ముందు కాదు, ప్రార్థనయే ముందు అని మనకు నేర్పిస్తోంది. ప్రభువు చనిపోయిన లాజరును మృతులలో నుండి లేపగలడు. కానీ, ముందు తండ్రికి ప్రార్థన చేస్తున్నాడు. ఎలీషా చనిపోయిన షూనేమీయురాలి కుమారుని తాను పొందిన " రెండంతల ఆత్మదారా "బ్రతికించగలను". అని అనుకోలేదు. కానీ, ముందు ప్రార్థన చేశాడు. ఇస్సాకు భార్య రిబ్కా తనకడుపులో తొందర కలిగినపుడు మానవ ప్రయత్నము ముందు చేయలేదు కానీ, ముందు దేవుని అడుగ వెళ్ళింది. ఈ కాలంలోనైతే స్త్రీలు ముందు గైనకాలజిస్ట్ దగ్గరికి వెళ్ళారు. అలాగే దావీదు యుద్ధానికి వెళ్ళే ముందు దేవుని యొద్ద విచారణ చేసేవాడు. ఎస్తేరు చేయుచున్న ప్రార్థన మామూలు ప్రార్థన కాదు. కానీ 3 రోజుల వుపవాస ప్రార్థన. ఉపవాస ప్రార్థన మీద ఆమెకెంత నమ్మకముందో కదా ! మన ప్రభువే ఉపవాస ప్రార్థనను గురించి మార్కు 9:20లో ప్రస్తావించాడు. అసాధ్యమైన సంగతులు సాధ్యపరచేది ఉపవాస ప్రార్థనే. ఈ ఉపవాస ప్రార్థన వారికి ఎన్నో అనూహ్యమైన మేలులను తెచ్చిపెట్టింది. ఈ ఉపవాస ప్రార్థన గురించి యోవేలు 2:12-16 వచనాల్లోనూ, యోనా 3:5-10 వచనాల్లోను, నెహె1:4 వచనంలోనూ, ఎజ్రా 8:21-23 వచనాల్లోనూ, దాని 9:3-27 వచనంల్లోనూ వ్రాయబడింది. అన్ని సార్లూ, ఉపవాసప్రార్థన వూహించలేని గొప్ప కార్యాలే చేసింది. 4వ అధ్యాయంలో 3వచనంలో యిప్పటికే రాజు ఆజ్ఞ గల శాశనము ఏఏ సంస్థానములకు వచ్చినదో అక్కడ కలత చెందిన యూదులందరూ ఉపవాస ముండి ప్రార్థిస్తున్నారు.

## ఎస్తేరు చేసిన మొదటి తీర్మాణం :

"మీరందరూ వుపవాసముండి ప్రార్థించండి" అని యూదులకు చెప్పి ఎస్తేరు తాను వూరకుండ లేదు. నేనును నాచెలికత్తెలునూ ఉపవాసముందుము" అని తన తీర్మానాన్ని చెప్పింది. రాణి తన నివాసంలో వుపవాస ప్రార్థన చేయవలసిన అవసరమేముంది ? ఏ ఇబ్బందీ, ఏ అవసరత తనకు లేదు. ఒక వేళ అదారు మాసము 13వ రోజు యూదులందరూ చంపబడుతూ వుంటే రాజు ఎస్తేరు నాభార్య గనుక ఆమెను 'చంపకండి' అని ఆమెను తప్పించవచ్చు. అయినా తన జనుల రక్షణ కొఱకు ఆమె 3 రోజులు కడుపు ఖాళీగా వుంచుకొని ప్రార్థించింది. యూదులకు ఎస్తేరుకు ఈ ఉపవాస ప్రార్థన అప్పుడప్పుడు అలవాటే. కానీ పారశీకులైన తన చెలికత్తెలు యూదురాలైన ఎస్తేరుతో కలిసి ఉపవాసముండుట ఆశ్చర్యము కాదా! ఈ చెలికత్తెలకు

ఏ సమస్యాలేదు. కానీ, ప్రార్థన చేస్తున్నారు. తమ రాణి తన జనుల రక్షణ కొరకు ఉపవాస ప్రార్థన చేయుచుండగా, వారు కూడా ఉపవాస ప్రార్థన చేస్తున్నారు. ఆమె కొరకు సానుభూతితో కాదు గానీ, "ఏడ్చువారితో ఏడ్వుడి. సంతోషించు వారితో సంతోషించుడి". అని ప్రభువు చెప్పినట్లు వారు చేస్తున్నారు. ప్రియసోదరీ ! నీవు అలాగున చేస్తున్నావా ? ఎవరు ఎలా వుంటే నాకేమి? నేనూ, నా వాళ్ళు బాగుంటే చాలు అనుకోలేదు. ఆ చెలికత్తెలు ఇతరుల ఇబ్బందులలో ఈ చెలికత్తెల్లాగా పాలు పంచుకుంటున్నావా ? కనీసం ప్రార్థనా సహాయమైన చేస్తున్నామా? పారశీక చెలికత్తెలకున్న ప్రేమ, ప్రార్థనా భారం, మనకుందా ? నీ ప్రక్క కుటుంబము ఏడుస్తుంటే వారిని దర్శించి, ప్రార్థించి, వాక్యంతో ఆదరిస్తున్నామా?

ఈ చెలికత్తెలు ఆమె యొద్దకు ఎప్పుడు పంపబడ్డారు? ఎస్తే 2 :9వ ఈ చెలికత్తెలు ఎస్తేరు అంత:పురంలో అతిశ్రేష్టమైన స్థలములో వుండగా హేగే ద్వారా ఆమెకివ్వబడ్డారు. ఎస్తేరు 2:16వ.లో ఎస్తేరు పెండ్లి రాజుతో రాజు యేలుబడిలో 7వ సంవత్సరము 'టెబేతు' లను 10వ నెలలో జరుగగా, ఆ పెండ్లికి ముందు ఒక సంవత్సర కాలం ఎస్తేరు అంత:పురంలో ఉన్నప్పుడు ఈ చెలికత్తెలు ఆమెకు ఇవ్వబడ్డారు. అంటే రాజు యేలుబడిలో 6వ సం॥లో చెలికత్తెలు యివ్వబడ్డారని అర్థమవుతుంది. ఇప్పుడు వీరు రాజు శాసనము బయలుదేరిన తరువాత వుపవాస ప్రార్థన చేస్తున్నారు. రాజు శాసనము ఏ సంవత్సరములో బయలుదేరినదో తెలియాలంటే ఎస్తేరు 3వ అధ్యాయం 7వ వచనం చదివితే, రాజు యేలుబడిలో 12వ॥ సం॥లో నీసాను అనగా ప్రథమ మాసములో అని తెలుస్తుంది. అంటే ఇంచుమించు 5సం॥ల నుండీ ఈ చెలికత్తెలు ఎస్తేరు దగ్గర వుంటున్నారని అర్థమవుతుంది. ఈ 5 సంవత్సరాలలో ఎస్తేరు వారికి యెహోవా దేవుని గురించి తెలియచేసి, వారిని నిజ దేవుని వైపు త్రిప్పి. వారిని ప్రార్థించు వారినిగానూ అందులోను ఒక దినముకాదు, రెండు దినములుకాదు, 3దినములు ఉపవాస ప్రార్థనచేయు వారిగా వారిని మార్చగలిగింది. ఇది మనందరికీ ఎంత మాదిరో కదా! ఎక్కడికో వెళ్లలేదు ఎస్తేరు.

\ తన రాణీ వాసంలో వున్న చెలికత్తెలనే మార్చివేసింది. ప్రభువును గూర్చిన విషయాలు వారికి చెప్పి వారిని ప్రభువు వైపు త్రిప్పింది. 5సం॥ములలో 7 ఆత్మలను అన్యజనుల నుండి సంపాదించి, వారిని ఉపవాస ప్రార్థన చేయువారిగా ఎదుగుదలలోనికి తెచ్చింది. ప్రియ సోదరీ! గత ఐదు యేళ్ళలో ఎన్ని ఆత్మలను నీవు రక్షణలోనికి నడిపించావు? ఆ ఆత్మలు ఎంత వరకు ఆత్మీయతలో ఎదగగలిగారు? యోహాను 15:16లో "మీరు ఫలించుటకును, మీ ఫలము నిలిచియుండుటకును నేను మిమ్మును ఏర్పరుచుకొని నియమించుకొంటిని". అని ప్రభువు అన్నారు. ఎస్తేరు పేరుకు 'నక్షత్రము' అని అర్థం యేసు ప్రభువుకున్న పేర్లలో ఒక పేరు 'వేకువ చుక్క' అని వుంది. ఈ పేరును బట్టి ఎస్తేరు యేసుప్రభువుకు సాదృశ్యంగా వున్నది.

ఎస్తేరు ప్రభువువలె ప్రార్థించింది కానీ ప్రభువు తాను లోకకళ్యాణము కొరకు సిలువలో నశించి పోయేప్పుడు తాను ఒంటరిగానే ప్రార్థించాడు. శిష్యులు నిద్రించారు. కానీ, ప్రార్థించలేదు. ప్రార్థనా సహాయము అందించలేదు. కానీ, ఎస్తేరు తన ప్రజల విమోచన కొరకై నేను నశించిన నశించెదను అనింది కానీ, ఆమె నశించలేదు పైగా ఆమె యేసు ప్రభువువలె ఒంటరిగా కాక తన చెలికత్తెలతో కలిసి ప్రార్థించడం ఆమె ప్రార్థనకు, ప్రభువు ప్రార్థనకు వున్న తేడాను గమనించగలము. అలాగున ఎస్తేరు నేనును నా చెలికత్తెలును ఉపవాస ముందుమని తీర్మానము చేసింది.

ఈ సందర్భములో ఆయా భక్తులు తమ వారితో కలసి చేసుకున్న తీర్మానాలను కొన్నింటిని మన హితం కొరకు ధ్యానిద్దాం. యెహోషువ 24:15లో నేను నా ఇంటివారును. యెహోవాను సేవించెదము అని తన తీర్మానాన్ని ఇశ్రాయేలీయులతో చెబుతున్నాడు.

యెహోషువ దేవునిసేవ, వారింటివారు సాతానుసేవ, మనుషులసేవ, ప్రభుత్వసేవకాదు. యెహోషువ చేసే దేవుని సేవనే యెహోషువ యింటివారు కూడ చేస్తారట, అలాగే యోకెబెతు, అమ్రాముల ముగ్గురు పిల్లలైన మిర్యాము, అహరోను, మోషే దేవుని సేవలోనే వున్నారు. మిర్యాము ప్రవక్త్రి, అహరోను యాజకుడు, మోషే ప్రవక్త మరియు నాయకుడు. పిల్లలందరూ దైవ సేవలోనే వున్నారు. యోకెబెతు, అమ్రాములు తమ పిల్లలు దైవసేవలో వుండగా చూచి ఎంతగా సంతోషించారోగదా! ఫిలిప్పు దైవసేవలో వుండగా ఆయన నలుగురు కమార్తెలు కూడ దైవసేవకై అంకిత మయ్యారు. సోదరీ! ఈనాడు నీవు, నీ పిల్లలు ఎవరి సేవలో ఉండాలనుకుంటున్నారు? కొద్ది మంది తమ పిల్లలందరూ డాక్టర్లు లేక ఇంజనీర్లు, లాయర్లు, లెక్చరర్లు కావాలని అనుకుంటూ ఉంటారు. ఎవరెట్లున్నా నీ సంగతి నీ కుటుంబము సంగతేమి? మా కుటుంబము 'రాయల్ ఫ్యామిలీ' అని చెప్పుకొనే వాళ్ళున్నారు. కానీ మా కుటుంబమంతా దైవ సేవకుల కటుంబము అని చెప్పుకొనే వాళ్ళు వేళ్ళమీద లెక్క పెట్టేంతమందే ఉన్నారు అంటే అది కడుశోచనీయమే. నిన్ను, నీ కుటుంబాన్ని దైవసేవకు అంకితం చేసుకుంటావా ? ఈ పని గౌరవము లేని పని, అందరూ యిష్టపడేది, గౌరవించేది, మెచ్చేది, కాదని అనుకుంటున్నావా ? చదవలేక, బ్రతకలేక, సంచి మెడ కేసుకొనే పని అని యితరులు భావిస్తున్నారని నీవునూ అనుకుంటున్నావా ? నెహెమ్యా దేవుని పని మిక్కిలి గొప్ప పని అని అంటున్నాడు (నెహె 6:3) అంతర్జాతీయ సువార్తికుడైన బ్రదర్ బిల్లీ గ్రాహమ్ గారిని ఒకసారి ఒక పెద్ద కంపెనీ వారు " చాలా పెద్ద జీతమిచ్చే ఉద్యోగమిస్తాము, మా దగ్గర ఉద్యోగం చేయండి అన్నారట అందుకు ఆయన మీ జీతం పెద్దదే కాని మీ పని చాలా చిన్నది అన్నాడట. అంటే తాను ప్రస్తుతం చేయుచున్న దేవుని పని మాత్రమే మిక్కిలి గొప్పది అని తన భావం. ఈ మిక్కిలి గొప్పదగు పనిని గుర్తించిన హన్నా తన కుమారుడైన సమూయేలు పాలు విడువగానే

యెహోవా సన్నిధిని కనబడి తిరిగి రాక అక్కడనే (దైవ సేవలోనే) వుండును తన కోరికను భర్తయైన ఎల్కానాకు తెలిపింది. ప్రియ సోదరీ ! నీవు కూడ నీ పిల్లలను అలా దైవ సేవకులుగా అర్పించడానికి ఇష్టపడుతున్నావా ? లేక నెహె. 5:6వచనంలో ఉన్నట్లు నీ పిల్లలు అన్యులవశములో (సైతాను) యిప్పటికీ వుండుటకు యిష్టపడుతున్నావా ? యెహోషువ లాగ నేనును నాయింటి వారును యెహోవాను సేవించెదమని చక్కని తీర్మానం చేసుకుంటావా ? యెహోషువ ఏసందర్భములో ఈ మాట అన్నాడంటే, దేవుడు ఇశ్రాయేలీయులకు ఎన్నో మేలులు చేసి వుండగా నేనునూ, నాయింటి వారునూ యెహోవాను సేవిస్తామన్నారు. అలాగే నీకు, నీ యింటివారికి లెక్క లేనన్ని మేలు చేసిన ప్రభువు సేవ కొరకు మీరు కూడా అర్పించుకుంటారా ?

(2) ఈ సందర్భములో నెహెమ్యా ప్రజల కొరకు చేసిన తీర్మానం నెహెమ్యా 5:10లో చదువుదాం. **నేనును, నా బంధువులునూ నా దాసులును** కూడా కఠినమైన దాసత్వములో వున్ననూ యూదులకు సొమ్మును. ధాన్యమునూ, అప్పుగా యిచ్చి ఆ అప్పు తిరిగి పుచ్చుకొనక వుందుము. అని తీర్మానించుకున్నారు. ఈ దినాలలో అప్పు ఇచ్చేవాళ్లే లేకపోతే అప్పు ఇచ్చిపుచ్చు కొనని వారున్నారా ? నెహెమ్యా గవర్నరు గనుక అలా చేశాడులే అనుకోడానికి లేదు. తన బంధువులు, తన దాసులు కూడా అలా చేశారంటే, కఠిన దాసిసత్వంతో అన్యుల మధ్య నలిగిపోతున్నా, యూదులపై వారికుమారులు, కుమార్తెలపై వారి కున్న దయ, ప్రేమ, దాతృత్వము ఎంత గొప్పవోకదా ! అలాగే మన ప్రభువు మనల నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీనివలన ప్రేమ ఎట్టిది. అని తెలిసికొనుచున్నాము. మనము కూడా సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్టబద్ధులమై వున్నాము. I యోహా 3:16లో ఏలయనగా ప్రేమ మరణమంత బలమైనది. (పరమగీతము 8:6) అంతేగాక ప్రభువును నమ్మని ప్రతి వ్యక్తికి అనగా పౌలు చెప్పినట్లు జ్ఞానులకు, మూర్ఖులకు మనము సువార్త విషయములో ఋణపడి వున్నాము. వారికి సువార్త చెప్పి రక్షణలోనికి నడిపించి ఋణము తీర్చుకొనవలసి వారముగా వున్నారు.

(3) ఇదే నెహెమ్యా తన గ్రంథములో 5:14 వచనంలో **నేను గానీ, నా బంధువులు గానీ,** 12 సంవత్సరములు అధికారికి రావలసిన సొమ్ము తీసికొనక పనిచేశామని చెబుతున్నాడు. గవర్నరు అధికారంలో వున్నా తన బంధువులు తన క్రింద చిన్న చిన్న అధికారాలలో వున్నా, తాము కష్టపడి పనిచేసి, ఉద్యోగాలలో ఫలితాన్ని ఆశించలేదు. అదే సమయంలో తనకు ముందున్న అధికారులు జనుల యొద్ద నుండి, ద్రాక్షారసమును, ఆహారమును, నలుబది చిన్నముల వెండి తీసుకున్నట్లు నెహెమ్యా కూడా తీసికొనలేదు. ప్రభుత్వము నుండి కానీ, ప్రజల నుండి కానీ నెహెమ్యా ఏ ఫలితాన్ని ఆశించక, ఫ్రీ సర్వీస్ చేశాడు. ఎంత మంచి తీర్మాణమో సాక్ష్యమో కదా! నేడు ప్రభుత్వ అధికారులందరు యించు మించు ఫలితాన్ని ఆశించేవారుగా వున్నారు. ప్రక్కదారుల్లో అక్రమమార్గాల్లో సంపాదించేస్తున్నారు. మేడలు, మిద్దెలు,

బంగారు, డబ్బు, తోటలు ఒకటేంటి ? వారినీ వీరిని చూచి అందరికంటే ఎక్కువగా సంపాదించడంలో అహర్నిశములు. పోటీపడుతూ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. తమ మోసపు కోరికలను ప్రజలకు తెలియజేసి బహుమానాలు పొందే వారు కూడా వున్నారు. (మీకా 7:3) కానీ నెహెమ్యా 5:17వచనంలో భూమి సంపాదించు కొన్నవారము కాము అన్నాడు. ఈనాడు ఉద్యోగములో చేరినపుడు 2 ఎకరాల భూమి మాత్రమే వున్నవారు, కొంతకాలములోనే 200 ఎకరాలకు పడగలెత్తే వారుగా కనబడుతున్నారు. ఈనాడు కొద్దిమంది దేవుని సేవ పేరుతో ఆయా సంస్థలలో చేరి చాలా డబ్బులు సంపాదించే పనిలో వున్నారు. అపో. పౌలు ఎక్కువమంది ఆత్మలను సంపాదించవలెనని ఆశించాడు. కానీ గేహెజీ ద్రవ్యమును, వస్త్రములను, తోటలను సంపాదించు కోవాలని అనుకున్నాడు. నయమాను బహుమానమిచ్చినా దేవుడైన యెహోవా జీవము తోడు నేనేమియు తీసికొనను అని ఎలీషా చెప్పాడు కానీ, పరిగెత్తి నయమాను దగ్గరి నుండి బహుమానం తెచ్చుకొన్న గేహజీని చూచి ఎలీషా ద్రవ్యమును, వస్త్రములను ఒలీవచెట్లను, తోటలను, ద్రాక్షతోటలను, గొఱ్ఱెలను, ఎడ్లను, దాసదాసీలను సంపాదించు కొనుటకిది సమయమా " ? అన్నాడు. ప్రియ సోదరీ ! అన్న వస్త్రములతో తృప్తి చెందుదాం. - మన జీతములతో తృప్తి పొందుదాం. మనకు దేవుడిచ్చిన వాటితో తృప్తి పొందుదాం. ప్రభువు కొఱకు, మనము, మన బంధువులు మన నిస్వార్థమైన సేవ చేద్దాం. ప్రతి విశ్వాసి తన జీవితకాల చివరలో తమ సంపదనలో ప్రభువు కొరకై ఎంత ఖర్చుపెట్టాడో తన కొరకై ఎంత మిగిలిచ్చుకొన్నాడో స్పష్టంగా తెల్పాలి.

(4) నెహె. 5:6వ వచనంలో నెహెమ్యా **నేను** ఈ గోడపని చేయగా **నాపని వారును** ఆపని చేయుచూ వచ్చిరి. నెహెమ్యా పాడైపోయిన యెరూషలేము గోడ పని చేస్తుండగా ఆయన పనివారును ఆపని చేయటానికి వచ్చారు. నెహెమ్యా ఎలాచేస్తే, ఆయన బంధువులు, ఆయన దాసులు, ఆయన పనివారు అలాగే చేస్తున్నారు. నెహెమ్యా వారికెంత మాదిరిగా వున్నాడో కదా! వీరు ఆయన మాదిరిని అనుసరించే వారుగా వున్నారు. మన ప్రభువైన యేసుక్రీస్తు పటము నెహెమ్యాలో కనిపిస్తోంది. యేసు ప్రభువు తండ్రి తనకిచ్చిన పనిని చేయుటకై ఈ లోకానికొచ్చారు. ఆయన ఈ లోకంలో ఏమీ సంపాదించుకోలేదు. అనేకుల కొఱకు తన ప్రాణాన్నే క్రయధనంగా యిచ్చాడు. పండ్రెండుయేండ్ల ప్రాయములోనే "నేను నా తండ్రి పనుల మీద ఉండవలెనని మీరెరుగరా" ? అని యోసేపు, మరియమ్మలతో అన్నాడు. ఆయన ఆత్మలను సమకూర్చే పనిలో వున్నాడు. మనమునూ ఆయన చేసిన పనినే చేయాలి. నాతోకూడా సమకూర్చని వాడు నాకు విరోధి అన్నాడు ప్రభువు. "**నేను పరిశుద్ధుడను** గనుక మీరునూ **పరిశుద్ధులై** యుండుడి అన్నాడు. నేనుండు **చోటున మీరునూ వుండాలి** అన్నాడు. ఆయన మనసులాగే మన మనసు కూడ వుండాలని, ఆయన పోలికయే మనలో ఏర్పడాలని. అలాగున అన్నిటిలో

ఆయన ఏమైయున్నాడో అలాగే మనమునూ వుండాలని ప్రభువు కోరిన రీతిగా మనము మాత్రమే గాక మన బంధువులు, మన చెలికత్తెలు, మన పనివారు, మనదాసులు అందరూ, ఆయన ప్రార్థనలో ఆయన పనిలో, ఆయన సేవలో నిస్వార్థంగా ప్రతి ఫలాపేక్ష లేకుండా ముందుకు సాగుదాం.

(5) నెహె 5:18వ వచనంలో నెహెమ్యా మరో తీర్మాణం చేస్తున్నాడు. **తన నిమిత్తమును తనతో వున్న 150 మంది అధికారుల నిమిత్తమును,** తక్కువ ఖర్చుతో కూడిన ఆహార పానీయాలనే వాడాలని తీర్మానించుకున్నాడు. ఈ 150 మంది నిమిత్తము ప్రతిరోజూ 1 ఎద్దు, 6 గొర్రెలు, కోళ్ళు 10 రోజులకొక మారు ద్రాక్షారసము సిద్ధము చేశాడు. యూదులకు ద్రాక్షలు ముఖ్యమైన పండ్లు వారికది ముఖ్యమైన పానము అయినా యూదుల దాసత్వము కఠినంగా వుండుట వలన 10 రోజుల కొక్కమారే ద్రాక్షారసము సిద్ధము చేయించాడు. తన యూదాసోదరులకు నెహెమ్యా తానెంత సహాయము చేసినా, జనుల దాసత్వము కఠినముగా వున్నందున చాలా సాధారణమైన భోజనాన్ని తీసికొంటూ, 10 రోజులకొక్కసారి ద్రాక్షాపానాన్ని తీసుకొని తిండిఖర్చులు, పానీయ ఖర్చులు తగ్గించుకొని పొదుపు చేయడం ఎంత మాదిరో కదా ! అక్కరలలో వున్న మన సోదర సొదరీల కొఱకు మన తిండి., పానీయ ఖర్చులు, తగ్గించుకొని, వారికి సహాయముచేయ తీర్మానించుకొందామా ? ఎంతో మంది అలాగున కాఫీలో చక్కెర తగ్గించుకొన, ఒకపూట భోజనము తగ్గించుకొని ముఖ్యంగా మిషనరీలెందరో ఇండియాకు డబ్బు పంపించే వారని వారిని గూర్చి విన్నాము. కదా! ఇలా మనము కూడా చేయడానికి ముందుకు వద్దామా! ఇలా ప్రభువునందు ఒక సోదరి, తన యింటికి ఫర్నీచరు కొనాలను కొన్న డబ్బును మరొక సోదరి యొక్క అప్పును తీర్చడానికి యిచ్చివేసిందట ఇది మనకెంతో మాదిరి కదా!

(6) నెహెమ్యా చేసిన మరో తీర్మాణం నెహె 4:23లో చదవవచ్చు. నెహెమ్యా, **అతని పనివారు. కావలివారు, బంధువులు, రాత్రింబవళ్ళు** గోడ పనిలో ప్రయాస పడుచు తమ వస్త్రములు వుదుకుకొనుటకు తప్ప మరి దేనికి తమ వస్త్రములను తీసివేయలేదట. తమ వస్త్రములు తీసివేయలేదు, అంటే రాత్రింబవళ్ళూ పని చేయుటకు వారు సిద్ధముగా వుండుటను గమనిస్తున్నాం. ఇది వారి సిద్ధమనస్సును చూపిస్తుంది. గవర్నరుగా వున్న నెహెమ్యా రోజులో పూటకొక డ్రస్ వేయగలిగిన సామర్థ్యం కలవాడైనను, వస్త్రములు తీసి వేయక పని చేస్తున్నాడు, యితరులతో చేయిస్తున్నాడు. వస్త్రాలు తీసివేసే లోపల ఏ శత్రువువైన వచ్చి పనికి భంగం కలుగచేస్తారని వస్త్రాలు ఉదుకు కొనుటకు తప్ప మరిదేనికి తీసివేయక పోవుట మనము గమనిస్తున్నాము. తిండిలో, పానీయములో, వస్త్రాలలో అన్నింటిలో, నెహెమ్యా మితముగా పొదుపుగా వున్నాడు. 1తిమో 4:2 ప్రకారం మనము అన్ని విషయములలో మితముగా ఉండవలెనని నేర్చుకొనుచున్నాము.

(7) నెహె 5:1-5 వచనంలో నెహెమ్యా యూదులలో అనేకులు- మేమును, మాకుమారులమును, కుమార్తెలమునూ దాసత్వములో వున్నామని, తినుటకు ధాన్యము లేదని, భూముల మీద, ద్రాక్షాతోటల మీద అప్పు చేశామని వాటిని విడిపించుకొనుటకు శక్తి చాలాకున్నదని, వడ్డీలతో బాధ పడుచున్నామని నెహమ్యాతో చెప్పారు. ఈ యూదుల మాటలు అప్పు చేశాం. వడ్డీ కట్టలేం. శక్తి చాలకున్నది. అనే మాటలు మాదిరికరంగాలేనే లేవు. ఆర్థిక విషయాల్లో చాలా జాగ్రతగా వుండాల్సివుంది. వారేకాదు, వారి కుమారులు, కుమార్తెలు కూడా ఇదే దయనీయమైన పరిస్థితిలోనికి వచ్చారు. పైగా దాసత్వంలో వున్నారు. పై రీతిగా వారుండడానికి కారణం కఠినమైన బానిసత్వమేమో. అయినా సొమ్మును, ధాన్యమును అప్పుగా యిచ్చి అప్పువుచ్చుకొనకుందుమని నెహెమ్యా, నెహెమ్యా బంధువులు, నెహెమ్యా దాసులు తీర్మాణం చేసుకున్నారు. పైన చెప్పినట్లు ఇబ్బందులలో, ఇరుకులలో వున్నవారి యెడల మన తీర్మాణము. కర్తవ్యము ఏమి ? వారికి కుమారుల, కుమార్తెల ప్రాణము మన కుమారుల కుమార్తెల ప్రాణము వంటిదే కాబట్టి సాధ్యమైనంతవరకు మనం వారికి సహాయం చేయాలి. యాకో 1:27లో "దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి యిబ్బందులలో పరామర్శించుటయు ఇహ లోకమాలిన్యము తనకంటకుండా తన్నుతాను కాపాడు కొనుటయే దేవుని యెదుట నిజమైన భక్తి అని వ్రాయబడి యుండగా మనమును, అట్టి తీర్మాణము చేసికొని దానిని అమలు చేయుదుము గాక ! ఆలాగున ఎస్తేరు యూదుల పక్షముగా రాజుతో మాట్లాడుట కొరకై " నేను నశించిన నశించెదనని" తీర్మాణము చేసికొనినపుడు ఆమె మనసులో నెమ్మది లేక పోయి వుండవచ్చు. ఏలయనగా రాజు 30 రోజుల నుండిరాజు ఆమెను తనవద్దకు పిలువలేదు. ఇతర స్త్రీలతో కాలం గడుపుతూ, తనదయా దాక్షిణ్యములను పొందిన ఎస్తేరును స్త్రీలందరికంటే ఎక్కువగా ప్రేమించి, తాను రాణిగా చేసిన ఎస్తేరును ఆయన మరచినట్టున్నాడు. కానీ మన పరమ అహష్వేరోషు "నిన్ను విడువను. నిన్ను యెన్నడును ఎడబాయను. చూడుము, నాఅరచేతిలో నిన్ను చెక్కుకొని వున్నాను" అని యెష 49:16వచనంలో వ్రాయించాడు. "నీ తల్లియైన నిన్ను మరచును గాని, నేను నిన్ను మరువను" అని యెష 49 : 15లో అంటున్నాడు. "నా తల్లిదండ్రులు నన్ను విడిచినను యెహోవా నన్ను చేరదీయును" అని దావీదు కీర్త 27:10 వచనంలో అంటున్నాడు. ఈమాటలు సంఘములో వున్న మనందరికీ వర్తిస్తాయి. ఎస్తేరు తన మనసులో 30 రోజుల నుండి రాజు తనను పిలువలేదని నెమ్మది లేని పరిస్థితిలో వున్ననూ, తన ప్రజల రక్షణ కొఱకు వారి తరవున విజ్ఞాపన చేయుటకు రాజునొద్దకు వెళ్ళింది. నెమ్మది కలిగి యున్నపుడే కదా ప్రార్థన, సేవ చేయాల్సింది అని చాలా మంది అనుకుంటారు. కానీ, అన్ని పరిస్థితులు అడ్డము తిరిగి అనానుకూలముగా వుండినప్పటికీ, మనము సమయమనక అసమయమనక మనము సేవచేయాలి. ప్రార్థించాలి. యోసేపుకు జీవితంలో తల్లిని చిన్నపుడే

కొల్పోయాడు. తండ్రికి దూరమయ్యాడు. అన్నలచే మిద్యానీయులకు అమ్మబడ్డాడు. అన్నలు పగపట్టారు. పోతీఫరు యింటిలో అతని భార్య యోసేపు మీద నిందమోపింది.. చెరసాలలో పడ్డాడు. ఇలా చిన్నతనమంచే ఎంతో నెమ్మది లేని పరిస్థితులు యోసేపుకు ఎదురైనప్పటికీ, తనకు వచ్చిన కలలతో కలువరంగా వుండిన పానదాయకుడితో, భక్ష్యకారునితో నిన్న వుండినట్లు మీ ముఖములు నేడులేవే? అని యితరుల బాధలు తాను పట్టించుకుంటున్నాడు. ఆలాగున మనమునూ మన స్వంతకార్యములను మాత్రమేకాక, యితరుల కార్యాములను కూడా చూడాలి. (ఫిలి2 :4). అలాగున సొంత కార్యములు మాత్రమేకాక యేసుప్రభువు కార్యములను కూడ చూడాలని ఫిలి 2:21వచనంలో వ్రాయబడివుంది. నా బాధలేనాకున్నాయి. ఇక యితరుల బాధలు నామీద ఎందుకు వేసుకోవాలి ? అని అనుకొనకూడదు యేసుప్రభువు తాను సిలువలో పలుబాధలు అనుభవిస్తూవున్నా, తన తల్లిని చూచుకొనే బాధ్యతను యోహానుకు అప్పగించాడు. తాను అనుభవించుచున్న సిలువ బాధలు ఎన్ని వున్నప్పటికీ, తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరని తనను కొట్టి దూషించి, వెంట్రుకలులాగుతూ, వుమ్మివేసి, తన కాళ్ళ చేతులలో చీలలు గ్రుచ్చి, తనను దిగంబరిగా చేసి, తనను తూలనాడు తున్న వారిని, తన మీద బరువైన సిలువ మ్రానును మోపి, కొరడాలతో తనను కొడుతూ వున్న మానవత్వం లేని మానవుల కొఱకు ప్రభువు తండ్రిని సిలువలో మొట్టమొదటే మొరపెట్టాడంటే ఆయన బాధలు ఆయనకు పట్టలేదు, కానీ మన పాపాల క్షమాపణ కొఱకై తండ్రికి ప్రార్థించడమే ఆయనకు ప్రాముఖ్యమయ్యింది. కనుక మనకు నెమ్మది లేకున్నా, ప్రభువువలె మనము యితరుల సమస్యల విషయములో కొంతైనా త్యాగం చేయాల్సిన వారముగా వుండాలి.

## ఎస్తేరు చేసిన రెండవ తీర్మాణము :

"నేను నశించిన, నశించెదను " అన్న దానిని గూర్చి ఆలోచిద్దాము. ఇది ఆమె త్యాగానికి ఆమె సమర్పణకు గుర్తుగా వుంది. అన్నీ సరిగా వున్నపుడే సేవ చేయుడం కాదు. సేవలో నష్టాలుంటాయి. త్యాగాలు చేయాల్సివుంటుంది. కొంతమంది భక్తులు తమ ప్రాణాలను కూడా అర్పించారు. "ప్రాణాలు బలి యిచ్చిరీ. ప్రభునెంతో సేవించిరి" అని మనం నేడు పాడుకుంటున్నాము కదా! ప్రభువు కొరకు ప్రాణం పెట్టిన భక్తులు స్తెఫెను, హేరోదు ఖడ్గముచే చంపబడిన యాకోబు, పేతురు, పౌలు ఇలా ఎంతో మంది వున్నారు. ఒరిస్సా రాష్ట్రంలోని బారిపదలో గ్రాహంస్టెయిన్స్ ఆయన యిద్దరు కుమారులు, ఇటీవల హైద్రాబాదులో కిడ్నాప్‌కు గురై కనబడకుండా పోయిన ఐజక్ రాజుగారు డేవిడ్, వీరందరూ ప్రభువు కొఱకు ప్రాణాలిచ్చే, నశించిపోయారు. ఎస్తేరు కూడా తన ప్రజల రక్షణ కొఱకై నశిస్తానని తీర్మాణం చేసింది. కానీ ఆమెనశించాల్సిన అవసరం రాలేదు. ఎస్తేరు లాగా మనమునూ మన సహోదరుల

కొఱకై ప్రాణము పెట్ట బద్ధులమై యున్నాము. (1 యోహా 3:16). ప్రభువు మన నిమిత్తము సిలువలో తన ప్రాణము పెట్టుట వలన ఆయన ప్రేమను మనము తెలిసికొంటున్నాము.

17వ వచనంలో మొర్దెకై వయసులో పెద్దవాడైననూ తనకంటే చిన్నది ఒకప్పుడు తన సంరక్షణలో వుండి తన మాటవింటూ వచ్చిన ఎస్తేరు నేడు రాణీ పదవిలో వుండగా ఆమె చెప్పిన ప్రకారమే ఎస్తేరు ఆజ్ఞాపించిన ప్రకారమే అంతటినీ చేసినట్లు చదువుతున్నాము. అలాగే మనమును ప్రభువు ఆజ్ఞాపించిన అంతట ప్రకారం చేయాలి ఆయనమీతో చెప్పినట్లు చేయుడని మరియు కానా వివాహంలో సేవకులతో చెప్పింది. రాత్రంతా శ్రమ పడినా ఏ చేపలు పట్టలేక పోయిన పేతురు ప్రభువు చెప్పినట్లు కుడి ప్రక్కన వలవేసి విస్తారమైన చేపలు పట్టగలిగాడు. అయినను నీమాట చొప్పున వలవేస్తానన్నాడు. వలవేయగా 153 గొప్ప చేపలు దొరికాయి. అలాగునే మన జీవిత పర్యంతము ప్రభువు చెప్పినట్లు గానే కొంత ప్రకారము కాదు అంతటి ప్రకారము చేయాలి. అలాకాక మొర్దెకై, ఎస్తేరు నాముందర పుట్టింది.- నాద్వారా పెరిగి పెద్దదై, నాద్వారానే, నాప్రయాస ద్వారానే రాణి అయ్యింది. ఈ స్థితిలోనికి ఆమె వచ్చుటకు కారణమునేనే. ఆమె మాట నేను వినాలా ? అని అనలేదు. ఆమె మాట అంతటి ప్రకారం చేశాడు. అలాగే మనమును చిన్న, పెద్ద అనికాక ఒకనికంటే ఒకడు యోగ్యుడుగా యెంచుకొనుట మంచిది.

❖ ❖ ❖

## 5వ అధ్యాయము 8+6=14వ.

**అంశము :** ఎస్తేరు రాజుకు మనవి చేయుట - హామాను మొర్దెకై పతనము కొరకు పథకము వేయుట.

**విభజన :** 1-8వ. ఎస్తేరు రాజు కొరకు విందు సిద్ధము చేయుట

9-14వ. హామాను మొర్దెకై కొరకు ఉరికొయ్య సిద్ధము చేయుట.

### 1-8వ. ఎస్తేరు రాజు కొరకు విందు సిద్ధముచేయుట :

మూడవ దినమున ఎస్తేరు రాజ భూషణములను ధరించుకొని రాజ సన్నిధికి వెళ్ళి నిలించింది. రాజు సన్నిధికి వెళ్ళాలంటే రాజ భూషణాలు ధరించుకునే వెళ్ళాలి. అహష్వేరోషుకు యిష్టమైన అభరణాలేంటో 2వ అధ్యాయంలో ఎస్తేరుకు హేగే ద్వారా తెలిసింది కనుక అవే ఆభరణాలు ధరించి వెళ్ళింది. అలాగే మన ప్రభువు సన్నిధికి వెళ్ళినప్పుడు మనము

వేసికొనవలసిన యుక్తమైన పరిశుద్ధ అలంకారములు లేక ఆభరణములు I తిమో 2:9-13 వచనంలోను, అలాగే 1 పేతు 3:1-5 వ్రాయబడి యున్నవి. వీటిని గూర్చి 2వ అధ్యాయంలో సవిస్తరముగా ధ్యానించాం.

కీర్త 110:3వ వచనంలో "యవనస్థులలో శ్రేష్ఠులు పరిశుద్ధాలంకృతులై మంచు వలె అరుణోదయ గర్భములో నుండి నీ యొద్దకు వచ్చెదరు" అని వ్రాయబడింది. ఈ వచనంలో యవనస్థులలోని శ్రేష్ఠులు పరిశుద్ధ అలంకృతులై వుంటారని తెలుస్తుంది. రక్షణతో మాత్రమే అలంకరించుకునేవారు సాధారణ యవనస్థులు. కానీ, పరిశుద్ధ అలంకారాలు ధరించిన వారే యవనుల్లో శ్రేష్ఠులని పిలువబడతారు. మరి ప్రియ సోదరీ! నీవు మామూలు సాధారణ విశ్వాసివిగా వుండటానికి యిష్టపడుతున్నావా? లేక శ్రేష్ఠమైన విశ్వాసివిగా వుండడానికి యిష్ట పడుతున్నావా ? పరిశుద్ధ ఆత్మీయ అలంకారము ఒక యవనస్థులకు మాత్రమే కాదు గానీ I దిన 16:28,29 వచనాల్లో జనముల కుటుంబాలు అందులో వున్నవారందరూ, 23వ వచనంలో సర్వజనులందరు పరిశుద్ధాలంకారములగు ఆభరణములను ధరించాలని ప్రభువు చెబుతున్నాడు. అలాకాక యెషయా 3:18-28వ॥ వరకు యూదాస్త్రీలు 21 రకములైన బాహ్య అలంకారాలను ధరించుకున్నారు. 26వ వచనంలో "ఆమె ఏమియూ లేనిదై నేల కూర్చుండును" అని వ్రాయబడింది. ఈ శరీర సంబంధమైన ఆభరణాలు ఒకరోజు లేకుండా పోతాయి. ఆత్మీయ పరిశుద్ధ అలంకారాలైతే పరలోకంలో కూడా కనబడుతాయి. యిర్మి 4:30లో పైన ఆస్త్రీలు అలంకరించుకున్న ఆభరణాలన్నీ శత్రువులు దోచుకున్నారు. కనుక ఆ స్త్రీకి "దోచుకొన బడినదానా! నీవేమి చేయుదువు ? రక్త వర్ణ వస్త్రములు కట్టుకొని, సువర్ణ భూషణములు ధరించి కాటుకచేత నీ కన్నుల పెద్దవిగా చేసుకొనుచున్నావే. నిన్ను నీవు అలంకరించు కొనుట వ్యర్థమే" అని వ్రాయబడింది. 31వ వచనంలో ఆమె నరహంతకులపాలై మూర్ఛిల్లిందని వ్రాయబడింది. రక్షణ అలంకారము లేక కేవలము లౌకిక అలంకారముతో, లేక క్షయమైన అలంకారముతో మాత్రమే బాహ్య దేహాన్ని అలంకరించుకుంటే నరహంతకుడైన సాతాను పాలు కావాల్సిందే.

పరిశుద్ధ అలంకారాల్లో లేక ఆభరణాల్లో రక్షణ ఒక్కటేకాదు. అనేక ఆత్మీయ అలంకారాలు వున్నాయి. ఉదాహరణకు స్త్రీలలో అణకువ, స్వస్థబుద్ధి, మౌనముగా వుండుట, సత్క్రియలు, విశ్వాసము, ప్రేమ, విధేయత మృదువైన గుణము, సాధువైన గుణము అనే అంతరంగ స్వభావాలు మనకు అలంకారమైన ఆభరణాలుగా వుండాలి. వీటన్నిటిలో పరిశుద్ధత లేక పవిత్రత వుండాలి. ఇవే పరిశుద్ధ ఆభరణాలు. ఇవి ప్రభువు దృష్టికి మిగుల విలువ గల ఆభరణాలు రాజ భూషణములు ధరించి ఎస్తేరు రాజు సన్నిధికి వచ్చినపుడు రాజుకు ఆమె మీద దయ పుట్టింది.

లోకంలో అలంకరణ కొరకు, అందాన్ని పెంపొందించుకొనే కొరకు ఆభరణముల్ని వాడుతారు. ఈ ఆభరణములు 2 రకములు (1) ఆత్మ సంబంధమైన (అక్షయమైన) ఆభరణములు (2) శరీర సంబంధమైన (క్షయమైపోయే) ఆభరణములు.

I. ఆత్మ సంబంధమైన అక్షయమైన ఆభరణములను గూర్చి జ్ఞాపకం చేసుకుందాం.

(1) రక్షణ అనే ఆభరణము : కీర్త 149:4

(2) అణకువ అనే ఆభరణము : I తిమో 2:9-15వచనంలో అణకువలేని స్త్రీ.
ఉదా : హాగరు ఆది 16:9

(3) స్వస్థబుద్ధి అనే ఆభరణము :- I తిమో 2:9-15వచనంలో స్వస్థబుద్ధి గల స్త్రీ.
ఉదా : అబీగయీలు I సమూ 25:3-25 వ॥లో 33వ॥

(4) సత్క్రియలు అనే ఆభరణం :- I తిమో 2:10వ॥ సత్క్రియలు చేసిన స్త్రీ.
ఉదా : దొర్కా అ.పో.కా. 9:36-43 వచనం.

(5) మౌనము అనే ఆభరణము : I తిమో 2:11; I కొరి 14:4 సంఘములో మౌనముగా వున్న స్త్రీ
ఉదా: హన్నా I సమూ 1:13; ఇంటిలో మౌనముగా వున్న స్త్రీ మార్కు 14:3-9 వచనం.

(6) విశ్వాసము అనే ఆభరణము : I తిమో 2:15; విశ్వాసమనే ఆభరణము గల స్త్రీ
ఉదా : శారా. హెబ్రీ 11:11

(7) ప్రేమ అనే ఆభరణము : I తిమో 2:15 భర్తపట్ల ప్రేమ అనే ఆభరణము గల స్త్రీ
ఉదా : మీకాలు I సమూ 18:21; అబీగయీలు I సమూ. 25:40-42
(బి) పిల్లలపట్ల ప్రేమ అనే ఆభరణము గల స్త్రీలు - లూకా 18:15; I రాజు 4:23-27వ॥

(8) పరిశుద్ధత అను ఆభరణము I తిమో 2:15, పరిశుద్ధత అను ఆభరణము లేని స్త్రీ. సామె 7:18

(9) లోబడుట అనే ఆభరణము : I పేతు 3:16 లోబడే స్త్రీ
ఉదా : శారా I పేతు 3:6

(10) సాధువైన, మృదువైన గుణమనే ఆభరణము : I పేతు 3:4 సాధువైన గుణము గల వాడు యేసు ప్రభువు. అలాగే హన్నా I సమూ 1:15

ప్రియసోదరీ! పైన చెప్పబడిన పరిశుద్ధ రాజభూషణములను నీవు ధరించుట వలన నీకు కలిగే సౌందర్యాన్ని చూడాలనే క్కీర 45:11 వచనంలో ఈ రాజు నీ సౌందర్యమును కోరుచున్నాడని వాక్యము వ్రాయబడింది. ఎందుకనగా కీర్త 45: 2వ॥లో వున్నట్లు ఆయన నరులలో అతి సుందరుడు. అతి సుందరుడైన ప్రభువు తన సంఘం యొక్క సౌందర్యాన్ని చూడగోరుతున్నాడు. ఈ సౌందర్యంతో సంఘవధువు రెండవ రాకడలో ప్రభువును సంధించాలి. అప్పుడు యెష 62:5లో వున్నట్లు పెండ్లి కుమారుడైన ప్రభువు పెండ్లి కుమార్తెను చూచి సంతోషిస్తాడు. ఈ లోకంలో వున్నపుడు కూడా నీవు ప్రార్థనా గదిలో ప్రవేశించినపుడు ప్రభువు దయను పొందాలంటే పైన పేర్కొనిన పరిశుద్ధ అలంకారాన్ని కలిగి వుండాలి. కీర్త 73:1లో ఇశ్రాయేలీయుల యెడల శుద్ధ హృదయుల యెడల ఆయన దయాళుడై వున్నాడు. ఆయన సన్నిధికి వచ్చిన మనలో ప్రభువు శుద్ధ హృదయము చూడగోరుతున్నాడు. అట్టి వారిమీద ప్రభువు దయను చూపువాడుగా వున్నాడు. మరియ తన యవ్వన కన్యక జీవితాన్ని పరిశుద్ధముగా వుంచుకొనిన కారణమున గబ్రియేలు దూత ద్వారా " దయా ప్రాప్తురాలా !నీకు శుభము అని పిలువబడింది. శుద్ధ హృదయంతో వున్న ' మరియ ' యెడల ప్రభువు దయచూపించి, యేసుక్రీస్తును లోకానికి రక్షకుడుగా అందించేందుకు ఆమెను వాడుకున్నాడు. అలాగున యవ్వన స్త్రీ లారా ! ప్రభువు నీమీద దయచూపాలంటే నీ జీవితం పరిశుద్ధంగా వున్నదా? నీమాట, చూపు, నడత, ప్రవర్తన, వినికిడి, అంతటిలో ఆయన చూడదగిన పవిత్రత లేనిచో ప్రభువును కోరినట్లయితే ఆయన నీకు అనుగ్రహిస్తాడు. హృదయ శుద్ధి గల వారు ధన్యులు వారు దేవుని చూచెదరు అని వాక్యంలో వ్రాయబడింది. అపవిత్ర హృదయాలతో దేవుని చూడలేము. పరలోకం వెళ్ళలేము. కానీ, తన రక్తములో శుద్ధీకరించే ప్రభువుకు నీపాపాలు ఒప్పుకొని కడుగబడు. యేసురక్తం ప్రతిపాపమునుండి నిన్ను కడిగి నిన్ను పరిశుద్ధురాలిగా చేస్తుంది. అప్పుడు నీవు దేవునిదయ యందును, మానవుల దయందును వర్ధిల్లిన యేసు ప్రభువువలెను, ఎస్తేరువలెను, సమూయేలువలెను వుండగలవు. ఆలాగున ఎస్తేరు రాజు దయను పొందింది. రాజు ఎస్తేరు 5:3వచనంలో " రాణియైన ఎస్తేరూ ! నీకేమి కావలెను? నీ మనవి ఏమిటి ? రాజ్యములో సగము మట్టుకు నీకనుగ్రహించెదను", అన్నాడు. రాజు ఎస్తేరు విషయంలో తనకు కలిగిన దయ ఫలితంగా తన రాజ్యములో సగము అంటే 127 సంస్థానాల్లో 63 సంస్థానములు ఎస్తేరుకు యిస్తాననడం ఎంతో ఆశ్చర్యకరమైన విషయం, ఎవరైనా, మొదట మనవి విని ఆ తరువాత జవాబు ప్రకటిస్తారు. ఎస్తేరు రాజుతో తన కోరికను లేక మనవిని చెప్పకముందే రాజు తన జవాబు ప్రకటించాడు. వారు వేడు కొనక మునుపే నేను వారికిచ్చెదనని యెషయా 65:24వ॥లో సెలవిచ్చిన మన ప్రభువు అహష్వేరోషు రాజు కంటే ఎంత గొప్పవాడో కదా ! ఆలాగున యూదులు, ఎస్తేరు, చెలికత్తెలు ప్రార్థించు చుండగా సామి 21:1వ॥లో వున్నట్లు

రాజు హృదయము యెహోవా చేతిలో నీటి కాలువవలె వుండింది. ఆయన తన చిత్తవృత్తి చొప్పున రాజును ఎస్తేరు వైపు త్రిప్పి వేశాడు. ఉదార కానుక ఇస్తాననన్నాడు. అలా ప్రార్థనలో ప్రభువు చేతిలో మనం పెట్టే ప్రతీ వ్యక్తిని ప్రభువు మనవైపుకు త్రిప్పుతాడు. ఈ రాజు త్రాగుబోతైనా, కఠినమైన ఆజ్ఞలు కలిగిన రాజైనా, పారశీక రాజైనా, దేవుని బిడ్డయైన ఎస్తేరువైపు దేవుడే ఆరాజును త్రిప్పాడు. ప్రియసోదరీ ! దేవుని వైపు తిరుగకుండా వున్నవారు నీయింటిలో నీ బంధువులలో, నీ మందిరంలో, నీ ఉద్యోగంలో, నీవు నివసించే చోటు ఎందరు వున్నారో వారందరిని ప్రార్థనలో ప్రభువు చేతి కప్పగించు. వారందరినీ, ప్రభువు తన వద్దకు వారిని మళ్ళించుకునే దేవుడై యున్నాడు. రాజ్యములో సగము మట్టుకు యిస్తానని రాజు ఎస్తేరుతో చెప్పగా ఎస్తేరు "రాజునకు యుక్తముగా తోచినయెడల నేను రాజు కొరకు సిద్ధపరచిన విందుకు రాజవైన తామును హామానును నేడు రావలెనని కోరుచున్నానని " రాజుతో చెప్పినట్లు చూస్తున్నాం. ఆమె నిజమైన కోరిక రాజ్యములో సగముకాదు గానీ, తన ప్రజల రక్షణ మాత్రమే ఆమె కోరింది. తన అసలు కోరిక బయటపెట్టక ముందు రాజుకు ఒకటికి రెండుమార్లు రెట్టింపు విందులతో సంతోషముతో కలుగచేసి, ఆసంతోషములో రాజు వున్నప్పుడు అసలు విన్నపం లేక కోరిక చెప్పాలనుకుంది. విందు సంతోషానికి గుర్తు. రాజుకేమి, కూలివానికేమీ ఎవ్వరికైనా విందు అంటే సంతోషమే. కనుక రాజు, హామాను, త్వరగా విందుకొచ్చారని 6వ వచనంలో చదువుతాం. విందుకు వచ్చిన రాజు ఎస్తేరూ! నీ కోరికేమిటి ? నీమనవి ఏమిటి? రాజ్యములో సగము మట్టుకైనా ఇస్తానని చెప్పాడు. కానీ ఎస్తేరు ఈ రోజు విందుకు వచ్చినట్టు రేపు కూడా విందుకు రమ్మని రాజుతో చెప్పి ఇదే నా మనవియు నాకోరిక అని చెప్పింది.

ప్రియ సోదరీలారా ! ఇక్కడ ఎస్తేరు రాజుకు తన మనవిని తెలియచేసి రాజు జవాబు పొందకముందు తానే రాజుకు ఒకటికి రెండు మారులు సంతోషానికి సూచనగావున్న విందులను రెట్టింపుసార్లు చేసింది. దీనిలో మనకు పాఠముంది ప్రభువును మనమడిగే మనవులు అడుగక ముందు ఆయనను మన జీవితంలో సంతోషపరుస్తున్నామా ? లూకా3:21,22వలో ప్రజలందరూ బాప్తీస్మము పొందినపుడు యేసుకూడా బాప్తీస్మము పొంది ప్రార్థన చేయుచుండగా, తండ్రియైన దేవుడు " నీవు నా ప్రియ కుమారుడవు. నీయందు నేనానందించుచున్నాను." అని చెప్పినట్లు చదువుచున్నాము. బాప్తీస్మము తీసుకొని కుమారుడు తండ్రి నానందింప చేస్తున్నాడు. ప్రతి విషయంలో తండ్రి ఆజ్ఞలను, తండ్రి చిత్తాన్ని భూమి మీద నెరవేర్చుటను బట్టి తండ్రికి ఆనందం కలిగించాడు. అందును బట్టే తండ్రి పరిశుద్ధాత్మను పావురపు ఆకారము వలె ఆయన మీదికి పంపినట్లు చూస్తున్నాము. అలాగే మనమును తండ్రిని ఆనంద పరచే జీవితాన్ని కలిగివుంటే ఆయనకు ఆనందం కలిగించే కుమారులు, కుమార్తెలు అవుతాం. అప్పుడు మనమడిగిన వన్నీ

మొదటి రోజు విందుకు రాకముందు విందుకు వచ్చిన తరువాత రెండవరోజు విందులో ఎస్తేరుకు ఏమి కావాలో దానిని గురించి రాజు వేసిన ప్రశ్నలను గురించి కొంత ఆలోచన చేద్దాం. విందుకు ముందు రాజు ఎస్తేరు 5:3వలో నీ మనవి ఏమిటి ? అన్నాడు తనకు కావలసిన వాటి కొరకై రాజునొద్ద మనవి చేయటానికి ఆమె రాలేదు. వ్యక్తిగతంగా తనకు అవసరమైనది ఏమీ లేకుండా దేవుడామెను ఉచ్ఛస్థితిలో వుంచాడు. యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు అనే అనుభవంలో దేవుడామెను వుంచాడు అటువంటి క్షేమస్థితిలో నిర్విచారముగా, నిశ్చితంగా, నిద్రపోతుగా, త్రాగుబోతుగా సోమరిగా ఆమె వుండలేదు. యిప్పుడు తాను చేసే మనవి తన కొరకుకాదు. తాను క్షేమమే, కాని తన జనులైన యూదుల క్షేమమే తనకు కావాల్సివుంది. ప్రియసోదరీ ! ఈనాడు నీవు క్షేమమే కానీ నీస్వంత బంధువులు, ప్రియులు, నీతోటివారు, నీ ప్రాంతం వారు నీదేశీయుల ఆత్మ రక్షణ విషయంలో క్షేమము లేక వున్నారు. వారికి రక్షణ కావాలని నీ పరమ రాజును అడుగుచున్నావా?

ఆనాడు ఎస్తేరుకు కావాల్సింది తన ప్రజల రక్షణే. విమోచనే ఎస్తేరు 5:6వ॥ లో నీకోరిక యేమిటి ? అన్నాడు రాజు. ఆమె తన జనుల రక్షణ కోరింది. ప్రియసోదరీ! నిన్ను ఈరోజు ప్రభువు నీకోరిక యేమిటి ? అని నిన్నడిగితే; నీ జవాబు ఏమిటి? కొద్దిమంది భక్తులు లౌకికమైనవి అడక్కుండా తమ దేవుని ప్రజల నిమిత్తమైన కోరికలు అడిగారు. ఉదా: సొలొమోనుకు దేవుడు గిబియోనులో ప్రత్యక్ష్యమైనపుడు నేను దేనినిచ్చుట నీ కిష్టమో దానిని అడుగుమని అతనితో సెలవిచ్చినపుడు I రాజు 3:9లో ఇంత గొప్పదైన నీ జనమునకు న్యాయము తీర్చగలవాడెవ్వడు ? కాబట్టి నేను మంచి చెడ్డలు వివేచించి నీ జనులకు న్యాయము తీర్చునట్లు నీ దాసుడనైన నాకు వివేకము గల హృదయము దయ చేయుము అన్నాడు. ఇక్కడ సొలొమోను దేవుడు నాకిష్టమైనది అడగమన్నాడుకదా అని దీర్ఘాయువునైనను; ఐశ్వర్యమునైనను, తన శత్రువుల ప్రాణమైనను అడుగకుండ దేవుని ప్రజలకు న్యాయం తీర్చడానికి వివేకము నిమ్మని అడిగాడు. ప్రియ సోదరీలారా !మీకేం కావాలో కోరుకోండి అని ప్రభువు అంటే మనమేమి కోరుతామో, ఏమి కోరమో అన్న ఆయన చూస్తుంటాడు. సొలోమోను తన స్వంతానికి కోరనివన్నీ కూడా ప్రభువు యిచ్చాడు. మన ఆత్మీయ, శారీరక కొరతలన్నీ ప్రభువు తీర్చువారై వున్నారు. కానీ మొదట ఆయన రాజ్యాన్ని, ఆయన నీతిని మొదట వెదికితే మనకేమి కావలో అవన్నీ ఆయన మనకు అను గ్రహిస్తారు. అలాగు ప్రభువు ఎస్తేరు విషయంలో తన జనులను హామాను పుట్టించిన మరణ శాశనము నుండి రక్షించుట మాత్రమే కాక అనేక విషయాలలో జవాబు పొందింది.

సామె 11:23వచనంలో నీతిమంతుల కోరిక వుత్తమమైనది అన్న మాట ప్రకారం నీతిమంతులైన సొలొమోను, ఎస్తేరు వుత్తమమైనవే దేవుని యొద్ద నుండి కోరుకున్నారు. ఈ

ఉత్తమమైనదే మార్త సహోదరియైన మరియ యొద్ద నుండి తీసి వేయబడదని ప్రభువు చెప్పినట్లు వారి యొద్ద నుండి ఉత్తమమైనవి తీసివేయబడవు. అటువంటి కోరికలు నెరవేర్చబడుతాయి. కనుక మనమునూ ఉత్తమమైన కోరికలే కోరుదాము. కీర్త 20:4 వచనంలో వున్నట్లు ప్రభువు మన కోరికను సిద్ధింప చేయువాడు కనుక ఉత్తమ కోరికల కొరకై ప్రభువునొద్ద మనవి చేద్దాం. నీతిమంతుని కోరిక ఉత్తమమైనది అంటే, ఉత్తమము కానివి కోరేవారు కూడ వున్నారు. ఉదా : గేహాజీ దేవుని సేవకుడైవుండియూ, తన గురువైన ఎలీషా తీసికొననివాటికై పరిగెత్తి వెళ్ళి, కుష్ఠురోగాన్ని తెచ్చుకున్నాడు. గేహాజీ కోరుకున్నవి ఈనాడుమనకు అవసరము కాదా ? అని మనమనకోవచ్చు. అవి అవరమే. కానీ వాటికంటే అత్యవసరమైనది ఆత్మీయ ఆశీర్వాదాలు. వాటిమీద మనము లక్ష్యముంచి కోరినట్లయితే సొలొమోనువలె మనము అడగని దీవెనలు, కోరికలు కూడా ప్రభువు మనకిస్తారు. చాలామంది ధనము కోరేవారున్నారు. సామె 11:28వలో ధనమును నమ్ముకొనువాడు పాడైపోవును. నీతిమంతుడు (అనగా ఉత్తమైన వాటిని కోరుకునువాడు) చిగురాకు వలె వృద్ధినొందును అని వ్రాయబడింది. కొందరు ఆస్థిని కోరేవారుగా ఉన్నారు. సామె 11:4 ఉగ్రత దినమందు ఆస్తి అక్కరకు రాదు అని వ్రాయబడింది. అయినా ఈ ధనము, ఆస్తిపాస్థులు ఈలోకంలో విడిచి పెట్టబడేవే. కాని ఆత్మల రక్షణలాంటి ఉత్తమైన కోరికలు పరలోకం మట్టుకు మనతో కూడా వస్తాయి. కనుక అలాంటి కోరికలనే మనము యికముందుకూ కోరుకుందాం.

మొత్తానికి ఎస్తేరు తన జనుల రక్షణ కొరకై రాజునొద్ద విచారణ చేసినట్లు మనమును ఒక్కజాతి వారి కొరకు మాత్రమే కాక, I తిమో 2:2 వున్నట్లు మనషులందరి కొఱకు రాజుల కొఱకు, అధికారుల కొరకును, విజ్ఞాపనములును, ప్రార్థనలను, కృతజ్ఞతాస్తుతులను, చేయవలసిన వారముగా వున్నాము. పండిత రామాబాయి ప్రతిరోజూ 3 వేల మంది కొఱకు విజ్ఞాపన చేస్తుందట. ఎంతమంచి మాదిరో కదా! ఈభాగంలో రాజు ఎస్తేరుకు రాజ్యములో సగము మట్టుకైననూ యిస్తానన్నాడు. కీర్త 2:7 వచనంలో మన ప్రభువు సగము మాత్రమే కాక "జనులను నీకు స్వాస్థ్యముగాను, భూమిని దిగంతముల వరకు నీకు సొత్తుగాను యిచ్చెదను" అని ప్రభువు అన్నారు. లూకా 15:31 వచనంలో " నా వన్నియూ నీవి " అన్నాడు. మన ప్రభువు అహష్వేరోషు రాజుకంటే గొప్పగా యిచ్చువాడు – ఎస్తేరు యిచ్చిన విందులో హామాను సంతోషించారు. రేపటి విందుకు కూడా తాను ఆహ్వానించబడినందున మనోల్లాసము కలవాడై బయలు వెళ్ళాడని 9వ వచనంలో చదువుతాం. లౌకికుడైన హామాను సంతోషము, వుల్లాసము దేనిని బట్టి ? అంటే, విందును బట్టియే. విందులు, వినోదాలు, ఫంక్షన్స్ పండుగలు, పెండ్లిండ్లు, పార్టీలు, బట్టలు, బంధువులు వీటివల్ల వచ్చే సంతోషము క్షణమాత్రమే. ఈ వుల్లాసాలు కొద్ది గంటలే కానీ దావీదు అ.పో. 2:28 వ॥లో ప్రభువు తన దర్శనాన్ని అనుగ్రహించుటయే తనకు

వుల్లాసమమని చెబుతున్నాడు. నేడు ఈ విధముగా వుల్లాసాన్ని కోరుకునే విశ్వాసులున్నారా? లౌకికమైన వుల్లాసాలనే కోరుకుంటున్నారా ? ప్రభువు దర్శనమంటే చాలామంది ప్రభువు, కలలో కనబడాలనీ, ప్రభువు గోడమీద గానీ, ఇసుకమీదగానీ, నేలమీదగానీ ఏమో వ్రాయలని, ప్రభువు తన స్వరము వినిపించాలనీ, ప్రభువు వెలుగు సౌలుకు కనిపించినట్లు కనిపించాలనీ కోరుకుంటారు. పూర్వకాలంలో అలాకొద్ది మంది విషయంలో జరిగింది. కానీ అపోస్తలుడైన పేతురు తన మొదటి పత్రికలో 1:17వచనంలో పరిశుద్ధ పర్వతము మీద ప్రభువుతో కూడ వుండి దేవుని వలన ఘనతయు, మహిమయు ఆయన పొందగా చూచి, ఈయనే నాప్రియ కుమారుడు, ఈయన యందు నేను ఆనందించుచున్నాను. అనే శబ్దము విన్నాడు. కానీ 19వ వచనంలో యింతకంటే స్థిరమైన ప్రవచన వాక్యము మనకున్నది, దానియందు లక్ష్యముంచిన యెడల మీకు మేలు అని అన్నాడు. కనుక వాక్యం ద్వారానే తన దర్శనమును ప్రభువు మనకు అనుగ్రహించు చున్నాడని అర్థమౌతుంది. ఈ వాక్యదర్శనమే మనకు వుల్లాసాన్ని కలిగిస్తుంది.

హామానైతే, ఎస్తేరు రాణి యిచ్చే విందునిమిత్తమై వుల్లాసంగా వున్నాడు. కానీ ఎస్తే 4:4 వచనంలో రాణి మహా విచారము కలదై వున్నట్టు చూస్తున్నాం. మొర్దెకై గోనె పట్ట తీసివేయమని ఆజ్ఞాపించి, కట్టించుకొనుటకై బట్టలు పంపించింది. కానీ అతడు వాటిని కట్టుకొనలేదు. తన అన్న గోనెపట్ట కట్టుకొని వుంటే చెల్లెలైన ఎస్తేరుకు మనోవిచారం కలిగింది. ప్రియ సోదరీ ! ఈనాడు ఎంతమంది నీఅన్నలు, నీతమ్ముళ్ళు రక్షణ వస్త్రములు ప్రశస్తవస్త్రములు లేక పెండ్లి వస్త్రము లేక వున్నారో వారందరిమీద నీవు మనోవిచారం కలిగి వున్నావా ? రాణి మనోవిచారంతోనే 5వ అధ్యాయంలో రాజుతో మనవి చేయుటానికి వచ్చింది. మనదుః ఖములలోనే, మన బాధలలోనే, మన కష్టాల్లోనే ప్రార్థనకు రావాలి. ఉదా : షూనే మీయురాలు తన కుమారుడు చనిపోయివుండగా అతనిని ఎలీషా గదిలో వుంచి తాను కర్మెలు పర్వతము మీద ఉన్న ఎలీషా యొద్దకు యించుమించు 30 మైళ్ళ దూరము ప్రయాణం చేసివెళ్ళింది. ఆమె భర్త ఈనాడు అమావాస్య కాదు. విశ్రాంతి దినము కాదు ప్రవక్త యొద్దకు ఎందుకు వెళ్ళుచున్నావనగా ' నేను వెళ్ళుట మంచిది ' అని చెప్పింది. (II రాజు 4:23) అలాగే దావీదు బత్షెబ ద్వారా పుట్టిన కుమారుడు జబ్బుతో వున్నపుడు ప్రార్థించాడు. ఆ కుమారుడు చనిపోయినపుడు మందిరానికి వెళ్ళి ప్రార్థించి వచ్చాడు. I సమూ 12:17,20 వచనంలో హన్నా బహు దుఃఖముతోనే షిలోహులోని మందిరానికి వచ్చి ప్రార్థించింది.(I సమూ 1:10) జవాబును పొందింది.

## 9-14వ హామాను మొర్దెకై కొరకు వురికొయ్య సిద్ధము చేయుట :

హామాను మనోల్లాసము గలవాడై తన యింటికి వెళ్ళాడు. మనోవిచారము గలదై ఎస్తేరు రాజునొద్దకు వచ్చింది. ఎస్తేరుకు, షూషను కోటలో వున్న యూదులకు, అన్ని

సంస్థానములలోని యూదలందరికీ మనోవిచారం కలిగించిన హామాను మాత్రం మనోల్లాసముతో వున్నాడు. యోహా 16:2వ వచనంలో మీరు ఏడ్చి ప్రలాపింతురు గానీ, లోకము సంతోషించును. మీరు దుఃఖింతురు గానీ మీ దుఃఖము సంతోషమగునని ప్రభువు చెప్పాడు. ఎస్తేరు 4:2,3 వచనాలలో దుఃఖిస్తున్న యూదులు ఎస్తేరు 18:15 వచనంలో సంతోషిస్తున్నారు. 5:9 వచనంలో హామాను, అదే వచనముగింపులో బహుగా కోపించు చున్నాడు. మొర్దెకై, తనను చూచి వంగి నమస్కారము చేయలేదని కోపాన్ని అణచుకొని ఇంటికి వెళ్ళి తన భార్యను స్నేహితులను పిలిపించి తనకు కలిగిన ఐశ్వర్యమును గూర్చియు చాలామంది పిల్లలు తనకుందుటను బట్టియూ, రాజు తనను ఘనపరచి, అధిపతుల మీద, సేవకులమీద తనను ఏలాగు పెద్దగా చేశాడో దానిని గురించియూ వారితో మాట్లాడాడు. రాజు తనను ఘనపరచడానికి రెండు కారణాలు ఇక్కడ చెబుతున్నాడు. 1. తన ఐశ్వర్యము 2. తనకు చాలా మంది పిల్లలుండుట. ఒకవేళ రాజు ఐశ్వర్యాన్ని చాలామంది పిల్లలున్నారని హామానును ఘనపరచి వున్నత పదవి నిచ్చాడేమో గానీ, ప్రభువు మనల్ని దీవించి గొప్ప స్థితికి తీసుకొచ్చాడంటే దానికి కారణం మన ఐశ్వర్యం కాదు. మన పిల్లలు కాదు, మన అందం, ఆస్థిపాస్థులు కానేకావు. ఆయనే ఒకరిని హెచ్చించును. ఆయనే ఒకరిని తగ్గించును. ఆయన చేట, ఆయన చేతిలో వుంది. ఎస్తేరుకు ఏ ఐశ్వర్యముందని దేవుడామెను రాణిగా చేశాడు? మొర్దెకైకి ఎంతమంది పిల్లలున్నారని దేవుడాయనను హామాను స్థానానికి హెచ్చించాడు ? అదంతా ప్రభువు కృపయే పౌలు నేనేమై యున్నానో అదంతా ప్రభువు కృపయే అన్నాడు. హామాను తన స్నేహితులతో, భార్యతో తన ఐశ్వర్యాని గూర్చి తన పిల్లలను గూర్చి మాట్లాడుచున్నాడు. మన మాటల్లో మన గొప్పతనాన్ని గూర్చి, ఆస్థిపాస్థులను గూర్చి మన పిల్లలు,వారి ఆస్థి, చదువు, అంతస్థును గూర్చి. ఇహలోకాన్ని గూర్చి గొప్పలు చెప్పుకోడం కాదు. జ్ఞానం కలిగి నోరు తెరవాలి. మన మాటల్లో కృప వుండాలి. ఉప్పు వేసినట్టు కృపా సహితంగా వుండాలి. మనమాటల్లో రుచినిచ్చే ఉప్పులాంటి యేసు ప్రభువును గూర్చిన మాటలుండాలి. లూకా మొదటి అధ్యాయములో ఎలిజబెత్, మరియు, ఇద్దరూ కలిసినపుడు ఆత్మతో నింపబడి ఆత్మీయ సంగతులు మాట్లాడుకున్నారు. మరియు సర్వశక్తుడు నా కొఱకు గొప్ప కార్యములు చేసియున్నాడని, సర్వశక్తుడైన దేవుని గురించి మాట్లాడింది. సోదరీ! నీ మాటలెలావున్నాయి ? నీ గొప్ప, నీయిల్లు, నీ సామాను, నీమొక్కలు, నీవంటలు, నీ సొమ్ములు, నీ బంధువులు, నీ బట్టలు, నీడబ్బు, నీ ఐశ్వర్యము వీటిని గురించే, నీ స్నేహితులతో మాట్లాడుచున్నావా ? చాలామంది స్త్రీలకు తమకెంత బంగారమున్నదో, ఎన్ని చీరలున్నాయో, ఎంత ఆస్థి వున్నదో, తమ బంధువులు ఎన్ని గొప్ప పదవుల్లో వున్నారో, తమ పలుకుబడి ఎంతగొప్పదో, వీటన్నింటిని గూర్చి యితరులకు చెప్పుకోడం, చాలాయిష్టం అంతెందుకు ?

బబులోను రాజు దూతలకు చూపించాడు. తన యింటియందేమి, రాజనగరునందేమి కలిగిన సమస్త వస్తువులలో దేనిని మరుగు చేయక యింటనున్న తన పదార్థములుగల కొట్టును, వెండి గంధవర్గములను, పరిమళ తైలములను, ఆయుధశాలను, సమస్తమును వారికి, చూపించాడు. చూపించిన వాటన్నింటిని గూర్చి వారితో మాట్లాడు వుంటాడు. వచ్చు దినములలో ఏమియూ లేకుండా నీ నగరునందలి సమస్తమును నేటివరకు నీ పితరుడు సమకూర్చి దాచిపెట్టిన దంతయును బబులోను పట్టణమునకు ఎత్తికొనిపోబడునని యెహోవా సెలవిచ్చాడు. (II రాజు 20:12–18) మనం చెప్పుకున్న గొప్ప వాటిని దేవుడు యిచ్చినట్టే యిచ్చి యోబులాగ తీసివేసినట్లయిన అప్పుడేమి చేయగలం ? వాటిని గూర్చి కాదు మనం సంభాషించాల్సింది. కీర్త 105:2 వచనంలో వున్నట్లు ఆయన ఆశ్చర్యకార్యము లన్నిటిని గూర్చి సంభాషణ చేయాలి.

హామాను కూడా తన ఐశ్వర్యాన్ని, చాలామంది పిల్లల్ని, పదవుల్ని, ఘనతను, పెద్దరికాన్ని అంతటిని త్వరితంగానే కోల్పోయాడు. దేని గురించి అతిశయంగా డంబముగా చెప్పుకుంటామో వాటిని దేవుడు దూరంగా చేస్తాడని తెలుస్తుంది. ప్రభువు కృప వలన వీటిని పొందామని ప్రభువును స్తుతిస్తే బాగుంటుంది. హామాను తన ఐశ్వర్యాన్ని బట్టి పిల్లలను బట్టి, ఘనత పెద్దరికాన్ని బట్టి, అతిశయపడ్డాడు. ఇవన్నీ ఈ రోజుండి రేపు రెక్కలు కట్టుకొని వెళ్ళిపోయేవే. దృశ్యమైనవి అనిత్యములు అదృశ్యమైనవే నిత్యములు. యిర్మి 9:2 లో "జ్ఞాని తన జ్ఞానమును బట్టియు, శూరుడు తన శౌర్యమును బట్టియూ అతిశయింపకూడదు. ఐశ్వర్యవంతుడు తన ఐశ్వర్యమును బట్టియూ అతిశయింపకూడదు. అతిశయించువాడు దేనిని బట్టి అతిశయించవలెననగా భూమి మీద కృప చూపుచూ నీతి న్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనే అని గ్రహించినన్ను పరిశీలనగా తెలిసి కొనుటను బట్టియే అతిశయించవలెను" అని వ్రాయబడి వున్నది. మన ఐశ్వర్యం మన ప్రభువే. అమహిమైశ్వర్యమైన ప్రభువును గురించి మాత్రమే యితరులతో మాట్లాడాలి. కొరింథీ సంఘస్థుల ఐశ్వర్యమేటంటే I కొరి 1:16వ॥లో వారు ప్రతి విషయములోనూ అనగా సమస్త ఉపదేశములోను, అనగా సమస్త ఉపదేశమందును, సమస్తజ్ఞానములోనూ ఐశ్వర్యవంతులయ్యారు. కొరింథీ సంఘస్థులు ఏ అంశము మీద ఉపదేశము చేయమన్నా చక్కగా ఉపదేశమివ్వగలరట. అది వారి ఐశ్వర్యము ప్రియసోదరీ ! నీవు యిట్టి ఐశ్వర్యము కలిగివున్నావా? సామె 8:18 ప్రకారము ఐశ్వర్యము ధనము ఘనతలు నాయొద్దవున్నవని ప్రభువు చెప్పుచుండగా హామాను తనకు ఐశ్వర్యము కలిగిందని అదేదో అదృష్టము తనను వరించిందని అన్యులు చెప్పినట్ల చెబుతున్నాడు. సామె 10:22 ప్రకారం ఐశ్వర్యము యెహోవా ఆశీర్వాద ఫలితమే అని వ్రాయబడింది. చాలామంది పిల్లలు తనకుండుటను బట్టి రాజు తనను పెద్దగా చేశాడని హామాను భావము. పిల్లల నిచ్చేదెవరు? కీర్త 127:3 వచనం ప్రకారం కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము. గర్భఫలము

ఆయన యిచ్చు బహుమానమే. హామానుకున్న ఘనత పెద్దరికము హామానుకు ఎవరిచ్చారు ? యెష 1:2 వచనంలో నేను పిల్లలను పెంచి వారిని గొప్పవారినిగా చేసితిని అని ప్రభువు అన్నాడు. కనుక దేవుడే హామానుకు ఐశ్వర్యము, కుమారులు, పెద్దరికమునిచ్చియుండగా హామాను అవన్నీ అవంతటికవే తనకు కలిగియున్నట్లు భావించాడు. ఈరోజు తనకు కలిగిన వన్నీ రేపే తనకు లేకుండా పోయాయి.

హామానునకు 10మంది పిల్లలున్నారని ఎస్తేరు 9:7లో గమనిస్తాము. ఈ పిల్లలే రాజు తనను హెచ్చించడానికి కారణమని హామాను అనుకున్నాడు. ఆ పిల్లలు ఎలాంటి వారో వారిపేర్ల అర్థాలే చెబుతాయి. చదువుదాం.

1. పర్షందాతా : శాశనము మీరినవాడు
2. దల్ఫోను : ఏడ్చువాడు గర్విష్ఠుడు
3. అస్పాతా : గుర్రము ఇచ్చిన వాడు
4. పోరాతా : ఫల భరితమైనది.
5. అతల్యా : యూదులను చంపినవాని కుమారుడు.
6. అరీదాత : శాశన సంబంధమైన పోరాటము.
7. పర్మస్తా : సమ్మకస్తుడు
8. అరీసై : ధ్వజముల యందలి సింహము
9. అరీదై : సింహముచాలును.
10. వైజాత : వారిని ప్రోక్షించెను.

వీరిపేర్ల అర్థాలను బట్టి ఒక్కడు తప్ప మిగతవారిలో సింహాల్లాంటి వారు, ఏడ్చువారు గర్విష్టులు, శాశనములు మీరినవారూ వున్నారు. ఇలాంటి పిల్లలు వందమంది వున్నా ప్రయోజనమేమి ? కడవడైననేమి ఖరముపాలు? గంగ గోవుపాలు గరిటెడైనను చాలు అని అన్నట్లు వీరిలో ఒకరైననూ తండ్రిని సంతోష పరచినట్లుగా చూడలేము. ఒక్కడైనా పరలోకపు తండ్రికి ప్రీతిపాత్రులుగా ఉండలేకపోయారు. హామాను ఇట్టి నిష్ప్రయోజక పిల్లలను గూర్చి అతిశయే పడుతున్నాడు. వీరందరూ ఒకే రోజే 9వ అధ్యాయంలో చనిపోయారు. ఆ తరువాత ఉరితీయింపబడ్డారు కూడా. ఈలాంటి (పనికి మాలిన) పిల్లలు పదిమంది తనకు వుండడం బట్టే రాజుతనను ప్రధానమంత్రిగా చేయడానికి కారణం అనుకున్నాడు హామాను. హామాను ఎంత వెర్రి తలంపును కలిగివున్నాడో కదా! తూర్పు నుండియైననూ, పడమటి నుండి యైననూ హెచ్చింపు కలుగదు. ఆయనే ఒకని తగ్గించును. ఆయనే ఒకని హెచ్చించును అని కీర్తన 75:7 వచనంలో చదువుతున్నాము. ఆయన లేకుండా మనకేమియూ కలుగలేదు.

కలిగియున్నదేదియూ ఆయన లేకుండా కలుగలేదు. కాని కారణం లేకుండానే పాపులమైన మనల్ని రక్షణ ఆశీర్వాదం మొదలుకొని సకలాశీర్వాదములు, హెచ్చింపులు మనకిచ్చి, పరలోకంలోని తన సింహాసనము మట్టుకు కూడా ప్రభువు మనల్ని హెచ్చించాడు. అందుకై ప్రభువుకు కోట్లాది స్తుతులు చెల్లించినా మనమాయనకు ఋణస్తులమే.

12వచనంలో హామాను రాణియైన ను ఎస్తేరు తాను చేయించిన విందుకు రాజును, నన్ను తప్ప మరి ఎవ్వరినీ పిలిపించలేదు. రేపటి దినమున కూడా రాజుతో కలసి విందునకు రమ్మని నాకు సెలవైనదని తన భార్య, స్నేహితులతో చెప్పాడు. అంతా తనను గురించే అతిశయముగా చెప్పుకుంటున్నాడు. గూర్చిన మాటలు దావీదు నిత్యము ఆయన కీర్తి నా నోటనుండును అన్నాడు. నిత్యము ప్రభువును గురించి ప్రభువు నీతిని గురించి ఆయన ప్రభావమును గురించి చెబుతున్నామా? (కీర్తన 71:8). హామానుకు తాను అతిశయపడేందుకు జీవితంలో ఇవన్నీ వుండినా ఈ యూదుడైన మొర్దెకై రాజుగుమ్మము నొద్దకూర్చునివుండుట నేను చూచునంత కాలము ఈ పదవి వలన నాకు ప్రయోజనమేమి లేదంటున్నాడు. తన పదవికి ప్రయోజనంగా రాజు జీతములు, దాసదాసీలు యిచ్చివుంటాడు. అంతకంటే ఏమి కావాలి ? ఈనాడు కూడా చాలామంది ఉద్యోగులు, పెద్ద పెద్ద అధికారులు కూడ ప్రభుత్వంలోనూ, ప్రైవేటు రంగములోను, పెద్ద పెద్ద జీతాలు తీసుకొంటున్నారు. జీతాలు వారికి ప్రయోజనం కాదా ? కొద్దిమందికి ఉద్యోగం చేసినంతకాలం మంచి యిండ్లు (క్వార్టర్స్) కూడా ప్రభుత్వం యిస్తోంది. పలుకుబడి కూడా ఉద్యోగస్థులకు వుంటుంది. ఇన్ని ప్రయోజనాలున్నా హామానుకు ప్రయోజనం లేదని చెబుతున్నాడు. కారణం, అందరూ నమస్కారం పెడుతున్నారు. మొర్దెకై ఒక్కడు నమస్కారం పెట్టకపోతే తన పదవి వలన ప్రయోజనమే లేదంటున్నాడు హామాను. అలాగే ఈ దినాల్లో దేవుడు మనకు ఎన్నోమేలులు చేసినా, ఎదో ఒక్కటి తక్కువైతే దేవుడు ఆసహాయం చేయలేదు, ఈ సహాయం చేయలేదని చెప్పడం తప్పుకాదా ! ఫిలి 4:6లో వ్రాయబడినట్లు నీకేమైనా క్రొత్తమేలు కావాలంటే ఇంతకుముందు ప్రభువు నీకుచేసిన మేలుల కొరకై ఆయనను స్తుతించి, అలాగున కృతజ్ఞతాపూర్వకముగా క్రొత్త విన్నపములను ప్రార్థనలో ప్రభువుకు తెలియచెప్పాలి. హామానులో సాతాను కనబడుతున్నాడు. మొర్దెకైలో ప్రభువు కనబడుతున్నాడు. ప్రభువు " నీదేవుడైన ప్రభువును మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెనని వ్రాయబడియున్నదని లూకా 4:8లో చెప్పాడు. మనము కూడా ఎవరైన మనకు వందనములు చెప్పకపోతే వారి మీద పగపట్టకూడదు. వారు వందనాలు చెప్పకపోతే మనమే పెడదాం తప్పేముంది? ఎదుటివారే మనకు వందనాలు చెప్పాలని అనుకొనకూడదు. అది ఒక పెద్ద సమస్యగా చేయకూడదు. మొర్దెకై ధర్మశాస్త్ర ఆజ్ఞను బట్టి దేవునికి తప్ప మరెవరికీ వంగి నమస్కరించుకూడదని హామానుకు వంగలేదు, నమస్కరించలేదు. కానీ, హామాను మొర్దెకై

తనకు మ్రొక్కడము లేదని తన భార్యకు, స్నేహితులకు చెప్పగా వారందరూ " ఏబది మూరల ఎత్తుగల ఉరికొయ్యను చేయించి దానిమీద మొర్దెకైని ఉరితీయుటకు సెలవిమ్మని రాజుతో మనవి చేయుము. తరువాత నీవు సంతోషముగా రాజుతో కూడా విందునకు పోదువని అని చెడ్డసలహాయిచ్చారు. హామానుకది యుక్తముగా తోచినందున అతుడు ఉరికొయ్యనొకటి చేయించి తన ఇంటి ముందు నాటించాడు. ప్రస్తుతానికి తన భార్య, స్నేహితులు యిచ్చిన చెడ్డ సలహా యుక్తముగానే హామానుకు కనబడింది. ఆ తరువాత ఇదే జెరెషే, ఇదే స్నేహితులే "ఆ మొర్దెకై యూదుల వంశపువాడైన యెడల అతని మీద నీకు విజయము కలుగదు. అతని చేత నీవు అవశ్యముగా చెడిపోదువు" అని చెప్పారు. ఇప్పుడు మొర్దెకైని చెడగొట్టాలని హామానుకు చెడ్డ సలహానిచ్చారు. అది హామానుకు యుక్తముగా తోచింది. ఈ యుక్తముగానున్న భార్య, స్నేహితులిచ్చిన సలహా ద్వారా హామాను నిజముగా చెడిపోయాడు. యూదుడైన మొర్దెకైను ఉరి కొయ్యమీంద ఉరితీసి చంపాలని చెడ్డ సలహానిచ్చి, హామాను ఆకార్యానికి ఉపక్రమింప చేసిన అతని స్నేహితులే, అతని భార్యయే చివరికి, "నీవుచెడిపోదువు, యూదుడైన మొర్దెకై పైనీకు జయము కలుగదు అని చెబుతున్నారు. అతనిని చెడ్డ సలహానిచ్చి నడిపించిన వారే ఇప్పుడు కష్టసమయంలో అతనిని ఒంటరిగా అతని ఖర్మకు అతనిని వదలివేసినట్లు మాట్లాడుతున్నారు. ఈలోక స్నేహితుల భార్యల బంధువుల సలహాలు ఇలాగే వుంటాయి. నీకేదైనా సమస్యవుంటే దాని నుండి తప్పించుకోడానికి సోదరీ! నీవు ఎవరి సలహా తీసుకుంటున్నావు ? స్నేహితుల సలహానా! భర్తల, బంధువుల సలహా తీసుకుంటున్నావా ? సోదరీ !వీరందరూ మానవ మాత్రులే. నీ శ్రేష్ఠమైన సలహాదారుడు (నీ best counsellor) నీప్రభువే. నీ ఆలోచన కర్త, నీ భాగముగా, ప్రభువునే కోరుకో (కీర్త 16:17) ఆశ్చర్యకరమైన ఆలోచనా శక్తి, అధిక బుద్ధియూ అయనే అనుగ్రహిస్తాడు, (యెష 28:29వ॥). హామాను వలె భార్యయైన యెజెబెలు యొక్క చెడ్డ సలహా తీసుకున్న అహాబురాజు రక్తాన్ని, కుక్కలు నాకాయి (I రాజు 21:19,25). యెరోబాము రాజు సలహా తీసుకొని వేషము మార్చి ప్రవక్తయైన అహీయాయొద్దకు వెళ్ళి శాపాన్ని తెచ్చుకొనిన యరోబాము భార్య కూడ ఒక వుదాహరణే మనకు. హెరోదియ సలహా మేరకు ఆమె బిడ్డయైన సలోమి, ఎంతమందిని తన నాట్యముతో ముగ్ధులనుగా చేసి ఎన్నెన్ని నీచకోరికలను కోరిందో ? చివరికి అ అమ్మాయి సంగంతి ఏమైందో తెలియదు. ఆదాముకూడ తన భార్య మాట లేదా సలహా తీసుకొనే కదా తినవద్దన్న పండ్లు తిని పాపం చేశాడు. కానీ కొంతమంది మంచి సలహాలనిచ్చారు. పిలాతు భార్య " ఈ నీతిమంతుని జోలికి వెళ్ళవద్దని పిలాతుకు మంచి సలహాలనిచ్చింది. ఇలా ఉద్యోగాలు చేసే భర్తలకు భార్యలు లంచం తీసికోవద్దని వాటి కొఱకై మనుషులను పీడించవద్దని, మోసపు కోరికలు యితరులతో చెప్పవద్దని నీతి న్యాయాలు కలిగి జీవించాలని భార్యలు తమ భర్తలకు

మంచి సలహాలిస్తే భర్తలు ఎంత బాగుపడతారో కదా! బత్షెబ తన కుమారుడైన సొలొమోనుకు దేవోక్తి నేర్పింది. తిమోతి తల్లి యునీకె, రక్షణార్థమైన జ్ఞానము పుట్టించే శక్తిగల పరిశుద్ధ లేఖనాలు నేర్పింది. ఇలా ప్రతి తల్లి ఎదిగిన తమ పిల్లలకు వాక్య సలహాలిస్తే పిల్లలు ఎంత చక్కగా దేవుని వాక్య మార్గములో నడుస్తారో కదా !

యిర్మీ 9:20 వచనంలో కొద్దిమంది స్త్రీలు తమ పిల్లలకు రోదన ధ్వని చేయడం నేర్పించారు. ప్రభువు యెరూషలేం కుమార్తెలతో నానిమిత్తం ఏడ్వకుడి - "మీ నిమిత్తమును - మీ పిల్లల నిమిత్తమును యేడ్వుడి అన్నాడు. అలాగు పిల్లల కొరకు ఏడ్చిన తల్లులున్నారు. అవును తల్లులు ఏడ్చి పిల్లల కొరకు ప్రార్థించాలని విలా 2:19 వ్రాయబడింది. " నీవు లేచిరేయి మొదటి జామున " మొఱ్ఱపెట్టుము. నీళ్ళు కుమ్మరించినట్లు ప్రభువు సన్నిధిని నీ హృదయమును కుమ్మరించుము. నీ పిల్లల ప్రాణము కొరకు నీ చేతులను ఆయన తట్టు ఎత్తుము "తల్లులారా మన పసిబిడ్డల కొఱకు, యవన పిల్లల కొరకు మనము ఏడ్చి ప్రార్థిస్తే తప్పక ఫలాన్ని చూస్తాం. ఈనాడు మనం ఏడ్చి మన పిల్లల కొరకు ప్రార్థిస్తే, మన పిల్లలు కూడా వారి పిల్లల కొఱకు ఏడ్చి ప్రార్థిస్తారు. తల్లియెట్టిదో బిడ్డయు అట్టిదే అనే సామెత నెరవేర్చబడాలి. చిన్నపుడు ఇష్మాయేలు ఇస్సాకును హింసించిన కారణాన, దాసిని దాని కుమారుని వెళ్ళగొట్టమని అబ్రహాముతో చెప్పింది. అపుడు హాగరు, ఇష్మాయేలును బట్టి అడవి పాలయ్యింది. ఇష్మాయేలు నీళ్ళతిత్తిలో నీళ్ళు అయిపోయినపుడు హాగరు ఇష్మాయేలును ఒక పొద క్రింద పడవేసి ఈ పిల్లవాని చావు చూడలేనని అనుకొని, వింటి వేత దూరము వెళ్ళి అతనికెదురుగా కూర్చొని ఎలుగెత్తి యేడ్చింది. తల్లి ఎలుగెత్తి ఏడ్చి మొర్రపెట్టు చుండగా, పిల్లవాడు కూడా దేవునికి మొరపెట్టాడని అలా మొరపెడితే దేవుడు వాడి మొర విన్నాడని చదువుతున్నాం. తల్లి మొరపెట్టితే పిల్లకూడ తల్లిలాగా మొఱ్ఱపెడుతుంది. యిర్మీ 31:15వ వచనంలో రాహేలు తన పిల్లల విషయమై అంగలార్చి ఏడుస్తోంది. 18వ వచనం ఆమె కుమారుడైన ఎఫ్రాయీము కూడ "నీవు నన్ను శిక్షించితివి. కాడికి అలవాటు కాని కోడె దెబ్బలకు లోబడునట్లుగా నేను శిక్షకు లోబడుచున్నాను. నీవునా మనసును త్రిప్పిన యెడల నేను తిరుగుదును అని ఎఫ్రాయీము మొర్రపెట్టు చున్నాడు. అవును తల్లులు మొర్రపెట్టడం చూచి పిల్లలు మొర్రపెట్టేది నేర్చుకుంటారు.

హేరోదు జన్మదినోత్సవమున నాట్యామాడిన ' సలోమి అనే తన కుమార్తెకు "బాప్తీస్మమిచ్చు యోహాను తలను నరికించి యిప్పుడే తనకిప్పించమని ఒక చెడ్డ సలహా నిచ్చిన హెరోదియను చూస్తున్నాం. హెరొదియ తన బిడ్డకు డ్యాన్స్ నేర్పింది. నరహత్య నేర్పింది కానీ, ప్రార్థనను, యెహోవా యందలి భయభక్తిని నేర్పలేదు. అందువలన భవిష్యత్తులో ఆ బిడ్డ తన జీవితాన్ని తన తల్లి ప్రేరణ ద్వారా ఎంతగా పాడుచేసికొని వుటుందో !అంతేకాక తన డ్యాన్స్‌ను చూచిన ఎంతమంది ప్రేక్ష్యకులను పాడుచేసిందో ! ప్రియసోదరీలారా ! నేడు మన పిల్లలకు ఏమి

నేర్పుతున్నాము ? ఎట్టి సలహాలు వారికిస్తున్నాము ? పెండ్లియైన తమ కుమార్తెలకు కొద్దిమంది తల్లులు, వేరు కాపురం పెట్టమని అత్తను దూరంగా ఉంచడానికే సలహాలనిస్తున్నారు. భర్తతో సొమ్ములు చేయించుకోమని, వస్త్రములు కొనిపించుకోమని సలహాలిస్తుంటారు. ఈలాంటి అజ్ఞాన సలహాలు చెప్పి పిల్లల దాంపత్య ఐక్యతకు భంగము కల్గిస్తున్నారేమో తల్లులు ఆలోచించుకోవాలి. మన అజ్ఞాన ప్రేమతో వారి సంసార జీవితంలో దూరి ఉచిత సలహాలు ఇవ్వకూడదు. భర్తమాటకు విధేయత చూపాలని, కుంటుంబంలో కష్టాలుంటే ఓర్చుకోమని, ప్రభువు ముందుకు మంచి రోజులిస్తాడని మంచి సలహాలియ్యాలి. అత్తను బాగాచూచుకోవాలని, ప్రభువుకు మంచి పేరు తేవాలని, ప్రభువు కృప ద్వారా ఆయింటిలో ఎదురయ్యే శోధనలను శ్రమలను, కష్టాలను, ప్రార్థనతో జయించాలని ఆడపిల్లలకు తల్లులు నేర్పించాలి. అబ్బాయి తల్లిదండ్రులైతే తన భార్యను నిష్ఠురపెట్టవద్దని, భార్య అవసరాలు తీర్చమని, ఆమెయోగ క్షేమాలు చూడాలని, అనారోగ్యంలో ఆదుకోవాలని, భార్యను ప్రేమించమని మంచి సలహాలివ్వాలి. కానీ, కుమారుడు రాగానే నీ భార్య అలా చేసింది. ఇలా చేసింది, చాడీలు చెప్పి వారి మధ్య తగదాలు రేపకూడదు.

అలాగే, స్నేహితులు తమ స్నేహితులకు చెడ్డ సలహాల నివ్వకూడదు. I సమూ 13:2-3వ వచనంలో చదివితే అక్కడ దావీదు కుమారుడైన అమ్నోను తన చెల్లెలైన తామారును మోహించి అమె కన్యకయైనందున ఆమెను ఏమి చేయవలెనన్నను దుర్లభమని చింతాక్రాంతుడై తన చెల్లెలైన తామారును బట్టి నానాటికి చిక్కిపోవుచుండగా, యెహోనాదాబు అను కపట స్నేహితుడు అమ్నోను సంగతి తెలుసుకొని " నీవు రోగివైనట్టు వేషము వేసికొని మంచము మీద పండుకొనుమని, నీతండ్రి నిన్ను చూచుటకు వచ్చినపుడు" తామారు చేతి వంటకాన్ని తినాలని రాజుకు చెప్పమన్నాడు. అలాగు తండ్రి సెలవుచే, తామారు అమ్నోను గదిలోనికి అప్పములు తీసికొని వచ్చినపుడు అతడు ఆమెను అవమానపరచి అనుభవించడం జరుగుతుంది. తామారు వెళ్ళి సంగతి తన అన్నయైన అబ్షాలోముకు చెబితే, అబ్షాలోము సరియైన సమయంలో అమ్నోనును చంపించాడు. ఇలా అమ్నోను రాజ్యానికి రావలసియుండగా ఇంత తొందరగా చనిపోడానికి కారణం అతనికి చెడు సలహానిచ్చిన కపటమైన యెహోనాదాబు అనే స్నేహితుడే. యెహోనాదాబు నిజమైన మంచి స్నేహితుడైతే, ఆపాప కోరికను బయట పెట్టిన అమ్నోనును చెంపమీద ఒక దెబ్బయైనా కొట్టి బుద్ధి చెప్పి గద్దించాల్సి వుండింది. మేలు కోరే స్నేహితుడుగా గాయంచేయాల్సింది. కానీ చెడ్డ సలహా యిచ్చి తప్పుకున్నాడు. అమ్నోను చనిపోయేప్పుడు ఈ స్నేహితుడు అడ్రస్ లేకుండా ఎక్కడికెళ్ళాడో తెలియదు. చెడ్డ సలహాలనిచ్చిన దుష్టస్నేహితులు తమ స్నేహితుని కష్టసమయాల్లో వీరు అసలు కనబడరు ఈనాడు ఇలాంటి స్నేహితు లెక్కువైపోయారు. మత్తు మందులను, మాదక ద్రవ్యాలను తమ స్నేహితులకు పరిచయం చేస్తున్నారు. నేర్పించే వాళ్ళు బాగానే వుంటారు. కానీ నేర్చుకున్నవారు సర్వనాశనమవుతున్నారు.

స్నేహితుల చెడుసలహాలు ఎంత ప్రమాదకరం? అందుకే దుష్టుల సాంగత్యము మంచినడవడిని చెడగొడుతుందని ప్రభువు I కొరి 15:33వ లో వ్రాయించారు. సామె 13:20 వచనం ప్రకారం దుష్టుల సాంగత్యము కాక, జ్ఞానులలో సహవాసము చేయువాడు జ్ఞానము గలవాడగును. మూర్ఖుల సహవాసము చేయువాడు చెడిపోవును. హామాను తుదకు మూర్ఖులైన తన భార్య, స్నేహితుల సలహా తీసికొని చెడిపోయాడు, చనిపోయాడు కూడా.

ఈలాగున హామాను భార్య, హామాను స్నేహితులు అతనికి మొర్దెకై కొఱకు ఉరికొయ్యను చేయించి వురితీయించుటకు రేపు రాజుతో మనవి చేసి ఆ తరువాత నీవు సంతోషముగా రాణి చేయు విందుకు వెళ్ళవచ్చునని హామానుకు చెడు సలహా యిచ్చారు. రాజుతో రేపు మనవి చేయమని చెప్పారు కానీ, అలా నీతిమంతునికి విరుద్ధంగా రాజుతో మనవి చేసేసమయమే అతనికి రాకుండా ప్రభువు చేశారు. హామాను మొర్దెకై కొఱకు తన యింటి ముందర వురి కొయ్యను సిద్ధము చేయించాడు. కానీ, మొర్దెకై దానిమీద వురి తీయింపబడలేదు. చెఱపకురా !చెడేవు అనే సామెతె ప్రకారం హామాను ఆ ఉరికొయ్యమీద వురి తీయించబడ్డాడు. యెష 54:17వ॥లో నీకు విరోధముగా రూపింపబడిన ఏ ఆయుధమునూ వర్థిల్లదని ప్రభువు వ్రాయించారు. మన కొఱకు పొంచియున్న ప్రతి అపద, ప్రతి శోధన, ప్రతి శ్రమ నుండి మన ప్రభువు మనలను కాపాడు వాడుగా వున్నాడు. కీర్త 119:86,87 వచనాలలో వున్నట్లు వగవాడైన అపవాది నిర్నిమిత్తముగా దేవుని బిడ్డలను, సేవకులను తరుముచుండగా, భూమి మీద ప్రభువు సేవకులు వుండకుండా వారిని నాశనము చేయవలెనని వుండగా ప్రభువు తప్పిస్తున్నారు. ప్రభువుకు లెక్కలేని స్తోత్రములు కలుగను గాక! హామానుగు రేపటి విందును సంతోషంగా ఆరగించుట కొరకై ఈరోజే పథకాన్ని సిద్ధము చేసుకుంటున్నాడు. హామాను పొందబోయే సంతోషము విందు ఆరగించినంత సేపే కదా! క్షణికానందం కొరకు నీతిమంతుని నిండుప్రాణాన్ని తీయాలనుకుంటున్నాడు. రాణి విందు భోజనాన్ని తినకముందు హామాను, మొర్దెకై ప్రాణాన్ని తినాలను కున్నట్టుంది. కొందఱు తమ శరీర క్షణిక సంతోషము కొఱకు, తమ శరీర తుచ్ఛమైన ఇచ్ఛలు నెరవేర్చుకునేందుకు దేవుడిచ్చిన విలువైన ప్రాణాలను తీసేందుకైనా వెనుకాడరు. ఆనాడు ఒక్క హామానునే ఎస్తేరు కాలంలో చూస్తున్నాం, నేటి కాలంలో ఇలాంటి హామానులు కోకొల్లలుగా వున్నారు. తమ పాపేచ్ఛలు నెరవేర్చుకొనుటకై కొంతమంది పురుషులు అనేకమంది స్త్రీలను అన్యాయంగా బలాత్కరించి ఆ తరువాత తమను ఎవరు గుర్తించకుండునట్లు ఆ స్త్రీల ప్రాణాలు కూడా తీస్తున్నారు. ఆ స్త్రీల శీలాన్ని దోచుకోడానికి ఎవరిచ్చారు వారికీ ధైర్యం, ఈ ఆలోచన ? సాతానే. ఆనాడు సాతను హామానును తన రాయబారిగా వాడుకుంటే, ఈనాడు అలాంటి సాతానుతో నడిపింపబడుచున్న హామానులు ఎంతమందో కదా! ముఖ్యంగా ఈ వురికొయ్యను మరణకరమైన నేరములు చేసినవారిని వారుచచ్చే పర్యంతము దానిమీద

వ్రేలాడదీస్తారు. యేసు ప్రభు ఏనేరము చేయని నిష్కాపియైనా, ఆ నీతిమంతుని తీసుకువెళ్ళి సిలువపై చంపారు. మొర్దెకైకి ఈ గ్రంథములో ఉరికొయ్య తప్పిపోయింది. కానీ మన పాపశిక్షగా మనము పొందవలసిన ఆ సిలువ శిక్ష మనమీద మోపక తన కుమారుని మీద మోపి మనకు రక్షణనిచ్చిన తండ్రి స్తుతింపబడును గాక!

❖ ❖ ❖

## 6వ అధ్యాయము 3+9+2=14వ.

**అంశము** : హామానుకు కలిగిన అవమానం

**విభజన** : 1-3వ రాజు మొర్దెకై తనకు చేసిన మేలును రాజ్యసమాచార గ్రంథము ద్వారా తెలిసికొనుట.

4-12వ - మొర్దెకైని ఘనపరచు విధానమును హామాను రాజుతో చెప్పుట.

13-14వ - హామాను చెడిపోవుటను గురించి అతని భార్య, స్నేహితులు అతనితో చెప్పుట.

### 1-3వ. రాజు మొర్దెకై తనకు చేసిన మేలును రాజ్యసమాచార గ్రంథము ద్వారా తెలిసి కొనుట :

1 వచనంలో ఆ రాత్రి రాజుకు నిద్రపట్టలేదట. ఏ రాత్రి రాజుకు నిద్రపట్టలేదు? అంటే హామాను మొర్దెకై కొరకు ఉరికొయ్య సిద్ధపరచిన రాత్రి. ఆరాత్రి మొర్దెకై నిద్రకు కరువేమీ లేక బాగుగా నిద్రపోయాడు. రేపే దేవుడాయనను ఘనపరచబోతున్నాడు. ఈ విషయము తెలిసివుంటే మొర్దెకైకి నిజముగా నిద్రపట్టి వుండేదికాదు. కానీ, రాజుకు నిద్ర పట్టకపోడము ఆశ్చర్యమే. పేతురు చెఅలో వున్నాకూడా బాగానే నిద్రపోతున్నాడు. ఆరాత్రే ప్రభువు ఆయనకు విడుదల యిచ్చాడు. రేపు పెళ్ళంటే ఈ రాత్రి ఆదాము గాఢ నిద్రపోతున్నాడు. తన ప్రియులు నిద్రించుచుండగా దేవుడు వారికిచ్చుచున్నాడు అనేమాట నెరవేర్చాడు దేవుడు (కీర్త 127:2). దేవుడు లేఖనాలలో తన బిడ్డలు కష్టములలో ప్రాణాపాయాల్లో వున్నపుడు అన్యరాజులకు నిద్రరాకుండా చేశాడు. అట్టి రాజుల్లో ఒకడు అహష్వేరోషు కాగా, మరోరాజు దర్యావేషు. దానియేలు సింహపు గుహలో వేయబడినపుడు దర్యావేషురాజు రాత్రి నిద్రపోలేదు. వాయిద్యాలు నాట్యాలు అన్నీ ఆరోజు రాజు ఆపివేశాడు. రాజు నిద్ర పోకుండా చేసినదీ దేవుడే ఆదాముకు

గాఢనిద్ర కలిగించిదీ దేవుడే ఆనాడు వారికి sleeping pills (స్లీపింగ్ పిల్స్) sedetives (మత్తుమందులు) లేవు. వారు అన్నీ ప్రభువు ద్వారానే పొందారు. యూదుల రక్షణ కొఱకై యూదులందరు, ఎస్తేరు, ఆమెచెలికత్తెలు చేయుచున్న ప్రార్థనల ద్వారా దేవుడు ఆ గొప్ప రాజుకు నిద్రపట్టకుండా చేశాడు. ఆరోజు అరాజుకు నిద్రపట్టక పోవడానికి తగిన కారణాలు ఏవీలేవు. కానీ, దేవుడే ఆ రాజుకు నిద్ర రానివ్వలేదు. కారణం రేపు ప్రొద్దున్నే హామాను, మొర్దెకైని వురితీయింప సెలవిమ్మని రాజుతో మనవి చేయబోతున్నాడు. గనుక దేవుడు మొర్దెకైని ఉరికొయ్య మీద మరణించే శాపగ్రస్తమైన మరణము నుండి రక్షించుటకును, అతనిని ఘన పరచుటకును, రాజుకు మొర్దెకై చేసిన మేలును రాజుకు గుర్తు చేయుటకును, రాజ్య సమచార గ్రంథమును రాజు చదివించుకొనుటకును దేవుడు రాజుకు నిద్ర పట్టకుండా చేశాడు. రాజుకు నిద్రపట్టకపోతే రాజు రాజ్య సమాచార గ్రంథాన్ని చదివించాడు.

ప్రియ సోదరీ ! నీకు నిద్రరాని వేళ నీవు ఏ పుస్తకాలు చదువుతున్నావు ? ఫిలింఫేర్, సితార, సచిత్ర, వారపత్రికలు, డిటెక్టివ్స్, లవ్‌స్టోరీస్, లాంటివి చదువుతున్నావా ? లేక టి.వి. చూస్తు మేలుకుంటున్నావా ? నీకు నిద్రరాని సమయంలో పరలోక రాజ్యసమాచార గ్రంథమైన బైబిల్‌ను చదివితే నీకెంత ధన్యకరము? ఎందుకనగా ప్రక 1:3వచనంలో సమయము సమీపించినది గనుక ఈ ప్రవచనము వాక్యములు చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులనుగైకొను వారును ధన్యులని వ్రాయబడింది. " బైబిల్ చదివితేనే ధన్యులైతే, అనుసరించువారు మరీ ధన్యులు బైబిల్ మధ్యలో డిటెక్టివ్స్ పెట్టుకొని చదివేవారు లేకపోలేదు. తల్లిదండ్రులు మాపిల్లలు బైబిల్ చదువుతున్నారులే, అనుకుని సంతోషిస్తుంటారు. పిల్లలు తల్లిదండ్రులను మోసగిస్తున్నారు. పిల్లలూ! ఈనాడు మీరు మీ తల్లిదండ్రులను మోసగిస్తే రేపు మీ పిల్లలు మిమ్ములను మోసగిస్తారు. మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు. మనుష్యుడు ఏ పంట విత్తునో అపంటనే కోయును. (గలతీ 6:7) చాలామంది బైబిల్‌ను చదువుటలేదు మనుషులందరు రక్షణ పొంది. సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము పొందవలెనని ప్రభువు యిష్టపడుచున్నాడు. I తిమో 2:4 బైబిల్ చదవకపోతే ఇక అనుభవ జ్ఞానం ఎక్కడనుండి వస్తుంది ? బైబిల్‌ను చదవకపోతే దైవజ్ఞానము పొందలేకపోతాం. ఇక్కడ 6:1వ॥లో ఆ రోజు రాజు రాజ్య సమాచార గ్రంథము చదవకపోతే ఈ బిగ్తాను తెరెషుల ద్వారా తనకు సంభవించవలసిన మరణము నుండి తనను మొర్దకై కాపాడిన విషయము రాజుకు తెలిసేదేకాదు. అందుకు ఫలితంగా మొర్దెకైకి ఏమేలునూ తాను చేయలేదనే తన తప్పును గ్రహించి ఆ తరువాత మొర్దెకైకి మేలు చేయడం జరిగింది. అలాగే దేవుని పరిశుద్ధ గ్రంథాన్ని మనం చదవకపోతే మన తప్పులు మన గ్రహించలేకపోతాం. అందుకే దేవోక్తి లేని యెడల జనులు కట్టులేక తిరుగుదురు " అని వ్రాయబడింది దావీదు నేను నీయెదుట పాపము చేయకుండునట్లు

నా హృదయములో నీ వాక్యమును వుంచుకొని వున్నాను. అని కీర్త 119:11వ॥లో అన్నాడు. అదే దావీదు కీర్త 119:50 వచనంలో "నీ వాక్యమే నన్ను బ్రతికించెను". బాధలో యిదే నాకు నెమ్మది కలిగించెను అన్నాడు. ఇంకా దావీదు కీర్త 119:9 వచనంలో యవనస్థులు దేనిచేత తమనడవడిని శుద్ధి పరచుకొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా! అని వ్రాశాడు. కీర్త 119 :99వచనంలో దావీదు " నీ శాశనములను నేను లక్ష్యము చేయుచున్నాను. కావున వృద్ధులకంటే నాకు విశేషజ్ఞానము కలదు. 98వచనంలో నీ ఆజ్ఞలు నాకు తోడుగా వున్నవి, నా శత్రువులను మించిన జ్ఞానము అవి నాకు కలుగచేయుచున్నవి అన్నాడు. దేవుని వాక్యము ఈ రీతిగా వ్రాయబడియున్నది, కనుక వాక్యము చదివితే మనం పాపం చేయకుండా వుంటాం. యవస్థులు తమ ప్రవర్తన దిద్దుకుంటారు. వృద్ధులను బోధకులను, శత్రువులను మించిన జ్ఞానము మనకు దొరుకుతుంది. మన తప్పులు, మన పాపాలు వాక్యం ద్వారానే గ్రహించి మనల్ని మనం దిద్దుకొని సవరించు కుంటాం. ఇన్ని వుపయోగాలున్న వాక్యాన్ని చదవకపోతే ఎన్ని నష్టాలు పొందుతామో ఆలోచన చేసికొని మరెక్కువగా వాక్యం చదవాలి. వాక్యం చదివే వ్యక్తి నీటి యోరను నాటబడిన చెట్టువలె ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె వుంటాడు. (కీర్త 1:3) వాక్యము ద్వారానే దేవుని చిత్తము కనుగొంటాము. వాక్యము సుత్తెవంటిది (యిర్మి 23:28) వాక్యము చాకలి వాని సబ్బువంటిది. అది మనల్ని ఆత్మీయముగా శుద్ధిచేస్తుంది. వాక్యము నీరువంటిది. అది మన జీవితాన్ని కడుగుతుంది. (ఎఫె5:25-27) వాక్యము దహించు అగ్నివంటిది. మనచెత్తను కాల్చివేస్తుంది (యిర్మి 23:28) వాక్యము ఖడ్గము వంటిది. ప్రాణాత్మలను కీళ్ళను విభజించునంత మట్టుకు దూరేది (హెబ్రీ 4:12) వాక్యము అద్దమువంటిది. మనలోపములను సవరించేది. దేవుని వాక్యము తేనె కంటెను జుంటి తేనెల కంటే, మధురమైనది. (కీర్త 119:130) దేవుని వాక్యము పాలవంటిది. అదిమనలను బలపరుస్తుంది. (I పేతురు 2:2)

సరే, మొర్దెకై రాజుకు ఎప్పుడో 2వ అధ్యాయంలో చేసిన మేలుకై రాజు యిప్పుడు అనగా 6వ అధ్యాయంలో మేలుచేయదానికి ఆలోచిస్తున్నాడు. ఎస్తే 2:22లో మొర్దెకై రాజుకు మేలు చేసినది రాజు యొక్క ఏలుబడిలో 7వ సంవత్సరములోనే అని అర్థమౌతుంది. దానికి ఋజువు 2:21 వచనంలో ఆదినములలో ఇద్దరు నపుంసకులు రాజును చంపచూచారని, మొర్దెకై రాజును కాపాడాడని వ్రాయబడింది. కానీ హామాను ద్వారా వ్రాయబడిన శాసనపు తాకీదులు రాజు ఏలుబడిలో 12వ సం॥ నీసానుమాసంలో షూషను కోటను చేరినట్లు ఎస్తే 3:6 అధ్యాయంలో చదువుతాము. ఆశాశనం వచ్చిన వెంటనే 3వ రోజు యూదులందరూ, మొర్దెకై, ఎస్తేరు, తన చెలికత్తెలు 3వ రోజులు ఉపవాసముండి ప్రార్థించారు. 3వ రోజు ఎస్తేరు రాజును మొదటి రోజు విందుకు పిలిచింది. ఈసంగతి ఎస్తేరు 5వ అధ్యాయంలో

వ్రాయబడింది. రాజు మొర్దెకైకి మేలుచేయాలనుకున్నది, ఆ మొదటి విందు జరిగిన రోజు రాత్రిలోనే. ఆరాత్రే రాజుకు నిద్రపట్టని రాత్రి. మొర్దెకై తనకు చేసిన మేలుకై అతనికి ప్రతిఫలమివ్వాలనుకున్న రాత్రి కూడా అదే. ఈ సంగతి 6వ అధ్యాయంలో వ్రాయబడింది. కనుక 4,5,6 అధ్యాయాలన్నీ రాజు ఏలుబడిలో (12వ సంవత్సరం) నీసానుమాసములో జరిగినవే కనుక, మొర్దెకై రాజుకు మేలు చేసింది, రాజుయొక్క ఏలుబడిలో 7వ సంవత్సరములోనే. రాజు మొర్దెకైని ఘనపరచాలనుకున్నది రాజు ఏలుబడిలో 12వ సం॥లో కనుక 12వ సం॥ నుండి 7వ సంవత్సరం తీసివేస్తే దాదాపు 5 సం॥ల క్రింద మొర్దెకై రాజుకు మేలుచేస్తే, 5 సం॥ల కాలము రాజు మొర్దెకై మేలును మరచిపోయాడు. కానీ పరమరాజు మరువలేదు. దేవుడు ఆరాత్రి రాజుకు నిద్రపట్టకుండా చేసి మెలకువతో నింపి హృదయాన్నే మొర్దెకైను ఘన పరచాలనే తలంపుతో రాజును నింపియుండుట ఎంతదైవ కార్యమో కదా ! ఈ రాత్రితో కలిపి 3 రోజులుగా మొర్దెకైతో సహా యూదులందరు ఉపవాస ప్రార్థన చేశారు. కానీ వారి ప్రార్థనలో మొర్దెకైని ఘనపరచి హెచ్చించమని వారు ప్రార్థించలేదు. వారి విడుదల కొఱకే ప్రార్థించారు. కానీ కరుణగల దేవుడు వారు అడిగిన దానికంటే వూహించిన దానికంటే ఎక్కువగా చేయుటకు శక్తిమంతుడై వారు అడుగని వాటిని కూడా అనేకంగా ఈ ఉపవాస ప్రార్థన ద్వారా యిచ్చుట ఎంత దేవుని కృపయో కదా ! మనుషులు మనల్ని మరువవచ్చు, నీ తల్లియైన నిన్నుమరచును. చూడుము, నా అరచేతిలో నిన్ను చెక్కుకొనియున్నాను అని దేవుడు యెష 49:15,16 వచనాలలో వ్రాయించారు. ప్రియసోదరీ ! నీవు చేసిన మేలును నీ బంధువులుగానీ, నీయిరుగు పొరుగు గానీ, ఆత్మీయులుగానీ, సంఘస్థులుగానీ, మరెవరైనా మరిచారా ? విచారపడవద్దు. దిగులు పడవద్దు. వారు మరచినా నీ దేవుడు నిన్ను మరవడు. ఆయన తనస్వంత సమయంలో నిన్ను జ్ఞాపకం చేసికొని నిన్ను పైకెత్తువాడు. మేలుచేసిన మొర్దెకైకి దేవుడు ఘనతను యిచ్చాడు. ఆలాగున గల 6:9,10లో మనము మేలుచేయుటయందు విసుగక యుందము. అలయక మేలు చేసితిమేని తగిన కాలమున పంటకోతుము. కాబట్టి మనకు సమయము దొరికినకొలది అందరియెడలను ముఖ్యముగా విశ్వాస గృహమునకు చెందిన వారి యెడలను మేలు చేయుదమని వ్రాయబడింది. మొర్దెకైని దేవుడు హెచ్చించే తగినకాలం రావాలంటే 5యేండ్లు పట్టింది. అంత లోపల మొర్దెకై ఎప్పుడుగానీ, దేవునిపైన సణగలేదు, గొణగలేదు. ప్రియసోదరీ! నిన్ను కూడా తగిన సమయంలో ప్రభువు హెచ్చిస్తారని తెలుసుకుంటే నీకెంతో మంచిది. కొలొ 3:23లో మనము ఏమి చేసినను ప్రభువు వలన స్వాస్థ్యమును ప్రతిఫలముగా పొందుదుమని యెరిగి, మనము చేయునది మనుషుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనఃపూర్వకముగా చేయవలెనని వ్రాయబడినట్లు మనమునూ చేద్దాం.

## 4-12వ. మొర్దెకైని ఘనపరచు విధానమును హామాను రాజుతో చెప్పుట :

రాజు ఆవరణములోకి 4వచనంలో హామాను మొర్దెకైకి విరోధంగా రాజుకు మనవిచేయుడానికై వెళ్ళాడు. కానీ రాజు హామానును గుర్తించినట్లు లేదు. ఆవరణములో "ఎవరో వున్నారు" అని చెబుతున్నాడు. కాని 5వ అధ్యాయంలో రాజు ఆవరణములోనికి ఎస్తేరు వెళ్ళినపుడు" ఆవరణములో ఎవరో వున్నారు" అనలేదు. ఎస్తేరు ఆవరణములో నిలిచి యుండుట చూడగానే ఆమెమీద ఆయనకు దయపుట్టి తన చేతిలోనుండు బంగారు దండమును ఆమె తట్టుచాపాడు. దేవుడు తనవారిని ఎరుగును అన్నమాట ప్రకారం రాజు ఎస్తేరును గుర్తిస్తున్నాడు. కానీ హామానును గుర్తించలేకపోయాడు. 5వ అధ్యాయంలో యూదులకు అనుకూలంగా మొఱ్ఱపెట్టడానికి ఎస్తేరు వస్తోంది. 6వ అధ్యాయంలో యూదులకు (మొర్దెకైకి) విరుద్ధంగా మొరపెట్టడానికి హామాను వస్తున్నాడు. హామాను అలాగే జెకర్యా 3:1లో యెహోవా దూత ఎదుట ప్రధాన యాజకుడైన యెహోషువ నిలువబడివుండగా, సాతాను ఫిర్యాదియై అతని కుడి పార్శ్వమున నిలుచుట మనం చూస్తున్నాము. ఫిర్యాదు చేయుటకు వచ్చిన సాతానుతో యెహోవా దూత "యెహోవా నిన్ను గద్దించును. యెరూషలేమును కోరుకొను యెహోవా నిన్ను గద్దించును" అన్నాడు. కానీ యెహోషువతో "నేను నీ దోషమును పరిహరించి ప్రశస్తమైన వస్త్రములతో నిన్ను అలంకరించుచున్నాను అని అన్నాడు." ఇక్కడ యెహోషువ మీద ఫిర్యాదు చేయుటకై సాతాను వచ్చినట్లు చూస్తున్నాం. ప్రక 12:10 వచనంలో "రాత్రింబగళ్ళు మన సహోదరుల మీద నేరము మోపువాడైన అపవాది పడద్రోయబడి వున్నా"డని వ్రాయబడింది. ఇక్కడ మన మీద సాతాను రాత్రింబగళ్ళు నేరారోపణ చేస్తున్నాడు మరి మనము రాత్రింబగళ్ళు ప్రార్థిస్తున్నామా ?

6వ వచనములో ఆవరణములో నున్న హామాను రాజునొద్దకు రాగానే హామాను మొర్దెకైకి విరుద్ధముగా రాజుకు మనవి చేయక మునుపే రాజు, "రాజు ఘన పరచన పేక్షించు వానికి ఏమి చేయవలెనని" హామాను నడిగాడు. ఇక్కడ యూదుల దేవుడైన యెహోవా దేవుడు, సాతానువలె, మొర్దెకై మీద ఫిర్యాదు చేయడానికి వచ్చిన హామానుకు ఫిర్యాదు చేయుడానికే సమయమివ్వకుండా చేయుట ఎంత ఆశ్చర్యమో కదా! ఇప్పటి నుండే హామానులోని సాతాను ప్రక 18:10వ వచనంలో వ్రాయబడినట్లు క్రిందికి పడద్రోయబడుచున్నట్లున్నాడు రాత్రింబగళ్ళు యూదులు చేయుచున్న ఉపవాస ప్రార్థన ఎంత గొప్ప కార్యము చేస్తున్నదో కదా ! 6వ వచనంలో హామాను "నన్నుగాక రాజు మరియెవరిని ఘనపరుచును" ? అని తనలో తాను అనుకొని తన కోరికలన్నీ రాజుతో క్రిందివిధంగా చెప్పాడు. రాజు ధరించు వస్త్రములను, రాజగుఱ్ఱమును రాజు తలమీద ధరించుకొను రాజకిరీటమును ఒకడు తీసికొని ఘనులైన రాజు అధిపతులలో

ఒకడు ఆ వస్త్రములను రాజు ఘన పరచనుద్దేశించు వానికి ధరింపచేసి (అనగా తనకు ఒకడు ధరింపచేయాలట, తాను ధరించడట) రాజ వీధిలో అతనిని నడిపించుచు (అనగా హామాను తనంతటతాను నడవడట అధిపతి నడిపించాలట) రాజు ఘనపరచన పేక్షించు వానికి ఈ ప్రకారం చేయతగునని అతని ముందర చాటించవలెను" అన్నాను. (అనగా హామాను ముందర చాటింపు కావాలట). హామాను పై కోరికలన్నిటితో తాను ఘనపరచబడాలని కోరుకున్నాడు మేలు చేసిన వాడిని ఘనపరచాలనుకున్నాడు రాజు. హామాను రాజుకు ఏమి మేలు చేశాడు ? రాజే, హామాను పీఠాన్ని అందరి పీఠం కంటే హెచ్చించి మేలు చేశాడు. కానీ రాజుకు ఏ మేలునూ చేయని హామాను ఘనతను కోరుకుంటున్నాడు. ఘనతకు ముందు మేలు చేయాలి. హామాను రాజుకు ఏమేలు కూడ చేయలేదు. ఘనతకు ముందు వినయముండాలి (సామె 15:33) హామాను ఏ వినయము చూపలేదు. నెనరు గల స్త్రీ ఘనపరచబడును (సామె 11:16) హామాను ఏనెనరూ ఎవరకీ చూపలేదు. దేవుడు దీనులను పెంటకుప్పల మీదనుండి పైకి ఎక్కించును (కీర్త113:8) ఏ దీనత్వము హామానులో కనిపించదు. సత్క్రియ చేయు ప్రతి వానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ మహిమయు, ఘనతయు, సమాధానమును కలుగును (రోమా 2:10) ఏ సత్క్రియలూ హామాను చేయలేదు.

పైన చెప్పబడిన రీతిగా హామాను రాజుకు ఏమేలును చేయలేదు. కానీ ఘనతను లోలోపల కోరుకొంటున్నాడు. హామానులాగే నేడు సంఘాలలో కూడ ఘనతను కోరుకునే వారున్నారు. వారు సంఘానికీ ఏవిధంగానూ తోడ్పడరు. ఏ పనియూ చేయరు. కానీ పెద్దరికము కావాలి !!! యోహాను పత్రిక 1:9లో దెయొత్రెఫె పౌలును గూర్చి చెడ్డమాటలు పలుకుచూ, అదిచాలదన్నట్టుగా సహోదరులను తానే చేర్చుకొనక, వారిని చేర్చుకొన మనసుగల వారినికూడా ఆటంకపరచు సంఘములో నుండి వారిని వెలివేయుచు, ప్రధానత్వమును కోరుచున్నాడని వ్రాయబడింది. ఇలాంటి వారికి పైన చెప్పబడిన రీతిగా వినయముండదు. నెనరువుండదు. సత్క్రియలు చేయరు. దీనత్వము మచ్చుకైనా కానరాదు. ఉప్పొంగిపోతూ వుంటారు. ఏ పనీ చేయరు ? ఘనతకు సంబంధించిన అర్హతలేమి వుండవు. ప్రార్థన వుండదు. భారముండదు. వీరిలో ధర్మశాస్త్రమే గానీ కృప వుండదు. తాము దేవుని కృపను అనుభవించియూ, ఎదుటి వారియెడల కనీస ప్రేమచూపరు. వాక్య విషయములో చాలా ఖచ్చితముగా (Strict గా) వున్నట్లు తమ్మును చూపుకుంటారు. ఈలాంటి వారిని ప్రభువు ఘనపరచరు. హామానులాగ, తలకు ముసుకు వేసికొని చివరకు అవమానము పొందుకోవాల్సిందే. అట్టివారు "నేను ఘనపరచబడాలి" అని పేక మేడలు కట్టుకోవాల్సిందే. వారి కోరికలు పగటి కలల్లాగా వుండాల్సిందే తప్ప ఘనత లేశమాత్రమైననూ అట్టివారికి ప్రభువు కలుగచేయరు. ఎస్తేరు 1:15 వచనంలో అహష్వేరోషు రాజు దగ్గర ప్రథమ పీఠముల మీద వుండ తగిన 7 గురు

ప్రధానులు లేదా ఘనులు వున్నారు. వారికి ఆ ప్రధానత్వము ఎలా వచ్చింది ? వారు రాజుసన్నిధిలో వుండాలి. వారు ఎప్పుడు రాజు ముఖము చుస్తూ వుండాలి, వారు కాలజ్ఞానులై వుండాలి. అంతేకాక 1:13 వచనంలో వున్నట్లు రాజ విధిని, ధర్మమును ఎరిగి, రాజుయొక్క ప్రతి సంగతిని పరిష్కరించువారై వుండాలి. ఇవి వీరి అర్హతలు. ఈనాడు పరమరాజు సన్నిధిలో ఆయన సముఖములో వుంటూ ఆయన ముఖాన్నే ప్రార్థనలో చూసేవారు. బైబిల్ జ్ఞాన మెరిగిన వారు, వాక్యవిధిని ఎరిగిన వారుగా, సంఘములో ప్రతి సంగితిని పరిష్కరించు వారుగా వున్నపుడే సంఘ పెద్దలుగా పరిశుద్ధాత్మ నడిపింపువలన. గుర్తించబడతారు. కానీ ఒకనికి లోకం, ఉద్యోగంలో, సమాజములో పలుకుబడి గౌరవము వుందని సంఘములో కూడా అలాగే అధికారం వుండాలని కోరుకోడం వాక్యాను సారం కాదు. అర్హతలు లేనివారు హెచ్చింపు కోరడం హాస్యాస్పదమే.

ఈ రీతిగా హామాను రాజు తనకిచ్చిన హెచ్చింపుతో తృప్తిపడక, రాజరికాన్ని కూడ కోరుతున్నారు. తాను కోరిన కోరికల్లో అన్నీ రాజుకు చెందిన వాటినే కోరుకున్నాడు. ప్రధాన మంత్రిగా తనకెన్నో వస్త్రాలుంటాయి. గుఱ్ఱాలుంటాయి. వాటితో ఆయనకు తృప్తి లేదు. రాజు కిరీటానికే ఎసరు పెట్టాడు. రాజవీధిలో నడిపించ బడాలనుకున్నాడు. ఇక హామాను కోరుకొననది రాజు సింహాసనము మాత్రమే అప్రత్యక్ష్యంగా (indirect గా) మనసులో ఆ కోరిక కూడా వుండి వుంటుంది. ఇన్ని కోరుకున్నపుడు అది ఒక్కటే ఎందుకు కోరుకోడు ? అయితే సాతాను యెహె 28 అధ్యాయములో వ్రాయబడినట్లు దేవునికి ప్రతిష్ఠింపబడిన పర్వతము మీద కాలుచున్న రాళ్ళమధ్య వుంటూ, దేవుడు తనకిచ్చిన సౌందర్యాన్ని చూచుకొని, తేజస్సును చూచుకొని, జ్ఞానమును చెరుపుకొనినవాడై యెష 14వ అధ్యాయములో చెప్పబడినట్లు దేవుడు తనకిచ్చిన స్థితి, స్థాయితో తృప్తి పడి దేవుని స్తుతించక 13వ, 14వచనాలలో నేను ఆకాశమునకు ఎక్కిపోయెదను, "దేవుని నక్షత్రములకు పైగా నాసింహాసనమును హెచ్చింతును" అంటున్నాడు. యోహాను (బాప్తీస్మమిచ్చు) ఆయన హెచ్చవలసినది నేను తగ్గవలసినది అంటూవుంటే సాతాను నేను నా సింహాసనమును హెచ్చింతును అంటున్నాడు. సాతాను ఇంకనూ ఉత్తరదిక్కున వున్న సభాపర్వతము మీద కూర్చుందును. మేఘమండలము మీద కెక్కుదును, మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని తన మనసులో అనుకున్నాడు. యెహాను సువార్త 8:23 వచనంలో ప్రభువు మీరు క్రిందివారు నేనుపై నుండు వాడను " అని యూదులతో చెప్పియుండగా, కొలొ 1:15-18లో ప్రభువు సృష్టికి ఆది సంభూతుడైయుండగా, సర్వము ఆయన యందు సృజింపబడి వుండగా అన్నింటి కన్నా ఆయన ముందుగా వుండగా, ఆయనే సమస్తమునకు ఆధారభూతుడై యుండగా, సంఘానికి ఆయనే శిరస్సైయుండగా, ఆయన ఆదియైయుండి మృతులలో నుండి లేచుట వలన ఆదిసంభూతుడై యుండగా, రోమా 9:5వచనం

ప్రకారం ఆయన సర్వాధికారియైన దేవుడై యుండి నిరంతరమూ (మానక) స్తోత్రార్హుడైయుండగా సాతాను అట్టి దేవునికి పైగా సింహాసనాన్ని హెచ్చించు కోవాలనుకున్నాడు. మహోన్నతునితో రారాజుతో ప్రభువుల ప్రభువుతో, భూపతులకు అధిపతితో, ఘనమైన మహారాజుతో, సర్వభూమికి రాజైనవానితో "నన్ను నేను సమానము చేసుకొందునుకున్నాడు." వెంటనే 15 వచనంలో సాతాను అగాథములో ఒక మూలకు త్రోయబడ్డాడు. సమాధిపొందక పారవేయబడిన కొమ్మవలె అయ్యాడు. చచ్చిన వారి శవములచే కప్పబడ్డాడు. త్రొక్కబడిన పీనుగవలె అయ్యాడు. పాతాళములో కేంద్రస్థానములో (Centre place లో) కాదు, ఒక మూలకు త్రోయబడ్డాడు. ఏదీ తన ఘనత? ఏమయ్యాయి తన కోరికలు ? కార్యరూపం దాల్చకుండా పోయాయి. అర్హతలేవీ లేకున్నా, ప్రధానత్వాన్ని, ఘనతను, హెచ్చింపును కోరుతూవుండే ఏ వ్యక్తికైనా యిలాగే జరుగుతుంది. ఇక ఎన్నడూ కోలుకొనకుండ అట్టడుగుకు వెళ్ళాల్సిందే. ఏమి లేని ఆకు ఎగిరెగిరి పడినట్టుయ్యింది. హామాను పరిస్థితి యిపుడు తాను కోరిన ఘనతను తానే మొర్దెకైకి ఇవ్వాల్సొచ్చింది. రాజు నీవు చెప్పి ప్రకారమే (అంటే ఒక్కటి తగ్గించకుండా) శీఘ్రముగా (అంటే యిప్పటికే 5 సం॥రాలు ఆలస్యమైంది) ఆ వస్త్రాలు, గుఱ్ఱము, కిరీటము అన్నీ తీసుకొని రాజు గుమ్మము నొద్ద కూర్చుని వున్న యూదుడైన మొర్దెకైకి (అప్పటికే మూడురోజుల ఉపవాస ప్రార్థన ముగించి తన విధి నిర్వహణకై రాజ గుమ్మానికి వచ్చిన మొర్దెకైకి) అలాగుననే చేయుము. నీవు చెప్పిన దానిలో ఒకటియూ కూడ విడువక అనగా తక్కువ కాకుండా (కీర్త 34:9 వచనంలో ఆయన యందు భయభక్తులు వుంచువానికి ఏమేలును కొదువై యుండదు) చేయుమని రాజు హామానుకు యిచ్చాడు.

ఎస్తే 4:1వ॥లో నిన్నటి వరకు బట్టలు చింపుకొని గోనెపట్టలు వేసుకొని బూడిద వేసుకొని పట్టణము మధ్యకు బయలు వెళ్ళి మహాశోకముతో రోదనముతో వుండిన మొర్దెకైని, తన్నుతాను తగ్గించు కొనిన దీనుడైన మొర్దెకైని ఈ రోజు వురి కొయ్యమీద వురి తీయబడవలసిన మొర్దెకైని, వురి తీసి రాణి విందుకు సంతోషంగా వెళ్ళాలనుకున్న హామాను, ఆ వస్త్రములను ధరింపచేసి తాను ఊరేగాలనుకున్న గుఱ్ఱము మీద మొర్దెకైని ఎక్కించి, రాజవీధిలో అతనిని నడిపించుచూ " రాజు ఘన పరచ అపేక్షించు వానికి ఈ ప్రకారము చేయతగును " అని మొర్దెకై ముందర చాటించాడు. మొర్దెకై ఆ రాజు కిరీటం, రాజ వస్త్రాలు ధరించినపుడు, రాజు గుఱ్ఱం మీద ఊరేగింప బడుతున్నపుడు ఎంతగా వెలిగిపోయాడో, యూదులు ఎంతగా సంతోషించారో, ఎస్తేరు ఎంత సంతోషించిదో,హామాను ఎంత పరాభవము పొందాడో ఇవన్నీ తలస్తుంటే దేవుని కార్యాలు ఎంత ఆశ్చర్యకరములో కదా! రాజు గుమ్మములో సెక్యూరిటీ గార్డ్‌గా వున్న మొర్దెకై గుఱ్ఱంపైన, ఆసీనుడై ఊరేగింపు పొందుతూ వుంటే ప్రధానమంత్రియైన హామాను క్రింద నడిపించుకొంటూ వెళ్ళుతూ వుంటే హామాను పరిస్థితి పూర్తిగా

తల్లక్రిందులైనట్టుంది. యూదుల ప్రార్థన హామాను పరిస్థితిని తల క్రిందుల చేసింది. యూదా దైవభక్తుడైన మొర్దెకైకి ఊహించని ఊరేగింపు, హెచ్చింపు కలిగించింది ప్రార్థనే. ఆయనే ఒకని హెచ్చించును. ఆయనే ఒకని తగ్గించును. తన్ను తాను హెచ్చించు కొను ప్రతివాడు (హామానులాంటివాడు) తగ్గించబడును. " తన్నుతాను తగ్గించుకొనువాడు (మొర్దెకైలాంటివాడు) హెచ్చింపబడును, (లూకా 14:11). ఇంతకూ, రాజు మొర్దెకైకి ఇవ్వనపేక్షించిన ఘనత స్థిరమైన ఘనత కాదు. అది తాత్కాలిక ఘనతయే. అలా కొంతసేపు మొర్దెకై వూరేగించబడి మళ్ళీ తన విధి నిర్వహణ కొఱకు తాను రోజూ వుంటున్న రాజగుమ్మము దగ్గరకే వచ్చాడు. హామానులాగ వెంటనే యింటికెళ్ళి తన తోడి వారికి రాజు తన్ను ఘనపరచిన సంగతి చెప్పుకోలేదు. మొర్దెకై తనకు కలిగిన ఘనతను, సన్మానాన్ని పెద్దగా పట్టించుకోలేదు. దానికై ముగ్ధమనోహరుడు కాలేదు. క్షణికమైన సంతోషానికి సన్మానానికి మురిసిపోలెదు. తన చిఱు వుద్యోగ నిర్వహణకై మళ్ళీ రాజగుమ్మానికే వచ్చాడు." ఇంతసేపు ఘనంగా వూరేగింపబడి అంతటి గొప్ప రాజుచే ఘనత పొందిన నేను మళ్ళీ యింత చిన్న వుద్యోగానికి రావాలా ? అని అనుకోలేదు. దేవుడు మనల్ని ఎంత హెచ్చించినా మనపూర్వస్థితిని మనము, మనపిల్లలు ఎప్పుడూ మరచి పోకూడదు రాజుగారేమో మొర్దెకై ద్వారా పొందిన మేలును జీవితకాలమంతా అనుభవిస్తున్నాడు గాని దానికి ప్రత్యుపకారంగా రాజు మొర్దెకైకిచ్చిన ఘనత కొన్ని గంటలు మాత్రమే. ఏ చరాస్తిగానీ, స్థిరాస్థి గాని మణులు, మాణిక్యాలు కానీ, రాజు యివ్వలేదు. హామాను తనంతటతానే పొందాలనుకున్నాడు. కానీ దేవుడు తన భక్తుడైన మొర్దెకైకు ప్రధానమంత్రి అయ్యే ఘనత యిచ్చాడు. మొర్దెకై ఘనతకెక్కడం వల్ల 16వ వచనంలో యూదులకు క్షేమము. ఆనందము. సంతృప్తి, ఘనత కలిగింది. మొర్దెకై పొందిన ఘనత యూదులకు కూడా విస్తరించింది. దేవుడు చేసే ప్రత్యుపకారం, మనుషులు చేసే ప్రత్యుపకారం కంటే ఎంతో శ్రేష్టమైనది. మన దేవుడు మహాఘనుడు కనుక తన ప్రజలను కూడ ఘనులుగానే చేస్తారు. యెష 1:2వలో "నేను నా పిల్లలను పెంచి వారిని గొప్ప వారినిగా చేసితిని" అన్నమాటలు ఈ సందర్భముతో మనం గమనించాలి. దావీదుతో కూడ దేవుడు లోకంలో ఘనులకు కలిగియున్న పేరువంటి పేరు నీకు కలుగ చేయుదును. నీ సంతతియు ఘనత చెందునని " I దిన 17:18,19 వ॥లో మాట యిచ్చారు. అలాగు ప్రియసోదరీలారా ! మనము పొందిన ఘనత, ఆశీర్వాదాలు, జ్ఞానము, హెచ్చింపు, అభివృద్ధి, మనమే కాక మన పిల్లలకు కూడ విస్తరిస్తే అది ఎంతదీవెనకరం ! అబ్రహామును దేవుడు బహుగా ఆశీర్వదించాడు. అతని ఆశీర్వాద అనుభవం అతని కుమారుడైన ఇస్సాకులో కూడా కనిపిస్తుంది. ఆది 26:12,13 వచనాలలో ఇస్సాకు గెరారు దేశమందున్నాడై (పరాయిదేశంలో) విత్తనము వేసి ఆ సంవత్సరము నూరంతలు ఫలము పొందాడు. యెహోవా అతని ఆశీర్వదించాడు గనుక, ఆ మనుష్యుడు గొప్పవాడయ్యాడు. అతడు మిక్కిలి

గొప్పవాడగు వరకు క్రమక్రమముగా అభివృద్ధి పొందుచు వచ్చాడు. అతని అభివృద్ధి చూచి యితరులు అసూయ పడ్డారు. ప్రియసోదరీలారా ! మనకున్న ఆశీర్వాద అనుభవాలు మన పిల్లలోనూ కనబడునట్లు ప్రార్థించాలి. మన నీతి కూడ మన పిల్లల పిల్లల తరము వుండాలి. మన ఆస్తిపాస్తులు వారికి వుంటే వుంటాయి లేకపోతే లేదు. కానీ మన నీతి తరతరాలుండాలి. అదే ప్రాముఖ్యం.

మొట్టకు తన ప్రాణాన్ని రక్షించి మేలుచేసిన మొర్దెకైకి రాజు యిచ్చిన కొంతసేపటి ఘనత, ఒక భక్తుడు చెప్పినట్లు, "చెట్టంత కవికి పిట్టంత సన్మానము" అన్నట్లుంది. కానీ ప్రియసోదరీ !మనల్ని మన పాపముల నుండి కడిగి, ఆత్మరక్షణ యిచ్చి, నరకము బారి నుండి మనలను విడిపించడానికి మానవరూపిగా ఈలోకానికి వచ్చి అన్యాయపు తీర్పును పొంది, బరువైన సిలువను మోసి మనవ్యసనములు వహించి, మన రోగములు భరించి, కాళ్ళ చేతులలో మేకులు కొట్టించుకొని, దిగంబరియై, సురూపమైనను సొగసైననూ లేక కురూపిగా మారిపోయి, తన రక్తాన్ని, నీటిని కార్చి, ప్రేమతో తన రక్తము ద్వారా మనలను కడిగి మనపాపముల నుండి మనలను విడిపించి, మనకొఅకు మరణించి తిరిగీ మృతులలో నుండి లేచి, తండ్రికుడి పార్శ్వమున కూర్చుండి మన కొఅకు విజ్ఞాపన చేస్తూ , మనలను తన స్వంత పెండ్లి భార్యగా చేసికొని, మనకొఅకు పరలోక రాజ్యాన్ని నిర్మిస్తూ మనలను తన చెంతకు చేర్చుకొనుటకు తిరిగీ రెండవసారి ఈలోకానికి రానైయున్న ప్రభువును మనమెంత ఎక్కువగా ఘనపరచాలో కదా! ఎందుకంటే ఆయన మహోఘనుడు కాబట్టి మహోఘనతకు ఆయన ముమ్మాటికి పాత్రుడే అలా ఆయనకు మహోఘనతకు ఆస్పదునిగా చేయక కొద్దిగానే ఘనపరిచితే ఒక భక్తుడు అన్నట్లు "చెట్టంత కవికి పిట్టంత సన్మానము" చేసినట్లే వుంటుంది. మన సంగతి కూడా.

దానియేలు గ్రంథములో 11:38వ॥లో కనిపించే ఉత్తరదేశపు రాజు క్రీస్తు విరోధికి సాదృశ్యంగా వున్నాడు. అతడు తన పితరులెరుగని దేవతను అనగా ప్రాకారముల దేవతను వారి దేవతలకు మారుగా ఘనపరుస్తాడట. బంగారును వెండిని, వెలగల రాళ్ళను, మనోహర వస్తువులను అర్పించి, ఆదేవతను ఘనపరుస్తాడట. ఈ క్రొత్త దేవత తనకు ఏమేలు చేసిందో ఎందుకు ఆదేతను ఘనపరస్తున్నాడో ఇక్కడ వ్రాయబడలేదు కానీ, సంఘమెత్తబడ్డాక అంత్యక్రీస్తు తన పాలనలో చివరి $3^1/_2$ సంవత్సరములు తన విగ్రహాన్ని నిలుపబెట్టి అందరూ ఆ విగ్రహాన్ని పూజించాలని శాశనము తెస్తాడు. ఆవిగ్రహము పేరుగానీ, 666 అను దాని సంఖ్యను గానీ నొసటి మీదగానీ చేతిమీదగానీ వేయించుకోవాలని అందరినీ అతడు బలవంతం చేస్తాడు.

ఆ విగ్రహానికి అతడు వెండి, బంగారు, వెలగల రాళ్ళ, ప్రశస్తమైన వస్తువులు యిచ్చి ఘనపరిస్తే, మనకొఅకు తన ప్రాణాన్నే పెట్టి రక్షించిన ప్రభువు యింకెంత వెండి, బంగారులు,

వెలగల రాళ్ళు, మనోహర వస్తువులు అర్పించాలో కదా! కొద్దిమందికి వారి చీరలే వారికి బంగారేమో? కొద్దిమందికి వారి సమయమే వారికి బంగారేమో మనము కలిగియున్న వాటినే ప్రభువుకిచ్చి ఆయనను ఘనపరుద్దాము కొద్దిమందికి వెల గలరాళ్ళు, వెండి, బంగారు, మనోహర వస్తువులు లేకపోవచ్చు పేతురు, యోహానులు బంగారు, వెండి, బంగారములు మాయొద్దలేవు అన్నారు. వెండినాది, బంగారునాది అన్నాడు ప్రభువు. కానీ ప్రభువు మన వెండి, బంగారు నాణెములు కోరుట లేదు. ఆత్మీయ ఇశ్రాయేలీయులమైన మన స్తుతుల మీద ఆయనను, మహిమపరచడం ద్వారా మనమాయనను ఘనపరిచినట్లే మీకా 6:6 వ॥లో వున్నట్లు, ఏమితీసికొని వచ్చి ఆయనను దర్శింపగలము? ఏమి తీసికొని వచ్చి మహోన్నతుడైన దేవుని సన్నిధిని నమస్కారం చేయాలి? దహన బలులను, ఏడాది దూడలను అర్పించాలా? వేలకొలది పొట్టేళ్ళా? వేలాదినదులంత విస్తార తైలమా? మన అతిక్రమముల కొరకై మన జ్యేష్ఠ పుత్రునా? ఏమివ్వగలము ప్రభువుకు? స్తుతులను మించి మనమివ్వగలిగినది ఇంకొకటి ఏమైనా వున్నాదా? మరుప లేనిమేలది. ఎన్నడూ తీర్చుకోలేని ఋణమది. ఎవడునూ, ఏవిధము చేతనైననూ తన సహోదరుని గానీ, సహోదరిని గానీ విమోచింపలేడు. మనము కుళ్ళు చూడక నిత్యము బ్రదుకున్నట్లు నిత్యజీవము నిచ్చినవారు ఎవరునూ లేరు మన నిమిత్తము దేవుని సన్నిధిని ప్రాయాశ్చిత్తము చేయగల వాడెవడును లేనపుడు, మన ప్రాణవిమోచన క్రయముగా తన ప్రాణాన్నే అనగా తన రక్తాన్నే ధారగా కార్చిన మనప్రియమైన యేసు ప్రభువు ద్వారా తండ్రియైన దేవుని అత్యున్నతంగా ఘనపరచాలి. కీర్త 49:8,9

## 13-14వ. హామాను చెడిపోవుటను గూర్చి, అతని భార్య స్నేహితులు అతనితో చెప్పుట :

13వ॥లో హామాను తనకు సంభవించిన దంతటిని గూర్చి తన భార్యయైన జెరెషుకును, తన స్నేహితులకును మునుపటివలె (ఎస్తేరు 5:10వ) చెప్పాడు. యెఫ్తా యెహో 11:11వ॥లో తన సహోదరుల ద్వారా తనకు సంభవించిన దంతటిని గూర్చి మిస్పాలో యెహోవా సన్నిధిని చెప్పుకున్నాడు. రక్తస్రావరోగము గలిగిన స్త్రీ తన పండ్రెండేళ్ళ రోగము సంగతి అంతయూ ప్రభువుతో చెప్పుకుంది. మనమును మనసంగతులన్నియూ ప్రభువుతోనే చెప్పుకోవడం మనకెంతో క్షేమకరం. కానీ హామాను తన సంగతి భార్యతోను, స్నేహితులతోను చెప్పుకునే అలవాటు కలవాడుగా కనిపిస్తున్నాడు. అలాగున ఎస్తే 5:10,11వ॥లలో వారి సలహాతో మొర్దెకైకి ఉరికొయ్య సిద్ధపరచిన హామానుతో వారు "ఎవనిచేతనీకు అధికార నష్టము కలుగుచున్నదో ఆ మొర్దెకై యూదుల వంశపువాడైన యెడల అతని మీద నీకు జయము కలుగదు అని అతని ఖర్మకు అతన్ని వదిలేస్తున్నారు. ఈమాటను బట్టి యూదుల మీద ఎవరునూ వారెంతటివారైననూ

జయము పొందలేరు అన్న సత్యము మనకు తెలియచున్నది. యూదులకు దేవుడు ఎంతతోడుగా వున్నాడోకదా! జెకర్యా 2:8వ॥లో మిమ్మును ముట్టినవాడు నాకనుగుడ్డును ముట్టిన వానితో సమానమని ప్రభువు చెబుతున్నాడు. యూదులు దేవుని జనాంగము వారిద్వారా అన్యజనులను రక్షించుట దేవుని చిత్తమయ్యింది. రోమా 9:4-5వ॥ ప్రకారము వీరు ఇశ్రాయేలీయులు దత్తపుత్రత్వము, నిబంధన, ధర్మశాస్త్రములు, అర్చనాచారాదులు, వాగ్దానములును వీరివి. పితరులు వీరివారు, శరీరమును బట్టి క్రీస్తు వీరిలో పుట్టాడు. ఇన్ని ఆధిక్యతలున్న వీరు దేవుని కనుగ్రుడ్డులాంటివారు. వీరిని చెరపవలెనని కోరుకునే వారు అవశ్యముగా చెడిపోతారని అన్యులైన హామాను భార్య, స్నేహితులు చెప్పడం మనకాశ్చర్యాన్ని కలిగిస్తోంది. 14వ॥లో వారింకనూ మాట్లాడుచుండగా రాజసేవకులు ఎస్తేరు చేసిన విందుకురమ్మని హామానును త్వరపెట్టారు. హామాను నాశనము కునికి నిద్రించలేదనే మాట నిజముగానే జరుగుతోంది. అది జరుగుటకు ఆతురపడుతోంది.

❖ ❖ ❖

## 7వ అధ్యాయము 6+2+2=10వ.

**అంశము :** హామాను ఉరితీయబడుట

**విభజన :** 1-6వ. రెండవనాడు రాజుతో ఎస్తేరు చేసిన విజ్ఞాపన

7-8వ. రాజు ఆగ్రహము

9-10వ. హామాను ఉరితీయబడుట.

### 1-6వ. రెండవనాడు రాజుతో ఎస్తేరు విజ్ఞాపన చేయుట :

రెండవనాడు ద్రాక్షారసపు విందులో రాజు ఎస్తేరు రాణీ! నీ మనవి ఏమిటి ? అని ఎస్తేరురాణితో అన్నాడు, అప్పుడు ఎస్తేరురాణి, "రాజా! నీ దృష్టికి నేను దయ పొందిన దాసనైతే, నీకు సమ్మతియైతే, నా విజ్ఞాపనమును బట్టి నా ప్రాణమును, నా మనవిని బట్టి నా జనులను నాకనుగ్రహింప బడుదురుగాక"! అని రాజుతో మనవి చేసింది. ఈ వాక్యము యొక్క అర్థమేమిటంటే, నా జీవితము నీ దయను పొందతగినదైతేనే నా మనవి వినండి లేకపోతే వద్దు అని చెప్పినట్టుంది. ఎవరి యెడల దేవుడు దయాళుడైవున్నాడు ? కీర్త 73: 1వ॥ ప్రకారము శుద్ధ హృదయుల యెడల దేవుడు దయాళుడై వున్నాడు. అంటే శుద్ధ హృదయంతో ఎస్తేరు రాజు సన్నిధికి వచ్చి విజ్ఞాపన చేస్తోందన్నమాట. అంతేకాక నీకు సమ్మతియైతేనే, నా మనవి విను. లేకపోతే వినవద్దు అన్నట్లే ఆమె రాజుతో మనవి చేస్తోంది. అనగా ఆమె జీవితంపట్ల

రాజు సమ్మతిగా వున్నట్లైతేనే తన మనవి వినమంటోంది. లేకపోతే వినవద్దంటోంది. ఇలా నా జీవితము నీ దయకు పాత్రమైనట్లైతే, నీకు సమ్మతిగా నా జీవితమున్నట్లైతే, నావిజ్ఞాపన ద్వారా నా ప్రాణము, నా మనవిని బట్టి నా జనులు నాకు అనుగ్రహింపబడాలి అని రాజుతో ఆమె చేస్తున్న మనవిలో సవాలు చేయుచున్నట్లుగా ఆమె కనబడుతోంది. మనమిలాగున ప్రార్థించగలుగుచున్నామా ? పరమ రాజు సన్నిధిలో ప్రార్థించుటకు వెళ్ళేముందు మన జీవితము ఆయనకు సమ్మతిగా వుందో లేదో ముందు చూచుకోవాలి. అలాగున సమ్మతి వుంటేనే జవాబు వెంటనే వచ్చేస్తుంది. అందుకే, ప్రసంగి 5:1వ॥లో నీ దేవుని సన్నిధికి వెళ్ళునపుడు నీ ప్రవర్తన జాగ్రత్తగా చూచుకొనుమని వ్రాయబడింది. అలాగైతే మన ప్రార్థన జీవితం, సాక్షజీవితం, మన సమర్పణ జీవితం, మన సేవా జీవితం, మన పవిత్ర జీవితం మన ఐక్యత, మన ఆత్మీయ జీవితం, పొరుగు వారితో మన జీవితం, కుటుంబీకులతో మన జీవితం, ఉద్యోగంలో మన జీవితం, స్థానిక సంఘంలో మన జీవితం ఆయనకు సమ్మతంగా వున్నాయా? అలాగైతే అనుమానమే లేదు. మన ప్రార్థన ప్రభువు ఆలకించి మనమడిగిన వాటిని నిశ్చయంగా అనుగ్రహిస్తాడు ఇక్కడ ఎస్తేరు అడిగిన అంశము ఏమిటి? తన ప్రాణము, తన జనుల ప్రాణాన్ని తన కనుగ్రహించబడాలని కోరుకుంది. లౌకికాన్ని అడుగలేదు. తన జనుల ప్రాణ విమోచన కొరకై అడిగింది. మనమును, అలాగే అనేక మంది మనుషుల పాప విమోచన కొరకై సమ్మతి గల జీవితముతో ఆయన సన్నిధికెళ్ళి పవిత్ర హృదయంతో ప్రార్థించుదము గాక!

4వ.లో వారు దాసులముగాను, దాసురాండ్రముగాను మేము అమ్మబడలేదు అని రాజుతో మనవి చేస్తోంది. కారణమేంటంటే 70 యేండ్ల బబులోనుచెర ముగిసింది. కనుక నేడు వారు దాసులు, దాసురాండ్రు కారు. స్వతంత్రులే. నేడు యూదులందరూ స్వతంత్రులే కాని, యూదుల విరోధియైన హామాను స్వతంత్రులైన వీరిని సంహరించుటకు, నశింపచేయుటకును వీరందరినీ వధకు సిద్ధమైన గొఱ్ఱెలనుగా తయారుచేశాడు. యూదుల నశించుటకు అమ్మబడిన వారిగా హామాను వారిని తయారు చేశాడు. ఇట్టి పరిస్థితులలో "మా విరోధిని తప్పించుకొనుటకు మిమ్మును శ్రమపరచుట యుక్తము కాదు" అని ఎస్తేరు రాజుతో అనింది. తన సమస్యలతో రాజును శ్రమపరచడం ఎస్తేరుకు ఇష్టము లేదు. మనలో ఎంత మందినైనను మన విరోధియైన అపవాది నుండియు మన పాపముల నుండియు నరకము నుండియు తప్పించి రక్షించుట కొరకై శ్రమ పడుటకు మన ప్రభువుకు యిష్టమే. ప్రభువు రక్తము కార్చి మనలను విరోధి నుండి తప్పించారు.

మనలో ఎంత మంది మన జీవితాలు సరిగా లేకున్నా, మన మనవులతో ప్రభువును ఎల్లప్పుడు శ్రమ పెడుతూ విసిగిస్తూనే వుంటున్నామా? మన జీవితాలు ఆయనకు దుఃఖము

కలిగించేవిగా వుంటున్నాయా? ఆయనతో సఖ్యత, నమ్రత అవసరం. 5వ॥లో రాజు ఈకార్యము చేయుటకు తన మనసును దృఢపరచుకొన్నవాడు దుష్టుడైన ఈ హామానే అని చెప్పింది. అవును, హామానులో సాతానుని చూస్తున్నాము. ఈ సాతాను దేవుని పిల్లలైన మన సేవకులను, మన సేవను మనలను, మన పిల్లలను, మన సంఘాలను. సంహరించి నశింపచేయుటకును తన మనసును దృఢపరచుకున్నాడు. కీర్త 119:86వ॥లో పగవారు (సాతాను, వాని దూతలు) నిర్నిమిత్తముగా తరుముచున్నారు. భూమిమీద వుండకుండ వారు నన్ను నాశనము చేయుటకు కొంచెమే తప్పెను" అని వ్రాయబడింది. దీన్ని బట్టి అనేకసార్లు సాతాను మనల్ని నాశనము చేయవలెనని పొంచి వుండగా ప్రభువు మనల్ని రాత్రింబవళ్ళు కనుపాపవలె కాపాడుచూ. కొంచెములో తప్పించు చున్నాడు. పాప మానవులను రక్షించుటకై ప్రభువు తన మనసును దృఢపరచుకుంటే, వారందరినీ నరకమనే నాశనములోనికి పడవేయాలనే దృఢమైన మనస్సును సాతాను కలిగి వున్నాడు. అలా తన మనస్సును దృఢపరచుకొన్నవాడేడి? అని రాజు అన్నప్పుడు "మా విరోధియగు, మా పగవాడు దుష్టుడైన ఈ హామానే" అని ఎస్తేరు రాజుతో అనింది. II థెస్స 2 : 8వ॥లో సాతాను ధర్మవిరోధి అని వ్రాయబడింది. I పేతురు 5:8వ॥లో "విశ్వాసులకు విరోధియైన సాతాను ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచూ వున్నాడు" అని వ్రాయబడివుంది. I యోహా 2:13వ॥లో సాతాను దుష్టుడు అని వ్రాయబడ్డాడు. మా విరోధి పగవాడు దుష్టుడైన హామానే అని ఎప్పుడైతే ఎస్తేరు అనిందో అప్పుడు హామాను రాజు ఎదుటను, రాణి యెదుటను భయాక్రాంతుడై పోయాడు. కీర్త 6:8-10వ "యెహోవా నా విన్నపమును ఆలకించి యున్నాడు. యెహోవా నా ప్రార్థన అంగీకరించును. నా శత్రువులందరు సిగ్గుపడి బహుగా అదరుచున్నారు. వారు ఆకస్మికముగా సిగ్గుపడి వెనుకకు మళ్ళెదరు. కీర్త 56:9వ॥ మరియు పైన చెప్పిన వచనములన్నింటిలో వ్రాయబడినట్టు మనము మొఱ్ఱపెట్టిన దినమున శత్రువు వెనుకకు తిరుగుతాడు. మనము మొఱ్ఱపెట్టని దినమున మనకు మనమే వెనుకకు తిరుగుతాము కనుక యెడతెగక ప్రార్థన చేయాలని I థెస్స 5:15వ॥లో వ్రాయబడినట్లు మనము యెడతెగక ప్రార్థన చేస్తూ సాతాను వెనుకకు తిరిగేటట్లు చేయాలి.

### 7-8వ॥ రాజు ఆగ్రహము :

ఎస్తేరు మనవిని వినిన రాజు వెంటనే ఆమెకు జవాబియ్యక ద్రాక్షా విందును విడిచి నగరు వనమునకు వెళ్ళిపోయాడు. కానీ, తిరిగి రెండవ సారి వనములో నుండి ద్రాక్షారసపు విందు స్థలమునకు వచ్చినపుడు రాజు ఎస్తేరుకు జవాబిస్తున్నాడు. అలాగుననే మనము చేసే కొన్ని విన్నపములకు యిప్పుడే జవాబు ప్రభువు నుండి రాకపోయినప్పటికీ ప్రభువు రెండవ

రాకడలో సంఘమును ఆకాశమండలమునకు తీసికొనిపోవుటకు వచ్చినపుడు మన సమస్యలకు జవాబులను ఆయన దయచేయువాడుగా వున్నాడు. ముఖ్యముగా మనలను శోధించుచూ, రాత్రింబగళ్ళు మన మీద నేరములు మోపుచున్న సాతాను విషయములో మనము చేసిన మొరలకు జవాబులు యేసు క్రీస్తు రెండవ రాకడలో మనము కనుగొంటాము.

8వ॥లో రాజు విందు స్థలమునకు వచ్చినపుడు ఎస్తేరు కూర్చుండియున్న శయ్యపై హామాను పడియుండుట రాజు చూచి – "వీడు యింటిలో నా సముఖము ఎదుటనే రాణిని బలవంతము చేయునా"? అని రాజు అనగానే భటులు హామాను ముఖమునకు ముసుకు వేశారు. 7వ॥లో హామాను రాజు తనకు ఏదో హాని చేయనుద్దేశించెనని తెలిసికొని రాణియైన ఎస్తేరు ఎదుట తన ప్రాణము కొరకు విన్నపము చేయుటకై నిలిచెను అనివ్రాయబడింది. కానీ 8వ॥లో "ఎస్తేరు శయ్యమీాద పడియుండెను" అని వ్రాయబడుట గమనిస్తున్నాం. అలా పడియుండుటను రాజు చూచి నా రాణిని నా యెదుటనే బలవంతము చేయునా? అని రాజు అనడము చూస్తే, ఆలోచిస్తూ వుంటే రాజుకు హామాను విషయమై మంచి ఆలోచనలు రావడము లేదు. అన్నీ చెడు ఆలోచనలే వస్తున్నాయి. ముందు హామాను ఎస్తేరు ఎదుట విన్నపము చేయుటకు నిలిచినట్లు, మరల శయ్య మీాద పడియుండినట్లు, చూస్తున్నాము. అవును దేవుడు మన శత్రువులను మన పాదములకు పీఠముగా చేస్తాడు. నీ శత్రువుల ఎదుట నీకు భోజనము సిద్ధము చేస్తానన్నాడు ప్రభువు. కీర్త. 66:3వలో నీ బలాతిశయమును బట్టి ( ప్రార్థన బలాతిశయమును బట్టి) నీ శత్రువులు లొంగి నీ యొద్దకు వచ్చెదరు" అని వ్రాయబడుటను ప్రభువు ఎస్తేరు విషయములో నెరవేర్చాడు. యెష 60:14వ॥లో నిన్ను బాధించిన (హామాను) సంతానపు వారు నీ యెదుటికి వచ్చి సాగిలపడెదరు. నిన్ను తృణీకరించెడి (హామాను) వారందరు వచ్చి నీ పాదముల మీాద పడెదరు అను మాటలను దేవుడు ఎస్తేరు, ఆమె జనుల విషయమై నెరవేర్చాడు. యిర్మి 15:11వ॥ కీడు కాలమున ఆపత్కాలమున నీ శత్రువులు నిశ్చయముగా నీకు మొరలిడునట్లు చేస్తానను వాక్యాన్ని దేవుడు ఎస్తేరు పట్ల నెరవేర్చాడు. ఎస్తేరు పట్ల మాత్రమే కాదు, ప్రియ సోదరీ! మన అందరి వ్యక్తిగత జీవితములో కూడ ప్రభువు అలాగుననే చేయువాడై యున్నాడు. 8వ. వచనంలో హామాను ముఖమునకు ముసుకు వేసుకున్నట్లు, 6:12వ, లో హామాను తలకు గుడ్డ కప్పుకున్నట్లు ఆ తరువాత హామాను ఉరితీయబడినట్లు వ్రాయబడింది. దేవుని బిడ్డలను శ్రమపెట్టే మరెవ్వరికైనను జరిగేది ఈలాగే. ఎస్తేరు 6:13వలో "యూదుల వంశపు వాడైన మొర్దెకై వలన నీకు అధికార నష్టము కలుగుతున్నట్టైతే నీవు అవశ్యముగా చెడిపోదువు" అని జెరెషు, స్నేహితులు–హామానుతో ముందే అన్నారు. వారు అన్నట్లే అవశ్యముగానే హామాను చెడిపోయాడు. జెకర్యా. 2:8వ॥ వున్నట్లు దేవుని బిడ్డలను ముట్టితే దేవుని కనుగ్రుడ్డును ముట్టినట్లే.

**9-10వ॥లో రాజు ఆగ్రహము చల్లారుట :**

9వ॥ ఏబది మూరల వురికొయ్య హామాను యింటి యొద్ద నాటబడియున్నదని రాజు షండులలో ఒకడైన, హర్బోనా చెప్పగా "దాని మీద వాని వురి తీయుము" అని రాజు ఆజ్ఞ యిచ్చాడు. 9వ॥లో రాజు భార్యను, (ఎస్తేరును) రాజు భార్య వంశమును నిర్మూలము చేసి కీడు చేయ తలపెట్టి, రాజు బావమరిది అయిన మొర్దెకైను (రాజుకు మేలు చేయువాడిని) వురితీయాలని కోరిన దుష్టుడే ఈ హామాను. 6 :7-9వ॥లో రాజ వస్త్రములను ధరించి, రాజకిరీటమును పెట్టుకొని, రాజు యొక్క గుఱ్ఱమును ఎక్కి ఘనపరచబడి ఊరేగింపు పొందాలని రాజు అవ్వాలని, రాజు యొక్క సింహాసనము కోరుకొని రాజుకే ఎసరు పెట్టాలని తలంచిన ద్రోహి ఈ హామాను. అలాగైతే మన మెవరివలె వున్నాము? మొర్దెకై వలె వున్నామా? లేక హామాను వలె వున్నామా? మేలు చేయువాడు (మొర్దెకై) దేవుని సంబంధి? దేవుని మూలముగా పుట్టినవాడు దేవుని సంబంధి వానిలో దేవుని బీజము నిలుచును గనుక హామానులాంటి కయీనులాంటి పాపములు అతడు చేయడు. దీనిని బట్టి దేవుని పిల్లలెవరో అపవాది పిల్లలెవరో తేట పడుతుంది. తన సహోదరుని, సహోదరిని ప్రేమింపని ప్రతివాడు దేవుని సంబంధులు కారు. మనము మేలు చేసే మొర్దెకైలాంటి వారమై వుండాలి. కానీ పాపము చేయు హామానులాంటి వారమై వుండకూడదు.

ఆ వురికొయ్యను తన యింటి వద్దనే నాటించాడు హామాను. తన యింటిలో తాను నాటించిన ఆ వురికొయ్య మీద తానే ఉరితీయింప బడబోవుచున్నానని తానెన్నడు, కలలోనైనా వూహించలేదు. చెరపకురా చెడెదవు అన్న సామెత ప్రకారమే జరిగింది. యెష 54:17వ॥ ప్రకారం "నీకు విరోధముగా రూపింపబడిన ఏ ఆయుధమును వర్థిల్లదు" అన్న వాక్యములు మొర్దెకై యెడల నెరవేరాయి. "గుంటను త్రవ్వువాడే దానిలో పడును, రాతిని పొర్లించువాని మీదికి అది తిరిగివచ్చును." (సామె 26:27వ॥) వాక్యము హామాను విషయంలో నెరవేరింది. "వాడు గుంట త్రవ్వి దానిని లోతు చేసివున్నాడు. తాను త్రవ్విన గుంటలో తానే పడిపోయెను". (కీర్త 7:15వ॥) అను వాక్యము కూడ హామానులో అక్షరాల నెరవేరింది. కీర్త 57:6 వ॥ నాయెదుట గుంట త్రవ్వి దానిలో తామేపడిరి. (కీర్త 94:21-23) దుష్టులు (హామాను) నీతిమంతుల (యూదుల) ప్రాణము తీయుటకై వారి మీదపడుదురు. దోషులని నిర్దోషులకు (మొర్దెకై) మరణము విధింతురు. యెహోవా నాకు (మొర్దెకైకి, ఎస్తేరుకు, యూదులందరికీ) ఎత్తైనకోట, నాదేవుడు నా ఆశ్రయ దుర్గము. ఆయన వారి దోషము వారి మీదికి రప్పించును. వారి చెడుతనమును బట్టి వారిని సంహరించును" ఈ వాక్యాలన్నీ యూదుల పగవాడైన హామాను యెడల నెరవేరాయి. 10వలో అప్పుడు రాజు యొక్క ఆగ్రహము చల్లారింది అని వ్రాయబడింది. మన శత్రువుల యెడల కూడా ప్రభువు ఆగ్రహము చల్లారే సమయము

ఆసన్నమౌతోంది. తన రెండవ రాకడలో ప్రభువు విశ్వాసుల విరోధియైన అపవాదిని వెయ్యి యేండ్లు అగాధములో బంధించనైయున్నాడు. ఆ తరువాత అపవాది మండుచున్న అగ్ని గంధకములతో నిండియున్న నరకములో పడద్రోయబడతాడు. అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు వుండును. అంతట మన ప్రభువు యొక్క ఆగ్రహము (సాతానుపట్ల) కూడ చల్లారుతుంది. అప్పుడు ఆయన పిల్లలమైన మనము ప్రభువుతో కలసి యుగాయుగములు పరలోకంలో నివసిస్తాము.

❖ ❖ ❖

## 8వ అధ్యాయము 2+4+2+6+3 = 17వ

**అంశము :** రెండవ శాశనము అమలు చేయుట.

**విభజన :** 1–2వ మొర్దెకై ప్రజలందరికీ పరిచయమగుట హామాను ఇంటి మీద అధికారం పొందుట.

3–6వ. యూదుల పక్షంగా ఎస్తేరు చేసిన విజ్ఞాపన

7–8వ. ఎస్తేరు ప్రార్థనకు రాజు ఇచ్చిన జవాబు

9–14వ. రెండవ శాసన తాకీదులు సంస్థానములన్నింటికి పంపబడుట

15–17వ. మొర్దెకై ప్రధాన మంత్రి అగుట దాని వలన యూదులకు కలిగిన మేలులు

### 1–2వ. మొర్దెకై ప్రజలందరికీ పరిచయమగుట – హామాను ఇంటి మీద అధికారము పొందుట :

1వ॥లో మొట్ట మొదటిసారిగా మొర్దెకై రాజ సన్నిధికి వచ్చాడు. అప్పుడే మొర్దెకై రాణి యొక్క అన్నగా, రాజుకు పరిచయమయ్యాడు. ఇప్పుడు రాజు హామాను ఇంటిని ఎస్తేరుకిచ్చాగా, ఎస్తేరు ఆఇంటి మీద అధికారాన్ని మొర్దెకైకి యిచ్చింది. రాజు హామాను వుంగరమును అనగా హామాను కోల్పోయిన అధికారాన్ని మొర్దెకైకి యిచ్చాడు. రాజు మొర్దెకైని పిలిచి, ప్రధానమంత్రి పదవి యిచ్చాడు. కొద్ది పనిలో మొర్దెకై నమ్మకముగా వున్నందున, గొప్ప పని మీద అధికారాన్ని ప్రభువు రాజు ద్వారా మొర్దెకైకి యిచ్చాడు. అలాగే మన ప్రభువు తన వెయ్యేండ్ల పాలనలో చిన్న పనిలో ఇప్పుడు నమ్మకముగా వుంటున్న తన పిల్లలమైన మనకు అనేకమైన వాటి మీద అధికారమిస్తాడు. నెహె 7:2వలో నెహెమ్యా తన సహోదరుడైన హనానీకిని, కోటకు అధిపతియైన హనన్యాకును యెరుషలేము పైన అధికారమిచ్చాడని

వ్రాయబడింది. దానికి కారణము హనన్యా నమ్మకమైన మనుష్యుడును అందరికంటే యెహోవా యందు భయభక్తులు గలవాడై యుండుటయే. అలాగే మొర్దెకై యెహోవాయందు భయభక్తులు గలవాడు, ఉపవాస ప్రార్థనలు చేయువాడు. తన జనుల రక్షణ విషయమైన భారము కలిగినవాడు. పనిలో శ్రద్ధ గలవాడు. శ్రద్ధ గలవారు ఏలుబడి చేయుదురని సామె 12:24వలో వ్రాయబడింది. పనిలో మొర్దెకై నమ్మకమైనవాడు. అపనమ్మకస్తులైన బిగ్తాను, తెరెషు అనుద్వారపాలకులు రాజును చంప చూడగా మొర్దెకై రాజు ప్రాణమును కాపాడినవాడుగా వున్నాడు. నమ్మకమైన వానికి దీవెనలు మెండు అన్నవాక్య ప్రకారము దీవెనకు గుర్తుగా గొప్ప పదవి మొర్దెకై కివ్వబడింది. మోషే దేవుని ఇల్లంతటిలో నమ్మకమైనవాడు. ప్రియ సోదరీ! ప్రభువు నీకు అప్పగించిన పనిలో నమ్మకంగా వున్నావా ? నీ భర్తకు, నీ అధికారికి, నీ ప్రభువుకు, నీ ఇంటి వారికి అన్ని విషయాలలో నమ్మకంగా వున్నావా ? లేక నమ్మకము నీలో నుండి తొలగిపోయిందా ?

సామె 13:22లో మంచివాడు తన పిల్లల పిల్లలను ఆస్తికర్తలనుగా చేయును. కానీ పాపాత్ముల ఆస్తి నీతిమంతులకు యివ్వ బడుచున్నది, అను వాక్య ప్రకారము హామాను ఆస్తి, హామాను పిల్లలకు రాలేదు. పాపాత్ముడైన హామాను ఆస్తి నీతిమంతుడైన మొర్దెకైకి దేవుడు యిచ్చాడు. హామాను యింటిని రాజు ఎస్తేరుకిచ్చినట్లు, యేసు ప్రభువు ఈ లోకాధికారి యైన సాతాను యొక్క ఇల్లు అనబడిన ఈ లోకాన్ని వేయి యేండ్ల పరిపాలనలో తన ప్రజలమైన మనకు పంచియిచ్చే వాడుగా వున్నాడు. ప్రసంగి 2:26 ప్రకారము దైవదృష్టికి యిష్టుడగు వానికిచ్చుటకై ప్రయాసపడి పోగుచేయుపనిని ఆయన పాపాత్ములకు నియమించును. హామాను డబ్బుపెట్టి, అందంగా అన్నీ హంగులతో, అనుకూలతలతో తన ఇంటిని కట్టివుండవచ్చును. ఆ కష్ట పడే పనిని, ప్రయాసపడే పనిని ఆయన పాపాత్ముడైన హామానుకు పెట్టాడు. దైవదృష్టికి మనము కూడా యిష్టులమైతే ప్రభువు మనల్ని కూడ పెద్దచూపుతో చూస్తాడు. కీర్తన 105:45వ వచనంలో ఆయన తన ప్రజలకు అన్యజనుల స్వాస్థ్యమును అప్పగించాడు. అని వ్రాయబడినట్లు ఇశ్రాయేలీయులకు కనాను దేశాన్ని అప్పగించాడు. ఇప్పుడు హామాను యింటిని ఆ ప్రభువు ఎస్తేరుకు అప్పగించాడు. యోబు 27:16,17,18 వచనాల్లో దేవుని బిడ్డల శత్రువులు ధూళి అంత విస్తారముగా వెండిని పోగుచేసినను జిగట మన్నంత విస్తారముగా వస్త్రములను సిద్ధపరచుకొనినను వారు దానిని సిద్ధ పరచుకొనుటయేగాని నీతిమంతులు దాని కట్టుకొనెదరు. నిరపరాధులు ఆవెండిని పంచుకొనెదరు. పురుగుల గూళ్ళ వంటి ఇండ్లు వారు కట్టుకొనెదరు. కావలివాడు కట్టుకొను గుడిసె వంటి ఇండ్లు వారు కట్టుకొందురు. వారు ధనము గలవారై పండుకొనెదరు గాని మరల లేవరు కన్నులు తెరవగానే లేకపోయెదరు. అని వ్రాయబడినట్లే హామాను విషయంలో అక్షరాల ప్రభువు నెరవేర్చాడు. హామాను ఇల్లు, హామాను ఇంటిలోని

ధనము, వెండి, బంగారులు, ఇంటిలోని ఐశ్వర్యము అన్నీ ఎస్తేరు కివ్వబడ్డాయి. ఎస్తేరు ఆ ఇంటి మీద అధికారాన్ని తన అన్నయైన మొర్దెకైకి యిచ్చింది. మన సంతతికి పగవారి గవినిని స్వాధీనపరచుకునే వారిగా ఆది 24:60వ॥ ప్రకారం ప్రభువు చేస్తారు. నీతిమంతుని ఇల్లు నిలుచును అని సామె 12:7లో వ్రాయబడింది. కానీ అనీతిమంతుడైన హామాను ఇంటి మీద అధికారము దేవుడు నీతిమంతుడైన మొర్దెకైకిచ్చాడు. కీర్తన 105:44-45వలో వ్రాయబడినట్లు ఎందుకు దేవుడు నీతిమంతులకు పాపాత్ముల, భక్తిహీనుల స్వాస్థ్యము అప్పగించాడంటే కీర్త 105:44,45వ॥లో వారు తన కట్టడలను గైకొనునట్లు తన ధర్మ శాస్త్ర విధులు ఆచరించునట్లు అన్యజనుల భూములను ఆయన వారికప్పగించెను. అని వ్రాయబడింది. ఎస్తేరు మొర్దెకై తనకు ఏమికావలెనో అది తెలియచేసిన మీదట మొర్దెకై రాజు సన్నిధికి వచ్చాడు. రాజు సన్నిధికి వచ్చాడు, అంటే రాజు రమ్మని చెప్పి వుంటేనే లేక రాజదండము చాచి వుంటేనే వచ్చివుంటాడు. కానీ మొర్దెకై తాను రాణి యొక్క 'అన్న' అని చెప్పుకునే శోధనలో ఎన్నడు పడలేదు. ప్రభువు తనను హెచ్చించే వరకు ఆయన ఓపికగా వున్నాడు. నీవు రాణి అయ్యాక నన్ను జ్ఞాపకము చేసికోమని కూడ అతడు ఎస్తేరుతో చెప్పలేదు. ఆయనే ఒకని హెచ్చించును, ఒకని తగ్గించును అని మొర్దెకై దేవునిపైనే ఆధారపడ్డాడు. మొర్దెకైని దేవుడు హెచ్చించే వరకు ఆయన బలిష్టమైన రెక్కల క్రింద దీనమనస్సు కలిగి వున్నాడు. దీనమైన పనిని అనగా రాజ గుమ్మము దగ్గర సెక్యూరిటీగార్డ్‌గానే వుండుటకు యిష్టపడ్డాడు. రాజు ఏలుబడిలో 10వసం॥ ఎస్తేరు రాణిగా హెచ్చింపబడింది. కానీ (ఎస్తే 2:12) రాజు ఏలుబడి 12వ సం॥ హామాను యూదుల నాశనమును గురించి మొదటి శాశనము వ్రాయించాడు. ఎస్తేరు (3:7) అనగా తన చెల్లియైన ఎస్తేరు రాణి పదవిలో రెండు సంవత్సరముల నుండి వుంటున్నా, మొర్దెకై తాను వాచ్‌మన్‌గా దీన స్థితిలోనే వుండి పోయాడు. రాణిగా వుంటున్న తన చెల్లికి చెప్పుకుని పెద్ద పదవులు రాజుద్వారా పొందాలి. అని కూడ అనుకోలేదు. దేవుడు హెచ్చించే వరకు అదే చిన్న పనిలో నమ్మకంగా వుంటూ వచ్చాడు. బిగ్తాను, తెరెషుల నుండి తనను మొర్దెకై కాపాడినందుకు రాజు ఏదైనా బహుమానము తనకివ్వకపోయినా, మొర్దెకై ఎస్తేరు ద్వారా ఆ ప్రయత్నాలేమీ చేయలేదు. దేవుని సమయానికే మొర్దెకై ఎదురుచూచాడు. ఈ విషయాలన్నింటిలో మొర్దెకై మనందరికీ ఎంతో మాదిరంగా వుండుట మనకాశ్చర్యాన్ని కలిగిస్తోంది.

### 3-6వ. యూదుల పక్షంగా ఎస్తేరు చేసిన విజ్ఞాపన :

ఈలాగున ఎస్తేరు రాజు దృష్టికి దయపొందినదై, ఇంపైనదిగా వుంటూ, యుక్తముగా మనవి చేస్తూ "యూదులను నాశనము చేయుటకు హామాను వ్రాయించిన తాకీదుల చొప్పున

జరుగకుండునట్లు వాటిని రద్దు చేయుటకు ఆజ్ఞ ఇవ్వమని రాజు పాదాలు పట్టుకొని మనవి చేసింది. రాజు ఆమె మనవి విన్నాడు. దీనిని బట్టి మన మనవిని ప్రభువు ఆలకించాలి అంటే, ఆయన దృష్టికి మనము దయపొందిన వారముగాను, ఇంపైన వారముగాను, వుండి, యుక్తముగా ప్రార్థనలు చేసినట్లయితే తప్పకుండా ప్రభువు మన మనవి ఆలకిస్తారు. చాలా సార్లు ఈ లాంటి జీవితం లేకుండా ప్రార్థనలు చేసినా జవాబు రాదు. కనుక జీవితాన్ని పరీక్షించుకోడం ఎంతో అత్యవసరం. ఎందుకంటే, ఎస్తేరులాంటి జీవితం ఎస్తేరుకు లేకుంటే ఆమె మనవిని రాజు అంగీకరించకుండా వుండేవాడు. రాజు అలా అంగీకరించకపోతే యూదులు నశించేవారు. ప్రియ సోదరీలారా! ఈనాడు మనము ఎస్తేరులాంటి జీవితం మనకు లేక పోవుట వలన మన ప్రార్థన ఆలకింపబడక పోవుట వలన ఎంతో మంది రక్షణలేక నశించిపోవుటకును, వారికి మన ద్వారా మేలుకలుగక పోవుటకును కారణమౌతామన్న సంగతిని యిప్పుడే గ్రహించి అలాంటి జీవితాన్ని జీవించుటకు త్వరపడడం నేడు మనము చేయవలసిన ప్రథమ కర్తవ్యం. అలాగున ఎస్తేరు. 8:6వ॥లో నా జనుల మీదికి రాబోవుకీడును, నా వంశము యొక్క నాశనమును చూచి ఏలాగు సహించగలను? అని రాజుకు మనవి చేసింది. ఒకవేళ ఆ శ్రమదినమున రాజు భార్య కాబట్టితాను తప్పించుకోగలదేమో! కానీ తన వంశము వారిని నాశనము నుండి ఎవరు తప్పిస్తారు? వారి నాశనాన్ని ఆమె ఊహించ లేకపోతోంది? "నేను చూచి సహించలేను" అని చెప్పు చున్నది. ప్రియ సోదరీ! ఎంతో మంది నీ జనుల్లో, నీ వంశములో, నీ కుంటుంబములో నరకమనే నాశనకరమైన స్థితిలోకి వెళ్ళబోతున్నారు. వారికి రాబోయే కీడును, నాశనాన్ని నీవు ముందే వూహించి ఎస్తేరువలె విలపిస్తున్నావా? ప్రభువు పాదాలను కన్నీటితో తడుపుతున్నావా? నీ రక్షణ, నీ క్షేమమే చూచుకుంటున్నావా? నీ కొరకే, నీ పిల్లల కొరకే ఎప్పుడూ కన్నీళ్ళు విడుస్తున్నావా? యిర్మి 9.1లో యిర్మియా నా జనులలో హతమైన వారిని గూర్చి నేను దివారాత్రము కన్నీరు విడుచునట్లు నా తలను జలమయముగాను నా కన్నులు కన్నీళ్ళ వూటగాను ఉండును గాక! అన్నాడు. తన జనుల్లో వ్యభిచారులు, ద్రోహులు, అబద్ధికులు, బలమును దేశములో నమ్మకముగా వుపయోగించనివారు, కీడు వెంట కీడు చేసేవారు, వారు కపటులు. ఎదుటి వారి తప్పులు పట్టువారు. ప్రతివాడు తంత్రగొట్టయి తన పొరుగువారి కొంపముంచే వారు కొండెములు చెప్పువారు. అటువంటివారి కొరకు యిర్మియా కన్నీరు కార్చితే, అలాంటి జనులు ఈ దినాల్లో మన చుట్టూ, మన సంఘాల్లో, కుటుంబాల్లో వుంటూవుండగా వారికొఱకు మనమునూ ప్రభువు సన్నిధిలో కన్నీళ్ళతో ప్రభువు పాదాలు తడుపుదాం. రోమా 9:1లో పౌలు నాకు బహు దుఃఖమును, నా హృదయములో మానని వేదనయు కలవు అని ఇశ్రాయేలీయుల రక్షణ కొరకు దుఃఖిస్తున్నాడు. లూకా 19:41-46 వచనాల్లో ప్రభువు యెరూషలేం పట్టణమును చూచి దాని విషయమై ఏడ్చాడు.

"నీవు ఈ నీ దినమందైననూ సమాధాన సంబంధమైన సంగతులను తెలిసికొనిన యెడల నీకెంతోమేలు" గానీ యిప్పుడవి నీ కన్నులకు మరుగు చేయబడి వున్నవి. ప్రభువు నిన్ను దర్శించిన కాలము నీవు ఎరుగకుంటివి గనుక నీ శత్రువులు నీ చుట్టు గట్టు కట్టి ముట్టడివేసి, అన్ని ప్రక్కలను నిన్ను అరికట్టి నీలోనున్న నీ పిల్లలతో కూడ నిన్ను నేల కలిపి, నీలో రాతి మీద రాయి నిలిచివుండ నియ్యనిదినములు వచ్చుచున్నవి" అని చెప్పి మారు మనసు పొందని ఆ పట్టణము, విషయమై ప్రభువు ఏడ్చినట్లు నీ గ్రామము కొరకు, నీ వీధి కొరకు, నీ పట్టణము కొరకు నీవలా ఏడ్చి ప్రార్థించగలుగుతున్నావా? నీ లాంటి ఒక స్త్రీ యైన ఎస్తేరు తన వంశము కొరకు భారంతో కన్నీళ్ళతో ప్రార్థించగలిగినపుడు మరి నీవు కూడా నీ వారి కొరకు అలా ప్రార్థన చేయాలి కదా! దాని కొరకై ప్రభువునడిగితే ఆయన నీకు ఆ సర్వమానవుల రక్షణార్థమై భారమిస్తాడు. తాను సిలువనెక్కాల్సిన ముందురోజు ప్రభువు, మరణమగునంతగా నా ప్రాణముబహు దుఃఖములో మునిగియున్నదని ప్రభువు గెత్సెమనే తోటలో ప్రార్థించాడు. మనము కూడా ఎన్నోసార్లు జీవితంలో దుఃఖిస్తుంటాము. కానీ, మరణమగునంతగా దుఃఖించామా? లేదుకదా! కానీ ప్రభువు మన కొఱకు మరణమగు నంతగా దుఃఖము పొందాడు. మరుసటి రోజు మరణమేచెందాడు. ఇలాగున ఎవరంతకు వారు ఎస్తేరు, యిర్మియా, పౌలు, ప్రభువు వలె వారి వారి స్వకీయుల కొరకు, పట్టణాలు, గ్రామాల కొరకు, వ్యక్తుల కొరకు వారి రక్షణార్థమై కన్నీటి ప్రార్థన చేస్తే మనవారందరూ యూదులవలె నాశనాన్ని కీడును తప్పించుకుంటారు గదా? మరి అలా చేయటానికి ఈ రోజే నీవు పూనుకుంటే మంచిది.

3వ॥లో యూదులకు విరోధముగా తలంచిన యోచనను వ్యర్థము చేయుదని ఎస్తేరు కన్నీళ్ళతో రాజును వేడుకుంది. ఎస్తేరు వేడుకున్నట్లే దావీదు అహీతోపెలు ఆలోచనను చెడగొట్టమని II సమూ 15:31లో దేవున్ని వేడుకున్నాడు. అలాగుననే దేవుడు అహీతోపెలు ఆలోచనను వ్యర్థము చేశాడు. అహీతోపెలు ఆలోచన దేవుడిచ్చిన ఆలోచనగా వుండేదట. కానీ దేవుడు అహీతోపెలు ఆలోచన చెడగొటేసరికి, అహీతో పెలు తన ఇల్లు చక్క బెట్టుకొని తన ఊరికి వెళ్ళి ఉరిపోసికొని చనిపోయాడు. అలాగే హామాను యోచనను వ్యర్థము చేయుదని ఎస్తేరు కన్నీళ్ళతో వేడుకుంది. అలాగే మనమునూ మన కష్టాల్లో, కన్నీటితో ప్రభువు పాదాలను పట్టుకొని అడిగినపుడు సాతాను ఆలోచనను వ్యర్థము చేస్తాడు. దుష్టుల ఆలోచన చొప్పున నడువవద్దు అని కీర్త 1:1లో చెప్పిన దేవుడు దుష్టుడైన సాతాను ఆలోచనను వ్యర్థము చేయమని ప్రార్థించే ఎస్తేరు లాంటి ప్రతి విశ్వాసి యొక్క ప్రార్థనను ప్రభువు ఆలకిస్తాడు. రాజు తన బంగారు దండమును ఎస్తేరు తట్టు చాపినపుడు ఎస్తేరు లేచి రాజు ఎదుట నిలిచి "రాజువైన తమకు నా ప్రార్థన సమ్మతియైతే హామాను తాకీదును రద్దు చేయుమని ప్రార్థించింది. ఎస్తేరు తన విజ్ఞాపన రాజుకు సమ్మతియైతేనే చేయుమంది. తమ దృష్టికి నేను దయపొందిన దాసనైతే,

తమరికి యుక్తముగా తోచితే లేదా తమ దృష్టికి యింపైన దాననైతేనే హామాను తాకీదును రద్దుచేయమని రాజు దగ్గర విజ్ఞాపన చేసింది. మనము దేవుని దయను ఎప్పుడు పొందుతాము? కీర్త 73:1నుబట్టి శుద్ధహృదయుల యెడల దేవుడు దయాళుడై వున్నాడు. కావున ఆయన దృష్టికి దయ పొందువారెవరనగా శుద్ధ హృదయము కలిగినవారే. దేనితో మన హృదయాన్ని, నడతను శుద్ధి పరుచుకోవాలి? ఆయన వాక్యము చేతనే శుద్ధి చేసికొని ఆయన సన్నిధిలో ప్రార్థించాలి. కీర్తన 119 :9. మనహృదయంలో పాపమును లక్ష్యము చేసిన యెడల ఆయన మన మనవిని ఆలకింపడు. అలాగే ఎస్తేరు ఈసంగతి యుక్తముగా తోచిన యెడల హామాను తాకీదును రద్దు చేయుమని రాజుకు మనవి చేసింది. మన ప్రార్థన దేవునికి యుక్తముగా వుండాలంటే ఏమిచేయాలి? రోమా 8:26-27వ॥ లో అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదుగానీ, ఉచ్చరింప శక్యముకాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా దేవునికి విజ్ఞాపనను చేయుచున్నాడు. గనుక మన ప్రార్థన ప్రభువుకు యుక్తముగా వుండాలంటే మనము ఆత్మ సహాయముతో ప్రార్థించాలి. హృదయములను పరిశోధించువాడైన యేసు ప్రభువు ఆత్మ యొక్క మనస్సు ఏదో ఎరుగును. ఆయన అనగా యేసు ప్రభువు దేవుని చిత్త ప్రకారము పరిశుద్ధుల కొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు. దేవుని చిత్తప్రకారము యేసు ప్రభువు మన కొరకు ఒక ప్రక్క విజ్ఞాపన చేయుచుండగా, యుక్తముగా ప్రార్థన చేయుటకు ఆత్మ మనకు సహాయము చేయువాడైయున్నాడు. 5వచనంలో నేను నీకు ఇంపైన దాననైన యెడల హామాను యోచన వ్యర్థము చేయుమని ఎస్తేరు రాజును వేడుకుంది. మనమీలాగు ప్రార్థించగలుగుచున్నామా? ప్రభువా! నేను నీ కిష్టమైతేనే నా ప్రార్థన ఆలకించు లేనియెడల ఆలకించవద్దు అని ప్రభువుతో ప్రార్థించగలమా? ఈ ప్రార్థన చేసే ఎస్తేరు జీవితం అహష్వేరోషుకు ఇష్టముగా ప్రీతిగా వున్నదా? లేదా? వాక్యములో చూద్దాం. ఎస్తే 2:9లో ఆ చిన్నది (ఎస్తేరు) హేగే దృష్టికి ఇంపైనది. గనుక ఆమె అతని వలన దయపొందింది. ఎస్తే 2:15 ప్రకారం హేగే నియమించిన అలంకారముతో అలంకరించుకొనిన ఎస్తేరును చూచిన వారందరికీ ఆమె మీద దయపుట్టింది. 2:17లో పెండ్లి రోజున రాజు స్త్రీలందరికంటే ఎస్తేరును ప్రేమించాడు. కన్యకలందరికంటే ఆమె అతని వలన దయాదాక్షిణ్యములు పొందెను. 5:3వ॥లో రాజునకు ఎస్తేరు యిష్టముగా వున్నది. కాబట్టియే రాజు "రాణియైన ఎస్తేరూ! నీకేమికావలెను? నీమనవి ఏమిటి? రాజ్యములో సగము మట్టుకు నీకనుగ్రహించెదనని రాజు ఎస్తేరుతో అన్నాడు. 5:6వ॥లో ద్రాక్షారసపు విందులో కూడ రాజు ఎస్తేరును చూచి నీ కోరిక ఏమిటి? అది నీ కనుగ్రహించబడును. నీ మనవి ఏమిటి? రాజ్యములో సగము మట్టుకైనను చేయబడునని చెప్పాడు. 7:2లో కూడ రాజు రాణితో 2వ రోజు ద్రాక్షారసపు విందులో కూడా పైన చెప్పినట్లే

రాజ్యములో సగమైనను ఇస్తాన్నాడు. కనుక అన్ని సందర్భాలల్లో ఎస్తేరు జీవితము రాజుకు ఇష్టముగానే వుంది. ప్రియ సోదరీ! ఎస్తేరు వలె మనమునూ అన్ని సమయాల్లో ప్రభువుకు ఇష్టులముగా జీవిస్తే ఆయన మన మనవిని ఆలకిస్తాడని అర్థమౌతుంది. ఏమి చేస్తే, లేక ఎలా జీవిస్తే మనం ప్రభువుకు ఇష్టులమౌతాము?

(1) విశ్వాసము : హెబ్రీ 11:6 ప్రకారము విశ్వాసము లేకుండా దేవుని కిష్టుడుగా వుండుట అసాధ్యము. రక్షించబడిన సమయంలో మనకు ప్రభువుపై వున్న విశ్వాసం కాదు గానీ, అనుదిన సమస్యలలో, బాధలలో, శ్రమల్లో ప్రభువు తప్పకుండా నిన్ను రక్షిస్తారన్న విశ్వాసం ఎంతో అవసరం. అనుదిన సమస్యలల్లో విశ్వాసము లేకపోతే ప్రభువుకు ఇష్టులము కాము. ఎఫె. 3:18వ॥లో వ్రాయబడినట్లు మన అనుదిన విశ్వాము ద్వారా క్రీస్తు మన హృదయములో నివసించాలి అప్పుడే మనమూ ఆయనకిష్టులమౌతాము. వారు కేవలము ఆయనకిష్టులు.

**(2) భక్తి :** కీర్త 16:3 ప్రకారం విశ్వాసులమైన మనము భక్తులము కాకపోతే దేవునికి యిష్టులముగా వుండలేము.

**(3) స్తుతి :** యెషయ 5:7 ప్రకారం యూదా మనుష్యులు ఆయనకిష్టమైన వనము అని వ్రాయబడింది. యూదా అనగా స్తుతి. స్తుతిచేయు మనుష్యులు ఆయనకిష్టులు. ప్రభువు నందు విశ్వసించి, భయ భక్తులు గలిగి స్తుతించు వారు ఆ యన కిష్టులు ప్రియ సోదరీ! ప్రభువును స్తుతిస్తున్నావా? స్తుతిచేయుట యెహోవాకు శోభస్కరము, ఎద్దు కంటెను, కొమ్ములును, డెక్కలు గల కోడెకంటెను అది యెహోవాకు ప్రీతికరము (కీర్త 69:31). కీర్త 34:1వ॥ ప్రకారం మనమెల్లప్పుడు యెహోవాను సన్నుతించాలి. నిత్యము ఆయన కీర్తి మన నోట వుండాలి. అది ప్రభువుకిష్టము.

కీర్త 50:23వలో వున్నట్లు "స్తుతియాగమర్పించువాడు నన్ను మహిమపరచుచున్నాడు" అని ప్రభువు వ్రాయించాడు. అట్టి స్తుతుల మీద ఆయన ఆసీనుడు కాగోరుచున్నాడని కీర్త 22:3లో వ్రాయించాడు. కీర్త 148:4వ॥లో అకాశముపైని జలములు ప్రభువును స్తుతిస్తున్నాయి. కీర్త 69:34లో భూమ్యాకాశములాయనను స్తుతిస్తున్నాయి. కీర్త 150:6లో సకల ప్రాణులు యెహోవాను స్తుతిస్తున్నాయి. కీర్త 148:3,7 సూర్య చంద్రులు, కాంతిగల నక్షత్రములు, అగాధజలములు ఆయనను స్తుతిస్తున్నాయి. కీర్త 148 : 8-10లో వున్నట్లు ఆవిరి, హిమము, వడగండ్లు, తుఫాను, పర్వతములు, సమస్తమైన గుట్టలు, సమస్తమైన ఫలవృక్షములు, మృగములు, పశువులు ఆత్మలేని సకల జీవులు అన్నియు ఆయనను స్తుతించు చుండగా సకల సృష్టి చేస్తున్న స్తుతులు, దూతలు చేయుచున్న స్తుతులు ఆయన కోరలేదు కానీ ఇశ్రాయేలు స్తుతులు ఆయన కోరగా ఆయన రక్షణ పొందిన మనము ఆయనను ఎంతగా స్తుతించాలో కదా! కనుక

యెహోవాసేవకులు, యూదులు, అన్యులు, సమాజములలోను, కుటుంబాలలోను, వ్యక్తిగతముగాను, సృజింపబడబోవు జనమును, సూర్యోదయము నుండి, సూర్యా స్తమయము వరకు అధిక స్తోత్రము, నిత్య స్తోత్రము ఆయనకు చెల్లించాలి. ఆయన పరాక్రమ కార్యములను బట్టియు, ఆయన మహా ప్రభావమును బట్టియు ఆయనను స్తుతించాలి. జీవిత కాలమంతయు స్తుతించాలి. యుగ యుగములు ఆయనను స్తుతించాలి. శాశ్వత కాలము నుండి శాశ్వత కాలము వరకూ స్తుతించాలి.

మన పెదవులతో, నాలుకతో పూర్ణ హృదయముతో ఆయనను స్తుతించాలి. బూర ధ్వనితో, స్వర మండలముతో, తంబురతో, నాట్యముతో, పిల్లనగ్రోవితో, మ్రోగుతాళములతో, గంభీర ధ్వని గల తాళములతో ఆయనను స్తుతించాలి. యెహోవా మీదపాటలు పాడి స్తుతించాలి. ఇంతవరకూ స్తుతించా మేమో? కీర్త 43:5లో వున్నట్లు ఇంకనూ స్తుతించాలి. దావీదు 119:175లో నీవు నన్ను బ్రదికింపుము నేను నిన్ను స్తుతించెదనన్నాడు. మన బ్రతుకు ఆయనను స్తుతించుట కొరకే వున్నాదా? ఇలా స్తుతించేవారు ఆయనకు యిష్టులు. ఆయన కిష్టమైన స్తుతిని ఆయనకు చెల్లించి "ఆస్తుతుల మీద ఆసీనుడు కాగోరుతున్న ఆయన కోరికను తీర్చి ఆయన కిష్టులమౌదామా? నీవు ఆయనను స్తుతించే బిడ్డవుగా వున్నట్లయితే నీవు ఆయన కిష్టురాలవే. దావీదు తను మట్టుకైతే బ్రతుకుట దేవుని స్తుతించుటకొరకె అన్నట్టున్నాడు. అయితే ప్రియ సోదరీ! నీ బ్రతుకు దేని కొరకు? ఆయనను స్తుతించుట కొరకేనా? ఇదే విషయాన్ని పౌలుహెబ్రీ 13:15లో యేసుక్రీస్తు ద్వారా దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము అని వ్రాశాడు కనుక ఎల్లప్పుడు స్తుతి చేయుచూ ఆయనకు యిష్టులమౌదాము.

**(4) ఉపకారము, ధర్మము :** హెబ్రీ.13అ:16వ॥లో ఉపకారమును, ధర్మమును చేయుట మరచిపోకుడి అట్టి యాగములు దేవునికిష్టమైనవని వ్రాయబడింది. అపో 10అ:4వ॥లో కొర్నేలి ధర్మకార్యాలు చేశాడని వ్రాయబడింది. అపో. 9:36వ॥లో తబిత ధర్మకార్యములు చేసింది. అపో 22అ:5వ॥లో మెలితే ద్వీపము వారు పౌలుతో కూడ వున్న రెండు వందల డెబ్బది ఆరు మందిని చేర్చుకొని (తమ ఇండ్లలో) వర్షము కురియుచూ, చలిగా వున్నందున వారు నిప్పు కూడ రాజబెట్టారు. తమ ఇండ్లలో చేర్చుకొన్నారు. ఆతిథ్యము కూడ యిచ్చి వుంటారు. వర్షములో తడిచినవారు తుడుచుకోడానికి తమ తువాళ్ళు, బట్టలు కూడ యిచ్చివుంటారు. అందుకే పౌలు మెలితే వాసులు మాకు చేసిన ఉపచారమింతింతకాదు అని వారిని గూర్చి వ్రాశాడు. ఇలా కొందరు బట్టలు, వస్తువులు యిచ్చి ఉపకారం చేస్తే ; II కొరి 8అ:19వ॥లో మాసిదోనియా సంఘాలు యెరూషలేములోని పరిశుద్ధులకు తమ ఉపకారాన్ని ద్రవ్యరూపంలో పంపారు. యోహాను వ్రాసిన మూడవ పత్రిక 7, 8వ॥లలో యోహాను పరదేశులైన సహోదరులను దేవునికి తగినట్టుగా సాగనంపి ఉపకారము చేయాలని వ్రాశాడు. దేవునికి ఇచ్చినట్లుగా మన సహోదర

సహోదరీలకు మన మిచ్చి ఉపకారం చేయాలి. అపో 4:9లో పేతురు, యోహాసులు పుట్టింది మొదలుకొని కుంటివాడైన దుర్భలునికి ఉపకారము చేశారు. ప్రభువునామమున స్వస్థపరచి ఉపకారము చేసి, అధికారులచే, పెద్దలచే, శాస్త్రులచే విమర్శింపబడ్డారు. కొన్ని సార్లు ఉపకారం చేసినందుకు కూడ కొన్ని విమర్శలు, మాటలు, అపనిందలు అనుభవించాల్సి వస్తుంది. అయినా నిందలు, విమర్శలు అనుభవించి కూడ ఉపకారం చెయ్యాలి. ఎందుకంటే అలాగు చేయుట దేవునికిష్టమైన యాగము చేసిన దానితో సమానము.

లూకా 13అ:33వలో "కలిగినవాటిని అమ్మి ధర్మము చేయుడి. పాతగిలని సంచులను పరలోకమందు అక్షయమైన ధనమును సంపా దించుకొనుడి. అక్కడికి దొంగరాడు, చిమ్మెట కొట్టదు." అని ప్రభువు శిష్యులతో చెప్పారు. గనుక ఆయన శిష్యులముగా వుంటున్న మనము ఉపకారము చేయుట ఆయన కిష్టమైన యాగము. II కొరి 9అ:13వ॥లో కొరింథీయులు పరిశుద్ధుల అక్కరలు తీర్చు నిమిత్తమై కొంత ద్రవ్యమును ధర్మము చేయగా అలాగున ధర్మము చేయుటలో వారు చూపిన ఔదార్యమును బట్టి ఆ పరిశుద్ధులు దేవుని మహిమ పరచారు. కనుక ఆ ప్రభువు కిష్టమైన యాగములైన ఉపకారమును ధర్మమును చేసి మనమునూ ప్రభువుకు ఇష్టమైన వారమగుదము గాక.

**(5) ఆయన కిష్టమైన సేవ :** హెబ్రీ 12అ:28వ॥లో, వినయ భయ భక్తులతో చేసే సేవయే ప్రభువుకు ప్రీతికరమైన లేక ఇష్టమైన సేవ అని వ్రాయబడింది. మనం చేసే సేవలో వినయముండాలి. అపో.కార్య 20అ:19వ॥ ప్రకారము పౌలు యూదుల కుట్రవలన శోధనలు సంభవించినా కన్నీళ్ళు విడుచుచూ పూర్ణ వినయభావముతో ప్రభువును సేవించాడు. I పేతు 3అ:8వ॥లో పేతురు 'తుదకు మీరందరు ఏక మనస్కులై ఒకరి సుఖ దుఃఖములందు ఒకరు పాలు పొంది సహోదర ప్రేమ గలవారును, కరుణా చిత్తులును, వినయ మనస్కులునై యుండుడని వ్రాస్తున్నాడు. ఎఫె 4అ:2వ॥లో మీరు జాలి గల మనస్సును, దయాళుత్వమును, వినయమును, సాత్వీకమును, దీర్ఘశాంతమును, ధరించుకొనవలెను అని పౌలు చెబుతున్నాడు. ఫిలి 2అ:3వ॥లో పౌలు వినయమైన మనస్సు గలవారై ఒకని కంటే, ఒకడు తన కంటే యోగ్యుడని ఎంచుకోమంటున్నాడు. ఈలాగున వినయముతో కూడిన సేవ చేస్తే ఆ సేవ ప్రభువుకు ప్రీతికరమైన సేవగా ఉంటుంది.

## 7-8వ. ఎస్తేరు ప్రార్థనకు రాజు ఇచ్చిన జవాబు :

ఈ వచనాలలో రాజు "హామాను యింటిని ఎస్తేరు కిచ్చియున్నాను" అని జవాబు ఇస్తున్నాడు. కీర్తన 49అ:11 వ॥లో "మూర్ఖులు పశుప్రాయులు ఏకముగా నశింతురు. వారు తమ ఆస్తిని యితరులకు విడిచిపెట్టుదురు తమ ఇండ్లు నిరంతరము నిలుచుననియు, తమ

నివాసములు తరతరములకు వుండుననియు వారను కొందరు. తమ భూములకు తమ పేళ్ళు పెట్టుదురు" అని, వ్రాయబడింది. హామాను తన యింటికి "హామాన్ భవన్" అని. హామాను నిలయము అని పేర్లు పెట్టాడేమో! కానీ పైన వాక్యములో చెప్పబడినట్లు హామాను పశుప్రాయుడై నశించిపోయాడు. అతని ఇల్లు ఎస్తేరుకు, మొర్దెకైకి విడిచిపెట్టాడు. కొద్ది సుంది తమ ప్రతిష్ఠ నిలుపుకొనుటకు తమ పేర్లు పెట్టుకొనునట్లు హామాను తన పేరుతో కట్టించిన ఇల్లు ఇప్పుడు ఎస్తేరు యిల్లుగా మారిపోయింది. ఎస్తేరు ఆ యింటి మీద అధికారమును మొర్దెకైకు యిచ్చింది. కీర్త 49అ:12వ॥లో వున్నట్లు ప్రధానమంత్రిగా ఎంత "ఘనత వహించిన వాడైనను హామాను నశించిన మృగమును పోలి శాపగ్రస్తమైన వురికొయ్య మీద వురి తీయించబడ్డాడు. వారు పాతాళములో మందగా కూర్చబడుదురు. మరణము వారికి కాపరియైయుండును అని చెప్పబడినట్లే హామాను పాతాళము పాలయ్యాడు. కీర్త 49అ:16వ॥లో వున్నట్లు ఒకడు ధన సంపన్నుడైనపుడు వాని యింటి ఘనత విస్తరించినపుడు భయపడకుము. వాడు చనిపోయినపుడు ఏమియూ కొనిపోడు. ఈ వాక్య ప్రకారమే హామాను తనకు ఐశ్వర్యము కలిగినందువలననే రాజు అతనిని పెద్దగా చేశాడనుకున్నాడు. కానీ తను చనిపోయినపుడు తన ఐశ్వర్యము, తన ధనము, తన ఇల్లు, తన పిల్లలు, తన ఆస్తిలో ఏమైనా చిల్లిగవ్వగానీ తనతో తీసుకెళ్ళాడా? హామాను ఘనత హామాను వెంట వెళ్ళిందా? లేదుకదా!. 14వ॥లో వున్నట్లు ఉదయమున యదార్థవంతులు వాని నేలుదురు వారి స్వరూపములు నివాసములేనివై పాతాళములో క్షయమై పోవును. అని వ్రాయబడినట్లే హామాను విషయంలో దేవుడు జరిగించాడు. దేవుడు నన్ను చేర్చుకొనును పాతాళ బలము నుండి ఆయన నా ప్రాణమును విమోచించును అని వ్రాయబడినట్లే హామాను మొర్దెకై విషయంలో ‘వుడు జరిగించాడు. యదార్థవంతులైన మొర్దెకై, ఎస్తేరులు హామాను యింటి మీద ఏలుబడి చేశారు. హామాను పాతాళములో క్షయమైపోయాడు.

ప్రియ సోదరీ! మరి నీ సంగతి ఏంటి? రేపోమాపో నీవు ఈ లోకాన్ని వదిలితే నీ ఆస్తి, దనము, ఐశ్వర్యము, ఇండ్లు నీతో వస్తాయనుకుంటున్నావా? హామానుకేమి జరిగిందో నీకూ అలాగే జరుగుతుంది కదా! ఈ లోకమంతా మిథ్య, మాయ. ఎల్లప్పుడు మనతో వుండేవాడు మన ప్రభువే. కీర్తన. 48అ:14వ॥లో వ్రాయబడినట్లు ‘ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడై యున్నాడు, మరణం వరకూ నీతో వుండి, ఆ తరువాత తన పరలోక రాజ్యానికి నిన్ను చేర్చే ప్రభువును నేడే నీ స్వంత రక్షకునిగా నీ హృదయంలో చేర్చుకో. ప్రభువు నిన్ను దీవిస్తాడు. 8వ॥లో రాజముద్రతో ముద్రించి, రాజు పేరుతో వ్రాయబడిన మొదటి శాసనమును ఏ మానవుడును మార్చజాలడు కనుక మీ కిష్టమైనట్లు నాపేరట యూదుల పక్షమున రెండవ తాకీదును వ్రాయించి రాజు వుంగరముతో ముద్రించమని రాజు జవాబిచ్చాడు. ఎంత గొప్పగా ప్రభువు యూదుల ప్రార్థనలకు ఎస్తేరు, మొర్దెకైల ప్రార్థనలకు ఎంత ఆశ్చర్యకరముగా జవాబిచ్చాడో

కదా! వారడిగిన దాని కంటే వూహించిన దాని కంటే గొప్పగా, అత్యధికంగా ప్రభువు వారికి సహాయమిచ్చాడు. రాజు ఎస్తేరు మొర్దెకైలను మీకిష్టమొచ్చినట్లు వ్రాసుకోండి అంటున్నాడు. వారిష్ట ప్రకారమే వారికి చేశాడు. అలాగున మన యిష్ట ప్రకారమే దేవుడు మనకునూ చేయాలంటే మనమేమి చేయాలో 1 యోహాను 3అ:20-22వ॥లలో చదువుదాం. "దేవుడు మన హృదయము కంటే అధికుడై సమస్తము ఎరిగి యున్నాడు గనుక మన హృదయము ఏఏ విషయములలో మనయందు దోషారోపణ చేయునో ఆయా విషయములలో ఆయన యెదుట మనలను సమ్మతి పరచుకొందము. ప్రియులారా! మన హృదయము మన యందు దోషారోపణ చేయని యెడల దేవుని యెదుట ధైర్యము గలవారమగుదుము. మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన కిష్టమైనవి చేయుచున్నాము గనుక మనమేమి అడిగినను (అంటే మనకిష్టమైనది ఏది అడిగినను) అది ఆయన వలన మనకు దొరుకును". మన యిష్ట ప్రకారము దేవుడు మనకివ్వాలంటే హృదయంలో దోషారోపణ వుండకూడదు. ఒకవేళ హృదయము దోషారోపణ చేస్తే మన హృదయాన్ని ప్రభువుతో సమ్మతి పరచుకొని, సవరించుకోవాలి సమ్మతి లేకపోతే మనమూ ప్రభువు, కూడి నడవగలమా? లేదుకదా! దోషారోపణ లేకపోతే ఆయన కృపాసనమునొద్దకు ధైర్యముగా వెళ్ళగలము. అంతమాత్రమేకాదు ఆయన ఆజ్ఞలుగైకొని ఆయన కిష్టమైనది జరిగించాలి. అప్పుడు మన కిష్టమైనవి ఆయన వలన మనకు దొరుకుతాయి. ప్రియ సోదరీ! నీ యిష్టాలు నెరవేరాలంటే, ఆయనకిష్టమైనవి మనం జరిగించాలి. అలా చేస్తే మనయిష్ట ప్రకారము మనకు దొరుకుతాయి. అప్పుడు ఎంత ఆనందమో కదా! యూదులు అలా ఆనందించారు. ఎస్తేరు, మొర్దెకై దేవుని ఆజ్ఞలన్నింటిని అనుసరించి ఆయనకిష్టమైనట్లు జీవించి తమ యిష్టాలు రాజు దగ్గర నెరవేర్చుకున్నారు. మనమును అలాగు చేయుదుము గాక! యేసు ప్రభువు కూడ యోహాను సువార్త 3అ:29వ॥లో నన్ను పంపిన వాడు నాకు తోడైవున్నాడు. ఆయన కిష్టమైన కార్యము నేనెల్లప్పుడు చేయుదును. గనుక ఆయన నన్ను ఒంటరిగా విడిచిపెట్టలేదు అన్నాడు. తండ్రికిష్టమైన కార్యాలు అప్పుడప్పుడు కాదు ప్రత్యేక సందర్భాలలో మాత్రమే కాదు. ఎల్లప్పుడూ ఆయన యిష్టప్రకారమే మనము చేయాలి. నా యిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదన్నాడు ప్రభువు. అలాగున తండ్రి యిష్టాన్ని ఎప్పుడైతే మనం నెరవేర్చుతామో అప్పుడు తండ్రి మనకు మన పనులలో ప్రయత్నాల్లో, సేవలో ఒకటేంటి అన్నింటిలో మనకు తోడుగా వుంటాడు. మనలను ఒంటరిగా విడిచి పెట్టడు. విద్యార్థులకు పరీక్షహాలులో పరీక్షలు వ్రాయునపుడు తోడుగా వుంటాడు. ఇంటికి దూరంగా క్రొత్తవూరిలో ఉద్యోగము చేస్తున్నపుడు, నీవు నివసించు చోట దేవుడు నిన్ను ఒంటరిగా వుంచక ప్రభువు నీకు తోడుగా వుంటాడు. అలాగు స్త్రీ పురుషులందరికి ఈ పుస్తకాన్ని చదువుచున్న నీకును, ఆ ప్రభువు తోడుగా వుంటాడు. నీ వ్రాతల్లో, నీ చేతల్లో, నీ వంటల్లో నీ పరిచర్యలో, అన్నింటిలో

ఆయన తోడు నీకు వుంటుంది. ఈ విషయాన్ని నీవు నీ జీవితాంతము జ్ఞాపకం చేసుకోవాలి. ఇది జీవిత సూత్రాల్లో ఒక ప్రాముఖ్యమైన సూత్రం. నీ యిష్టాన్ని ప్రక్కకు నెట్టివేయాలి. అప్పుడు సంపూర్ణముగా ప్రభువు తోడు నీకు వుంటుంది. ప్రభువు "తండ్రి నన్ను ఎప్పుడూ ఒంటరిగా విడచిపెట్టలేదు" అన్నాడు, కానీ, సిలువపై ఆయన రక్షణ కార్యము చేయాల్సి వచ్చినపుడు మాత్రమే తండ్రి తన కుమారునిచేయి విడచి పెట్టాడు. కుమారుడైన ప్రభువు అందుపలననే కీర్త. 22అ:1వ॥లో నా దేవా! నా దేవా! నన్నేల చేయివిడచితివి? నా ఆర్థధ్వనిని ఆలకించక నీవేల దూరముగా వున్నావు?" అన్నాడు ఇది ఒక ప్రత్యేక సందర్భము. అది కుమారుడు తండ్రికి విధేయుడుగా, తండ్రి అప్పగించిన పనిని తానే చేయాలి. కాబట్టి, తండ్రి చిత్తాన్ని నెరవేర్చుటకు తండ్రి పనిని తుదముట్టించుటకు ప్రభువు లోకంలోకి వచ్చాడు. గనుక ఆ పని పూర్తిగా కుమారునికే తండ్రి అప్పగించి చూస్తున్నాడు. ఆదాము సకల జాతి పక్షులకు, జంతువులకు ప్రాకు పురుగులకు ఏపేర్లు పెడతాడో చూచినట్లుగా మనకు అప్పగించబడిన పనిని మనం ఎలా చేస్తామో చూడడానికి ప్రభువు యిష్టపడుతున్నాడు. ఆదాముకు అప్పగించిన ఆ గొప్ప పనిని చేస్తున్నపుడు సాటియైన సహాయముగా హవ్వను తనకు భార్యగా ఇంకా అప్పటికి యివ్వలేదు దేవుడు. ఒంటరిగానే ఆదాము ఆ పనిని నెరవేర్చాడు. అలాగున తండ్రి యేసు ప్రభువును, సిలువ మీద అదొక్క సందర్భములో తప్ప ఎన్నడూ కూడ తన కుమారుని ఒంటరిగా విడిచి పెట్టలేదు. మరి నీ విషయంలో నా విషయంలో, మన అందరి విషయంలోనైతే " నిన్ను యేమాత్రమును విడువను నిన్ను ఎన్నడును యెడబాయను (యెహో 1వ అ:5వ॥లో) అన్నాడు." నా తల్లి తండ్రులు నన్ను విడచినను యెహోవా నన్ను చేరదీయును అని దావీదు కీర్త. 27అ:10వ॥లో అన్నాడు. కనుక ప్రభువు మనలను విడువని దేవుడుగా వుంటాడు. ఎప్పుడలా జరుగుతుంది? మనమాయనకు యిష్టమైన కార్యాలు చేసినప్పుడు అని అర్థమయ్యింది కదా! మీ కిష్టమైనవి అడుగుడి, మీ కివ్వబడును. మీకిష్టమైన వాటిని తట్టుడి మీకు తీయబడును. మీకిష్టమైన వాటిని వెదకుడి మీకు దొరుకును అని చెబుతున్నాడు. యెషయా. 45అ:11వ॥లో ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడగు సృష్టికర్తయైన యెహోవా ఈ మాట సెలవిచ్చు చున్నాడు. "రాగలవాటిని గూర్చి నన్నడుగుదురా? అడుగుడి నా కుమారులను గూర్చియు, నా హస్త కార్యములను గూర్చియు, నాకే ఆజ్ఞాపింతురా? ఆజ్ఞాపించుడి" అని ప్రభువు సెలవిస్తున్నాడు. మీకిష్టమైనవి అడుగుడి అని సృష్టికర్తయైన దేవుడు ఇంత చనువు, ఇంత స్వాతంత్ర్యము మనకు యిస్తున్నాడు. మీకిష్టమైనట్లు తాకీదు వ్రాసుకోండి అని అహష్వేరోషు రాజు చెప్పినట్లు ప్రభువు కూడా చెబుతున్నాడు? ఇంకెందుకు ఆలస్యం? ఈ పుస్తకాన్ని చదువుచున్న ప్రియ సోదరీ! ఆయన కిష్టమైనట్టు నీవు జీవిస్తున్న సందర్భంలో ప్రభువు ద్వారా నీకిష్టమైన వాటి కొరకు త్వరగా అడిగి పొందుకో.

## 9-14వ.లలో రెండవ శాశన తాకీదులు సంస్థానములన్నింటకి పంపబడుట :

10వ వచనములో రాజనగరి పనికి పెంచబడిన బీజాశ్వముల మీద అంచెగాండ్రు ప్రతి సంస్థానానికి అతివేగంగా వెళ్ళారు. అలాగే మనం కూడా పరమ రాజు పనికి పెంచబడిన బీజాశ్వాలపై అతి వేగంగా సర్వ లోకానికెళ్ళి సర్వ సృష్టికీ సర్వ భాషల్లో సువార్తను పంచాలి. ప్రియ సోదరీ! ప్రభువు సేవకొరకే జీవించు. 11వ రాజు వ్రాయించి ముద్రించిన మొదటి శాశనము యూదులకు మరణ శాశనమై యుండగా రాజు రెండవ సారి వ్రాయించిన శాశనము యూదులకు జీవశాసనమై వున్నది. మొదటి శాసనము పాపము వలన వచ్చు జీతము మరణము అను వాక్యమును (రోమా 3అ:23వ॥) పోలియుండగా రెండవ శాశనము అయితే దేవుని కృపావరము మన ప్రభువైన యేసుక్రీస్తు నందు నిత్యజీవము. అను (రోమా :8అ.23వ॥) వాక్యమునకు వున్నాయి. ఆదారు మాసము 12వ రోజు ప్రతి పట్టణమందుండు యూదులు కూడుకొని తమ ప్రాణములను కాపాడుకొనుట కొరకు తమ విరోధ జనుల, సైనికులందరిని, శిశువులను స్త్రీలను సంహరించి, హతము చేసి నిర్మూలపరచి, వారి వస్తువులను కొల్లపెట్టుటకు యూదులకు రాజు సెలవిచ్చెనని ఆ రెండవ శాసనమందు వ్రాయబడింది. ఈ రెండవ శాశన ప్రతులు వ్రాయించి ఆయా సంస్థానములందున్న జనులందరికీ పంపవలెనని రాజు ఆజ్ఞ యిచ్చినట్లు నేటి దినాల్లో మనము ప్రభువు సువార్త పత్రికల ప్రతులు సకల ప్రాంతాలకు వారి రక్షణార్థమై మనము పంచాలి. యూదులు తమ పగ వారి మీద పగ తీర్చుకొని సంహరించి హతము చేయుటకు ప్రతులు పంపితే మనము మన శత్రువుల మిత్రుల, సకల మానవుల రక్షణార్థమై సువార్త ప్రతులు పంచే అలవాటు పెట్టుకున్నామా? సువార్త పత్రికలు ఎల్లప్పుడూ ఎక్కడికెళ్ళినా నీవు నీతోపాటు వుంచుకొని ప్రభువు నెరుగని వారికందరికీ వాటిని పంచిపెడుతుండాలి. విద్యార్థి దగ్గర క్లాస్ పుస్తకాలెలా వుంటాయో, వైద్యుని దగ్గర స్టెతెస్కోపు ఎలవుంటుంది ఆయన సేవకుల సేవకు రాండ్రమైన మన దగ్గర సువార్త కరపత్రాలు వుండాలి.

## 15-17వ॥లలో మొర్దెకై ప్రధాన మంత్రి అగుట వలన యూదులకు కలిగిన మేలులు :

14వ॥లో రాజు వలన ప్రేరేపింపబడిన అంచెగాండ్రు అతి వేగముగా ఆయా సంస్థానములకు వెళ్ళిన రోజున మొర్దెకై ఊదా వర్ణము, తెల్లని వర్ణమును గల రాజ వస్త్రమును, బంగారపు పెద్ద కిరీటమును, అవి సెనారతో చేయబడిన ధూమ్ర వర్ణములు గల వస్త్రములను ధరించుకొనిన వాడై రాజ సముఖము నుండి బయలు దేరాడు. అలాగున రెండవ శాశనము

యొక్క తాకీదుల ప్రతులు పంపబడిన తరువాత మొర్దెకై ప్రధాన మంత్రిగా ఏలాగుస అలంకరింపబడి షూషనుకు వచ్చాడో, ప్రభువు సువార్త పత్రికలు చదివి ప్రభువును రక్షకునిగా అంగీకరించి ఆయన రెండవ రాకడ కొరకు ఎదురుచూస్తున్న వారి కొరకు ప్రభువు మొర్దెకై వలె రాజుల రాజుగా ప్రభువుల ప్రభువుగా రాబోతున్నాడు. మొర్దెకై నిమిత్తము షూషను పట్టణము ఆనందించి, సంతోషము కలిగినట్లు మరియు యూదులకు క్షేమము, ఆనందము. సంతుష్టి ఘనత కలిగినట్లు ప్రభువును మన జీవితములోనికి ఆహ్వానించుట ద్వారా నిజమైన పరలోక సంతోషము, ఆనందము, క్షేమము, ఘనత కలుగుతాయి. ప్రియ సోదరీ! నీవు ఏ పట్టణములో, ఏ ప్రదేశములో వుంటున్నావో అక్కడి ప్రజలకు నీ ద్వారా సామె. 29అ:24వ॥ వలె నీతిమంతులు ప్రబలినపుడు ప్రజలు సంతోషిస్తారు. అను మాట ప్రకారము సోదరీ! నిన్ను బట్టి ఎవరికైనా సంతోషమా? సామె 11అ :10వ॥ ప్రకారం నీతి మంతులు వర్ధిల్లుట పట్టణమునకు సంతోషకరము. నీతిమంతుడైన మొర్దెకై చిన్న ఉద్యోగం నుండి ప్రభువు కృపవల్ల వర్ధిల్లి ప్రధానమంత్రి కాగా షూషను పట్టణానికి సంతోషం కలిగింది 11వ॥లో అది శుభదినమని విందుచేసుకున్నారు. అందరిలో అతి నీతిమంతుడైన మన ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా లోకమంతటికీ మహా సంతోషము కలిగింది. ఆయన మొదటి రాకడలో కూడా లోమంతటికీ కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానము ఆయన జన్మము ద్వారా కలుగుతుందని దూత ప్రకటించాడు. అయన యందు విశ్వసిస్తే మన దినాలన్నీ శుభ దినాలే అవుతాయి. ప్రభువును మన హృదయరాజుగా స్వీకరిస్తే జీవిత దినాలన్నీ శుభదినాలుగానే అనుభవిస్తాం. కీర్త. 84అ:8వ॥ ప్రకారం అయన తన ప్రజలతోను తన భక్తులతోను శుభవచనములు సెలవిస్తాడు. అలాగున బైబిల్ లో 31,173 శుభవచనాలు ఆయన తన ప్రజలకు బైబిల్‌లో వ్రాయించాడు. 17వ॥లో యూదులు అది శుభదినమని విందు చేసుకున్నారని వ్రాయబడింది. రక్షణ ద్వారా మనం పొందే సంతోషాన్ని బట్టి, సంతోష హృదయులైన మనకు నిత్యమూ వాక్యపు విందు బైబిల్ చదవడం ద్వారా మనం పొందుతూ వుంటాము. 17వ॥లో దేశపు జనులకు యూదుల యెడల భయము కలిగింది. రక్షింపబడిన మన యెడల దేవుడు చేసే కార్యాలను బట్టి మన చుట్టూ వున్న వారికి మన యెడల భయము కలుగుతుంది. ఆది 35అ :4వ॥లో యాకోబును, అతని కుమారులును షెకెము నుండి బేతేలుకు ప్రయాణమై పోయినపుడు దేవుని భయము వారి చుట్టువున్న పట్టణముల మీద వుండెను. గనుక వారు యాకోబు కుమారులను తరుమలేదు. మన ప్రయాణాల్లో కూడా దేవుడు తన ప్రజలమైన మన చుట్టూ తన భయాన్ని అన్యజనులకు కలుగచేస్తాడు. అపో.కా. 2అ:42వ॥లో పేతురు చెప్పిన వాక్యము ద్వారా రక్షించబడి బాప్తీస్మము తీసికొనిన వారు అపోస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుట యందును. ప్రార్థన

చేయుట యందును యెడతెగక యుండినపుడు వారిని బట్టి ప్రతివానికీ భయము కలిగినట్లు మనమును ఆ నాలుగు విషయాల్లో యెడతెగక జీవిస్తే మన చుట్టూ దేవుని భయము వుంటుంది. ఈలాగున యూదుల మీద పారశీకులకు భయము ఏర్పడి అనేకులు యూదా మతమును అవలంబించారట. ప్రభువు ఎంత ఆశ్చర్యకరుడో కదా! అన్యదేశస్థులు యూదా మతము అవలంబించడం ఎంత గొప్పకార్యమో కదా! జెక. 8అ:23వ॥లో ఆ దినములలో ఆయాభాషలు మాటలాడు అన్యజనులలో పదేసి మంది ఒక యూదుని చెంగుపట్టుకొని "దేవుడు మీకు తోడుగా ఉన్నాడను సంగతి మాకు వినబడినది గనుక మేము మీతో కూడా యెరూషలేములో సైన్యములకు అధిపతియగు యెహోవాను వెదకుటకు, పదేసి మంది అన్యులు ఒక యూదుని చెంగు పట్టుకొని వస్తారని వ్రాయబడింది. ప్రియ సోదరీ! నీ విషయమై యితరులెవరైనా యిలా సాక్ష్యమిస్తున్నారా? నీ ద్వారా కనీసం 10 ఆత్మలైనా ప్రభువు దగ్గరికి వస్తాయా? ఆది. 30అ:20వ॥లో లేయా తనను ద్వేషిస్తున్న యాకోబుకు 6 మంది కుమారులను కన్నానని చెబుతోంది. సోదరీ! నిన్ను సృష్టించిన వాడు నీకు భర్తయై యుండగా, ఆ భర్త నిన్ను ద్వేషించక, ప్రేమించు వాడైయుండగా ఆ పరమ భర్త కొరకు నీవు ఎన్ని ఆత్మలు సువార్త సేవలో కన్నావు? ఒక్క ఆత్మనైనా క్రీస్తు నొద్దకు తేకుండా వట్టి చేతులతో నీవు పరమందు ఆయనను దర్శించుట న్యాయమా? ఆలోచించి ప్రభువు కొరకు అనేకాత్మలను పౌలువలె, పేతురువలె, మిగతా అనేక భక్తులవలె ప్రభువు నొద్దకు తెచ్చుటకు ప్రయత్నించు.

❖ ❖ ❖

## 9వ అధ్యాయము 15+4+13=32 వ

**అంశము :** తమ పగవారి మీద యూదుల విజయము

**విభజన :** 1-15వ.లు పగవారి నాశనము

16-19వ.లు యూదుల సంతోషము

20-32వ.లు పూరీము పండుగ

### 1-15వ॥లు పగవారి నాశనము :

రాజ చట్టము నెరవేరు కాలమున యూదులను జయింపగలుగుదుమని పగ వారు నిశ్చయించుకొనిన దినముననే యూదులు తమ పగవారి మీద అధికారము పొందినట్లు అగుపడింది. యూదులకు అనుకూలముగా వ్రాయబడిన రెండవ తాకీదు నెరవేరు కాలమున పగవారైన పారశీకులు నిశ్చయముగా యూదులను జయిస్తామనుకున్నారు. కానీ అదే కాలమున

యూదులే తమ పగ వారిని జయించారు. నిర్గ. 15అ:9వ॥లో ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రములో నడిచిపోయినపుడు, తరిమెదను, కలిసి కొనెదను, దోపుడు సొమ్ము పంచుకొనెదను, వాటి వలన నా ఆశ తీర్చుకొనెదను, నా కత్తి దూసెదను, నా చెయ్యి వారిని నాశనము చేయునని బగుప్త శత్రువులు అనుకున్నారు. గాని దేవుడు సముద్రమును కప్పగా వారు మహా అగాధమైన నీళ్ళలో సీసము వలె మునిగి పోయారు. అదే విధంగా మన ప్రతి సంగతి పరిష్కరింపబడడానికి, దేవుని ప్రతి వాగ్దానము నెరవేరడానికి ఒక కాలము వుంటుంది. శారాకు కుమారుని నిర్ణీత కాలంలో యిచ్చాడు. (ఆది. 18అ:14వ వ॥) అదే నెరవేరు కాలము. (ఎస్తే. 9:1) శత్రువును దేవుడు మన పాదముల క్రింద చితగగొట్టిస్తాడు. (రోమా 16అ:20వ వ॥) ఎప్పుడు చితకద్రొక్కిస్తాడు? 'శీఘ్రమే' అన్నాడు. ప్రభువు ఆ కాలము వరకు తమ పగవారిని హతము చేయడానికి కూడుకున్నారు. వారిని గూర్చి సకల జనులకు భయము కలిగింది. ఎవరునూ వారి ఎదుట నిలువలేక పోయారు. ఆది 35అ:4వ వ॥లో యాకోబు కుటుంబము షెకెము నుండి 'బేతేలుకు' వెళ్ళు చుండగా దేవుని భయము వారి చుట్టూ వున్నందు వలన ఎవరునూ వారిని తరుమలేదు. యెహోషువ 2,10,11 వ॥ల్లో దేవుడు ఇశ్రాయేలు ప్రజల యెడల చేసిన మేలును బట్టి యెరికో ప్రజలు భయపడి, ధైర్యముచెడిన వారుగా, గుండెలు కరిగిపోయిన వారుగా వున్నట్లు రాహాబు చెప్తోంది. అపో.కా. 2అ:43వ వ॥లో రక్షించబడిన వారు అపోస్తులుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థించుట యందును యెడతెగక వుండినందున ఆ 3వేల మందిని బట్టి ప్రతి వానికిని భయము కలిగింది. యిర్మీ 33అ:9వ వ॥లో భూజనులందరి యెదుట ఇశ్రాయేలీయులు నాకిష్టమైన పేరుగాను స్తోత్ర కారణముగాను, ఘనత కాస్పదముగాను ఉందురు. నేను వారికి చేయు సమస్త ఉపకారములను గూర్చిన వర్తమానమును జనులు విని నేను వారికి కలుగచేయు సమస్త క్షేమమును బట్టియు సమస్తమైన మేలులను బట్టియు భయపడుచు దిగులు నొందుదురు" అని దేవుడు వ్రాయించాడు. II దిన. 17అ:10వ వ॥లో కూడ యూదా దేశము చుట్టు వుండు దేశముల రాజ్యము లన్నింటి మీదికి యెహోవా భయము వచ్చినందున వారు యెహోషాపాతుతో యుద్ధము చేయకుండిరి. ఈ వాక్యములన్నింటిలో కూడా దేవుని భయము వారి చుట్టూ వున్నందువలన, చుట్టూవున్న ప్రజలకు యూదుల విషయమై భయము కలిగినట్లు చుచూస్తున్నాము. అలాగే మనము కూడ దేవుని ఆత్మీయ విషయాల్లో యెడతెగక వున్నట్లయితే దేవుడు మనచుట్టూ కూడా తన భయాన్ని యితరులకు కలుగ చేస్తాడు. 3వ వ॥లో మొర్దెకైని గూర్చిన భయము కలిగి నందున సంస్థానముల యొక్క అధిపతులును, అధికారులును, ప్రభువులును, రాజు పని నడిపించు వారును యూదులకు సహాయము చేశారు. ఇదంతా యూదుల యెడల దేవుని సహాయము కాదా! 4వ వ॥లో

మొర్దెకై రాజ నగరిలో గొప్పవాడైపోయాడు. అంతేకాక అంతకంతకు గొప్పవాడై పోయాడు. అలాగే అన్యులమైన మనము కుక్కలము, కడసారి వారమై యుండగా I కొరి 1అ:31వ వ॥ ప్రకారం, బలహీనులము, ఎన్నికలేనివారమై యుండగా, నీచులము, తృణీకరింపబడిన వారమైయుండగా, వెర్రివారమై, కొద్దివారమై యుండగా, పెంటకుప్పల మీద నున్న దీనులమై యుండగా ప్రభువు మనల్ని పరలోకము మట్టుకు హెచ్చించాడు. ఈ లోకంలో కూడ I దిన. 17:16:19వ॥లలో వలె ఘనులకు కలిగియున్న పేరు వంటి పేరు దావీదుకిచ్చినట్లు మనకుసూ ప్రభువు ఇచ్చాడు. యెష. 1అ:2వ వ॥లో చెప్పినట్లు దేవుడు తన పిల్లలమైన మనల్ని పెంచి గొప్పవారిగా చేశాడు. కీర్త. 126అ:2వ వ॥లో వ్రాయబడినట్లుగా యెహోవా వీరి కొరకు గొప్ప కార్యములు చేసెనని అన్యజనులు చెప్పుకునేటట్లు ప్రభువు చేశారు. ఈలాగున మొర్దెకై విశ్వాసులమైన మనకు సాదృశ్యంగా వున్నాడు. అంతమాత్రమే కాక వెయ్యేండ్ల పరిపాలన చేయబోతున్న మన రారాజైన యేసు రాజుకు కూడా ముంగుర్తుగా వున్నాడు. ప్రభువు యెష. 52వ:13అవ॥ ప్రకారము ఆయన హెచ్చింపబడి ప్రసిద్ధుడై మహోఘనుడుగా యెంచబడి రారాజుగా తన పరిపాలనలో వుండబోతున్నాడు, పారశీక అధిపతులు, ప్రభువులు, అధికారులు, రాజు పని నడిపించు వారు యూదులకు సహాయము చేసినట్లు ప్రభువు పరిపాలనలో యెష. 61వ:5అ–7వ॥లలో వ్రాయబడినట్లు అన్యులు నిలువబడి యూదుల మందలను మేపే వారుగా వుంటారు. పరదేశులు యూదులకు వ్యవసాయ కులుగా వుంటారు. పరదేశులు యూదా వారి ద్రాక్షతోటలకు కాపరులౌతారు. యూదులు, ఇశ్రాయేలీయులు యెహోవాకు యాజకులని, వారు మా దేవుని పరిచారకులని మనుషులు ఇశ్రాయేలీయులను గూర్చి చెప్పుకుంటారు. 4వ వ॥లో మొర్దెకై రాజు యొక్క నగరిలో మాత్రమే గొప్పవాడు గాక అతని కీర్తి 127 సంస్థానములన్నింటియందును వ్యాపించెనని చదువుతున్నాము. ప్రియ సహోదరీ! మన ఊరిలో మనము దేవుని విషయాల్లో (ఆత్మీయ విషయాల్లో) గొప్పవారంగా ఎదిగామా? ఈ సాక్ష్యం మన ఊరిలో మాత్రమే కాక అన్ని చోట్లలోనూ కలిగివున్నామా? తిమోతి లుస్త్రలోనూ, ఈకొనియలోనూ వున్న సహోదరులందరి వలన మంచి పేరు కలిగియున్నవాడుగా అపో.కా 16:2వ వ॥లో చూడగలము. ప్రసంగి 7వఅ:1వ వ॥ ప్రకారం సుగంధ తైలము కంటే మంచి పేరు మేలు సామె 22వఅ:1వ వ॥ ప్రకారం "ఐశ్వర్యము కంటే మంచి పేరు కోరదగినది." కనుక మన మందరము కూడా అన్ని చోట్ల (భూదిగంతముల వరకు) ప్రభువు కొరకు మంచి సాక్షులమై వుండాలి. వ్యక్తిగతముగా చక్కని సాక్ష్యము లేకుండా ప్రభువు కొఱకై సాక్ష్యమివ్వలేము. 5వ వ॥లో యూదులు తమ శత్రువులందరిని కత్తివాత హతము చేసి నాశనము చేశారు. ఒక్క షూషను కోటలో 500 మందిని చంపి నాశనము చేశారు. హామాను యొక్క 10 మంది కుమారులు ఉరితీయించబడి శాపగ్రస్త మరణమును

అనుభవించారు. హామాను కుమారులకు ఎందుకీ గతి పట్టిందో మనమాలోచిస్తే? యెష. 61వఅ:8-9వ॥లలో ఒకడు అన్యాయముగా ఒకని సొత్తును పట్టుకొనుట నాకు అసహ్యము. అట్టి వారికి సత్యమును బట్టి (వాక్యమును బట్టి) వారి క్రియాఫలమును నేను వారికిచ్చెదను. వారి సంతానము జనములలో అందరికీ తెలియబడును. జనముల మధ్యను వారి సంతానమును ప్రసిద్ధినొందును. వారు యెహోవా ఆశీర్వదించిన జనమని వారిని చూచిన వారందరూ ఒప్పుకుంటారు. ఈ వచనాల వలన మన కర్థమయ్యేదేంటంటే హామాను యూదులందరి ప్రాణాలు అన్యాయంగా తీయాలనుకున్నాడు (చంపాలనుకున్నాడు). వాక్య సత్యాన్ని బట్టి దేవుడాయన క్రియలకు ప్రతి ఫలమిచ్చాడు. ఆయన సంతానము ప్రసిద్ధి నొందలేకపోయింది. యెహోవా చేత ఆశీర్వాదము పొందలేక పోయారు. ఉరితీయబడి శాపగ్రస్తమైన మరణమనుభవించారు. వారు శాపానికి ప్రసిద్ధులుగా, ప్రతీకలుగా బైబిలు చరిత్రలో మిగిలిపోయారు. వారి పేర్లకు అర్థములు ముందే తెలుసుకున్నాము.

హామాను పిల్లల పేర్ల అర్థాలను బట్టి చూస్తే వారందరిలో శాసనములను మీరేవారు, ఏడ్చే గర్విష్ఠులు, యూదులను చంపేవారు, సింహములాంటి వారుగా కనిపిస్తున్నారు. ఈలాంటి జీవితం జీవించిన వారు గనుకనే వారు చివరికి శాపగ్రస్త మరణాలు పొందారు. 12వ వ॥లో రాజు **510** మంది పారశీకులు షూషను కోటలో చనిపోయారని రాణితో చెప్పి రెండవ దినమున "**ఇప్పుడు** నీ మనవి ఏమిటి? **ఇంకనూ** నీ మనవి ఏమిటి? అది నీకను గ్రహించబడును. అది నీకు చేయబడునని" ప్రభువు రాజు రాణితో చెబుతున్నాడు. అనగా నిన్నటి వరకు నీవు అడిగిన ప్రకారం నీకు జవాబిచ్చాను. ఇప్పుడు తాజాగా, ఇంకనూ (నిన్నటిదికాక) ఈరోజు క్రొత్తగా ఏమడిగినా నేను చేస్తాను, అంటున్నాడు. భూసంబంధమైన ఈ రాజు ఒక్క రోజు మాత్రమే కాక రెండు రోజులు ఆమె అడిగినవి ఇస్తానని చెబుతుంటే, మన పరమరాజు తనను ఎన్నిసార్లు, ఎన్ని దినాలు, జీవిత పర్యంతము ఎంత కాలము నుండి ఎంత కాలము వరకు అడిగినా యిస్తూనే వుంటాడు. ఆయన ప్రార్థన ఆలకించేవాడు. రాజు ఎస్తేరుకు మాత్రమే ఇచ్చాడు. ప్రభువు ఎంత మంది అడిగినా అంత మందికి కూడ ఇస్తాడు. సర్వశరీరులకు కూడ ఇస్తాడు. రెండవరోజు రాజు, రాణిని పై విధంగా అడుగగా రాణి ఈ రోజు జరిగినట్లు రేపును జరగాలి అని రాజును అడిగింది. అందువల్ల ఆ రెండవ రోజు షూషను కోటలో **300** మంది పారశీకులను యూదులు చంపారు. మిగతా సంస్థానములన్నింటిలో మొదటి రోజున **75,000** మంది పారశీకులను యూదులు చంపారు. అనగా 2 రోజులు కలిపి 500+10+300+75,000 = 75,810 మంది పారశీకులను యూదులు చంపివేశారు. చెఱపకురా, చెడెదవు అన్న తీరుగా పారశీకులకు ఈ పరిస్థితి దాపురించింది.

15వ వ॥లో వారు కొల్లసొమ్ము పట్టుకొనలేదు అని వ్రాయబడింది. ఎస్తేరు. 3అ:13వ వ॥లో హామాను ఆదారు మాసం 13వ రోజు యూదులందరినీ నిర్మూలించాలి అంతమాత్రమే కాదు, వారి కొల్ల సొమ్ము పట్టుకోవాలి అని శాశనంలో వ్రాయించాడు. కానీ యిపుడు నిర్మూలమైంది పారశీక ప్రజలే. దేవుని ప్రజలైన యూదులను దోచుకోవాలనుకునే వారే నిర్మూలము చేయబడ్డారు. నిర్గ. 15వఅ :9వ వ॥లో ఐగుప్తీయులు, ఇశ్రాయేలీయులను దోపుడు సొమ్ముగా పంచుకొనెదను. వాటి వలన నా ఆశ తీర్చుకొనెదను, నా కత్తి దూసెదను, నా చెయ్యి వారిని నాశనము చేయునని అనుకొనెను. కానీ వారు రాతివలె అడుగంటి పోయారు. అగాధ జలోఘములల్లో సీసము వలె మునిగిపోయారు. కానీ యిక్కడ ఎస్తేరు 9:15వ వ॥లో యూదులు పారశీకుల కొల్లసొమ్ము పట్టుకోలేదు. వారు తమ ప్రాణ రక్షణ కొరకే వారిజాతి రక్షణ కొరకే ఆశించారు. దాని కొరకై దేవుని ప్రార్థించారు. కానీ కొల్లసొమ్ము పట్టుకోవడం వారి ఉద్దేశం కాదు. ఈనాడు ప్రతి మనిషి సొమ్ము, సంపాదన మీదనే దృష్టిపుంచుతున్నాడు. కడకు అన్యాయంగానైనా అక్రమంగానైనా డబ్బు సంపాదించాలనే మనస్సు కల్గియున్నారు. చివరకు దేవుని సేవకులమని చెప్పుకునే బిలాములు, గేహజీల్లాంటి వారు కూడ సొమ్ము కొఱకే సేవ చేస్తున్నారు. చివరకు యేసు ప్రభువు శిష్యుడైన ఇస్కరియోతు యూదా కూడా 30 వెండి రూకలకు తన బోధకున్ని అప్పగించాడు. ఆ సొమ్మును అనుభవించకుండానే తన్ను తాను ఆత్మహత్య చేసుకున్నాడు కదా! ఒక పాస్టర్ ఉచితముగా యివ్వవలసిన బైబిలును డబ్బులకు అమ్ముకొని తన ఊరు వెళ్ళగానే తన కాలు విరిగిందట. కొంత మంది ధనమును ఆపేక్షించి విశ్వాసము నుండి తొలగిపోయి నానా బాధలలో తమ్మును తామే పొడుచుకున్నారని పౌలు I తిమో. 6వఅ :10వ వ॥లో వ్రాశాడు. దైవజనుడా, నీవైతే వీటన్నిటి విసర్జించమని నీతి, విశ్వాసము, ప్రేమ, ఓర్పు, సాత్వీకమును సంపాదించుకొనుటకు ప్రయాసపడమని పౌలు తిమోతిని 11వ. వ॥లో హెచ్చరిస్తున్నాడు. యూదులు కొల్లసొమ్మును లక్ష్యపెట్టలేదు. విసర్జించారు. జాతి రక్షణే వారు కోరుకున్నారు.

యూదులు కొల్లసొమ్ము పట్టుకోలేదు. కానీ పౌలు ఏమి పట్టుకున్నాడు? "నేను దేని నిమిత్తము క్రీస్తు యేసు చేత పట్టబడితినో దానిని పట్టుకొనవలెనని గురియొద్దకే పరుగెత్తుచున్నాను." అని ఫిలి. 3అ:12వ వ॥లో చెబుతున్నాడు. అలాగైతే, యేసు క్రీస్తు పౌలును ఎందు కొరకు పట్టుకున్నాడు? అన్యజనుల యెదుట, రాజుల ఎదుట, ఇశ్రాయేలీయుల యెదుట ప్రభువు నామమును భరించుటకును, దేవుడు అతన్ని పట్టుకున్నాడని వాక్యములో చదువుతున్నాము. ఆ ప్రభువు ఉద్దేశాన్ని నెరవేర్చడానికి, ఆ ఉద్దేశాన్ని పట్టుకొనుటకు పౌలు పరుగెత్తుచున్నాడని ఫిలి. 3వఅ :12వ వ॥లో ద్వారా గ్రహిస్తున్నాము. పౌలు అలాగున అన్యులు,

రాజులు, ఇశ్రాయేలీయుల మధ్య దేవుని నామాన్ని భరించాడు. ఎన్నో శ్రమలను భరించాడు. ఎన్నో సంఘాలు కట్టాడు. ఈనాడు అనేకులు సేవ చేయడానికి యిష్టపడుతున్నారు. కానీ ఆయన నామమున శ్రమలననుభవించుటకు యిష్టపడుట లేదు. అపోస్తలుడైన యోహాను ప్రభువు వలన కలిగిన శ్రమలోను, రాజ్యములోను, సహనములోను పాలివాడయ్యాడు (ప్రక. 1వఅ:9వ వ॥). చాలా మందికి యేసు వలన కలిగే రాజ్యము ఇష్టమే కాని యేసు కొరకు శ్రమ పడడానికి, సహనము కలిగి వుండడానికి యిష్టపడరు. ఈలాంటి వాటిని పట్టుకోడానికై యోహానును ప్రభువు పట్టుకున్నాడు. ప్రియ సోదరీ! ప్రభువు నిన్నెందుకు పట్టుకున్నాడో నీకు తెలుసా? దానిని పట్టుకోడానికి నీవు పరుగెడుతున్నావా? బిలాము ప్రవక్త, బాలాకు రాజు యొక్క బహుమానం కోసం పరుగెత్తాడు. గేహజి నయమాను నొద్దకు పరుగెత్తుకొని పోయి అతని యొద్ద ఏదైనను తీసుకొందు ననుకున్నాడు. కానీ పరుగెత్తుకొనిపోయి కుష్ఠురోగం తెచ్చుకున్నాడు. కనుక ఈ మాటలు మనకు హెచ్చరికగా నుండగా ప్రియ సోదరీ! నీ ప్రభువు నీ కప్పగించిన పని ఏమి? దానిని పట్టుకోడానికి నేటి నుండైనా పరుగెత్తుతావా?

## 16-19వ॥లలో యూదులు సంతోషించుట :

వారు సొమ్ము పట్టుకోక పోయినా శత్రువు నుండి వారు రక్షింపబడి యున్నందున 14వ దినమున, 15వ దినమున వారు నెమ్మది పొంది విందులు చేసుకున్నారు. నెమ్మది నిచ్చే వాక్య విందులు మనకునూ మన ప్రభువు ప్రతి సంవత్సరము ప్రత్యేక కూడికలలో ఇస్తూనే వున్నారు. ప్రతి సంవత్సరము జనరల్ మీటింగ్, యూత్ మీటింగ్, సేవకుల మీటింగ్, స్త్రీల మీటింగ్ యిలా ఎన్నో వాక్యపు విందులు మనకు కూడ, ప్రభువు అనుగ్రహిస్తున్నారు. 19వ॥లో అవిశుభదినములని ఒకరికొకరు వారు బహుమానములు పంపించు కున్నారు. సొమ్మును బట్టి వారు ఆనందించుట లేదు కానీ, దేవుడు వారికిచ్చిన విడుదల, విమోచన నిమిత్తమై సంతోషిస్తూ బహుమానాలు ఒకరికొకరు పంపించుకున్నారు. దేవుని పిల్లలు ఒకరి కొకరు బహుమతు లిచ్చుకోవడం వారి ప్రేమను సూచిస్తుంది. ప్రభువు కూడ పరలోకమందు మనకు బహుమానములిచ్చు వాడుగా వున్నాడు. హెబ్రీ 11వఅ:26వ వ॥లో మోషే ఫరో కుమార్తె యొక్కకుమారుడని పించుకొనలేదు. అలా అనిపించుకోడం ఈలోకంలో మోషేకు అధిక్యతే. కాని, ప్రతిఫలముగా కలుగబోవు బహుమానమందు ఆయన దృష్టియుంచాడు. ఈ బహుమానమిచ్చే వాడు ప్రభువే. ఫిలి. 3వఅ:14వ వ॥లో వున్నట్లు దేవుని ఉన్నతమైన పిలుపుకు కూడా దేవుడు బహుమానమివ్వబోతున్నాడు. ఆ బహుమానం పొందాలని గురియొద్దకే మనము కూడా పరుగెత్తాలి. కొలొ. 2వఅ:19వ వ॥లో వ్రాయబడినట్లు ఎవడునూ మన బహుమానాన్ని అపహరించకుండ చూచుకోవాలి. II పేతురు 2వఅ:16వ వ॥లో వున్నట్లు

దుర్నీతి వలన కలుగు బహుమానము వద్దు. మన పగవాడైన సాతానుడులేని, బాధలు లేని పరలోకానికి మనము వెళ్ళినపుడు గొఱ్ఱెపిల్ల వివాహ మహోత్సవములో విందు చేయబోయే ఆ శుభదినమున మనకునూ ప్రభువు బహుమానములు యివ్వబోతున్నారు. (IIకొరి 5:10)

## 20-32వ॥లలో పూరీము పండుగ ఆచరించుట :

ఆదారు మాసం 14,15 శుభదినాలను ఏరీతిగా ఆచరించాలో వాటిని గూర్చి సమీపముననేమి, దూరముననేమి నివసిస్తున్న యూదులందరికీ మొర్దెకై పత్రికలు వ్రాసి పంపాడు. ఆ రెండు దినములు వారికి శుభ దినములు. ఆ నెల వారికి సంతోషము తెచ్చిన నెల. ప్రతి సంవత్సరము వారు ఆ దినాలను ఆచరించాలని మొర్దెకై వ్రాయించగా, ఆ ప్రకారము చేయుటకు వారు ఒప్పుకున్నారని వ్రాయబడింది.

అలాగు విశ్వాస జీవితములో క్రొత్తనిబంధన ప్రకారము మన మాచరించదగిన ఆచరణలేమి లేవు. కాని అర్థసహితమైన రెండు ఆచరణలు మాత్రమే వున్నాయి. అవి (1) ప్రభువు నందు విశ్వసించిన తరువాత తీసుకునే బాప్తీస్మము (2) బాప్తీస్మము తీసుకున్న వారు ఆచరించవలసిన ప్రభువు బల్ల ఈ రెంటికీ అర్థమున్నది. "నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపబడును" అన్న ప్రభువు ఆజ్ఞ ప్రకారం మనము ప్రభువును రక్షకుడిగ ఒప్పుకొని బాప్తీస్మం తీసుకోవాలి. ఆ తరువాత ఆదివారం అర్థము. ప్రతి ఆదివారమున సంఘముగా కూడుకొని ప్రభువు బల్లను తప్పనిసరిగా ఆచరించాలి. నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని ఆచరించవలెను. అని ప్రభువు చెప్పినట్లు యూదులవలె సంవత్సరమునకొకసారి కాక, నెలకొకసారి కాక ఆదివారమున, అనగా ఏ ఆదివారమున?. నెలలో మొదటి ఆదివారమా? 2వ ఆదివారమా? 3వ ఆదివారమా? లేక నాలుగవ ఆదివారమా? ఆదివారమున అనగా ప్రతి ఆదివారమున సంఘముగా కూడి ప్రభువు బల్లలో ప్రభువును ఆరాధించాలి. తరతరములకు, మన సంతతి కూడా ఆచరించాలి. 28లో మొర్దెకై మాటలు ప్రతి సంస్థానములో, ప్రతి పట్టణములో, ప్రతి కుటుంబములో తరతరములుగా యూదులు ఈ పూరీము పండుగను రెండు దినములు ఆచరించాలని, ఇది వారి మీదను, వారి సంతతి మీదను ఒక బాధ్యత అనియు వారు ఒప్పుకున్నారని వ్రాయబడింది. అలాగే ప్రభువు మన కొరకు వ్రాయించిన ఆజ్ఞలు విధులు ఆచరించుట మన బాధ్యత. అని ఖండితముగా ఆచరించవలసినవే ఆచరిస్తే ఆచరించండి లేకపోతే లేదు. అని, ప్రభువు చెప్పలేదు. ప్రభువువిచ్చిన ఆజ్ఞలు 1. నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపబడును నమ్మనివానికి శిక్ష విధింపబడును. 2. ప్రభువు నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడి. 3. మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించండి. (మార్కు 16వఅ:15వ). ఆయన

ఆజ్ఞలు జాగ్రత్తగా గైకొనవలెనని ప్రభువు ఆజ్ఞయిచ్చారు. మొర్దెకై వ్రాయించిన వాటిని పై సంగతులను యూదులు మానకుండునట్లు, మరచిపోకుండునట్లు ఒక బాధ్యతగా వుండాలని ఆజ్ఞను ఖండితంగా వ్రాయించాడు. మొర్దెకై ఏర్పరచిన విందు దినాలు ఎలాగో ఉపవాస, విలాపదినాలు కూడ బాధ్యతగా ఎంచుకొని వాటిని జరిగిస్తామని యూదులు ఒప్పుకున్నారు. విందు దినాలు అందరూ ఆచరించడానికి ముందుకొస్తారేమోగానీ; ఉపవాస దినాలు ఆచరించడానికి ముందుకురారు. కానీ యూదులు ఉపవాస ప్రార్థన దినాలను కూడ ఆచరిస్తామని, ఆ బాధ్యతను తమ మీద వేసుకొని ఆచరించారు. ప్రియ సోదరీ! ఈనాడు సంఘాల్లో విందులెక్కువైనాయి. కానీ ఉపవాస ప్రార్థనలు తక్కువయ్యాయి. ఎస్తేరు రాణి అంతఃపురములో వుండినప్పటికీ యూదులందరి రక్షణ కొరకై 3 రోజులు తన చెలికత్తెలతో ఉపవాస ముండుట మనకెంతో మాదిరికరం. ఉపవాసదినాలను గూర్చి తాను యూదుల కాజ్ఞాపించకమునుపే ఎస్తేరు మాదిరిగా వుండింది. మార్కు 9వఅ:29వ వ॥లో ప్రభువు చెప్పినట్లు ఉపవాస ప్రార్థనతోనే గాని మరిదేనితోను కొన్ని సమస్యలు సాధ్యము కావు. కనుక విందులు ఎంత శ్రద్ధగా చేసుకుంటామో, ఉపవాస ప్రార్థనలు కూడా అంత శ్రద్ధగా, బాధ్యతగా, మరువకుండా, చేయాలి. లేఖనాలలో అన్న ప్రవక్తి రేయింబవళ్ళు ఉపవాస ప్రార్థనలు చేసింది. అ.కా. 13వఅ:2వ వ॥లో అంతియొకయ సంఘములో వున్న ప్రవక్తలు బోధకులు ప్రభువును సేవిస్తూ, ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ – "నేను పిలిచిన పని కొరకు పౌలును, బర్నబాను ప్రత్యేక పరచుడని" చెప్పుట మనము గమనించగలము.

పాత నిబంధనలో ఎజ్రా. 8వ:21వ వ॥లో ఎజ్రా యూదులు యెరూషలేముకు వెళ్ళే ప్రయాణములో తమ శుభ ప్రయాణము కొఱకు ఉపవాసముండి వారు ప్రార్థన చేయగా దేవుడు వారి మనవిని ఆలకించాడు నెహె.1వఅ:4వ వ॥లో యెరూషలేము ప్రాకారము పడద్రోయబడి గుమ్మములు కాల్చబడి యుండగా, చెరపట్టబడిన వారు నిందను, శ్రమను పొందుచుండగా నెహెమ్యా కొన్ని రోజులు దుఃఖముతో ఉపవాస ముండి ఇశ్రాయేలీయుల దోషమును ఒప్పుకొనుచు ప్రార్థన చేశాడు. యోవే. 2వఅ:15వ వ॥లో సీయోను దోషమును ఒప్పుకొనుచు ప్రార్థన చేశాడు. యోవే. 2వఅ:15వ వ॥లో సీయోనులో బాకా ఊదుడి వ్రతదినము ప్రకటించబడి ఉపవాస దినము ప్రతిష్ఠించుడి అని వ్రాయబడింది. పై వచనాలను బట్టి ప్రకటించబడి ఎజ్రా లాంటి శాస్త్రులు, నెహెమ్యా లాంటి గవర్నర్లు, ఎస్తేరు లాంటి రాణులు, సీయోనులోని జనుల పెద్దలు, చిన్నవారు, స్తన్యపానము చేయు బిడ్డలు, పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె, యాజకులు ఈలాంటి వారందరూ ఒక దినముగాని కొన్ని దినములు గాని, కొన్ని నెలలు గానీ, ఉపవాస విలాపములతో, మనో దుఃఖముతో ఉపవాస ప్రార్థనలు మంటపమునకు బలి పీఠముకు మధ్యలో కొంచము చేస్తే, నెహెమ్యా యింటిలో

చేస్తే, ఎస్తేరు అంతఃపురములో చేస్తే, అన్న ప్రవక్తి దేవాలయంలో చేస్తే మరికొందరు జనులు మందిరంలో ఉపవాస విలాప ప్రార్థనలు చేశారు. ఉపవాస ప్రార్థన వీరు, వారు అని కాదు, అందరూ అనగా చిన్న పిల్లలు, శిశువులు. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తె అందరూ చేయవచ్చు(యోవేలు 2వఅ:16వ వ॥). ఎన్ని రోజులు చేయాలి? అన్న నియమమేమీ లేదు. మనకున్న సమస్య యొక్క తీవ్రతను బట్టి మన అనుకూలతను బట్టి మన దేహబలహీనతలను కూడా దృష్టిలో వుంచుకొని మనకనుకూల స్థలములో జ్ఞాన యుక్తముగా ఉపవాసం చేయుట మంచిది. ఉపవాసముండి గ్యాస్ట్రిక్ ట్రబుల్, కడుపు మంట తలనొప్పి లాంటివి తెచ్చుకోడం కాదు. అసలు మనము కడుపు కట్టుకొని, జమ్ముకాడ వంగిపోయినట్లు గోనెపట్ట కట్టుకొని బూడిద పోసికొని, కూర్చుండుట ఆయన కిష్టమైన వుపవాసం కాదు. అయితే తల వంచుకొని గోనె కట్టుకొని బూడిద పరచుకొని కూర్చుండుట. ఉపవాసం చేయుట దేవునికిష్టం కాదని యెష. 58వఅ:5వ వ॥లో ప్రభువు చెబుతున్నాడు. అలాగైతే ఏది ఆయన కిష్టమైన ఉపవాసం? "దుర్మార్గులు కట్టినకట్లను విప్పుటయు. కాడిమ్రాను మోకులు తీయుటయు, బాధింపబడిన వారిని విడిపించుటయు. ప్రతికాడిని విరుగకొట్టుటయు నేనేర్పరచుకొన్న ఉపవాసము కాదా? నీ ఆహారము ఆకలిగొనిన వారికి పెట్టుటయు, నీ రక్త సంబంధికి ముఖము తప్పింపకుండుటయు, దిక్కుమాలిన బీదలను నీ యింట చేర్చుకొనుటయు, వస్త్రహీనుడు కనబడినపుడు వానికి వస్త్రములిచ్చుటయు ఇదియే గదా నాకిష్టమైన వుపవాసము అని ప్రభువు యెషయా 58వఅ:6-8వచనాల్లో చెప్పారు. ఈలాగున ఆయనకిష్టమైన ఉపవాసము చేసినపుడు కలుగు 16 దీవెనలు 8-12 వచనాల వరకు వ్రాయబడ్డాయి.

31వ వ॥ మొత్తానికి మొర్దెకై ఈలాటి ఉపవాస విలాప కాలములను, ఊరీము పండుగను స్థిరపరచుటకు మొర్దెకై, 127 సంస్థానములకు క్షేమము కోరునట్టి, విశ్వాసార్థములగు మాటలుగల పత్రికలు వ్రాసి పంపాడు. అలాగే ప్రభువు మనకు ఆత్మీయముగా స్థిరపరచు మాటలు క్షేమాభివృద్ధి, హెచ్చరిక, ఆదరణ కలిగించే మాటలు, విశ్వాసమును పెంపొందించే మాటలు గల బైబిలు గ్రంథాన్ని 40 మంది వ్యక్తుల ద్వారా మన కొరకు వ్రాయించారు. జ్ఞానమును ఉపదేశమును అభ్యసించుటకును, వివేక సల్లాపములను గ్రహించుటకును నీతి న్యాయ, యదార్థతలను అనుసరించుట యందు బుద్ధికుశలత యిచ్చు ఉపదేశము పొందుటకును జ్ఞానములేని వారికి బుద్ధికలిగించుటకును, తెలివి, వివేచనము పుట్టించుటకును తగిన సామెతలు ప్రభువు వ్రాయించారు. స్త్రీలకు పురుషులకు, అత్త కోడండ్రకు, భార్య భర్తలకు, స్నేహితులకు, అధికారులకు, తల్లిదండ్రులకు, దాసదాసీలకు, యజమానులకు, కూలీలకు, ధనికులకు, బీదలకు, దేవుని సేవకులకు, పిల్లలకు, బాల బాలికలకు, సంఘ పెద్దలకు, పరిచారకులలకు. సువార్తికులలకు ఒకరికేంటి? అందరికీ వలు వయసుల వారికి

ప్రయోజనకరముగా ప్రభువు బైబిలు గ్రంథాన్ని వ్రాయించి దయచేయగా మనమెంత స్థిరపడుతున్నాము? ఎంతగా క్షేమాభివృద్ధి పొందుతున్నాము? ఎంతగా విశ్వాస మునుండి అధిక విశ్వాసమునకు ఎదుగుతున్నాము? మన మీలాగు క్షేమాభివృద్ధి పొంది, విశ్వాసములో ఎదిగి 1 యోహాను. 2వఅ:1వ వ॥లో వున్నట్లు పాపము చేయకుండుటకై ప్రభువు బైబిల్‌లో ఈ సంగతులు వ్రాయించారు. పాపంలో పడడానికి హేతువేదీ లేదు. మొర్దెకై పూరీము పండగను గూర్చి మాత్రమే పత్రికలు వ్రాయించాడు. కానీ యేసుక్రీస్తు తాను చేసిన కార్యములు ఇంకనూ అనేకములు కలవు. కానీ వాటిలో ప్రతి దానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైన చాలదని యోహాను తన సువార్త 21వఅ:25వ వ॥లో వ్రాశాడు.

23వ.వ॥లో ఈలాగున యూదులు మొర్దెకై తమకు వ్రాసిన ప్రకారముగా నెరవేర్చుదుమని ఒప్పుకున్నారు. అలాగే ప్రభువు మనకిచ్చిన ఆజ్ఞలు, ఆచరణలు, ఉపదేశములు, శాసనములు, కట్టడలు బైబిల్‌లో ఎన్నో వ్రాయించారు. వ్రాసిన ప్రకారముగా నెరవేర్చడానికి మనము ఒప్పు కుంటున్నామా? అనేకసార్లు ఆయన ఆజ్ఞలు వింటూనే వున్నాం. చదువుతూనే వున్నాం. విన్నవి, చదివినవి ఆచరించడానికి, నెరవేర్చడానికి ఒప్పు కుంటున్నామా? యాకోబు పత్రిక 1వఅ:22వ వ॥లో వ్రాయబడినట్లు మనము వినువారము మాత్రమైయుండి మనల్ని మనము మోసపుచ్చు కొనకుండ వాక్య ప్రకారము ప్రవర్తించు వారమై యుండాలి. వాక్యాన్ని విని అలాచేస్తామని ఒప్పుకొని దాని ప్రకారము ప్రవర్తింపని వారమైతే మన సహజ ముఖములను అద్దములో చూచుకొని అవతలికి పోయి మనమెట్టివారమో వెంటనే మరచిపోవు వారముగా వుంటాము. ప్రియ సోదరీలారా! మనం వాక్యం వినడం మనల్ని మనం మోసపుచ్చుకోడానికేనా? లేక వినినవి ఒప్పుకొనినవి వాటి ప్రకారము ఆచరించడానికా? ఆచరించి ప్రభువు దీవెనలు పొందుదాం. ఎస్తేరు 9వఅ:27వ వచనాలలో ఈలాగున యూదులు తాము ఒప్పుకోడమే కాదు గానీ, ప్రతి సంవత్సరము ఈ దినములను ఆచరించి తరతరాలుగా కుటుంబములోను, ప్రతి సంస్థానములోను, ప్రతి పట్టణములోను, జ్ఞాపకము చేయబడునట్లుగా ఆచరిస్తామని తమ సంతతి వారికి కూడా జ్ఞాపకము చేస్తామని ఒప్పుకున్నారు. మానకుండ మరచిపోకుండా తమ సంతతి మీద, తమతో కలిసికొను వారి మీదను ఒక బాధ్యతగా వుండునని ఒప్పుకున్నారు. ప్రియ సోదరీలారా! వాక్యాన్ని విని ఒప్పుకొని, ఒక బాధ్యతగా ఆచరించి మనము మాత్రమే కాక మన సంతతి, మాత్రమేకాక మనతో ఎవరెవరు కలిసికొంటూ ఉంటారో వారందరూ దేవుని ఆజ్ఞలు మానకుండా, మరచిపోకుండా ఆచరించడానికి మనమును ఒప్పుకుందామా! ఇశ్రాయేలీయులు యెషయా. 17వఅ:10వ వ॥లో రక్షణ కర్తయైన దేవునినే మరచిపోయారని వ్రాయబడింది. రక్షణ కర్తనే మరచిపోతే ఇక ఆరాధించవలసిన ఆరాధనా దినము. (ఆదివారము) ఏమిగుర్తుంటుంది?

నియామక కూడికలు ఎలా గుర్తుంటాయి? బాప్తీస్మమును గూర్చిన ఆజ్ఞ సహవాసమును గూర్చి, రొట్టె విరచుటను గూర్చి, బోధన గూర్చి, ప్రార్థనను గూర్చి దేవుడిచ్చిన ఆజ్ఞలు నీకు గుర్తున్నాయా, మరచిపోయావా? అలా మరచిపోకుండునట్లుగా ఎస్తేరు ఆజ్ఞలను ఆచరించమని ఇశ్రా యేలీయులకు ఆజ్ఞాపించింది. ప్రియ విశ్వాస సోదరి! కీర్తన 119వఅ:4వ వ॥లో వ్రాయబడినట్లు ఆయన ఆజ్ఞలన్నింటిని జాగ్రత్తగా గైకొనవలెనని ఈనాడు దేవుడు మనతో మాటలాడుచున్నాడు. దానికి జవాబుగా కీర్తన 119వఅ:48వ వ॥లో నీ ఆజ్ఞలతట్టు నా చేతులెత్తుచున్నాను. కీర్తన 119వఅ:60వ వ॥లో నీ ఆజ్ఞలనను సరించుటకు నేను జాగుచేయక త్వరపడితినన్నాడు.

కీర్త 119వఅ:98వ వ॥లో నీ ఆజ్ఞలు నాకు తోడుగా వున్నవి. శత్రువులను మించిన జ్ఞానము, బోధకులను మించిన జ్ఞానము, వృద్ధులను మించిన జ్ఞానము నాకు కలదు అంటున్నాడు. దావీదు కీర్తన 119వఅ:131వ వ॥లో నీ ఆజ్ఞలయందైన అధిక వాంఛతో నేను నోరు తెరచి ఒగర్చుచున్నాను అన్నాడు. కీర్తన 119వఅ:151వ వ॥లో ఆయన ఆజ్ఞలన్నియూ సత్యమైనవి. యెహోవా నీవు సమీపముగా వున్నావు. అనగా ఆజ్ఞలను అనుసరించువారికి ఆయన సమీపముగా వుంటాడని దావీదు చెప్పుచున్నాడు. కీర్తన 119వఅ:176వ వ॥లో నీ ఆజ్ఞలను నేను మరచువాడను కాను, అని చెప్పుచున్నాడు. కీర్తన 119వఅ:6వ వ॥లో ఆయన ఆజ్ఞలన్నిటిని లక్ష్యము చేయునపుడు నాకు అవమానము కలుగనేరదు అన్నాడు. ఆయన ఆజ్ఞల అనుసరించినపుడు యిన్ని లాభములుండగా యిట్టి ఆజ్ఞలు విషయమై దావీదు తీర్మానము, నిర్ణయము ఏమై వున్నదో కీర్తన. 119వఅ.:112వ వ॥లో చెప్పుచున్నాడు. " నీ కట్టడలను గైకొనుటకు నా హృదయమును నేను లోపరచుకొని యున్నాను" ఇది తుది వరకు నిలుచు నిత్య నిర్ణయము. ప్రియ సోదరీ! నీవునూ అలాంటి నిత్య నిర్ణయము తీసుకుంటే ఎన్నో లాభాలు నీవు కూడ పొంద గలవు. మరి ఇప్పుడే ఆ నిర్ణయము ప్రభువుతో చేసుకుంటావా?

అలా నీవు నిర్ణయము తీసుకోకపోతే కీర్తన 119వఅ.:21వ వ॥లో "నీ ఆజ్ఞలను విడిచి తిరుగు వారు శాపగ్రస్తులు. అంటున్నాడు. I యోహాను 3వఅ:4వ వ॥లో ఆజ్ఞ అతిక్రమమే పాపము అని వ్రాయబడింది. రోమా 6వఅ.:23వ వ॥లో పాపము వలన వచ్చు జీతము మరణము అని వ్రాయబడింది. మరణమనగా రెండవ మరణము. అదియే అగ్ని గంధకములతో మండు గుండము. అచ్చట అగ్ని ఆరదు, పురుగు చావదు. దీనిని తప్పించు కోవాలంటే, ప్రభువు దగ్గర పాపాలు ఒప్పుకొని అగ్ని గుండము నుండి రక్షణ పొందాలి. అలాగాక ఆయన ఆజ్ఞ విడిచి తిరిగితే శాపగ్రస్తమైన నరకమే నీ గతి అవుతుంది.

31వ వ॥లో ఈ పూరీము పండుగను స్థిరపరచే మాటలు, యూదులకు క్షేమము కలిగించే మాటలు, విశ్వాసము కలిగించే మాటలు గలిగిన పత్రికలను ఎస్తేరు, మొర్దెకై యూదులకు పంపారు. ఈ సంగతులు స్థిరమై, గ్రంథములో వ్రాయబడ్డాయి. అలాగే మన ప్రభువు కూడ బైబిల్ గ్రంథములో మనల్ని స్థిరపరచే మాటలు వ్రాయించాడు. 1 కొరి 15వఅ:58వ వ॥లో ప్రకారం స్థిరులును, కదలని వారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికినీ ఆసక్తులునై యుండుడి అని వ్రాయించాడు. ఫిలి. 4వఅ:1వ వ॥లో ప్రభువు నందు స్థిరులై యుండుడని వ్రాయించాడు. అంతమాత్రమే కాక సామె. 1:2-4 వచనాల్లో జ్ఞానము, ఉపదేశము, బుద్ధి కలిగించు సామెతలను, తెలివి, వివేచనపుట్టించుటకు తగిన సామెతలను కూడా ప్రభువు బైబిలులో వ్రాయించారు. ఇవన్నీ దేవుడు ఎందుకు వ్రాయించాడంటే యోహా. 20వఅ:31వ వ॥లో వున్నట్లు యేసు దేవుని కుమారుడని నమ్మునట్లును, నమ్మి ఆయన నామము నందు జీవము పొందునట్లును అవి వ్రాయబడ్డాయి. ప్రియ సోదరీ! నీవు యేసును నమ్ముకోవాలనే బైబిలులో వ్రాయబడింది. మరి యేసును ప్రభువుగా నమ్మావా? రోమా 10వఅ:9వ వ॥లో వున్నట్లు యేసు ప్రభువవని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందలి విశ్వసించిన యెడల నీవు రక్షించబడతావు. అప్పుడు దేవుడు బైబిలును వ్రాయించిన ఉద్దేశము నెరవేరబడుతుంది. మొర్దెకై

❖ ❖ ❖

## 10వ అధ్యాయము 1+2+1=4వ.లు

**అంశము :** రాజ్యములో మొర్దెకై పని-ఆయన గొప్పతనము.

**విభజన :** 1వ-వ॥ అహష్వేరోషు నిర్ణయించిన పన్ను
2-3వ॥ మొర్దెకై గొప్పతనము

### 1వ. అహష్వేరోషు నిర్ణయించిన పన్ను :

1వ వ॥లో రాజైన అహష్వేరోషు తన రాజ్యములోని 127 సంస్థానములకు, ద్వీపములకు పన్ను చెల్లించాలని నిర్ణయించినట్లు వ్రాయబడింది. ఇలా రాజ్యములోని ప్రజలు చెల్లించిన పన్నులతోనే రాజులు, అధికారులు ప్రజల కొరకైన సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ వుంటారు. ఆసుపత్రులు కట్టించడమో, రోడ్లు వేయించడమో, పాఠశాలలు కట్టించడమో, రైలు, బస్సు సౌకర్యాలు కల్పించడమో, నీటి వసతి కల్పించడం లాంటి పనులు పన్నులలోనే

చేస్తుంటారు. యేసు ప్రభువు ఒకసారి మత్త. 17వఅ:24వ వ॥లో పన్ను వసూలు చేయువారు మీ బోధకుడు అరషెకెలు పన్ను చెల్లింపడా? అని పేతురును అడుగగా అతడు యింటికి వచ్చి ఆ మాట యేసు ప్రభువుతో మాటలాడక మునుపే యేసు పన్ను ఎవరి యొద్ద వసూలు చేయుదురు? కుమారుల యొద్దనా? అన్యుల యొద్దనా? అని అడిగినపుడు అతడు 'అన్యుల యొద్దనే' అని చెప్పినపుడు యేసు అలాగైతే కుమారులు స్వతంత్రులే అయినను మనము వారికి అభ్యంతరము కలుగచేయకుండునట్లు నీవు సముద్రమునకు పోయి గాలము వేసి మొదట పైకివచ్చు చేపను పట్టుకొని దాని నోరు తెరిచిన యెడల ఒక షెకెలు దొరుకును దానిని తీసుకొని నా కొరకును, నీ కొరకును వారికిమ్మని పేతురుతో చెప్పారు. కనుక యేసు ప్రభువు సర్వాధికారియైన దేవుడై యుండి కూడ ఇతరులకు అభ్యంతరము కలుగకుండునట్లు పన్నును చెల్లించినట్లు విశ్వాసులమైన మన మందరమును ప్రభుత్వం విధించే పన్నులు కట్టాల్సిందే. ఆ విషయంలో మన ప్రభువే మనకు మాదిరి. అహష్వేరోషు ఎంత మహారాజు అని పిలువబడినా ప్రజలచే పన్నులు కట్టించుకున్నాడు. కానీ మన యేసు క్రీస్తు ప్రభువు వెయ్యి ఏండ్ల పాలనలో గానీ, తండ్రి చేసే నిత్య పాలనలో గాని పన్నులుండవు, పన్నులులేని రాజ్యమది ప్రజల మీద ఏ భారము మోపని రాజ్యమది, సుభిక్ష పరిపాలనది, ఆయన యెరూషలేము రాజధానిగా చేసికొని పరిపాలించే వెయ్యేండ్ల రాజ్యములో కలిగే ఆశీర్వాదములను గూర్చి యెష. 65వ అధ్యాయము 16వ వచనము నుండి 25వ వ॥ వరకు వ్రాయబడ్డాయి. ఆ రాజ్యములో "పూర్వము కలిగిన బాధలు నా దృష్టికి మరువబడును" అని ప్రభువు అన్నాడు. ఏమిటా బాధలు? భూరాజులు ఒకవేళ మనము పన్నులు చెల్లించలేని పరిస్థితుల్లో వున్నట్లయితే షోకాజ్ నోటీసులివ్వడం, ఆస్తులను జప్తుచేయడం, లేదా చెఱలో వేయించడం ఇలాంటి బాధలు ప్రభువు రాజ్యములో గాని, నిత్య పాలనలో గాని మనకుండవు. ఆ బాధలు మనం మరచిపోతాము. ఆ రాజ్యం ఎల్లప్పుడు హర్షించి, ఆనందించే రాజ్యం. తన జనులను చూచి ప్రభువు కూడ ఆనందించి హర్షిస్తాడు. రోదన ధ్వని, విలాపధ్వని దానిలో వినపడదు. ఎవరుకట్టుకున్న యిండ్లలో వారు కాపురముంటారు. వృథా ప్రయాసలారాజ్యంలో వుండవు. వేడుకొనక మునుపే వారికి దేవుడు ప్రత్యుత్తరమిచ్చే రాజ్యమది. మనవి చేయుచుండగా ఆలస్యము లేక ఆయన ఆలకిస్తాడు. అన్ని జంతువులు కలిసి ఒకేచోట గడ్డిమేస్తాయి. విష పురుగులతో, క్రూర మృగాలతో బాధవుండదు. ఆయన పరిశుద్ధ పర్వతములో క్రూర మృగములు కూడ ఏ హాని చేయవు. అట్టి రాజ్యములో ఎప్పుడు ఈ భూలోకంలో మనము అనుభవించే బాధలు అనగా పన్నుల బాధలు, దొంగల బాధలు, దోచబడటము, మోసపరచబడటం, విషపురుగుల కాటు. వాతావరణ కాలుష్య బాధలు, వైరల్ ఫీవర్స్, డెంగ్యూ, చికెన్ గునియా, మొదలగు అనారోగ్యాలు, కరువు ఈలాంటి బాధలన్నీ మరువబడతాయి.

దేవునికి స్తోత్రం చిన్న చిన్న ద్వీపాలను కూడ విడిచిపెట్టకుండా అహష్వేరోషు రాజు ప్రజలచే పన్నులు కట్టించుచున్నాడు. దీనికి ప్రభువు వ్యతిరేకం కాదు. కనుకనే రోమా 13వఅ:7వ వ॥లో ప్రభువు ఎవనికి పన్నో వానికి పన్నును, ఎవనికి సుంకమో వానికి సుంకమును చెల్లించుడి అని చెబుతున్నాడు. కనుక ఈ లోకాధికారులకే మనం పన్నులు కట్టాలి. కాని ప్రభువు రాజ్యంలో వీటన్నిటి బాధలు మరుపబడతాయి. అయినా ఈ మొర్దెకై పన్నులు వసూలు చేసి ప్రజలకు సంక్షేమ కార్యక్రమములు చేయగా, హామాను ఖజానాలో వున్న డబ్బును ఖాళీ చేసి ప్రజా సంక్షేమం కొరకు కాక యూదా ప్రజలను చంపించడానికి ఖర్చు చేయడానికి ప్రయత్నించాడు. జన క్షయము రాజుకు వినాశకరము. జన సమృద్ధిచేత రాజులకు ఘనత వచ్చును. అని సామె. 14వఅ:2వ వ॥లో వ్రాయబడింది. ఖజానాలోని డబ్బుతో యూదులను చంపి జన క్షయము చేయాలనుకున్నాడు హామాను. మొర్దెకై అట్టి యూదులను బ్రతికించి రాజుకు జన క్షయాన్నికాక జన క్షేమాన్ని కలిగించాడు. అలాగున ప్రియ సోదరీ! ఈనాడు నీ ద్వారా సంఘములలో నూతన విశ్వాసులు చేరుతున్నారా? లేక నీ కఠినమైన వైఖరిని బట్టి సంఘానికి రాకుండా ఆగిపోవుట ద్వారా జన క్షయము జరుగుతున్నదా? నీ ద్వారా ఆత్మలు సంఘానికి రాకపోగా ప్రయాసపడి ఇతరులు తెచ్చిన ఆత్మలను నీవు రాకుండా చేస్తున్నావా? ఇష్టమున్నవాళ్ళు రండి లేని వాళ్ళుపొండి అని అంటున్నావా? నీ వైఖరిని నీ మాటలను నీవు మార్చుకోవాలి. మొర్దెకై తన వారందరితో సమాధానముగా మాట్లాడేవాడని ఎస్తేరు 10వఅ:3వ వ॥లో చదువుతాము. ఇంతకు నీవు హామానువా? మొర్దెకైవా?

## 2-3వ. వచనములలో మొర్దెకై గొప్పతనము :

మొర్దెకై పేరుకి చిన్న వాడు అర్థము ఒకప్పుడు కొద్దివాడే. ఆయన పుద్యోగము రాజ గుమ్మము దగ్గర కావలి కాచే చిన్న ఉద్యోగము. స్తోమత చిన్నదే. కానీ. ఇప్పుడు ఆయన పారసీక రాజ్యానికి ప్రధాన మంత్రిగా వున్నాడు. అలాగే యేసు ప్రభువు ఈ లోకానికి మానవుడుగా వచ్చినపుడుగ వచ్చినపుడు చిన్నవాడుగానే వచ్చాడు. వడ్లవానికి కుమారుడని పించుకున్నాడు. కానీ, రెండవ రాకడలో రాజుల రాజుగా ప్రభువుల ప్రభువుగా రాబోతున్నాడు. ఆయన బలవంతుడని, ఆయన బలమైన కార్యాలు చేశాడని, సామర్థ్యముచే కార్యాలు చేశాడని రాజు అతనిని ఘనపరచిన సంగతి వీటన్నిటిని గూర్చి పారసీకుల యొక్క రాజ్య సమాచార గ్రంథములో వ్రాయబడ్డాయి. అలాగుననే దేవుడు మనకిచ్చిన బలమును, ఘనతను దేవుని సేవలో వాడాలి. గుణవతియైన భార్య బలమును, ఘనతకు వస్త్రముగా కలిగివుండుట. అని సామె. 31వఅ:25వ వ॥లో వ్రాయబడింది. ఆమె అబల. బలహీనఘటమే కానీ, లేని బలాన్ని తెచ్చుకొని సామె. 31వఅ:17వ వ॥లో రెండు చేతులతో బలముగా పనిచేస్తోంది.

ఆమెకాబలము ఎలా వచ్చింది? నెహె 6వఅ:9వ వ॥లో నెహెమ్యా "నా దేవా యిప్పుడు నా చేతులను బలపరుచుము" అన్నట్లు గుణవతియైన భార్యను కూడ దేవుడే బలపరచాడు. ఆయన కృప మనల్ని బలపరస్తుంది. మన ప్రభువు అధికబల సంపన్నుడు. జ్ఞాన బలము కలవాడు. మనమును మన ప్రభువు ఇచ్చిన బలముతో పనులు చేయాలి. బలముగా దేవుని వాక్యాన్ని ప్రకటించాలి. మనం పోయే పాతాళంలో గాని. పరలోకంలో గాని చేయటానికి పనులేమీ వుండవు. శక్తి లోపం లేకుండా చేతికి వచ్చిన పనిని చేయాలని ప్రసంగి. 9వఅ:10వ వ॥లో వ్రాయబడింది. దేవుడు మత్తయి. 25వఅ:15వ వ॥లో వ్రాయబడినట్లు ప్రభువు సామర్థ్యము చొప్పున తలాంతులు ఇస్తున్నారు. ఇపుడు ఏమైనా పనులు చేయగలుగుతున్నామంటే ఆయన ఇచ్చిన తలాంతులతోనే, సామర్థ్యంతోనే మనం చేయగల్గుతున్నాం. దేవుని చేత సామర్థ్యాన్ని, తలాంతును పొందియుండియూ మనం పనులు సరిగా చేయకపోతే, సామర్థ్యాన్ని దాచుకుంటే తలాంతును దాచిపెడితే దేవుడిచ్చిన బలాన్ని దాచుకుంటే "సోమరివైన చెడ్డదాసుడా! ఈ కొంచెములో నీవు నమ్మకంగా లేవు" అని మనకున్న తలాంతును తీసి పదితలాంతులు కలిగిన వానికి యిచ్చివేస్తాడేమో జాగ్రత్తగా ఆలోచించి మన పనిని, పని ద్వారా మనకు వచ్చే బహుమానాలను, కిరీటాలను ఎవరునూ అపహరింపకుండా చూచుకోవాలి. మొర్దెకై అన్యరాజైన అహష్వేరోషు ప్రాణాన్ని కాపాడాడు. తద్వారా మొర్దెకై రాజ వస్త్రాలచే అలంకరింపబడి, రాజ కిరీటము తల మీద ధరించబడి, ఘనులైన రాజ అధిపతులలో ఒకడైన హామానుతో రాజు గుఱ్ఱము మీద ఎక్కింపబడి ఊరేగించబడుతూ రాజ వీధిలో ఘనపరిచబడ్డాడు. అది కొంతసేపు ఘనతయే. ఇప్పుడైతే నిజముగా ప్రధాన మంత్రి పదవిలో వుంటూ ఆ రాజ్యంలో రాజ సముఖములో ఆ అన్య ప్రజల మధ్య తాను చేయుచున్న బలమైన కార్యములు బలముతోను సామర్థ్యముతోనూ చేయుచుండగా ఆ పనుల గూర్చి అన్య రాజుల సమాచార గ్రంథమందు రికార్డు చేయబడియున్నదంటే అది ఎంత గొప్ప సాక్ష్యమో కదా! హామాను అలాంటి పనులేవైనను చేసినట్లు రికార్డు లేకపోడం మనం గమనించగలము. అన్యులైన అధికారులు అలా చేయకపోగా యూదుడైన మొర్దెకై ఎంత మంచి సాక్ష్య జీవితం జీవించాడో కాదా! మొర్దెకై మనకందరికీ మంచి మాదిరిగాను ప్రభువుకు మహిమగాను వున్నాడు. నిజముగా మొర్దెకై జీవితాన్ని ఆలోచించినపుడు అది మనకెంతో సంతోషాన్ని ప్రభువుకు ఆనందాన్ని కలిగించేదిగా వున్నది.

ప్రియ సోదరీ! నీకప్పగింపబడిన పని విషయంలో అది యింటిపనైనా బయటి పనైనా, చివరకు ఉద్యోగమైనా, దేవుని పనినైనా బలంతో, సామర్థ్యంతో, నేర్పుతో, నాణ్యతతో, శ్రద్ధతో చేస్తున్నావా? మనం చేసే పనిని బలంతో మాత్రమే కాక జాగుచేయకుండా చేయాలి. కాలాతీతం కాకుండా నిర్ణీత సమయంలోనే ఆ పనిని ముగించాలి. అలా సమయం

మించిపోయే వరకు చేస్తే అలా పనిలో జాగు చేయువాడు నష్టము చేయువానికి సోదరుడు. సామె 18వఅ:9వ వచనం ప్రకారం పనిలో నిపుణత కూడా వుండాలి. సామెతలలో వ్రాయబడినట్లు పనిలో నిపుణత గల వానిని చూచితివా వాడు రాజుల యెదుటనే నిలబడుతాడు. I రాజులు 11వఅ:28వ వ॥లో యరోబాము బలాఢ్యుడైన యువకుడైయుండగా యితడు పని యందు శ్రద్ధగలవాడని తెలిసికొని సొలొమోనురాజు, యోసేపు సంతతి వారు చేయవలసిన భారమైన పని మీద అతనిని అధికారిగా నిర్ణయించాడు. అలాగే పరమ సొలొమోను రాజు కార్యాలను మనము కూడా శ్రద్ధగా చేస్తే ఏలుబడిచేస్తాము లేక అశ్రద్ధగా చేస్తే శాపగ్రస్థులమౌతాం. శ్రద్ధ గలవాడు ఐశ్వర్య వంతుడగునని సామె10వఅ:4వ వ॥లో వుంది శ్రద్ధగల వారు ఏలుబడిచేయుదురు. శ్రద్ధగా పని చేసిన యరోబాము చివరకు ఇశ్రాయేలీయులకు రాజయ్యాడు. బద్ధకముగా పనిచేయువాడు దరిద్రుడగునని సామె. 10వఅ:4వ వ॥లో వ్రాయబడింది. గుణవతి యైన భార్య బలహీన ఘటమైనను బలములేని నడుముకు నడికట్టును కట్టుకొని చేతులతో బలముగా పనిచేయునని. (సామె. 31వఅ:17వ వ॥) ఒక చేతితో పంటెను పట్టుకొని మరోచేత వేళ్ళతో కదురు పట్టుకొని వడుకుతూ (సామె. 31వఅ:17వ వ॥) పని చేస్తోంది. దరిద్రులకు చేతులు అనగా రెండు చేతులూ చాపి ధర్మము చేసే పని చేస్తోంది. అసలు ఆమె చేసే పనులు బోలెడన్ని వున్నాయి. ఆమె చేసే పనులు క్రింద వ్రాయబడిన రీతిగా వున్నాయి.

(1) సామె. 31వఅ:10-12 వచనములు భర్త కొరకు చేసిన పని (2) 13వ వ॥లో ఇంటిలో వస్త్రాల పని (3) 31వఅ:14-15వ వచనములో ఇంటిలో భోజనాల పని (4) 30వఅ:16-17వ॥లలో తోటలో పని (5) 31వఅ:18-19వ॥లలో వ్యాపారపు పని (6) 31వఅ:20వ వ॥లో ధర్మము చేసే పని (7) 30వఅ:21-22వ॥లలో యింటిలో ఆత్మీయ పని (8) 31వఅ:26వ వచనములలో ఇంటిలో బోధించే పని (9) 31వఅ:27వ॥లో యింటివారి నడతలు కనిపెట్టేపని.

ఈ పనులన్నియూ ఆమె చేసేవిగా వున్నవి. అసలు పని చేయకుండ ఆమె భోజనము చేయదు. II థెస్స. 3వఅ:10వ వ॥లో ఎవడైనను పనిచేయనొల్లని యెడల వాడు భోజనము చేయకూడదని పౌలు ఆజ్ఞాపించాడు. ఇన్ని పనులు చేసిన గుణవతిని ఆమె పనులే ఆమెను కొనియాడుతున్నాయి. ఆ గవిని పెద్దలు ఇంటిలోనే వుండి ఇన్ని పనులు చేసిన ఆమెను కొనియాడు తున్నారు. ఆమె భర్త దేశపు పెద్దల మధ్య కూర్చునేవాడు. ఆయన కూడ భార్య పనులకు కొనియాడుతున్నాడు. ఆమె పనులు ఆమెను కొనియాడు తున్నాయి. మరి ప్రియ సోదరీ! నీవు చేసే పనులు ఎవరైనా మెచ్చుకో గలుగుతున్నారా? నీ పని ఈలాగు ప్రశంసను

పొందుతోందా? చేసిన పనిని బట్టి అట్టి వారికి ప్రతిఫలమియ్యదగును (సామె 31వఅ:31వ వ॥). ప్రతిఫలము లోకంలో దొరకకపోయినా, పరలోకమందు ఫలము తప్పక దొరుకుతుంది. మెట్టుకు ప్రియ సోదరీ! మనం చేసే ప్రతి పనికీ ప్రతిఫలం వుంది. మన పనులు గాలికి కొట్టుకొనిపోయేవి మాత్రం కాదు. II. కొరి. 5వఅ:10వ వ॥లో వ్రాయబడినట్లు తాను మనము జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైననూ సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును మనలో ప్రతి వాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్ష్యము కావాలి. గుణవతియైన భార్య పనులను ఊరి పెద్దలు ఊరి గవిని దగ్గర పరీక్షించి వాటిని కొనియాడారు. చేసిన పనులను బట్టి ప్రతి ఫలమియ్యతగును అన్నారు. తన యింటి పనులు తాను చేసుకుంటే ఆమెకు జీతము ప్రతిఫలంగా ఎవరూ ఏమీ యిచ్చి వుండరు, ఊరకనే మెచ్చుకున్నారు. అంతే కానీ, ఈ భూలోకంలో మనమున్న ఇంటిలో భర్తకు గానీ, అత్తకు గానీ, పిల్లలకు గానీ, సంఘానికి గానీ, ఇరుగుపొరుగు వారికి గానీ, ప్రభువుకు గానీ మనమేమి చేశామో వాటన్నిటికీ ప్రభువు దగ్గర ప్రతిఫలముంది. రూతు తన పెనిమిటి చనిపోయాక తను అత్తకు ఏమి చేసిందో బోయజుకు తెలిసింది. అలాగే మన అత్త మామలకు, ఆడపడుచులకు బంధువులందరికీ, మన పిల్లలకు, పొరుగువారికి, శత్రువులకూ, మనుషులందరికీ, బీదలకు, ఎవరెవరికి మనమేమేమి చేశామో ఆ క్రియలన్నీ మన పరమబోయజైన ప్రభువుకు తెలుసు యెహోవా మనము చేసిన ప్రతి దానికి ప్రతిఫలమిస్తాడు. ఆయన నీకు సంపూర్ణమైన బహుమానమిస్తాడు (రూతు 2:12). అంటే నూటికి నూరు పాళ్ళు ప్రతిఫలమిస్తాడు. యొకెబెతు తన కుమారుడైన మోషేకు పాలిచ్చి పెంచగా ఫరో కుమార్తె ఆమెకు జీతమిచ్చింది. అలాగే ఎవరెవరికి మనము ఏమి చేశామో దానికంతటికీ ప్రభువు జీతమిస్తాడు. మనుషుల కొరకే మనము కార్యాలు చేశామా? దేవుని కొరకు కార్యాలేమీ చేయలేదా? అందరూ తమ స్వకార్యములనే చూచుకొంటున్నారా? ప్రభువు కార్యాలేమీ చేయుట లేదా? కానీ మన ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చినపుడు మనకొరకు ఆయన రక్షణ కార్యము, స్వస్థత కార్యములు, అద్భుత కార్యములు, బోధించే కార్యములు ఎన్నెన్నో చేశారు. ఆయన చేసిన కార్యములన్నిటి గూర్చి వ్రాయబడిన గ్రంథములకు ఈ భూలోకమైనను చాలదు అని యోహాను తన సువార్త లో వ్రాశాడు. ఆయన మన కొరకు ఇన్ని కార్యాలు చేస్తే ఆ పరమ రాజు కొరకు కొంతైనా చేయాలికదా?

ఈలాగున మొర్దెకై బలము, సామర్థ్యము, ఆయన చేసిన కార్యములను గూర్చి మాదీయుల యొక్కయు, పారశీకుల యొక్కయు రాజ్య సమాచార గ్రంథములో

వ్రాయబడ్డాయట. అది ఏలాగో మనము చేసిన క్రియలన్నియు మంచి చెడ్డల గ్రంథములో వ్రాయబడుతున్నాయి. ప్రకటన 20వఅ:12వ వ॥లో అప్పుడు గ్రంథములు విప్పబడెను. జీవ గ్రంధమను వేరొక గ్రంథము కూడ విప్పబడెను. ఆగ్రంథములో వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున ప్రతివాడు తీర్పుపొందెను. అని వ్రాయబడింది క్రియల చొప్పున తీర్పు వుంటుంది. కనుక మనం మంచి క్రియలే చేద్దాం.

3వ వచనములో యూదుడైన మొర్దెకై రాజైన అహష్వేరోషునకు ప్రధాన మంత్రిగా వుండి తన వారందరితో సమాధానముగా మాటలాడేవాడని చదువుతున్నాం. మొర్దెకై చిన్న స్థితిలో నుండి ప్రభువు కృపవలన ప్రధాన మంత్రి స్థాయికి హెచ్చించబడినను గర్వించిన వాడు కాదు. అందరితో సమాధానంగా మాటలాడే వాడని తెలుస్తుంది. కొద్దిమంది పై స్థితికి ఎదిగినపుడు క్రింది వారితో అసలు మాట్లాడరు వారి కన్నులు నెత్తికి వచ్చినట్లు చేస్తారు. క్రింది వారు వారి కంటికి కనబడనట్లు, చూచి చూడనట్లు నటిస్తారు. కానీ మొర్దెకై తన వారందరితో సమాధానముగా మాట్లాడు తున్నాడు. ప్రియ సోదరీ! నీ వారందరితో నీవు సమాధానముగా మాట్లాడుతున్నావా? నీ బంధువులతో, నీ అత్తగారితో, ఆమె సంబంధికులతో, నీ సంఘస్థులతో, నీ భర్తతో నీవు సమాధానంగా మాట్లాడుతున్నావా? శక్యమైతే సమస్త మనుష్యులతో సమాధానంగా వుండమని ప్రభువు రోమా. 12వఅ:18వ వ॥లో చెప్తున్నాడు. హెబ్రీ 12వఅ:14వ వ॥లో అందరితో సమాధానమును, పరిశుద్ధాత్మయు కలిగి యుండుటకు ప్రయత్నించండి. అని ప్రభువు చెప్తున్నాడు. సమాధానమనే బంధమును కాపాడుకోవాలి. నీ సహోదరికి నీ మీద విరోధమున్న యెడల ముందు నీ అర్పణను బలిపీఠము ప్రక్కన పెట్టి వెళ్ళి ఆ వ్యక్తితో సమాధానపడుమని మత్త. 5వఅ:23,24వ॥లోని వాక్యము చెబుతుంది. కనుక అందరితో మనం సమాధానంగా మాట్లాడాలి. ఈనాడు ఉన్నత అధికారులు మంత్రులు అందరితో మాటలాడరు. డిగ్నిటీ మెయింటేన్ చేస్తారు. కానీ, మొర్దెకై ఒక సామాన్యునివలె అందరితో సమాధానంగా మాట్లాడడం ఎంత మాదిరియో కదా! ఆది 50వఅ:21వ వ॥లో యోసేపు తనకు కీడు చేసిన తన అన్నలతో భయపడకండి నేను మీ పిల్లలను పోషించెదనని చెప్పి వారిని ఆదరించి వారితో ప్రేమగా మాటలాడాడని వ్రాయబడింది. సామె. 31వఅ:26వ వ॥లో గుణవతియైన భార్య జ్ఞానము కలిగి తన నోరు తెరచి కృప గల ఉపదేశము చేసేదని తెలుస్తుంది. మొర్దెకై అందరితో ఏమి మాట్లాడుతున్నాడు? తన వారందరి క్షేమమును విచారిస్తున్నాడని వ్రాయబడింది. ఈనాడు ఎవరి క్షేమాన్ని వారు చూచుకుంటున్నారు. కాని మొర్దెకై ఇపుడు ప్రధాన మంత్రిగా వుండినప్పటికీ ఇతరుల క్షేమము తన క్షేమముగా భావించి వారి క్షేమాలు విచారిస్తున్నాడు. మనము ఇతరుల క్షేమాన్ని కోరుకుంటున్నామా? పౌలు, తిమోతి సంఘాల క్షేమాన్ని గూర్చి చింతించే వాళ్ళుగా వున్నారు. యోసేపు అన్యాయంగా చెరలో

వేయబడినను తాను క్షేమస్థితిలో లేకున్నను పానదాయకుల అధిపతి, భక్షకారుల అధిపతి ఇద్దరి ముఖములు నిన్న మొన్న వున్నట్లు లేవని వారి క్షేమాన్ని, గూర్చి విచారిస్తున్న వాడుగా కనిపిస్తున్నాడు. కానీ యోసేపు చిన్న తనంలోనే తల్లిని కోల్పోయిన బిడ్డగా వుండినపుడు, తన స్వంత తల్లుల దగ్గర వున్న తన 10 మంది అన్నలు యోసేపు క్షేమ సమాచారాన్ని కొంచెము కూడా అడిగేవారు కాదెమో. కనీసం యోసేపు తిన్నా త్రాగావా? అనే కనీస క్షేమ సమాచారాలు కూడ అడగలేదేమో. ఈనాడు మందిరాల్లో చాలామంది ఒకరికి ఒకరు కనీసం మాట్లాడుకోరు. ఇక క్షేమ సమాచారాలు ఎలా అడుగుతారు? ప్రభువు సిలువలో ఏ క్షేమము లేనివాడుగా వుంటూ, అనేక రీతులుగా బాధననుభవిస్తున్నా రెండవ దొంగ యొక్క క్షేమాన్ని కోరి. నీవు నేడు పరదైసులో నాతో కూడ వుంటావని చెప్పడం ద్వారా దొంగను ఎంత ఆదరించాడో కదా! అతనికి పరలోక క్షేమాన్నిచ్చాడు కదా! అంతేకాక కీర్త 23వఅ:6వ వ॥ ప్రకారం కృపా క్షేమములను ప్రభువు మన బ్రతుకు దినములన్నిటను ఇచ్చేవాడుగా వున్నాడు. అలాగే ప్రభువును ఆయన భక్తులను పోలి మన మందరము యితరుల క్షేమాన్ని కోరుతూ, వారి క్షేమాన్ని చూచి ఆనందించు వారముగా వుండాలని నేర్చుకుందాం! ఎందుకంటే మన ప్రభువు తన సేవకుల క్షేమాన్ని చూచి ఆనందించువాడు (కీర్త. 35వఅ:27వ వ॥). మన పిల్లలు క్షేమంగా వుంటే మనకానందమే. అంతమాత్రమే కాక మొర్దెకై యూదులలో గొప్పవాడై తన దేశస్థులలో చాలా మందికి ఇష్టుడుగా వున్నాడని, 3వ వచనము పై భాగంలో మొర్దెకై తన వారితో అనగా యూదులతో సమాధానంగా మాట్లాడి వారి క్షేమాన్ని గురించి విచారించే వాడని నేర్చుకున్నాం. అదే వచనం క్రింది భాగంలో మొర్దెకై తన దేశస్థులలో చాలా మందికి ఇష్టుడుగా ఉండేవాడని చదువుతున్నాం. మొర్దెకై పరాయి రాజు క్రింద పరాయి ప్రజల మధ్య వున్న వారిలో చాలామందికి ఇష్టుడుగా ఉండుట ఎంతమంచి సాక్ష్యమో కదా! మనముంటున్న ఇళ్ళలో, కాలేజీల్లో, సంఘాల్లో, మన ఇరుగు పొరుగు వారి మధ్య ఈ సాక్ష్యము మనకున్నదా సోదరీ! పరీక్షించుకోవడం మంచిది. గొప్పవాడైన మోర్దెకై అందరికి యిష్టుడుగా వున్నాడు. గొప్ప వారు చాలా వరకు అయిష్టులుగా వుంటారు. నేడు ప్రజలకు యిష్టములేని రాజులు, ఇష్టములేని గొప్పగొప్పవారు రాజ్యాలనేలుతూ అధికారంలో వుంటున్నారు. అలాంటివారు దుర్మార్గులుగా వుండి చనిపోతే వారు చచ్చిపోయినందున ప్రజలు దేవుని స్తోత్రం అంటారు. ఉదా :- నాబాలు ధనవంతుడే కానీ దావీదుకు, దావీదు సేవకులకు, తన సొంత సేవకులకు ఇష్టంగా జీవించలేకపోయాడు. మన యజమానుడు బహుపనికిమాలిన వాడని తన సేవకులు అబీగయీలుతో చెప్పారు. కాబట్టి మనమెలా వున్నాం? అందరి యెడల ఎలా వున్నాం? ఇష్టముగా వున్నామా? లేక కష్టముగా వున్నామా? అన్నింటికంటే ముఖ్యముగా మనలను సృష్టించి, వెదకి రక్షించిన మన పరమ ప్రభువు యెడల ఎలా వున్నాము? మనము దేహముతో

ఉన్నను, దేహము విడిచినను ఆయనకు ఇష్టులమై ఉండవలెనని II కొరి. 5వఅ:9వ వ॥లో ప్రభువు వ్రాయించాడు.

ఈ గ్రంథాన్ని అంతటినీ చదివిన ప్రియ సోదరీ! ఏ విషయాలను గురించినైనా పరిశుద్ధాత్మ దేవునిచేత నీవు హెచ్చరింపబడివుండే వాటి విషయమై నీవు దేవుని సన్నిధిలో తలవంచి ఇప్పుడే ఒక నిర్ణయాన్ని తీసుకొని అలాగు జీవించి ఆత్మయుతలో, ముందుకుసాగాలని మనవి చేస్తూ ముగిస్తున్నాను.

ఇట్లు
యేసుక్రీస్తు పరిశుద్ధులలో అత్యల్పురాలైన

**మీ కెజియక్క**


11F
12D